సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 18 సంచిక: 226
శుక్రవారం 7-11-2025
SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

అంధకారంలో కేజీహెచ్

సెల్‌ఫోన్ టార్చ్ వెలుతురులో వైద్యం చేస్తున్న సిబ్బంది

- తెగిపోయిన విద్యుత్ కేబుల్ వైర్లు
- మధ్యాహ్నం నుంచి నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు

3 లో

యువతే.. లీడర్!

సమాజంలో యువత, విద్యార్థుల పాత్ర అత్యంత కీలకం: వైఎస్ జగన్

మంచి రాజకీయాలకు విద్యార్థి దశ నుంచే బీజం

ఓ నాయకుడి గురించి కాలర్ ఎగరేసుకుని చెప్పేలా ఉండాలి

మనం మార్చకపోతే ఈ వ్యవస్థ మారదు... చూసీ చూడనట్లు వదిలేశామంటే ఎప్పటికీ ఇలాగే ఉంటుంది

2 లో

విద్యార్థుల భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దేలా మొట్టమొదటి సారిగా అడుగులు పడింది మన ప్రభుత్వంలోనే..

- ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు.. నాడు - నేడుతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లు
- విద్యా దీవెన, వసతి దీవెన కోసమే రూ.16,800 కోట్లు వ్యయం చేశాం
- మన పిల్లలు ప్రపంచంతో పోటీ పడేలా కరిక్యులమ్
- జీఈఆర్‌లో గణనీయమైన ప్రగతి.. కూటమి ప్రభుత్వంలో మొత్తం రివర్స్
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణం.. రూ.2.50 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో.. వాటిని పూర్తి చేసేందుకు ఐదేళ్లలో రూ.ఐదు వేల కోట్లు ఇవ్వలేరా?
- మీరు తీసుకురాకపోగా స్కామ్‌ల కోసం మెడికల్ కాలేజీలను అమ్మేస్తారా చంద్రబాబూ?
- పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల అధ్యక్షులతో సమావేశంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నిప్పులు

> ఇది సోషల్ మీడియా యుగం.. ఈ యుగంలో డ్రైవ్ చేసేది యువతే.. యువత చేతుల్లోనే భవిష్యత్ ఉంది.. వారెలా డిసైడ్ చేస్తే, ఆ గవర్నమెంట్ వస్తుంది.. ఆ ప్రభుత్వం.. మీరు సిట్ అంటే సిట్! స్టాండ్ అంటే స్టాండ్! దటీజ్ ద పవర్ ఆఫ్ యంగ్‌స్టర్స్.
>
> - వైఎస్ జగన్

ఇండిచిప్.. ఇది మరో ఉర్సా!

- కోటి రూపాయల కంపెనీ రూ.22,976 కోట్ల పెట్టుబడి
- పది రోజుల కంపెనీతో జనవరి 12న రూ.14,000 కోట్ల పెట్టుబడి ఒప్పందం

11 లో

నేటి గ్రుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గ్రుడ్ల రిటైల్ ధర ₹78	ఫారం దగ్గర లైవ్ బర్డ్	108 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	196 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	135 కిలో	స్కిన్ లెస్	223 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

మన ఖాతాలో వేసేద్దాం

- గొప్పల కోసం పథకాలు, వ్యవస్థల పేరు మార్పులు
- ప్రతి అడుగులోనూ సీఎం చంద్రబాబు క్రెడిట్ చోరీ
- పరిపాలనను వికేంద్రీకరిస్తూ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తెచ్చిన నాటి సీఎం జగన్..
- వలంటీర్లతో కలిసి ఈ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలు
- అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ వ్యవస్థపై బాబు అక్కసు
- గ్రామ, వార్డు సచివాలయాలన్నీ విజన్ యూనిట్లుగా మార్పు

5 లో

GURUGRAM | JAIPUR | KOLKATA

యువతే.. లీడర్

సమాజంలో యువత, విద్యార్థుల పాత్ర అత్యంత కీలకం

మంచి రాజకీయాలకు విద్యార్థి దశ నుంచే బీజం: వైఎస్ జగన్

12న నియోజకవర్గాల్లో ర్యాలీలను విజయవంతం చేయాలి

చంద్రబాబు ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి మెడికల్ కాలేజీలను కాపాడుకునేందుకు పార్టీ కార్యాచరణ చేపట్టింది. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ఉద్యమంలా సాగుతోంది. ప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమాలు జరుగుతున్నాయి. మీరు అన్నింటిలో ఇన్‌వాల్వ్ కావాలి. తటస్థులను కూడా కూడగట్టి నడవాలి. ఈనెల 12న నియోజకవర్గాల్లో ర్యాలీలను విజయవంతం చేయాలి. సీఎం చంద్రబాబు షాక్ తిని ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే స్థాయిలో నిర్వహించాలి. డిసెంబరులో ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఆందోళన చేపట్టి చంద్రబాబు ప్రభుత్వం మెడలు వంచుదాం. పార్టీ పరంగా అన్ని కమిటీల నిర్మాణం జరుగుతోంది. గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు అవుతున్నాయి. గ్రామస్థాయిలో విద్యార్థి, యువజన అనుబంధ విభాగం కూడా రావాలి. చైతన్యం అక్కణ్నుంచే మొదలు కావాలి.

సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు

ప్రసంగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'భావితరానికి మీరే దిక్సూచి.. రాజకీయాల్లో విద్యార్థులు, యువత తులసి మొక్కల్లా ఉన్నతంగా ఎదగాలి..' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోషల్ మీడియా యుగంలో డ్రైవ్ చేసేది యువతేనని, వారి చేతుల్లోనే భవిష్యత్ ఉందన్నారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ విద్యార్థి విభాగం సమావేశం జరిగింది. విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల అధ్యక్షులతో సమావేశమైన వైఎస్ జగన్ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు.. జరుగుతున్న పరిణామాలపై చర్చించి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలోవైఎస్ జగన్ ఏమన్నారంటే..

తులసి మొక్కల్లా ఎదగాలి..

ఒక నాయకుడి గొప్పతనానికి యువత, విద్యార్థి దశ నుంచే బీజం పడుతుంది. మీరంతా జనరేషన్–జీ లో ఉన్నారు. భావితరానికి దిక్సూచీ కాబోతున్నారు. బహుశా ఒకటి, రెండు టరమ్స్‌లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేస్తారు. మీరు రాజకీయాల్లో తులసి మొక్కల్లా ఎదగాలి. మీరంతా సోషల్ మీడియాను అత్యధికంగా అనుసరించేవారు, దాన్ని నడిపించేవారు, 90 కి.మీ. వేగంతో ప్రయాణించే మనసు ఉన్నవారే! రాజకీయాలు ఎలా ఉండాలంటే.. ఫలానా వ్యక్తి మా నాయకుడు అని కాలర్ ఎగరేసుకుని చెప్పేలా, యువతరం మనవైపు చూసేలా ఉండాలి. మనలో ఆ క్యారెక్టర్, గుణాలు కనిపించినప్పుడే ఆ పరిస్థితులు వస్తాయి. రాష్ట్రంలో ఈరోజు ఏం జరుగుతోందో అందరం చూస్తున్నాం.

సరైన విత్తనం వేయకపోతే పరిస్థితి మారదు..

విద్యార్థులు, యువత గట్టిగా అడుగులు ముందుకు వేస్తే.. దేశాలలో ప్రభుత్వాలు కూడా మారిపోతున్నాయి. రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారడం పాత కథ అయితే.. బంగ్లాదేశ్ లాంటి దేశాల్లో కొత్త ప్రభుత్వాలు వచ్చే కార్యక్రమాలు జరిగాయి. అంత శక్తిసామర్థ్యాలు ఉన్నవారు యువకులు. ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే.. మన రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి.. ఏం జరుగుతోంది..? అనేది మనమంతా చూడాల్సి ఉంది. రాష్ట్రం బాగుండాలని అంతా ఆరాట పడుతున్నాం కాబట్టి ఇక్కడి రాజకీయ పరిణామాలను గమనించాల్సిన అవసరం ఉంది. ఈ రోజు ఒక యువకుడు గొప్పగా ఎదిగి భావి ప్రపంచంతో పోటీ పడి ఉద్యోగాన్ని అవలీలగా సంపాదించుకునే పరిస్థితి ఉందా? మీ మన స్కూళ్లనే అడగండి. ఏదైనా రాత్రికి రాత్రే జరగదు. ఒక నాయకుడు ప్రణాళికాబద్ధంగా ఒక అడుగు వేస్తే.. ఆ విత్తనం చెట్టుగా కావడానికి, విజన్ ట్రాన్స్‌లేట్ కావడానికి కనీసం 10 నుంచి 15 ఏళ్లు పడుతుంది. అదే ఈరోజు సరైన విత్తనం వేయకపోతే ఎన్నేళ్లు గడిచినా పరిస్థితి మారదు. 10, 15 ఏళ్ల తర్వాత కూడా మన బతుకులు మారవు. ఇదే మాదిరిగా ఉంటాం. మనం లీడర్లుగా కాబోతున్నప్పుడు.. అలాంటి మంచి విత్తనాలు వేసే ఆలోచన మన మనసులో మెదలాలి. మనం చేసే పని వల్ల భవిష్యత్ తరాలు మారాలి. మరి విద్యా వ్యవస్థ మన ప్రభుత్వ హయాంలో ఎలా ఉండేది? గత 18 నెలలుగా ఎలాంటి అడుగులు పడుతున్నాయి? అనే తేడాను గమనించాల్సిన అవసరం చాలా ఉంది.

> గత 18 నెలలుగా అంతా తిరోగమనం. స్కూళ్ల దగ్గరి నుంచి మొదలు పెడితే.. నాడు-నేడు, ఇంగ్లిష్ మీడియం ఆగిపోయాయి. టోఫెల్ క్లాస్‌లు ఎత్తివేశారు. సబ్జెక్టు టీచర్ కాన్సెప్టు గాలికి ఎగిరిపోయింది. 8వ తరగతి నుంచి పిల్లలకు ట్యాబ్‌లు ఆపేశారు. గోరుముద్ద కింద నాసిరకం ఆహారం పెడుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన రెండింటికి కలిపి చంద్రబాబు దాదాపు రూ.6,400 కోట్లు బకాయి పెట్టారు. దీంతో పిల్లలు చదువులు మానేస్తున్నారు. సర్టిఫికెట్లు రాని పరిస్థితి. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు అప్పులు చేస్తున్న పరిస్థితి ఈ రోజు రాష్ట్రంలో కనిపిస్తోంది.

మన హయాంలోనే ఆ అడుగులు..

యువకులుగా మన పాత్ర కీలకమన్నది గుర్తు పెట్టుకోవాలి. మనం మార్చకపోతే ఈ వ్యవస్థ మారదు. మనం మార్చడానికి అడుగులు ముందుకు వేస్తేనే ఈ వ్యవస్థ మారుతుంది. మనం చూసీచూడనట్లు వదిలేశామంటే ఈ వ్యవస్థ ఎప్పటికీ ఇలాగే ఉంటుంది. ఆ దిశగా మొట్టమొదటి సారిగా అడుగులు పడింది మన హయాంలోనే అని గర్వంగా చెప్పగలను. విద్యార్థుల భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దేలా విద్యా రంగంలో మనం చాలా మార్పులు చేశాం. కేజీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తయ్యే దాకా ఆ పిల్లాడికి ఎలాంటి చదువులు ఉండాలి? వారు భావితరంతో పోటీపడి నిలబడటమే కాకుండా విజయం సాధించాలనే ఆలోచన చేసింది ఒక్క వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమే.

ఆ ఆలోచన చేయగలిగిన వాడే.. లీడర్

విద్యార్థులకు ఓటుహక్కు ఉండదు కాబట్టి ఏ రాజకీయ నాయకుడూ వారి గురించి ఆలోచన చేయడు. కానీ వారే రేపొద్దున భవిష్యత్తు అని ఆలోచన చేయగలిన వారు మాత్రమే రాజకీయ నాయకుడు కాదు.. లీడర్ అవుతారు. అలాంటి అడుగులు పడింది వైఎస్సార్‌సీపీ హయాంలోనే అని గొప్పగా చెప్పగలుగుతా. మొట్టమొదట అడుగులు.. ఇంగ్లిష్ మీడియం వైపు పడ్డాయి. ఎవరైనా నారాయణ.. శ్రీచైతన్య.. వంటి ప్రైవేట్ స్కూళ్లకు ఎందుకు వెళ్లాలి? మన గవర్నమెంట్ స్కూళ్లు ఎందుకు అలా లేవు? అవి ప్రైవేట్ స్కూళ్లతో పోటీపడే పరిస్థితి ఎందుకు లేదు? ప్రైవేట్ స్కూళ్లే.. గవర్నమెంట్ స్కూళ్లతో పోటీ పడే పరిస్థితిని తీసుకొచ్చినప్పుడు పేదవాడి జీవితం బాగు పడుతుందని భావించి మొట్టమొదటి విత్తనం అక్కడ నుంచి పడింది. అందులో భాగంగా వేగంగా అడుగులు వేస్తూ గవర్నమెంట్ స్కూళ్లలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. తొలిసారిగా గవర్నమెంట్ స్కూళ్లలో తప్పనిసరి ఇంగ్లిష్ మీడియం తీసుకొచ్చాం. ఇంగ్లిష్ మీడియం స్కూళ్లుగా మార్చాం. 3వ తరగతి నుంచే ఒక పీరియడ్‌గా టోఫెల్, సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్ తీసుకొచ్చాం. ప్రతి పిల్లవాడి చేతికి పుస్తకాలతోపాటు తెలుగు–ఇంగ్లిష్ ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ కూడా ఇచ్చాం. 8వ తరగతి నుంచి ప్రతి పిల్లాడి చేతిలో ట్యాబులు పెట్టి ప్రైవేట్ స్కూళ్ల కంటే గొప్పగా అడుగులు వేయించాం. ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈనే కాదు.. ఏకంగా ఐబీని కూడా తీసుకొచ్చి మన గవర్నమెంట్ స్కూళ్లలో పిల్లలకు పరిచయం చేశాం. జెనీవా నుంచి ఐబీ టీమ్ వచ్చి మన ప్రభుత్వంతో కలసి పని చేసింది. 2025లో ఫస్ట్ క్లాస్.. 2026లో సెకండ్ క్లాస్.. 2027లో థర్డ్ క్లాస్.. ఇలా 2035 నాటికి మన పిల్లలు టెన్త్ క్లాస్ పరీక్షలు ఐబీలో రాసే విధంగా జెనీవా నుంచి వచ్చిన ఐబీ బృందం మన ప్రభుత్వంతో కలసి పని చేసింది. ఎందుకివన్నీ జరిగాయంటే.. ఆ స్థాయి విద్యను మన పిల్లలకు ఇవ్వగలిగితే ఆంధ్రా కాదు.. ప్రపంచంతోనే పోటీ పడగలుగుతారు. ప్రపంచంతోనే పోటీ పడుతున్నప్పుడు.. మన పిల్లల చదువులు అక్కడి నుంచి మొదలవుతున్నాయా? లేదా? అనేది అత్యంత ముఖ్యమైన విషయం. అందుకే విద్యా వ్యవస్థను మార్చుకుంటూ వచ్చాం.

ఉన్నత విద్యలో విప్లవం..

ప్రభుత్వ స్కూళ్లలో నాడు–నేడుతో శ్రీకారం చుట్టి.. అమ్మ ఒడితో పిల్లలను బడికి పంపేలా తల్లులను ప్రోత్సహించాం. 75 శాతం హాజరు తప్పనిసరి చేశాం. గోరుముద్ద ద్వారా రోజుకో మెనూతో పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాం. ఈ మార్పులను ఉన్నత విద్య వరకు తీసుకెళ్లాం. తొలిసారిగా ఉన్నత విద్యలో జాబ్ ఓరియెంటెడ్ కరికులమ్ తీసుకొచ్చింది వైఎస్సార్‌సీపీ హయాంలోనే. మన చదువుల్లో లేనిది ఏమిటి? బాగా అభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్నది ఏమిటి? అని మొట్టమొదటిసారిగా బేరీజు వేశాం. అక్కడున్న కోర్సులు ఇక్కడ ఎందుకు లేవు? డిగ్రీ అనేది ఇక్కడ నామ్‌కేవాస్తే చదువుగా ఎందుకు ఉంది? అక్కడి డిగ్రీకి విలువ ఎందుకు ఉంది? అనే విషయంపై అసెస్ చేసి ఎడెక్స్‌ను తీసుకొచ్చాం. ప్రముఖ 'ఐవీ లీగ్' కాలేజీలు, స్టాన్‌ఫర్డ్, ఎంఐటీ లాంటి పెద్ద యూనివర్సిటీల డిగ్రీలను మన కోర్సులో భాగం చేస్తూ.. సర్టిఫికెట్లు కూడా వారి దగ్గరి నుంచే వచ్చే విధంగా.. క్రెడిట్లు కూడా వారే ఇచ్చేలా భాగస్వాములను చేస్తూ ఎడెక్స్ ద్వారా మన డిగ్రీలను ఆన్‌లైన్ కరికులమ్‌లో భాగం చేశాం. డిగ్రీలో నాణ్యతను పెంపొందిస్తూ తొలిసారి తప్పనిసరి అప్రెంటిస్ విధానం తీసుకొచ్చాం.

విద్యాదీవెన, వసతి దీవెనకు రూ.16,800 కోట్లు ఇచ్చాం..

కాలేజీల్లో క్వాలిటీ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను మెరుగుపరుస్తూ 'నాక్' (నేషనల్ ఎస్సెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్) రిజిస్ట్రేషన్ చేయించాం. మనం అధికారంలోకి రాకముందు 2019 నాటికి కేవలం 257 కాలేజీలకు నాక్ రిజిస్ట్రేషన్ ఉంటే 2024 ఫిబ్రవరి నాటికి వాటి సంఖ్య 437కి తీసుకెళ్లాం. అంతేకాకుండా పిల్లల చదువుల కోసం ఏ తల్లిదండ్రులూ ఇబ్బంది పడకూడదని, అప్పులపాలు కాకూడదని తాపత్రయపడుతూ మొట్టమొదటిసారిగా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యాదీవెన పథకాన్ని తీసుకొచ్చాం. ఆ ఒక్క పథకం కిందనే రూ.12,609 కోట్లు ఖర్చు చేశాం. ప్రతి త్రైమాసికం అయిపోగానే దానికి సంబంధించిన ఫీజులు క్రమం తప్పకుండా పిల్లల తల్లుల ఖాతాల్లో వేశాం. హాస్టల్ ఖర్చుల కింద వసతి దీవెన ద్వారా క్రమం తప్పకుండా ఇచ్చాం. డిగ్రీ పిల్లలకు ఏటా రూ.20 వేలు రెండు విడతల్లో ఇచ్చాం. ఏటా రూ.1,100 కోట్లు ఏప్రిల్‌లో ఇచ్చేలా అడుగులు పడ్డాయి. ఒక్క వసతి దీవెన కింద మొత్తం రూ.4,275 కోట్లు ఇచ్చాం. ఇలా పిల్లలు గొప్ప చదువులు చదవాలని భావిస్తూ ఉన్నత విద్యా రంగంలో విద్యాదీవెన, వసతి దీవెన కింద రెండు పథకాల కోసం ఏకంగా రూ.16,800 కోట్లు ఖర్చు చేసింది ఒక్క వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. దీనివల్ల పేద, మధ్య విద్యార్థులు ఎవరూ ఫీజులు కట్టలేక చదువులు మానేయాల్సిన పరిస్థితులు రాకుండా అడుగులు పడ్డాయి.

18 నెలలుగా అంతా తిరోగమనం..

ఈ రోజు ఏం జరుగుతోంది? గత 18 నెలలుగా అంతా తిరోగమనం. స్కూళ్ల దగ్గరి నుంచి మొదలు పెడితే.. నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం ఆగిపోయింది. టోఫెల్ క్లాస్‌లు ఎత్తివేశారు. సబ్జెక్టు టీచర్ కాన్సెప్టు గాలికి ఎగిరిపోయింది. 8వ తరగతి నుంచి పిల్లలకు ట్యాబ్‌లు ఆపేశారు. గోరుముద్ద కింద నాసిరకం ఆహారం పెడుతున్నారు. ఉన్నత విద్యా రంగం పరిస్థితి చూస్తే.. పిల్లలు బాగా చదివితే వాళ్లెక్కడ గొప్పవారు అవుతారనే బాధ చంద్రబాబులో ఎక్కువగా కనిపిస్తోంది. ఈ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి సెప్టెంబరు చివరి వరకు ఏడు త్రైమాసికాల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలే! గత ఏడాది జనవరి నుంచి మార్చి వరకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏప్రిల్‌లో వెరిఫై చేసి మే నెలలో డబ్బులు ఇవ్వాల్సి ఉంటే చంద్రబాబు ఎన్నికల సంఘానికి లేఖ రాసి దాన్ని ఆపించాడు. ఎన్నికల తరువాతైనా చంద్రబాబు ఇవ్వాలి కదా? అక్కడి నుంచి ఫీజులకు బ్రేక్ పడింది. ఇప్పటికి ఏడు త్రైమాసికాలు. డిసెంబరుతో మరో త్రైమాసికం జోడవుతుంది. ఒక్కో త్రైమాసికానికి రూ.650 కోట్ల నుంచి రూ.700 కోట్లు. ఏకంగా దాదాపు రూ.4,900 కోట్లు పెండింగ్‌లో ఉంటే ఈ ప్రభుత్వం ఇచ్చింది కేవలం రూ.700 కోట్లు మాత్రమే. అంటే రూ.4,200 కోట్లు బకాయి పెట్టారు. ఈ డిసెంబరు వస్తే మరో రూ.700 కోట్లు ఇవ్వాల్సి వస్తుంది. వసతి దీవెన కింద ఏటా రూ.1,100 కోట్లు ఇవ్వాలి. రెండేళ్లలో రూ.2,200 కోట్లు బకాయి పెట్టారు. రెండింటికి కలిపి చంద్రబాబు దాదాపు రూ.6,400 కోట్లు బకాయి పెట్టారు. దీంతో పిల్లలు చదువులు మానేస్తున్నారు. సర్టిఫికెట్లు రాని పరిస్థితి. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు అప్పులు చేస్తున్న పరిస్థితి ఈ రోజు రాష్ట్రంలో కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలకు తోడుగా వైఎస్సార్‌సీపీ నాయకత్వం తీసుకోకపోతే చదువులు మానేస్తారు. ఒక చిన్న ఉదాహరణ చెబుతా.. జీఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) అంటే . మీ అందరికీ తెలుసు. ఇంటర్ తర్వాత ఉన్నత విద్యలో ఎంతమంది చేరుతున్నారని చూస్తే.. మన ప్రభుత్వం రాక ముందు 2018–19లో జీఈఆర్ 27.86 శాతం ఉంటే, మన ప్రభుత్వం వచ్చాక 2023–24 నాటికి జీఈఆర్ 37 శాతానికి పెరిగింది. అది ఇప్పుడు మళ్లీ రివర్స్ అయింది. ఫీజులు కట్టలేక పిల్లలు వెనక్కి తగ్గుతున్నారు. చదువులు ఇంత దారుణమైన పరిస్థితిలో ఉన్నాయి. మరోవైపు ఉద్యోగాలు, పిల్లల భవిష్యత్ చూస్తే ఆందోళనకరం.

మేం ఎన్ని ఉద్యోగాలిచ్చామో మీ లెక్కలే చెబుతున్నాయి..

వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్క ప్రభుత్వ రంగంలోనే దాదాపు 6.31 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం. ప్రభుత్వ రంగంలో శాశ్వత ఉద్యోగాలు 2,13,662 ఇచ్చాం. గ్రామ, వార్డు సచివాలయాల్లో మన కళ్లెదుటే కనిపిస్తారు. వాటిలో దాదాపు 1.26 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం. 52 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశాం. వైద్య ఆరోగ్య రంగంలో జీరో వేకెన్సీ పాలసీ తీసుకొచ్చాం. ఆస్పత్రుల్లో స్పెషలిస్టుల కొరత లేకుండా చేశాం. దేశంలో 61 శాతం స్పెషలిస్టు వైద్య నిపుణుల కొరత ఉంటే, మన హయాంలో ఏపీలో అది కేవలం 4 శాతం మాత్రమే ఉంది. అలా 17 వేల మందిని నియమించాం. పాఠశాల విద్యలో 10,300 పోస్టులు భర్తీ చేశాం. టీచర్ పోస్టులు ఇచ్చాం. డీఎస్సీ సమస్యలన్నీ పరిష్కరించి ఉద్యోగాలు ఇచ్చాం. ఇవి కాకుండా 2.66 లక్షల మంది వలంటీర్లు. ఆప్కాస్‌లో మరో లక్ష మంది, 18 వేల మంది బెవరేజెస్ కార్పొరేషన్‌లో, రేషన్ డోర్ డెలివరీ వాహనాల్లో 20 వేల ఉద్యోగాలు కల్పించాం. ఇవి కాకుండా ఎంఎస్‌ఎంఈలు 4.78 లక్షల యూనిట్లు గ్రౌండ్ చేయడం ద్వారా దాదాపు 33 లక్షల ఉద్యోగాలను సృష్టించగలిగాం. మన హయాంలో వాటికి క్రమం తప్పకుండా రాయితీలు ఇచ్చి భరోసా కల్పించి నిలబెట్టాం. ఉద్యోగ, ఉపాధి కల్పనలో ఎంఎస్‌ఎంఈలది చాలా కీలక పాత్ర. వీటిలో పెట్టుబడి తక్కువే అయినా ఉద్యోగాలు ఎక్కువ. అదే పెద్ద పెద్ద కంపెనీల్లో పెట్టుబడి ఎక్కువ.. ఉద్యోగాలు తక్కువ. ఇంకా లార్జ్ అండ్ మెగా రంగంలో మరో లక్ష ఉద్యోగాల కల్పన. అన్నీ కలిపితే.. 40,13,552 ఉద్యోగాలు ఒక్క వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సృష్టించగలిగాం. ఇవి మనం చెప్పే లెక్కలు కాదు. వాళ్లు తయారు చేసుకున్న సామాజిక సర్వే నివేదికలో చూపించిన లెక్కలే ఇవన్నీ!

స్వయం ఉపాధికి ప్రోత్సాహం..

నిజంగా మెరుగైన ఉద్యోగాలు సెల్ఫ్ ఎంప్లాయిడ్ సెక్షన్‌లో (స్వయం ఉపాధి రంగం) వస్తాయి. అది ఒక విప్లవం. ఆ దిశగానే ఆసరా, సున్నా వడ్డీకే రుణాలు, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం అమలు చేశాం. అక్కచెల్లెమ్మలు తమ కాళ్ల మీద నిలబడేలా ఐటీసీ, పీ అండ్ జీ, రిలయన్స్, అమూల్ లాంటి సంస్థలతో టై అప్ చేశాం. చేయూత ద్వారా దాదాపు 26 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు.. ఆసరా, సున్నా వడ్డీ ద్వారా దాదాపు కోటి మందికిపైగా మేలు జరిగింది. నేతన్న నేస్తం, వాహనమిత్ర, తోడు, చేదోడు ద్వారా లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి.

వ్యవసాయం దండగ కాదు.. పండగ

రాష్ట్రంలో దాదాపు 62 శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. చంద్రబాబు నోటి నుంచి వ్యవసాయం దండగ అనే మాటలు వస్తే.. మేం పండగ అని చేసి చూపాం. విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు రైతన్న ప్రతి అడుగులో చేయి పట్టుకుని నడిపించాం. రైతులకు ఏ విపత్తు, ఆపద వచ్చినా వెంటనే ఆదుకున్నాం. గతంలో రాష్ట్రంలో 6 పోర్టులు మాత్రమే ఉంటే, కోవిడ్ ఉన్నప్పటికీ మన హయాంలో మరో 4 కొత్త పోర్టులకు శ్రీకారం చుట్టాం. అందులో మూడు ప్రభుత్వ రంగంలోనివే. మూలపేట, రామాయపట్నం, మచిలీపట్నం పోర్టుల పనులు చాలా వేగంగా జరిగాయి. సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఒక్క కాకినాడ పోర్టు మాత్రం ప్రైవేటు రంగంలో అభివృద్ధి జరుగుతోంది. ఇంకా 10 ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల పనులు చురుగ్గా కొనసాగాయి.

నాడే అదానీ డేటా సెంటర్..

మన హయాంలోనే అదానీ డేటా సెంటర్ ప్రాసెస్ జరిగింది. అసలు డేటా రావాలంటే కేబుల్ కావాలి కదా? సింగపూర్ నుంచి సముద్రంలో కేబుల్ ఏర్పాటు ప్రక్రియకు నాడే శ్రీకారం చుట్టడం జరిగింది. సింగపూర్ ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ హయాంలోనే లేఖ కూడా రాశాం. అవన్నీ జరిగాయి, మనం చేశాం కాబట్టే ఇప్పుడు డేటా సెంటర్ వస్తోంది. విశాఖ అభివృద్ధికి అడుగులు వేశాం కాబట్టే గూగుల్ వస్తోంది. భోగాపురం ఎయిర్‌పోర్టు భూసేకరణ చేసి, వేగంగా అన్ని అనుమతులు పొంది, పనులు కూడా చేశాం. అందుకోసం దాదాపు రూ.900 కోట్లు ఖర్చు చేశాం. అవన్నీ మనం చేశాం కాబట్టి పురోగతి కనిపిస్తోంది. అలా మంచి విత్తనాలు నాటాం. విత్తనం వేయకపోతే చెట్టు ఎక్కడి నుంచి వస్తుంది?

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణం..

చంద్రబాబు చేస్తున్న మరో దారుణమైన పని.. కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ. ఆయన మంచి చేయకపోగా చెడు చేస్తున్నారు. స్కూళ్లు, ఆస్పత్రులు, ఆర్టీసీ బస్సులను గవర్నమెంట్ ఎందుకు నడుపుతుందో ఆలోచన చేశారా? ప్రభుత్వం వాటిని నిర్వహించకుంటే ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పేదలు దోపిడీకి గురవుతారు. దీనికి చెక్ పడాలంటే ప్రభుత్వమే వాటిని నిర్వహించాలి. 1923 నుంచి 2019 వరకు రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలోని మెడికల్ కాలేజీలు కేవలం 12 మాత్రమే. వాటిలో ఒక్కటి కూడా చంద్రబాబు కట్టలేదు. మన ప్రభుత్వ హయాంలో కోవిడ్ ఉన్నప్పటికీ, ఏకంగా 17 మెడికల్ కాలేజీల పనులు మొదలుపెట్టాం. ఏడు మెడికల్ కాలేజీలు పూర్తి చేశాం. ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటైతే స్థానికంగా సూపర్ స్పెషాలిటీ సేవలు టీచింగ్ ఆస్పత్రి మాదిరిగా అందుబాటులోకి వస్తుంది. ఆ స్థాయిలో వైద్య సేవలందుతాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు, స్టూడెంట్లు, మెడికోస్, నర్సింగ్ విద్యార్థులు వీరంతా అక్కడే పని చేస్తారు. పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం చేరువలో అందుబాటులోకి వస్తుంది. ఎప్పుడైతే అవన్నీ అందుబాటులోకి వస్తాయో ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ ఆగిపోతుంది. 50 కి.మీ. లోపే పేదలకు అత్యాధునిక వైద్యం ఉచితంగా అందుతున్నప్పుడు ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.లక్షలు చెల్లించాల్సిన అవసరం ఉండదు. పేదలకు, మధ్య తరగతికి ఒకవైపు మంచి చేస్తూ మరోవైపు ఆ 17 మెడికల్ కాలేజీల ద్వారా 2,550 మెడికల్ సీట్లు అదనంగా అందుబాటులోకి వస్తాయి. సగం సీట్లు ఫ్రీగా పిల్లలకు దక్కుతాయి. మిగిలిన సీట్లు కూడా ప్రైవేటు మెడికల్ కాలేజీల కంటే తక్కువ ఫీజుకే అందుబాటులోకి వస్తాయి. మన పిల్లలు ఇక్కడే డాక్టర్లుగా మారి మన ప్రాంతంలోనే సేవలు కూడా అందిస్తారు.

మనం చేపట్టిన మెడికల్ కాలేజీల్లో మన హయాంలోనే 7 కాలేజీలు పూర్తయ్యాయి. 5 కాలేజీల్లో తరగతులు కూడా మొదలై మూడు బ్యాచ్‌లు జరిగాయి. పాడేరు మెడికల్ కాలేజీలో గత ఏడాది క్లాస్‌లు ప్రారంభమయ్యాయి. గత ఏడాది పులివెందుల మెడికల్ కాలేజీకి 50 సీట్లు ఇస్తామంటే వద్దని అడ్డుపడి చంద్రబాబు లేఖ రాశారు. కొత్త మెడికల్ కాలేజీల కోసం రూ.3,000 కోట్లు ఖర్చు చేశాం. మిగిలిన 10 కాలేజీలకు మరో రూ.5 వేల కోట్లు అవసరం. అది కూడా ఐదేళ్లలో ఖర్చు చేస్తే చాలు. అంటే ఏటా రూ.1,000 కోట్లు మాత్రమే వెచ్చించాలి. కానీ ఆ మనిషికి మనసు రాదు.. అది కూడా ఖర్చు చేయకుండా ఏకంగా వాటిని అమ్మేస్తున్నాడు. రాష్ట్ర బడ్జెట్ చూస్తే రూ.2.50 లక్షల కోట్లు. మెడికల్ కాలేజీలకు కావాల్సింది ఏటా కేవలం రూ.1000 కోట్లు. ఆయన పెట్టపోతే పోయే..! మేం వచ్చిన తరువాత చేసుకుంటాం. కానీ ఇలా స్కామ్‌లు చేస్తూ అమ్మడం ఏమిటి? ఈ స్థాయికి దిగజారిపోయిన వ్యక్తిని నిలదీయడం యువత నుంచే మొదలు కావాలి!!

ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు పానుగంటి చైతన్య, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్లు ఎ.రవిచంద్ర, తోట రాంజీ, శ్రీవాత్సవ, చెవిరెడ్డి హర్షిత్, ప్రణయ్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్స్ ఓబుల్‌రెడ్డి, నీలి ఆనంద్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో కేజీహెచ్

విద్యుత్ సరఫరా లేక ఐసీయూ, ఇతర వార్డుల్లో రోగుల ఇక్కట్లు

అమెరికాను మించి టెక్నాలజీని తేగల సమర్థుడు ప్రభుత్వాస్పత్రిలో కరెంటు ఇవ్వలేకపోతున్నారా అంటూ నెటిజన్ల ఫైర్

మహారాణిపేట (విశాఖ) : విశాఖపట్నం కింగ్ జార్జి ఆసుపత్రి (కేజీహెచ్)లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం అలముకుంది. గురువారం మ.12.30 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో.. పలు వార్డుల్లో రోగులు, సిబ్బంది చీకట్లోనే గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కేబుల్ ద్వారా సబ్ స్టేషన్‌కు వెళ్లే లైన్లు దెబ్బతినడంతో వివిధ వార్డులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గైనిక్ వార్డు, భావనగర్ వార్డు, పిల్లల వార్డులు, రాజేంద్రప్రసాద్ తదితర వార్డుల్లో అంధకారం నెలకొంది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఐసీయూ, చిన్న పిల్లల వార్డుల్లోని రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖరనాయుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కాగా, అమెరికాను మించి టెక్నాలజీని తేగల సమర్థుడు ప్రభుత్వాస్పత్రిలో కరెంటు ఇవ్వలేకపోతున్నారా అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

విద్యుత్ సరఫరా లేక అంధకారంలో ఉన్న కేజీహెచ్‌లోని అర్థోపెడిక్ వార్డు

సెల్‌ఫోన్ వెలుతురులో రోగికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

కొవ్వొత్తి వెలుగులో రోగికి సెలైన్ పెడుతున్న నర్సు

గైనిక్ వార్డులో చీకట్లు..

ఘాట్‌రోడ్డులో ఒడిశా బస్సు దగ్ధం

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

పాచిపెంట: పార్వతీపురం మన్యం జిల్లా పద్మాపురం పంచాయతీ రొడ్డవలస సమీపంలోని ఘాట్ రోడ్డుపై విజయనగరం నుంచి ఒడిశాలోని జైపూర్‌కు వెళ్తున్న ఒడిశా ఆర్టీసీ బస్సులోని ఇంజిన్‌లో మంటలు వ్యాపించాయి. కాసేపటికే బస్సు మొత్తం మంటల్లో కాలిపోయింది. డ్రైవర్ అప్రమత్తమై బస్సును రోడ్డుపక్కకు నిలిపి అందులో ఉన్న 10 మంది ప్రయాణికులను కిందకు దింపేశాడు. దీంతో ప్రాణనష్టం తప్పింది. ఘటనా స్థలాన్ని ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు.

విజ్ఞాన్ చాన్స్‌లర్‌గా డాక్టర్ పావులూరి బాధ్యతల స్వీకారం

వర్సిటీ చాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పావులూరి సుబ్బారావు

చేబ్రోలు: గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ చాన్స్‌లర్‌గా ప్రముఖ శాస్త్రవేత్త, అంతరిక్షరంగంలో విశిష్ట సేవలందించిన డాక్టర్ పావులూరి సుబ్బారావు బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ సీఎండీగా ఉన్న ఆయన ఆంధ్రప్రదేశ్ స్పేస్ అకాడమీ అధ్యక్షుడిగా, ఇంకా పలు కీలక హోదాల్లో ఉన్నారు. కార్యక్రమంలో వర్సిటీ చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, మాజీ డీజీపీ డాక్టర్ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, విజ్ఞాన్ యూనివర్సిటీ 2026–27 సంవత్సరానికి సంబంధించి బీటెక్, బీఫార్మసీ, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఏ ఎల్ఎల్‌బీ (ఆనర్స్), బీబీఏ ఎల్ఎల్‌బీ (ఆనర్స్), బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్, ఫార్మ్–డీ కోర్సుల్లో ప్రవేశాల కోసం వీశాట్ నోటిఫికేషన్‌ను వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ విడుదల చేశారు.

నిర్లక్ష్య డ్రైవింగ్‌కు ఏఐ బ్రేకులు

డ్రైవర్ల బిహేవియర్ ప్రొఫైల్స్ సిద్ధం చేయాలని కేంద్రం నిర్ణయం

ఏఐ టెక్నాలజీతో రూపకల్పనకు మార్గదర్శకాలు జారీ

నిర్లక్ష్యపూరిత డ్రైవర్లపై కఠిన చర్యలకు కసరత్తు

జాతీయ రహదారి భద్రత ప్రణాళిక–2030 ఖరారు

సాక్షి, అమరావతి: రోడ్డు ప్రమాదాలతో దేశంలో ఏటా 1.6లక్షల మంది దుర్మరణం చెందుతున్నారు. అందులో 80 శాతం ప్రమాదాలకు డ్రైవర్ల తప్పిదాలే ప్రధాన కారణం. అందుకే నిర్లక్ష్యపూరితంగా డ్రైవింగ్ చేసేవారిపై కొరడా ఝుళిపించేందుకు కేంద్ర రవాణా శాఖ సిద్ధమవుతోంది. నిర్లక్ష్యపూరిత డ్రైవర్లను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాంకేతికతతో కట్టడి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. జాతీయ రహదారుల నిర్మాణ లోపాలకు బాధ్యులైన కాంట్రాక్టు సంస్థలపై కూడా కఠిన చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు జాతీయ రహదారి భద్రత ప్రణాళిక–2030ను కేంద్ర రవాణా శాఖ ప్రకటించింది. రోడ్డు ప్రమాదాలను కనిష్ట స్థాయికి తగ్గించేందుకు యూకే, సింగపూర్ దేశాల్లో అమలు చేస్తున్న డ్రైవర్ల బిహేవియర్ డేటా ట్రాకింగ్ వ్యవస్థను మన దేశంలో ప్రవేశపెడతామని తెలిపింది. ఇందుకనుగుణంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు మార్గదర్శకాలను జారీ చేసింది.

జాతీయ రహదారి భద్రత ప్రణాళికలో కొన్ని ముఖ్యాంశాలు...

- నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసేవారికి కేవలం జరిమానాలు విధించడంతో సరిపెట్టకూడదని కేంద్రం స్పష్టం చేసింది. పదేపదే నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం అలవాటుగా మారిన వాళ్లకు 'డేంజరస్ డ్రైవింగ్ బిహేవియర్' అనే కేటగిరీ కింద చేర్చాలని ఆదేశించింది. అందు కోసం పోలీసు, రవాణా, అటవీ, ఎన్‌హెచ్‌ఏఐ తదితర విభాగాలు రహదారులపై నెలకొల్పే సీసీ కెమెరాల ఫుటేజీలు, ఈ–చలానా డేటాను అధ్యయనం చేస్తారు.
- 'డేంజరస్ డ్రైవింగ్ బిహేవియర్' కేటగిరీలో చేర్చినవారు మానసిక నిపుణులు, ఇతర నిపుణుల వద్ద కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుంది. అయినా సరే నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్ కొనసాగించినట్టు నిర్ధారణ అయితే వారి డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేస్తారు. ఈ డ్రైవర్ల ప్రొఫైళ్లను వ్యక్తిగత బీమా, వాహన బీమా సంస్థల డేటాతో అనుసంధానిస్తారు.
- రోడ్డు ప్రమాదాలకు రహదారుల నిర్మాణ లోపాలే కారణమని నిర్ధారణ అయితే సంబంధిత కాంట్రాక్టు సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటారు. ప్రమాదాలపై దర్యాప్తు నివేదిక ఆధారంగా ఈ చర్యలు ఉంటాయి.
- డ్రైవర్ల ప్రొఫైల్స్‌ను రూపొందించి వారి డాటా ట్రాకింగ్ విధానాన్ని ఎంపిక చేసిన రాష్ట్రాల్లో 2026లో మొదలు పెడతారు. 2030నాటికి దేశవ్యాప్తంగా అమలు చేయాలని కేంద్ర రవాణాశాఖ నిర్ణయించింది.

- శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ అధికారుల తీరుతో పీజీ సైకాలజీ విభాగంలో కొత్తగా చేరిన నలుగురు విద్యార్థినులు టీసీలు తీసుకుని వర్సిటీని విడిచిపెట్టారు. ఇటీవల సైకాలజీ హెచ్‌ఓడీ ప్రోత్సాహంతో సీనియర్లు తమను ర్యాగింగ్ చేశారని, ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని, వర్సిటీలో తమకు రక్షణ లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

సాక్షి

శుక్రవారం, 7 నవంబర్ 2025

ఈసీ మౌనం సిగ్గుచేటు!

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కొంతకాలంగా ప్రయోగిస్తానంటూ చెప్పిన 'హైడ్రోజన్ బాంబు' ఎట్టకేలకు బిహార్ తొలి దశ పోలింగ్‌కు 24 గంటల ముందు బుధవారం బద్దలైంది. ఇది నిరుడు జరిగిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల జాబితాకు సంబంధించింది. రాహుల్ చెబుతున్న ప్రకారం అందులో 25 లక్షలమంది నకిలీ ఓటర్లున్నారు. సహజంగానే ఎన్నికల సంఘం(ఈసీ) మినహా దేశంలో అందరికీ ఈ విషయం దిగ్భ్రాంతి కలిగించింది. బ్రెజిల్‌లో ఉంటున్న పోర్చుగీసువాసి హెయిర్ డ్రెసర్ లారిసా నెరి అనే యువతి ఫొటోకు ఈ జాబితాలో చోటు దొరికింది. ఒకసారి కాదు... 10 పోలింగ్ కేంద్రాల పరిధిలో 22 సార్లు వినియోగించారు. 'సెర్చ్'లో దొరక్కుండా ఒక్కో చోట ఒక్కో పేరు తగిలించారు. స్వీటీ, సరస్వతి, సీమ...ఇలా బహుళ నామధేయాలతో ఆమె మన ఎన్నికల జాబితాలో వర్ధిల్లింది. బహుశా 22 సార్లూ తన ఓటు హక్కు 'వినియోగించుకుని' ఆమె తన 'పవిత్ర కర్తవ్యాన్ని' నెరవేర్చి ఉంటుంది. మీడియా సమావేశంలో ఆమెను రాహుల్ బ్రెజిల్ మోడల్‌గా చెప్పారు. ఇది స్పీడ్ యుగం కనుక ఆ సమావేశం ముగిసిన వెంటనే విషయం ఆమెకు చేరిపోయింది. ఏనాడూ సందర్శించని దేశంలో ఎన్నికల జాబితాలో తన పాత ఫొటో రావటంపై ఆమె బోలెడు ఆశ్చర్యపోతోంది. జనాన్ని దగా చేయటానికి తన ఫొటో వినియోగించి ఉంటారని సరిగానే గుర్తుపట్టింది.

నకిలీ ఓటర్ల పంచాయతీ రాహుల్–ఈసీలకు సంబంధించింది కాదు. ఇద్దరిలో ఎవరో ఒకరి మాటే నిజం కావాలి కనుక జరిగిందేమిటో ఈసీ సంజాయిషీ ఇచ్చితీరాలి. తప్పు తనవైపుంటే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. రాహుల్ ఆరోపణ అవాస్తవమైతే ఆయనపై చర్య తీసుకోవాల్సిన బాధ్యత ఉంది. ఏదీ చేయకుండా 'అప్పుడెందుకు చెప్పలేద'ంటూ దబాయింపులకు దిగటం నైతిక పతనానికి చిహ్నమవుతుందే తప్ప సమర్థవంతమైన జవాబు కానేరదు. సీ–డాక్ సంస్థ రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఉపకరణాన్ని 2022లో వినియోగించారు. వార్షిక ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) పేరిట జరిగిన ఆ ప్రక్రియలో దాని సాయంతో దేశవ్యాప్తంగా దాదాపు 3 కోట్ల ఓట్లు తొలగించారు. ఇవన్నీ ఒకటికన్నా ఎక్కువసార్లు నమోదైన ఓట్లు, చెల్లని ఓట్లు. ఆ ఉపకరణం ఒకటికన్నా ఎక్కువసార్లు వినియోగించిన ఫొటోను కూడా పసిగడుతుంది. దానికి ఎందుకు స్వస్తి చెప్పారో ఈసీ సంజాయిషీ ఇవ్వాలి.

అసలు ఈసీకీ, ఈ 12.5 శాతానికీ మధ్య ఉన్న అవినాభావ సంబంధమేమిటో అర్థం కాదు. రాహుల్ లెక్క ప్రకారం హరియాణాలో 12.5 శాతం మంది నకిలీ ఓటర్లు. చిత్రంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలైన వెంటనే ఈసీ ప్రకటించిన పోలింగ్ శాతానికీ, నాలుగు రోజుల తర్వాత అదే సంస్థ చెప్పిన శాతానికీ మధ్య వ్యత్యాసం కూడా 12.5 శాతమే! ఇంత శ్రద్ధగా లెక్క పాటిస్తున్న మాయావులెవరో ఈసీ తేల్చుకోవాలి. రాహుల్ ఆరోపణలకు ఈసీ ఎగవేత ధోరణిలో జవాబిస్తున్నందువల్ల కేంద్రం జోక్యం చేసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలి. జాబితాలో చేరిన నకిలీ ఓట్ల సంగతలా ఉంచి... గల్లంతైన ఓట్లు మరింత ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఎన్డీటీవీ బృందం ఆరా తీసిన ప్రకారం హరియాణాలో ఒక గ్రామంలోని పలు కుటుంబాల్లో రెండు నుంచి నాలుగు ఓట్లు గల్లంతయ్యాయి. చిత్రమేమంటే వీరు ఆ ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో ఓటేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ మాదిరి లీలలు బహు విధాలు! నోటిఫికేషన్ ప్రకటించినప్పటి నుంచే అక్రమాలు మొదలైపోయాయి. నిజానిజాలేమిటో నిర్ధారించుకోకుండానే కూటమి నాయకులు ఫిర్యాదు ఇచ్చిందే తడవుగా జిల్లాల్లో ఉన్నతాధికారుల్ని మార్చారు. అయిదేళ్లుగా అమలవుతున్న పథకాలు ఆపేశారు. బదిలీల వెనకున్న కుతంత్రమేమిటో పోలింగ్ రోజు హింస బయటపెట్టింది. పోలైన నాలుగు కోట్లకుపైగా ఓట్లలో 51 లక్షలు సాయంత్రం 6 తర్వాతే పడ్డాయి. ఇక ఈవీఎంల విన్యాసాలు అనంతం. సగటున ఒక్కో అసెంబ్లీ స్థానంలో 28,000 ఓట్లు, లోక్‌సభ స్థానం పరిధిలో 1.96 లక్షల ఓట్లు పెరిగాయి. ఇది 87 అసెంబ్లీ స్థానాల్లో గెలుపోటముల్ని నిర్దేశించింది. వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేసి 17 నెలలు గడుస్తున్నా జవాబు లేదు! కర్ణాటక, మహారాష్ట్రలకు సంబంధించి కూడా ఇలాగే ఫిర్యాదులొచ్చాయి. ఈ స్థితిలో జరుగుతున్న, జరగబోయే ఎన్నికలపై ఎవరికైనా విశ్వాసం ఉంటుందా? ఇకనైనా ఈసీ బాధ్యులు నోరు విప్పాలి. ఆ ఉద్దేశం లేకుంటే తప్పుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.విదియ ప.2.29 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** కృత్తిక ఉ.7.00 వరకు, తదుపరి రోహిణి తె.5.19 వరకు (తెల్లవారితే శనివారం), **వర్జ్యం:** రా.9.52 నుండి 11.21 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.22 నుండి 9.07 వరకు, తదుపరి ప.12.06, నుండి 12.51 వరకు, **అమృత ఘడియలు:** రా.2.20 నుండి 3.51 వరకు.

సూర్యోదయం : 6.04
సూర్యాస్తమయం: 5.24
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

మీరే ఆదర్శం

విజయం అంటే – మీరు ఎంత సంపాదించారు, మీకు ఎంతమంది అనుచరులు ఉన్నారు అని కాదు. ఎవరైనా మిమ్మల్ని చూపిస్తూ "నేను అలా ఉండాలనుకుంటున్నాను" అని మిమ్మల్ని ఆదర్శంగా తీసుకోవటం, మీ నుంచి స్ఫూర్తి పొందటం... మీ నిజమైన విజయం.

– ఆదిత్య ఘోష్, 'ఆకాశ ఎయిర్' కో–ఫౌండర్

అవకాశాల వేట

జీవితం క్రూరమైనది. ఇక్కడ ఏదీ సురక్షితం కాదు. కనుక సురక్షితంగా ఆడటం మానేసి అవకాశాల వేటకు తెగించాలి. ఎంత కష్టపడినా ఫలితం ఉండకపోవచ్చు. అప్పుడు వైఫల్యమే మీకు మెలకువలు నేర్పుతుంది. విజయం వైపు మిమ్మల్ని ఒడుపుగా నడిపిస్తుంది.

– సుపర్ణ్ వర్మ, స్క్రీన్ రైటర్

ప్రయాణాలు

కొన్నిసార్లు నేను ఏం ఆలోచిస్తున్నానో, ఏం చేస్తున్నానో నాకు తెలియనంతగా భయాందోళనలకు గురవుతాను. అప్పుడు నేను ఎక్కడికైనా ప్రయాణం పెట్టుకుంటాను. ఆ ప్రయాణంలో నా మనసు కుదుటపడుతుంది. ప్రశాంతంగా అనిపిస్తుంది.

– డకోటా జాన్సన్, నటి

ఒకటే లక్ష్యం

మీరు నాకు ఓటు వేసినా, నా ప్రత్యర్థులలో ఒకరికి ఓటు వేసినా... మీ నమ్మకానికి నేను అర్హుడినని నిరూపించుకునే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. నేను ప్రతి ఉదయం ఒకే లక్ష్యంతో మేల్కొంటాను: ఈ నగరాన్ని మునుపటి రోజు కంటే మెరుగ్గా మార్చటం కోసం!

– జోహ్రాన్ మమ్దానీ, న్యూయార్క్ సిటీ మేయర్

కష్టానికి ఫలితం

మీకు లభించిన దేనినీ తేలికగా తీసుకోకండి. జీవితం పట్ల కృతజ్ఞతతో ఉండండి. ప్రతిరోజూ మైదానంలోకి అడుగు పెట్టే వరాన్ని, ఆనందాన్ని జీవితం నాకు ఇచ్చింది. ఇష్టపడే పనిని చేస్తూ ఉండటం ఒక విలాసం. మనం ఎంతగా కష్టపడితే అంతగా జీవితాన్ని మనం ఇష్టపడతాం.

– రిషబ్ పంత్, క్రికెటర్

చేతులు కలపండి

నేను తల్లిని, శాస్త్రవేత్తని, ఆశావాదిని. నేను ఒంటరిగా నడవను, ఒంటరిగా పరిపాలించను. అందర్నీ కలుపుకొంటాను. మిమ్మల్ని నిరాశపరచను. ఈ భూమిపై అత్యంత అద్భుతమైన వారు మెక్సికో ప్రజలు. మనమందరం కలిసి ప్రయాణిద్దాం. కలిసి పని చేద్దాం.

– క్లాడియా షీన్‌బామ్, మెక్సికో తొలి అధ్యక్షురాలు

'కృత్రిమ' కంటెంట్‌కు కళ్లెం ఇలాగా?

విశ్లేషణ

దినేశ్ సి. శర్మ

డీప్‌ఫేక్, జనరేటివ్ ఏఐల సాయంతో సృష్టించిన ఆడియో, వీడియో సమాచారం విచ్చలవిడిగా పెరిగిపోతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఈ రకమైన కంటెంట్‌ను నియంత్రించేందుకు ఉద్దేశించిన ముసాయిదా నిబంధనలను ప్రకటించింది. ఇవి 2021 నాటి ఐటీ చట్టానికి కొనసాగింపుగా ఉండనున్నాయి. కంప్యూటర్లు, ఏఐ, అల్గారిథమ్‌ల వంటి వాటి సాయంతో సృష్టించిన, అభివృద్ధి చేసిన, మార్పులు చేసిన సమాచారం, కంటెంట్ అన్నింటినీ కృత్రిమ మీడియాగా పరిగణిస్తారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌పై కొన్ని నెలలుగా ఈ కృత్రిమ కంటెంట్ మోతాదు విపరీతమైన విషయం తెలిసిందే. ఎప్పుడూ అనని మాటలను, చేయని పనులను చేసినట్టుగా చూపించే ఈ రకమైన కంటెంట్‌ను నియంత్రించకపోతే ప్రమాదమే. ట్రంప్, మోదీ మధ్య జరిగినట్టుగా చెబుతున్న టెలిఫోన్ సంభాషణ కూడా ఈ కోవకే చెందుతుంది.

'చట్టబద్ధమైన' హెచ్చరిక ఉండాలి!

ఏఐ ఆధారిత డీప్‌ఫేక్‌లను తప్పుడు సమాచారాన్ని ప్రసారం చేసేందుకు, ఒకరి పరపతిని తగ్గించేందుకు, ఆర్థికపరమైన నేరాలు చేసేందుకు వాడుతున్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల సందర్భంలో ప్రజలను ప్రభావితం చేసేందుకూ వాడటం కద్దు. ఇలాంటి అభ్యంతరకరమైన సమాచారం గురించి ప్రభుత్వం ఇప్పటి వరకూ 'సిగ్నిఫికెంట్ సోషల్ మీడియా ఇంటర్మీడియరీస్' (యాభై లక్షల కంటే ఎక్కువ సబ్‌స్క్రైబర్లు ఉన్న సామాజిక మాధ్యమ ప్లాట్‌ఫామ్స్)కు సలహా, సూచనలు ఇవ్వడానికే పరిమితమైంది. ఫిర్యాదులపై స్పందించేందుకు, చట్టపరమైన నిబంధనలు అమల్లో ఉండేలా చూసేందుకు ఈ కంపెనీల్లో వ్యవస్థలు ఉండాలి.

కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించిన నిబంధనలు... కంటెంట్ తీరుతెన్నులను గుర్తించేందుకు; సృష్టి, పంపిణీ, విస్తృతి వంటివి తెలుసుకునేందుకు బాధ్యత ఎవరిదన్న విషయాలపై చట్టబద్ధతను కోరుతున్నాయి. ఏఐ ఆధారంగా సృష్టించిన కంటెంట్ మొత్తాన్ని మెటాడేటాలో స్పష్టం చేసేలా చేయడం ద్వారా దీన్ని సాధించాలన్నది లక్ష్యం. ఫలితంగా ఏది కృత్రిమమైంది? ఏది కాదన్న విషయం స్పష్టమవుతుంది.

ఏది కృత్రిమ సమాచారం అన్న విషయాన్ని ఆ యా సోషల్ మీడియా సంస్థలే ప్రకటించాల్సి ఉంటుంది. ఈ కొత్త నిబంధనలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌తోపాటు ఏఐ కంపెనీలు, అవి అందించే టూల్స్‌కు కూడా వర్తిస్తాయి. ఏఐ టూల్స్ సిద్ధం చేసే కంపెనీలు కూడా సమాచారం ఏ రకమైందన్న విషయాన్ని స్పష్టం చేయాలి. పొగాకు ఉత్పత్తులపై ఉండే హెచ్చరిక మాదిరిగా 'ఈ కంటెంట్ కృత్రిమమైంది' అన్న లేబిలింగ్ శాశ్వతంగా ఉండాలన్న మాట! కనిపించే స్క్రీన్‌లో ఈ హెచ్చరిక కనీసం పది శాతం సైజులో ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. ఆడియో విషయానికి వస్తే మొదటి పది శాతం నిడివిలో ఈ హెచ్చరిక వినిపించాలి. తాము అప్‌లోడ్ చేసే సమాచారం ఏ రకమైందో వినియోగదారులే ప్రకటించేలా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ చర్యలు తీసుకోవాలి. సదుద్దేశంతో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్... ఏఐ ఆధారిత కంటెంట్ దేన్నైనా నిరోధించినా, తొలగించినా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం ప్రకారం వీరికి లభించే చట్టపరమైన రక్షణ కొనసాగుతుంది.



◆ ఏఐ ఆధారిత 'కృత్రిమ' కంటెంట్‌ను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త నిబంధనలన్నీ డీప్‌ఫేక్స్ లేదా అభ్యంతరకరమైన కంటెంట్‌ను తొలగించడం పైనే దృష్టిని కేంద్రీకరించాయి. ఇలా కాకుండా ప్రతి ఒక్కరి భౌతిక లక్షణాలు, గొంతుల రక్షణకు వీలు కల్పించేలా నిబంధనలను రూపొందించి ఉండాల్సింది.

కృత్రిమ మేధ ఏదైనా సరే... నియంత్రణ ప్రభుత్వాలకు కష్టమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇదే తీరు. ఏఐ కంటెంట్ చాలా సంక్లిష్టమైంది. ఛాట్‌జీపీటీ, జెమిని, డాల్–ఈ వంటి ఏఐ టూల్స్ మాత్రమే కాదు.. మరెన్నో రకాల ఏఐలు, ప్లాట్‌ఫామ్స్ కంటెంట్ సృష్టిలో తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. ఏఐ ఆర్ట్ జనరేటర్, వాయిస్ క్లోనింగ్ టూల్స్, డీప్‌ఫేక్ యాప్స్ వంటివన్నీ కలిస్తేనే కృత్రిమ కంటెంట్ సృష్టి, వ్యాప్తి సాధ్యమవుతోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, లింక్డ్‌ఇన్ వంటి ప్రధాన సోషల్ మీడియా కంపెనీలు మాత్రమే భారత్‌లో ఉండగా... మిగిలినవి ప్రపంచంలో ఎక్కడి నుంచో పనిచేస్తున్నాయి. వీటన్నింటినీ భారత ప్రభుత్వ నియంత్రణ పరిధిలోకి తేవడం దుస్సాధ్యం.

హడావిడిగా నిబంధనలా?

కేంద్రం డీప్‌ఫేక్స్ విషయంలో ప్రతిపాదించిన కొత్త నిబంధనలు హడావిడిలో చేసినట్టుగా కనిపిస్తోంది. ఇంకోలా చెప్పాలంటే రాజకీయ నేతలపై వస్తున్న వరుస డీప్‌ఫేక్ వీడియోలపై అప్పటికప్పుడు స్పందించినట్టుగా అనిపిస్తోంది. ప్రతి పౌరుడి హక్కులు పరిరక్షించేలా ఆలోచించి రూపొందించి ఉంటే బాగుండేది. ఈ కొత్త నిబంధనలన్నీ డీప్‌ఫేక్స్ లేదా అభ్యంతరకరమైన కంటెంట్‌ను తొలగించడంపైనే దృష్టిని కేంద్రీకరించాయి. అలాంటి కంటెంట్‌కు బాధ్యతను సోషల్ మీడియాపైనే మోపే ప్రయత్నం జరిగింది. ఇలా కాకుండా ప్రతి ఒక్కరి భౌతిక లక్షణాలు, గొంతుల రక్షణకు వీలు కల్పించేలా నిబంధనలను రూపొందించి ఉండాల్సింది. సినీతారలు తమ ముఖాలు, గొంతులను ఏఐ ద్వారా అనధికారికంగా ఎవరూ వాడకుండా ఉండే హక్కును కోరుతున్నారు.

డీప్‌ఫేక్‌లపై వివిధ దేశాలు వేర్వేరు పద్ధతుల్లో స్పందిస్తున్నాయి. డెన్మార్క్ పౌరులందరి వ్యక్తిగత లక్షణాలను ప్రత్యేకమైన హక్కుగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటోంది. అమెరికా ఎన్నికల్లో ఏఐ ద్వారా సృష్టించిన ఆడియో, వీడియో కంటెంట్‌ను నిషేధించేలా చట్టాన్ని ప్రతిపాదించారు. ఆన్‌లైన్ భద్రతకు సంబంధించి ఫ్రాన్స్ ఒక సమగ్రమైన చట్టం చేసే ప్రయత్నాల్లో ఉంది. యూకే కూడా ఆన్‌లైన్ సేఫ్టీ చట్టాలకు సవరణలు చేసింది. దీని పరిధిలోకి డీప్‌ఫేక్స్, ఫొటోల మార్ఫింగ్‌ను కూడా చేర్చింది. వీటన్నింటిలో యూరోపియన్ యూనియన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చట్టం సమగ్రంగా ఉందని చెప్పాలి. ఏఐతో రాగల సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించి, నియంత్రణ అవసరాన్ని, లోటు పాట్లను చర్చించి దీన్ని రూపొందించారు.

భారతదేశంలో మాత్రం ఎలాంటి బహిరంగ చర్చ లేకుండా ఈ నిబంధనల రూపకల్పన జరిగింది. ప్రతిపాదిత నిబంధనలపై వ్యాఖ్యానించేందుకు రెండు వారాల గడువు మాత్రమే ఇచ్చారు. కీలకమైన, దేశ ప్రజల్లో చాలామందిపై ప్రభావం చూపే అంశమైనందున మరింత విస్తృత చర్చ జరిగి ఉండాల్సింది. వేర్వేరు రంగాల భాగస్వాములతో చర్చించి ఉంటే నిబంధనలు మరింత సమర్థంగా ఉండేవి. పనిలో పనిగా 2021 నాటి డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్ ఎంత సమర్థంగా పనిచేస్తోందో కూడా చర్చించే అవకాశం దక్కేది. ఇందులో లోపాలను సరిదిద్దుకోవడంతోపాటు కొత్త నిబంధనలను మరింత సమర్థంగా రూపొందించేందుకు అవకాశం దక్కేది.

అసలు సమస్యలు

ప్రభుత్వ సంస్థలు ఇలాంటి చట్టాలను తమకు అనుకూలంగా మార్చుకుని కొందరి కంటెంట్‌ను మాత్రమే తొలగిస్తాయన్న అనుమానం నిత్యం ఉంటుంది. ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు కొందరు తప్పుడు, ఏఐ జనరేటెడ్ సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా వాడిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అలాగే రోబోట్‌లు లేదా అపరిచితులు సృష్టించే కంటెంట్ విషయంలో టెక్ కంపెనీలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల అవిశ్వసనీయ వైఖరి అన్నది కొత్త నిబంధనల అమలులో అతి పెద్ద ప్రతిబంధకం అని చెప్పాలి.

యూరోపియన్ యూనియన్ మాదిరిగా అన్ని విషయాలనూ నియంత్రించే సమగ్రమైన చట్టం భారతదేశానికి అవసరం. డిజిటల్ అక్షరాస్యత, ఆన్‌లైన్ భద్రతలపై ప్రజల్లో చైతన్యం పెంచడం ద్వారా వినియోగదారుల హక్కులను కాపాడాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత

పారతంత్ర్యాన్ని పారదోలిన గేయం



బంకించంద్ర ఛటర్జీ

'వందేమాతరం' నినాదం లేని స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఊహించలేం. బ్రిటిష్‌వాళ్లకు వ్యతిరేకంగా గొప్ప స్ఫూర్తిని, ఉద్యమ కాంక్షను వందేమాతర గేయం భారతీయుల్లో రగిలించింది. అదే తరువాత మన జాతీయ గేయం అయ్యింది. దీన్ని బంకించంద్ర ఛటర్జీ (ఛటోపాధ్యాయ) రచించారు. బ్రిటిష్ వారు భారతదేశాన్ని ఆర్థికంగా కొల్లగొట్టడం, సాంస్కృతికంగా బలహీనపరచడం ఆయన్ని వేదనకు గురిచేసింది. అందుకే 'ఆనంద్ మఠ్' నవల రాశారాయన. ఈ నవలలో సన్యాసుల స్వాతంత్ర్య సమర శంఖ నినాదం వందేమాతరం అవుతుంది. ఈ గేయాన్ని 1875 నవంబరు 7న బంకించంద్ర రాశారు. తరువాత 'ఆనంద్ మఠ్'లో పొందుపరిచారు. ఈ నవంబర్ 7తో వందేమాతర గేయానికి 150 ఏళ్లు పూర్తవుతాయి. వందే మాతర వేడుకలను అధికారికంగా వచ్చే ఏడాది నవంబర్ 7 వరకూ కేంద్రం నిర్వహించనుంది.

బంకించంద్ర 'ఆనంద్ మఠ్' రాయడానికి నూరేళ్లకు పూర్వం 1773లో కొందరు సన్యాసులు ఆంగ్లేయుల మీద ఉద్యమించారు. 1770 ప్రాంతంలో క్షామంతో ప్రజానీకం అల్లాడిపోయారు. ఈ పరిస్థితుల్లో లక్షల మందికి పైగా చనిపోయారు. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకుల పన్నుల పీడనకు వ్యతిరేకంగా హిందూ సన్యాసులు, ముస్లిం ఫకీర్లు ఏకమై చారిత్రాత్మక తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటు ఘట్టాలను కూర్చిన ఆనంద్ మఠ్ 1882లో ప్రచురితమైంది. 1884 ఏప్రిల్ 8న బకించంద్ర మరణించాక 1896లో రవీంద్రనాథ్ టాగూర్ ఆ గేయానికి స్వరకల్పన చేసి జాతీయ కాంగ్రెస్ సమావేశంలో పాడారు. అప్పట్నుంచి వందేమాతరం అందరి నోళ్ళలో నినాదంగా మారింది.

విభజించు–పాలించు సిద్ధాంతంతో హిందువులను, ముస్లిములను విడదీసేందుకు వైస్రాయ్ లార్డ్ కర్జన్ 1905 జూలై 20న బెంగాల్ విభజన ప్రకటన చేశాడు. తూర్పు బెంగాల్, పశ్చిమ బెంగాల్‌గా ఈ విభజన 1905 అక్టోబర్ 16న అమలులోకి వచ్చింది. ఈ విభజనకు వ్యతిరేక ఉద్యమం 1905 ఆగస్ట్ 7నే ప్రారంభమైంది. ఈ ఉద్యమానికి 'వందేమాతర ఉద్యమం' అని అశ్వనీకుమార్ దత్త నామకరణం చేశారు. వందేమాతరం అంటే 'మాతృభూమికి నమస్కారం' అని అర్థం. ఈ ఉద్యమంలో ప్రజలు వందేమాతరం గేయాన్ని ఆలపించటం, ఒకరినొకరు వందేమాతరం అని పలకరించుకోవడం వల్ల దీన్ని వందేమాతర ఉద్యమం అని పిలిచారు. ఈ ఉద్యమంలోనే విదేశీ వస్తువులను బహిష్కరించి, స్వదేశీ వస్తువులను మాత్రమే ఉపయోగించాలానే నిర్ణయం తీసుకోవడం వలన దీనికి స్వదేశీ ఉద్యమం అనే పేరు కూడా వచ్చింది. ఉద్యమం దెబ్బకు బ్రిటిష్ వాళ్లు దిగివచ్చి బెంగాల్ విభజనను 1911లో రద్దు చేశారు. దీంతో వందేమాతర ఉద్యమం ఆగింది కానీ... తరువాత స్వాతంత్ర్య ఉద్యమంలోని ప్రతిఘట్టంపైనా దాని ప్రభావం పడింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక, 1950 జనవరి 24న రాజ్యాంగ సభ 'వందేమాతరం' గేయాన్ని 'జనగణమన'తో సమానంగా గౌరవిస్తూ జాతీయ గేయంగా అధికారికంగా స్వీకరించింది.

– నర్సింగు కోటయ్య । హిస్టరీ అసిస్టెంట్ ప్రొఫెసర్
(వందేమాతరం గేయానికి 150 ఏళ్లు)

ఇది సామాజిక అన్యాయం!

ఇన్‌బాక్స్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 10 మెడికల్ కాలేజీలను మొదటి దశలో పబ్లిక్ అండ్ ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) కింద ప్రైవేట్ సంస్థలకు అప్పచెబుతూ నిర్ణయం తీసుకుంది. మీడియా నివేదికల ప్రకారం ఏకంగా 16 మెడికల్ కాలేజీలను పీపీపీ కింద ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడం కోసం ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. విపక్ష వైఎస్సార్‌సీపీ నుండే కాక 'ప్రజా ఆరోగ్య వేదిక', విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజా సంఘాలు, సామాన్య ప్రజల నుంచి కూడా ఈ విషయమై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

2019కి ముందు ఆంధ్రప్రదేశ్‌లో 12 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయి. తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం, వైద్య విద్య, ప్రభుత్వ వైద్యం వంటి రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా కొత్తగా 17 మెడికల్ కాలేజీలు నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. అందులో ఐదు మెడికల్ కాలేజీలు నిర్మాణం పూర్తి చేసుకొని ఆ ప్రభుత్వ హయాంలోనే అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన మెడికల్ కాలేజీలు నిర్మాణ దశలో ఉన్నాయి. కాగా ఈ 17 మెడికల్ కాలేజీలు ప్రభుత్వానికి భారం కాకుండా ఉండటం కోసం ఒక సెల్ఫ్ సస్టెయినబుల్ మోడల్‌ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. దానికి అనుగుణంగా జీఓ నం. 107, 108లు విడుదలయ్యాయి.

వీటి ప్రకారం 50 శాతం మెడికల్ సీట్లు కన్వీనర్ కోటాలో భర్తీ అవుతాయి. మిగిలిన వాటిలో 35 శాతం సెల్ఫ్ ఫైనాన్స్ కింద, 15 శాతం ఎన్నారై కోటా కింద భర్తీ అవుతాయి. వచ్చిన ఆదాయంతో కాలేజీలో మెడికల్ ఎక్విప్మెంట్, మెయింటెనెన్స్, మౌలిక వసతులు అభివృద్ధి చేసుకుంటూ తమ కాలేజీలను తామే మెయింటెయిన్ చేసుకోవచ్చు అనేది గత ప్రభుత్వ ఆలోచన. అదే ప్రైవేట్ కాలేజీలో ఎంబీబీఎస్ చదవాలంటే సుమారు కోటిపైనే ఖర్చు అవుతుంది అనేది వాస్తవం. ఏ ప్రభుత్వం అయినా సరే ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించడం ప్రాథమిక విధి. దీన్ని విస్మరిస్తే సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన జాతులు మరింతగా నష్టపోతాయి. ఇది సామాజిక అన్యాయం అవుతుంది. కూటమిప్రభుత్వం అనుసరిస్తున్న పీపీపీ విధానం ఈ అన్యాయానికి తెరలేపిందని వేరే చెప్పనవసరం లేదు.

– డా॥ నాగరాజు సోమపంగు । హైదరాబాద్

సాక్షి ఎడిటోరియల్ పేజీ ఈ–మెయిల్: editpage@sakshi.com

వ్యవసాయ భారతం

ప్రపంచంలోని 'లేబర్ ఫోర్స్'లో 2023 నాటికి వ్యవసాయ రంగంలో (అడవులు, చేపల వేటతో సహా) ఉన్నవారు 91.6 కోట్ల మంది. 2000 సంవత్సరంలో వీరి శాతం 40 కాగా, అది ఇప్పుడు 26 శాతానికి తగ్గింది. ప్రపంచంలో వ్యవసాయ రంగ కార్మికులు అధిక శాతం ఉన్నది భారత్‌లోనే!

డేటా సాయింట్



సత్కర్మకు దైవబలం తోడు!

జ్యోతిర్మయం

'కర్మం బొనరించును జననము మరణంబు' అన్నాడు తిక్కన ఆంధ్రమహాభారతం, అనుశాసనిక పర్వంలో! సృష్టిలోని సకల జీవుల కర్మల ఫలితాలుగా సంభవించేవే జనన, మరణాలు అని ఆ మాటల అర్థం. కర్మ సముదాయం చెడనిది. **'అచోద్యమానాని యథా పుష్పానిచ ఫలానిచ, స్వకాలం నాతివర్తంతే తథా కర్మ పురాకృతం'** – ప్రకృతిలో పూలు, పండ్లు ఎలాగైతే ఎవరి ప్రేరణ లేకుండానే, కాలం దాటి పోకుండా పుష్పించి, ఫలాలను ఇస్తాయో, అలానే పూర్వం ఎప్పుడో చేయబడినదైన సత్కర్మ, తగిన సమయానికి సత్ఫలితాన్ని తప్పక ఇస్తుంది అని వ్యాసులవారి మహాభారతం, మోక్షధర్మ పర్వంలో చెప్పబడింది.

'మేలు రెండు లోకంబుల మేల తెచ్చు; కీడు సేసిన దప్పుదు కీడ యగుట' అన్నాడు తిక్కన 'నిర్వచనోత్తర రామాయణము' చతుర్థాశ్వాసంలో! ఈ లోకంలో మేలు చేస్తే అది రెండు లోకాలకూ ఫలాన్ని ఇచ్చే మేలే అవుతుంది. అలాంటిదే కీడు కూడా! మనిషి చేసే మంచి పనికి అనుకూలంగానే దైవం అందించే సహాయం ఉంటుందని చెప్పడంలో సత్కర్మకు, దైవానుకూలతకు అవినాభావ సంబంధం ఉన్నదని బోధపడుతుంది. ఎలాగైతే చిన్న అగ్నికణం వాయువు తోడైనప్పుడు పెద్దదిగా పెరిగి ప్రజ్వరిల్లుతుందో, ఆ విధంగానే సత్కర్మ తోడైనప్పుడు దైవం అందించే బలం కూడా విశేషంగా పెరుగుతుందనే గొప్ప ఆలోచనను వ్యాసమహర్షి ముందుకు తెచ్చి చూపాడు మహాభారతం, అనుశాసనికపర్వంలో! ఆ సందర్భంలోనే...

శ్లో. యథా తైలక్షయాద్ దీపః ప్రహ్రాసముపగచ్ఛతి / తథా కర్మక్షయాద్ దైవం ప్రహ్రాసముపగచ్ఛతి.

తైలం క్షీణించగానే వెలుగుతున్న దీపం ఎలాగైతే ఆరిపోతుందో అలాగే, చేసే కర్మలో పవిత్రత అనే తైలం ఎప్పుడైతే క్షీణిస్తుందో అప్పుడు దైవానుకూలత కూడ అంతరించిపోతుందని చెప్పి... వెలిగే దీపానికి, వెలిగించే తైలానికి గల అవినాభావ సంబంధమే మనిషి చేసే సత్కర్మకు, ఆ సత్కర్మకు దైవం అందించే సహకారానికి మధ్య ఉంటుందనే నిజాన్ని గ్రహించాలని భావ యుక్తంగా చెప్పాడు.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

హాస్టల్ విద్యార్థిని ప్రసవం

- హాస్టల్లోనే బాలికకు పురిటి నొప్పులు
- రిమ్స్‌కు తరలింపు.. మగ బిడ్డ జననం

కడప రూరల్: కడప నగరంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో ఉంటూ చదువుతున్న బాలిక ప్రసవించడం కలకలం రేపింది. వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరుకు చెందిన బాలిక కడప మరియాపురం ప్రాంతంలోని బాలికల వసతి గృహంలో ఉంటుంది. స్థానిక కాలేజీలో పారా మెడికల్ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ విద్యార్థినికి గురువారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో హాస్టల్ సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బాలికను కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ విద్యార్థిని మగ బిడ్డకు జన్మనిచ్చింది. బాలిక గర్భిణిగా ఉందన్న సంగతి హాస్టల్ సిబ్బంది పసిగట్టకపోవడం గమనార్హం.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

కళ్యాణదుర్గం రూరల్: అప్పుల బాధ తాళలేక అనంతపురం జిల్లాలో మరో యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లికి చెందిన వెంకటేశ్(26)కు భార్య తేజ, ఇద్దరు కుమార్తెలున్నారు. వెంకటేశ్ తనకున్న ఐదెకరాల పొలంలో టమాట, మిర్చి తదితర పంటలు సాగు చేస్తున్నాడు. మంచి దిగుబడి వచ్చినా.. కూటమి ప్రభుత్వం నిర్వాకం కారణంగా గిట్టుబాటు ధరలు లేక పోవడంతో వెంకటేశ్ తీవ్రంగా నష్టపోయాడు. దీంతో పంటల సాగు, కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు సుమారు రూ.15 లక్షలకు చేరాయి. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువవ్వడంతో మనస్తాపం చెందిన వెంకటేశ్.. గురువారం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

తుపాను సాయం అందలేదంటూ నేతన్నల ఆందోళన

ఆందోళన చేస్తున్న చేనేతలు

మనుబోలు: మోంథా తుపానుతో నష్టపోయిన తమకు సాయం అందించలేదంటూ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేనేత కార్మికులు గురువారం నిరసన తెలిపారు. మగ్గం గుంతల్లోకి నీరు చేరడంతో తాము ఉపాధి కోల్పోయామని వాపోయారు. ప్రభుత్వ సాయంగా ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరకులను కొన్ని గ్రామాల్లోనే అందించిందని, మనుబోలు, చెర్లోపల్లిలో నేతన్నలకు ఎలాంటి సాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సాయం అందించాలని కోరారు. చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు.

రాజ్ కేసిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై కౌంటర్‌కు హైకోర్టు ఆదేశాలు

సాక్షి, అమరావతి: మద్యం అక్రమ కేసులో కేసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి 200 రోజులుగా జైల్లో ఉన్నారని, ఇది వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన వ్యవహారమని సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు విన్నవించారు. మద్యం అక్రమ కేసులో మొదటి నిందితునిగా ఉన్న కేసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు ఇటీవల కొట్టివేసిన సంగతి తెలిసిందే. దీంతో బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై గురువారం న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ జ్యోతిర్మయి విచారణ జరిపారు. ఈ సందర్భంగా సీఐడీ, సిట్ తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, పోసాని వెంకటేశ్వర్లు స్పందిస్తూ, పూర్తి వివరాలను కోర్టు ముందుంచేందుకు సమయం ఇవ్వాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి అనుమతినిస్తూ, తదుపరి విచారణ నాటికి కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీ, సిట్‌ను ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 14కి వాయిదా వేస్తూ ఉత్తర్వులిచ్చారు.

విశాల్ గున్నీకి అనుకూలంగా క్యాట్ తీర్పుపై అప్పీల్

హైకోర్టులో విచారణ వాయిదా

సాక్షి, అమరావతి: సీనియర్ ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీని తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఈ ఏడాది ఆగస్టు 29న ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యాజ్యం గురువారం హైకోర్టు ముందు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ తరఫు నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ గేదెల తుహిన్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసుపై తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ముంబై సినీనటి జత్వానీ అరెస్ట్ విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకున్నందుకు కూటమి ప్రభుత్వం రాగానే విశాల్ గున్నీతో పాటు పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులను సస్పెండ్ చేసింది. దీనిపై గున్నీ క్యాట్‌ను ఆశ్రయించారు. ప్రభుత్వ ఉత్తర్వులను క్యాట్ తప్పుపట్టింది.

మన ఖాతాలో వేసేద్దాం..

గొప్పల కోసం పథకాలు, వ్యవస్థల పేరు మార్పు

ప్రతి అడుగులోనూ సీఎం చంద్రబాబు క్రెడిట్ చోరీ

- పరిపాలనను వికేంద్రీకరిస్తూ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తెచ్చిన నాటి సీఎం వైఎస్ జగన్
- వలంటీర్లతో కలిసి ఈ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలు
- అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ వ్యవస్థపై బాబు అక్కసు
- ఈ క్రమంలో గ్రామ, వార్డు సచివాలయాలన్నీ విజన్ యూనిట్లుగా మార్పు
- ఇప్పటికే అమ్మ ఒడి, రైతు భరోసా, నాడు-నేడు, దిశా యాప్, విద్యా కానుక పేర్ల మార్పు
- సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ సహా 143 హామీల అమలులో ఘోర వైఫల్యం
- ఇది ముమ్మాటికీ క్రెడిట్ చోరీనే అంటున్న రాజకీయ విశ్లేషకులు

సాక్షి, అమరావతి: ఏమార్చి.. పేరు మార్చి.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారు. అమ్మ ఒడి నుంచి గూగుల్ డేటా సెంటర్ వరకూ అదే తీరు. తాజాగా గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను విజన్ యూనిట్లుగా పేరు మార్చి.. వాటిని తానే ప్రారంభించినట్లుగా గొప్పలు చెప్పుకోవడానికి సిద్ధమయ్యారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ సహా ఇచ్చిన 143 హామీల అమల్లో ఘోరంగా విఫలమైన చంద్రబాబు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన పథకాలు, ప్రారంభించిన వ్యవస్థల పేర్లు మార్చి.. వాటిని తానే ప్రారంభించినట్లు గొప్పలు చెప్పుకోవడానికి తహతహలాడుతున్నారంటూ రాజకీయ విశ్లేషకులు విమర్శిస్తున్నారు. ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలను అందించాలనే లక్ష్యంతో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు 2019 అక్టోబర్ 2న నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిదే. దేశ చరిత్రలో గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. రాష్ట్ర వ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఒకే నోటిఫికేషన్‌తో 1.34 లక్షల మంది శాశ్వత ఉద్యోగులను నియమించారు. అంతకు ముందే అంటే 2019 ఆగస్టు 15న వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఒకేసారి 2.66 లక్షల మంది వలంటీర్లను నియమించారు. గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ ద్వారా నాలుగున్నరేళ్లలో ప్రజల ఇంటి గుమ్మం వద్దకే 12 కోట్ల ప్రభుత్వ సేవలను అందించారు.

సచివాలయ వ్యవస్థపై దేశ వ్యాప్త ప్రశంసలు

కరోనా మహమ్మారి ప్రబలిన సమయంలో రాష్ట్రంలో ప్రజలకు గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్లు అందించిన సేవలపై దేశ వ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయి. సచివాలయ వ్యవస్థ పనితీరును కేంద్రం, పలు రాష్ట్రాల అధికారుల బృందాలు పరిశీలించాయి. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు.. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను నీరుగార్చడానికి కుట్ర పన్నారు. ఈ క్రమంలోనే విత్తనం నుంచి విక్రయం వరకూ రైతులకు చేదోడు వాదోడుగా నిలిచే రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారు. వాటి పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చి దిష్టిబొమ్మల్లా తయారు చేశారు. వలంటీర్లకు గౌరవ వేతనం రూ.5 వేల నుంచి రూ.పది వేలకు పెంచుతామని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక ఏకంగా వలంటీర్లను తొలగించి వెన్నుపోటు పొడిచారు. గ్రామ, వార్డు సచివాలయాలను అనవసరంగా ఏర్పాటు చేశారని.. వాటిలో నియమించిన ఉద్యోగుల వేతనాల భారం పెరిగి పోయిందని అక్కసు వెళ్లగక్కారు. ఆ తర్వాత మోంథా తుపానును గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా సమర్థవంతంగా ఎదుర్కొన్నామని ప్రశంసిస్తూ.. ఇప్పుడు ఆ వ్యవస్థను తానే ప్రారంభించినట్లుగా గొప్పలు చెప్పుకోవడానికి వాటి పేర్లను విజన్ యూనిట్లుగా మార్చుతామని ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకం /ప్రారంభించిన వ్యవస్థ	చంద్రబాబు కూటమి ప్రభుత్వం మార్చిన పేరు
రైతు భరోసా కేంద్రాలు	రైతు సేవా కేంద్రాలు
రైతు భరోసా	అన్నదాత సుఖీభవ
జగనన్న కాలనీలు	ఎన్టీఆర్ నగర్‌లు
అమ్మ ఒడి	తల్లికి వందనం
గోరుముద్ద	మధ్యాహ్న భోజనం
విద్యా కానుక	విద్యార్థి మిత్ర
నాడు–నేడు	మన బడి– మన భవిష్యత్తు
మత్స్యకార భరోసా	మత్స్యకారుల సేవలో
వాహన మిత్ర	ఆటో డ్రైవర్ల సేవలో
దిశ యాప్	శక్తి యాప్
గ్రామ, వార్డు సచివాలయాలు	విజన్ యూనిట్లు

‘అమ్మ ఒడి’ విషయంలోనూ అంతే..

- తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించే సమయంలో అది మంత్రి నారా లోకేశ్ ఆలోచన నుంచి పుట్టిందంటూ గొప్పలు పోయారు. వాస్తవానికి వైఎస్ జగన్ అమలు చేసిన అమ్మ ఒడి పథకానికే పేరు మార్చి అమలు చేస్తున్నారని విద్యార్థులు, తల్లితండ్రులే ఎలుగెత్తిచాటారు.
- వైఎస్ జగన్ అమలు చేస్తున్న పథకాలను రద్దు చేయం అని, వాటిని అంతకంటే గొప్పగా అమలు చేస్తామని.. అదనంగా సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ పథకాలను కూడా అమలు చేస్తామంటూ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక జగన్ అమలు చేసిన పథకాల పేర్లు మార్చారు. మరి కొన్ని రద్దు చేశారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ పథకాలను గాలికొదిలేశారు.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కృషి వల్ల విశాఖపట్నంలో గూగుల్‌తో కలిసి డేటా సెంటర్ ఏర్పాటుకు అదానీ సంస్థ నడుం బిగించింది. ఇప్పుడు ఆ డేటా సెంటర్ తన వల్లే విశాఖకు వచ్చిందంటూ సీఎం చంద్రబాబు క్రెడిట్ చోరీకి పాల్పడ్డారు.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని ప్రారంభించి, ఏడు కాలేజీలను అప్పట్లోనే పూర్తి చేశారు. తరగతులు కూడా ప్రాంభమయ్యాయి. కానీ.. సీఎం చంద్రబాబు మాత్రం ఆ మెడికల్ కాలేజీలను ప్రైవేటువారికి అప్పగిస్తూ అదే తన ఘనతగా చెప్పుకుంటుండటం కొసమెరుపు.

బడుగులేరు ఎస్సీ కాలనీలో విష జ్వరాలు, కామెర్లు

- 9 మంది విద్యార్థులకు అస్వస్థత
- ప్రభుత్వాస్పత్రిలో ఏడుగురు విద్యార్థులకు చికిత్స
- గ్రామంలో పర్యటించిన డీఎంహెచ్‌ఓ, విద్యా శాఖ అధికారులు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

కనిగిరి రూరల్: ప్రకాశం జిల్లా కనిగిరి మండలం బడుగులేరు ఎస్సీ కాలనీకి చెందిన 9 మంది విద్యార్థులు వాంతులు, విష జ్వరాలు, కామెర్లతో కనిగిరి ప్రభుత్వాస్పత్రిలో చేరటంతో ఒక్కసారిగా ఆందోళన రేగింది. అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం.. గ్రామంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో సుమారు 220 మంది చదువుతున్నారు. వారందరికీ మోంథా తుపాను కారణంగా సెలవులు ఇవ్వగా.. ఎస్సీ కాలనీలో నాలుగు కుటుంబాలకు చెందిన సుమారు 13 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలు, జ్వరాలతో అనారోగ్యం పాలయ్యారు. స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించుకున్నారు. వీరిలో ముగ్గురు కోలుకోగా, మిగతా 9 మందికి వాంతులు తగ్గినా జ్వరం తగ్గలేదు. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) సూచన మేరకు విద్యార్థుల్ని కనిగిరి ప్రభుత్వాస్పత్రికి బుధవారం తరలించారు. వైద్య పరీక్షలు చేయగా, కామెర్లుగా నిర్ధారణ అయింది. ఒకే ఇంట్లోని బ్లెస్సీ, రేచర్ల (9, 8 తరగతులు), మరో ఇంట్లోని అజయ్ (10వ తరగతి), ఒకే ఇంట్లోని తరుణ్, జయకుమార్, రాణి (3, 8, 10 తరగతులు), ఇంకో ఇంట్లోని కొండ్రు జగన్ (4వ తరగతి) కనిగిరి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విక్కి (7వ తరగతి) ఒంగోలులో, షర్లీ (8వ తరగతి) చెన్నైలో చికిత్స పొందుతున్నట్టు వారి తల్లిదండ్రులు తెలిపారు. కొన్ని రోజుల క్రితం పాఠశాలలోని 9, 10 తరగతుల విద్యార్థినులు ముగ్గురు కామెర్లకు గురైనట్టు సమాచారం. దీనిపై ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. డీఈఓ, డీఎంహెచ్‌ఓ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు బడుగులేరు పాఠశాలను సందర్శించారు. గ్రామంలోని మూడు బోర్ల వద్ద, గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

నాలుగు రోజుల క్రితం ఓ విద్యార్థి మృతి

కాగా.. బడుగులేరు ఎస్సీ కాలనీకే చెందిన 2వ తరగతి విద్యార్థి బి.భరత్ ఈ నెల 2న మృతి చెందాడు. కడుపులోని పేగుల్లో ఇన్‌ఫెక్షన్ కారణంగా చనిపోయినట్టు అతని తండ్రి బలసాని రాజశేఖర్ తెలిపారు. ఇప్పుడు మరికొందరు విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో విద్యాశాఖ అధికారులు వచ్చి మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించారు. రెండేళ్ల నుంచి విద్యార్థి భరత్‌కు కడుపులో నొప్పి వస్తోందని అతని తల్లిదండ్రులు చెప్పారని డీఈఓ కిరణ్‌కుమార్ వెల్లడించారు. దీనికి, తాజా ఘటనకు సంబంధం లేదన్నారు.

ఎస్‌ఆర్‌ఎంలో 300 మంది విద్యార్థులకు అస్వస్థత

- అధికారుల తనిఖీల్లో నిర్ధారణ
- ఫుడ్‌పాయిజనే కారణమా?
- విచారణ కమిటీ ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీ

మంగళగిరి టౌన్: గుంటూరు జిల్లా మంగళగిరి మండల పరిధిలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీలో గురువారం పలు శాఖల అధికారులు తనిఖీలు చేశారు. యూనివర్శిటీలో ఫుడ్ పాయిజన్ ఘటనపై గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణ కమిటీ ఏర్పాటుచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో తెనాలి సబ్ కలెక్టర్, ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, ఆహార తనిఖీ అధికారి, పౌర సరఫరాల అధికారులను నియమించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీలో అధికారులు తనిఖీలు చేశారు. క్యాంటీన్‌లో ఆహారం నాసిరకంగా ఉన్నట్లు గుర్తించామని తెనాలి సబ్ కలెక్టర్ సంజన సిన్హా తెలిపారు. దాదాపు 300 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, వారం రోజుల నుంచి రోజుకు 50 మంది అస్వస్థతకు గురవుతున్నారని, పలువురు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. ఇద్దరు విద్యార్థులు మంగళగిరి ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

ఆరుగురితో కమిటీ

ఈ సందర్భంగా మంగళగిరి తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ సంజనా సిన్హా మీడియాతో మాట్లాడారు. ఫుడ్ పాయిజన్ ఘటనపై వాస్తవాలను నిర్ధారించి చర్యలకు ఉపక్రమించేందుకు జిల్లా కలెక్టర్ ఆరుగురితో కమిటీని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ ఘటనకు కారణమేమిటన్నది ఖచ్చితంగా తెలుసుకునేందుకు పూర్తిస్థాయి విచారణ కొనసాగుతుందన్నారు. సీఆర్డీఏ పరిధిలోని గ్రామాల నుంచి సరఫరా అవుతున్న నీటి వలన సమస్య తలెత్తిందా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు తెలియజేశారు. ఆహారం వండేందుకు వినియోగిస్తున్న నీరు, తాగునీరు శాంపిల్స్‌ను ప్రయోగశాలకు పంపినట్లు చెప్పారు. నివేదిక ఆధారంగా యూనివర్శిటీకి మెమో జారీ చేస్తామని తెలిపారు. గతంలో కూడా ఇటువంటి ఘటనలు జరిగిన దాఖలాలు ఉన్నాయని, నివేదిక ఆధారంగా యూనివర్శిటీపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎస్‌ఆర్‌ఎం వర్శిటీకి సెలవులు

ఇదిలా ఉంటే ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీకి ఈ నెల 7వ తేదీ నుంచి 23వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు యూనివర్శిటీ రిజిస్ట్రార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూనివర్శిటీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ వల్ల పలువురు అనారోగ్యానికి గురైనట్టు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని యూనివర్శిటీ అంతటా శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, మెస్‌తో పాటు వంట గదులు, హాస్టల్ మొత్తం శుభ్రం చేస్తున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో రెండు వారాలపాటు సెలవులు ఇచ్చినట్టు వెల్లడించారు.

నకిలీ మద్యం కేసులో బెయిల్ పిటిషన్ల వాయిదా

- 11 మంది నిందితుల రిమాండ్ 13 వరకు పొడిగింపు
- ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు

విజయవాడ లీగల్: నకిలీ మద్యం కేసులో అరెస్టయి, రిమాండ్‌లో ఉన్న ఎ–1 అద్దేపల్లి జనార్ధనరావు, ఎ–2 అద్దేపల్లి జగన్మోహనరావు, ఎ–18 జోగి రమేష్, ఎ–19 జోగి రాము, ఇతర నిందితుల్లో తొమ్మిది మంది తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్లపై డిఫెన్స్ న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేసేందుకు వీలుగా విచారణను ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు ఈనెల 11కి వాయిదా వేశారు. అలాగే, అద్దేపల్లి జగన్మోహనరావు, అద్దేపల్లి జనార్ధనరావును మరోసారి ఐదురోజుల కస్టడీ కోరుతూ ఎక్సైజ్ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై డిఫెన్స్ న్యాయవాదులు గురువారం కౌంటర్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణను కూడా న్యాయమూర్తి 11వ తేదీకి వాయిదా వేశారు. ఇదే కేసులో జోగి రమేష్, జోగి రాములను 10 రోజుల కస్టడీ కోరుతూ ఎక్సైజ్ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా డిఫెన్స్ న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను 11కు వాయిదా వేశారు. అలాగే, నకిలీ మద్యం కేసులో రిమాండ్‌లో ఉన్న 11 మంది నిందితులు అద్దేపల్లి జనార్ధనరావు, అద్దేపల్లి జగన్మోహనరావు, బాదల్ దాస్, ప్రదీప్ దాస్, శ్రీనివాసరెడ్డి, కళ్యాణ్, నకిరికంటి రవి, శ్రీనివాసరావు, రమేష్ బాబు, షేక్ అల్లాభక్షు, చక్కా సతీష్‌కుమార్‌ల రిమాండ్ గురువారంతో ముగిసింది. వీరంతా వివిధ జైళ్లలో ఉండటంవల్ల పోలీసులు వారిని వర్చువల్ విధానంలో న్యాయస్థానంలో హాజరుపరిచారు. వీరి రిమాండ్‌ను ఈనెల 13 వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

కూటమి ప్రభుత్వాన్ని సాగనంపుదాం

- కూటమి పాలనలో విద్య, వైద్య రంగాలు సర్వనాశనం అయ్యాయి
- వైఎస్ జగన్ తీసుకొచ్చిన సంస్కరణలను పక్కనపెట్టేశారు
- మాజీ మంత్రి పేర్ని నాని
- వైఎస్ జగన్ ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రారంభించి 8 ఏళ్లు పూర్తి
- పార్టీ కేంద్ర కార్యాలయంలో కేక్ కట్ చేసి పార్టీ నాయకుల సంబరాలు

తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నేతలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖితమైందని ఆ పార్టీ నాయకులు చెప్పారు. వైఎస్ జగన్ పాదయాత్ర మొదలుపెట్టి గురువారంతో 8 ఏళ్లయిన సందర్భంగా మాజీ మంత్రులు పేర్ని నాని, సాకె శైలజానాథ్, మేరుగ నాగార్జున ఆధ్వర్యంలో తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. 341 రోజుల పాటు 3,648 కిలోమీటర్లు పాదయాత్ర చేసి, అప్పటి 13 ఉమ్మడి జిల్లాల్లోని 134 నియోజకవర్గాల్లో అన్ని వర్గాలకు చెందిన లక్షలమందిని వైఎస్ జగన్ పలకరించారని చెప్పారు. తనకు ఎదురైన అనుభవాలను, ప్రజల ఆకాంక్షలను బహిరంగ సభల్లో వివరిస్తూ, ఏం చేస్తానో చెబుతూ, అధికారంలోకి వస్తూనే హామీలన్నీ అమలు చేసి ప్రజా పాలనంటే ఇదీ అనేలా ట్రెండ్ సెట్ చేశారని పేర్కొన్నారు. సమాజంలోని ఆర్థిక, సామాజిక అసమానతలు తొలగాలంటే నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించడమే మార్గంగా భావించి వినూత్న మార్పులు తీసుకొస్తే... చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పెత్తందారీ విధానాలతో సర్వనాశనం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దురహంకార, ప్రజా వ్యతిరేక, అవినీతి పాలనకు వ్యతిరేకంగా, ప్రజా సంకల్ప యాత్ర స్ఫూర్తితో 2027లోవైఎస్ జగన్ మరోసారి పాదయాత్ర చేస్తారని తెలిపారు. ‘‘వైఎస్ జగన్ ప్రజా సంకల్ప పాదయాత్రలో 2,516 గ్రామాల ప్రజలను పలకరించి వారి ఆకాంక్షలను తెలుసుకున్నారు. తాను చూసిన అంశాలను, అనుభవాలను 124 బహిరంగ సభలలో ప్రస్తావించారు. 55 ఆత్మీయ సమ్మేళనాలతో కుల వృత్తులను బతికించడానికి ఏం చేయాలనేదానిపై కుల సంఘాలతో చర్చించి అభిప్రాయాలు తీసుకున్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ప్రజల్లో వెనుకబాటుకు కారణం నిరక్ష్యరాస్యత అని గ్రహించి విద్యా విప్లవం తెచ్చారు. ఖరీదైన కార్పొరేట్ వైద్యం చేయించుకునే క్రమంలో అప్పులపాలై కుటుంబాలు చితికిపోకుండా వైద్య విప్లవం తీసుకొచ్చారు. ఈ రంగాల్లో నాడు నేడు కార్యక్రమం చేపట్టి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. పేదవాడికి వైద్యం మరింత చేరువ చేయాలని తపించి ఐదేళ్ల పాలనలో 17 మెడికల్ కాలేజీలు ప్రారంభించి 7 కాలేజీలను పూర్తి చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుంది. ఢిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వం 800 స్కూళ్లను పదేళ్లలో మార్చి చూపిస్తే, వైఎస్ జగన్ హయాంలో కరోనాతో రెండేళ్లు పోయినా మూడేళ్లలో 16 వేల పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ బడుల్లో సీట్ల కోసం రికమండేషన్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యేలను కోరారంటే పాఠశాలన్ని వైఎస్ జగన్ ఎంత గొప్పగా తీర్చిదిద్దారో అర్థం చేసుకోవచ్చు. నిరంతరం ప్రజా శ్రేయస్సు, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకుసాగారు. ఈ క్రమంలో ఎన్నో ఒడిదొడుకులు, వేధింపులు, కేసులు, ఒత్తిళ్లు ఎదురైనా వెనకడుగు వేయలేదు. ప్రజా ప్రభుత్వం ఎలా ఉంటుందో తన పాలన ద్వారా చూపారు’’ అని పేర్ని కొనియాడారు. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ బడులను నాశనం చేసిందని, ఇంగ్లిష్ మీడియం రద్దు చేసిందని మండిపడ్డారు. చంద్రబాబు ధన దాహంతో మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తూ వైద్య విద్య చదవాలన్న పేద విద్యార్థుల ఆశలకు గండి కొట్టారని ధ్వజమెత్తారు.

ప్రజలను బలితీసుకుంటున్నది చంద్రబాబే..

‘‘చంద్రబాబు నేతృత్వంలో రాక్షస పాలన సాగుతోంది. సభలు, పబ్లిసిటీ స్టంట్లతో అమాయకుల ప్రాణాలను బలిపెట్టే లక్షణం చంద్రబాబుది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆలయాల్లో తొక్కిసలాటలు జరిగి భక్తులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నా చంద్రబాబు కనీస బాధ్యత తీసుకోలేదు. చేతకాని వారు, అవినీతి పరులు, తప్పుడు ఆలోచనలు ఉన్నవారు అధికారంలో ఉండడం ప్రజలకు శాపంగా మారుతుందని చెప్పడానికి ఈ వరుస దుర్ఘటనలే ఉదాహరణలు. ఇలాంటి దుర్మార్గ ప్రభుత్వాన్ని తెచ్చుకున్నందుకు రాష్ట్ర ప్రజలంతా చింతిస్తున్నారు.

మోంథా తుపాన్‌తో దెబ్బతిన్న పొలాలను పరిశీలించి ప్రభుత్వాన్ని నిలదీసి రైతులకు అండగా నిలవాలని వైఎస్ జగన్ కృష్ణా జిల్లా పర్యటనకు వెళ్తే, ‘‘ఎవర్నీ చంపకుండా రావాలంటూ మంత్రి నారా లోకేశ్ నోటికొచ్చినట్టు మాట్లాడాడు. రైతులు కన్నీళ్లు పెట్టుకుంటుంటే లోకేశ్ ముంబైలో కుటుంబంతో కలిసి క్రికెట్ మ్యాచ్ ఎంజాయ్ చేశాడు. పైగా తానే గెలిపించామని ప్రచారం చేసుకుంటున్నారు. అమిత్ షా కొడుకుతో ఫొటోలు దిగి ప్రచారం చేసుకోవడం గొప్ప కాదు దిగజారుడుతనం’’ అని పేర్ని నాని ఆగ్రహం వ్యకం చేశారు.

రాష్ట్ర చరిత్రను మార్చారు..

పాదయాత్ర చేయాలంటూ వైఎస్ జగన్ తీసుకున్న సాహసోపేత నిర్ణయం రాష్ట్ర చరిత్రను మార్చేసిందని మేరుగు నాగార్జున అన్నారు. అన్ని వర్గాల వారిని కలిసి ఆప్యాయంగా పలకరిస్తూ నేనున్నానని హామీ ఇచ్చారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ ఐదేళ్ల పాలనలో అమలు చేసి దిక్సూచిగా నిలిచారని ప్రశంసించారు. పజ్రాసంకల్ప పాదయాత్ర ద్వారా రాష్ట్ర ప్రజల కష్టాలను, ఆకాంక్షలను దగ్గర్నుంచి చూసిన వైఎస్ జగన్ వాటికి పరిష్కారాలను వెతుకుతూ ముందుకుసాగారని సాకె శైలజానాథ్ తెలిపారు. మళ్లీ వైఎస్ జగన్ ప్రజా పాలన వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడమే లక్ష్యంగా హామీలు గుప్పించి ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, టీజేఆర్ సుధాకర్ బాబు, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, మురుగుడు హనుమంతరావు, వరుదు కళ్యాణి, రుహుల్లా, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కారుమూరి వెంకటరెడ్డి, నాయకులు దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ, వార్డు సచివాలయాల పేరు మార్పు

- డేటా ఆధారిత పాలనపై సదస్సులో సీఎం చంద్రబాబు
- ఇకపై విజన్ యూనిట్లుగా పని చేస్తాయని వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల పేరు మారుస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఇకపై ఇవి విజన్ యూనిట్లుగా పని చేస్తాయని అన్నారు. గురువారం ఆయన సచివాలయంలో మంత్రులు, శాఖల ఉన్నతాధికారులతో పాటు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో డేటా ఆధారిత పాలనపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నరైనా కొన్ని శాఖలు ప్రజలు సంతృప్తి చెందేలా పని చేయడం లేదని అన్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని చెప్పారు. ఆర్టీసీలో పారిశుద్ధ్యంతో పాటు రెవెన్యూ, మున్సిపల్ సేవల్లో ప్రజల్లో సంతృప్తి పెరగడం లేదని అసహనం వ్యక్తం చేశారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి పెరిగిపోయిందని చెప్పారు. వచ్చే నెల రెండో వారం నాటికి ఏ శాఖ పని తీరు ఎలా ఉందో పరీక్షిస్తామన్నారు.

డేటా ఆధారిత రియల్ టైమ్ పాలన

ప్రతి ఒక్కరూ క్రియాశీలకంగా పని చేయాలని సీఎం అన్నారు. రాష్ట్ర పౌరులందరి డేటా క్రోడీకరించామని, ప్రతి కుటుంబం యూనిట్‌గా గృహాలను జియో ట్యాగింగ్ చేశామన్నారు. డేటా ఆధారిత రియల్ టైమ్ పాలన ఉంటుందని, ఫైళ్ల వేగంగా క్లియర్ చేయాలన్నారు. రూల్స్ ప్రకారం జీవోలు ఇవ్వక పోవడం వల్లే న్యాయ వివాదాలు తలెత్తుతున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను వదిలేస్తున్నామని, కాశీబుగ్గ ఆలయానికి అంత మంది భక్తులు వస్తే తెలియక పోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆలయాలు, పరిశ్రమలు, రవాణా.. ఎక్కడా ఎస్‌వోపీలను పాటించడం లేదన్నారు.

నేడు దేశ వ్యాప్తంగా 'వందేమాతరం' ఆలాపన

150 ఏళ్ల ఉత్సవాలను ప్రారంభించనున్న ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: స్వాతంత్ర్యోద్యమ సమయంలో భారతీయులను ఏకతాటిపైకి తేవడమే కాకుండా, ఇప్పటికీ అదే స్ఫూర్తిని రగిలిస్తున్న వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ నెల 7వ తేదీ, శుక్రవారం ఉదయం 10 గంటలకు దేశవ్యాప్తంగా అందరూ ఒకే సమయంలో వందేమాతర గేయం ఆలపించాలని కోరింది. ఏడాదిపాటు కొనసాగే'వందేమాతరం'ఉత్సవ కార్యక్రమాలను ఉదయం 9.30 గంటలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభిస్తారని ప్రధాని కార్యాలయం తెలిపింది. ఈ సందర్భంగా నాణెం, తపాలా బిళ్లను విడుదల చేస్తారు. పౌరులు, విద్యార్థులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, పోలీసులు, వైద్యులు, ఉపాధ్యా యులు, దుకాణదారులు, ఇతర వర్గాల ప్రజలంతా ఒకేసారి వందేమాతర గేయం ఆలపించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా అన్ని రాష్ట్రాల్లో గవర్నర్, సీఎం నేతృత్వంలో రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చింది. జిల్లా నుంచి మండల స్థాయి వరకు విద్యాలయాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించింది. మాతృభూమిని కీర్తిస్తూ సాగే ఈ గేయాన్ని బంకించంద్ర ఛటర్జీ 1875 నవంబర్ 7వ తేదీన అక్షయ నవమినాడు రచించారు. ఆయన రాసిన ఆనందమఠ్ నవలలో భాగంగా బంగదర్శన్‌లో ఈ గేయం మొదటిసారిగా అచ్చయింది.

23 ఏళ్ల నాటి జాబితాతో ఎస్ఐఆర్ ఎందుకు చేపట్టారు?

ఈసీకి కలకత్తా హైకోర్టు సూటిప్రశ్న

కోల్‌కతా: ఏకంగా 23 ఏళ్ల క్రితం నాటి ఓటర్ల జాబితాను ఆధారం చేసుకుని 'ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)' చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలకత్తా హైకోర్టు ప్రశ్నించింది. ఈ అంశంలో మీ వివరణ తెలపాలని ఈసీని హైకోర్టు ఆదేశించింది. పశ్చిమబెంగాల్ సహా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికల సంఘం ఎస్ఐఆర్‌ను మొదలెట్టడం తెల్సిందే. ఈ నేపథ్యంలో పాత గణాంకాలను పరిగణనలోకి తీసుకోవడం వెనుక ఆంతర్యాన్ని ఈసీ బయటపెట్టాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన సందర్భంగా కలకత్తా హైకోర్టు పై విధంగా స్పందించింది. నవంబర్ 19వ తేదీలోగా ఈసీ అఫిడవిట్‌ను తమకు అందజేయాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ పార్థసారథి సేన్‌ల హైకోర్టు డివిజన్ బెంచ్ సూచించింది. ప్రస్తుత సంవత్సర డాక్యుమెంట్లు, సమాచారంతోనే ఎస్ఐఆర్ చేపట్టేలా ఈసీని ఆదేశించాలని పిల్‌లో పిటిషనర్ కోరారు.

ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారం తీసుకోలేదు: సీఎం మమత

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఎన్యుమరేషన్ దరఖాస్తు ఫారాలు స్థానిక బూత్ లెవెల్ అధికారి(బీఎల్‌వో)నుంచి తనకు నేరుగా అందినట్టుగా వస్తున్న వార్తలను సీఎం మమతా బెనర్జీ ఖండించారు. తనకు ఎలాంటి ఎన్యుమరేషన్ ఫారం అందలేదని ఆమె స్పష్టం చేశారు. బుధవారం తన నివాసానికి వచ్చిన బీఎల్‌వో నుంచి దరఖాస్తును తీసుకున్నట్లుగా మీడియాలో వస్తున్న వార్త పూర్తి అవాస్తవం, తప్పుదోవ పట్టించేది, ఉద్దేశపూర్వకంగా వదంతులను వ్యాపింపజేసేందుకు చేసిన ప్రయత్నంగా ఆమె స్పష్టం చేశారు. తన నివాసానికి వచ్చిన బీఎల్‌వో ఉద్యోగుల వివరాలను తెలుసుకుని వారికి ఎన్యుమరేషన్ ఫారాలను ఇచ్చారని వివరించారు. రాష్ట్రంలోని పౌరులంతా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించే వరకు తాను ఎలాంటి దరఖాస్తును పూర్తి చేసేది లేదని ఆమె కరాఖండిగా చెప్పారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ అమలును సీఎం మమత తీవ్రంగా వ్యతిరేకిస్తుండటం తెల్సిందే.

భూ కుంభకోణంలో అజిత్ పవార్ కుమారుడి హస్తం

ఉన్నత స్థాయి దర్యాప్తుకు ఆదేశం

పుణే: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ పవార్‌తో సంబంధమున్న రూ.300 కోట్ల భూ కుంభకోణంలో ఒక రెవెన్యూ అధికారిని మహారాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. విచారణ కమిటీకి అదనపు చీఫ్ సెక్రటరీ (రెవెన్యూ) వికాస్ ఖర్గే సారథ్యం వహించనున్నా రు. ఇది చాలా తీవ్రమైన విషయమని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు. పుణేకు చెందిన తహసీల్దార్ సూర్యకాంత్ యెవాలెను సస్పెండ్ చేశారు. బీజేపీ, అజిత్ పవార్‌కు చెందిన ఎన్సీపీ, ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేతో కూడిన సంకీర్ణ ప్రభుత్వంపై ప్రతిపక్ష మహాయుతి తీవ్రమైన ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. పుణేలోని ముంధ్వారాలో ఉన్న 40 ఎకరాల ప్రభుత్వ భూమిని రూ.300 కోట్ల కు పార్థసారథి భాగస్వామిగా ఉన్న ఓ ప్రైవేట్ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా అమ్మేశారన్నది ప్రధాన ఆరోపణ.

నేడు వారణాసికి మోదీ

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సొంత పార్లమెంటరీ నియోజకవర్గం వారణాసికి చేరుకుంటారు. సాయంత్రం ప్రత్యేక విమానంలో ఇక్కడికి రానున్న ఆయన.. బీహెచ్ఈఎల్ యూనిట్‌ను సందర్శిస్తారు. ఈ సందర్భంగా వారణాసికి చెందిన 3,200 మంది ప్రముఖులతో జరిగే ముఖాముఖిలో పాల్గొంటారు. బనారస్ రైల్వేస్టేషన్‌ను సందర్శిస్తారు. అక్కడ జరిగే కార్యక్రమంలో నాలుగు వందేభారత్ రైళ్లను ప్రారంభిస్తారు. ఇందులో బనారస్–ఖజురహో, లక్నో–సహరాన్‌పూర్, ఫిరోజ్‌పూర్–ఢిల్లీ, ఎర్నాకులం–బెంగళూరు ఉన్నాయి.

అరెస్టుకు కారణాలను తక్షణం చెప్పాలి

- నిందితునికి అర్థమయ్యే భాషలో రాతపూర్వకంగా వివరించాలి
- ఏ నేరం, చట్టం కింద అరెస్ట్ చేస్తున్నారో స్పష్టం చేయాలి
- అరెస్టులపై కీలక తీర్పు వెలువర్చిన సర్వోన్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ: ఆగమేఘాల మీద అరెస్టులు జరిగిపోయే భారత్‌లో ఇకమీదట నిందితులకు అరెస్ట్ కారణాలు, కేసులో పొందుపరిచిన చట్టాల చిట్టాను విడమర్చి చెప్పాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అరెస్ట్ అయిన ప్రతి ఒక్క వ్యక్తికి తనను ఎందుకు అరెస్ట్ చేశారో, ఆ కేసులో ఏమేం రాశారో, ఎలాంటి చట్టాలను పేర్కొన్నారో, ఏ నేరాలను పొందుపరిచారో అతనికి అరెస్టసమయంలోగానీ అరెస్ట్‌చేసిన తక్షణంగానీ తెలియజేయాలంటూ సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పును వెలువర్చింది. గత ఏడాది ముంబైలో జూలైలో ఢీకొట్టి ఖరీదైన బీఎండబ్ల్యూతో పారిపోయిన ఘటనలో నమోదైన ఉదంతానికి సంబంధించి మిహిర్ రాజేశ్ షా, మహారాష్ట్ర ప్రభుత్వం మధ్య నడిచిన కేసులో తీర్పు చెబుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసీహ్‌ల ధర్మాసనం ఈ కీలక తీర్పును ఇచ్చింది.

వ్యక్తిగత స్వేచ్ఛకు ప్రాథమిక రక్ష ఇది

ధర్మాసనం తరఫున 52 పేజీల తీర్పును జస్టిస్ అగస్టీన్ రాశారు. ''రాజ్యాంగంలోని 22(1) అధికరణం ప్రకారం ఎవరినైతే పోలీసులు లేదా దర్యాప్తు సంస్థలు అరెస్ట్‌చేస్తాయో వాళ్లకు వీలైనంత త్వరగా అరెస్ట్‌కు కారణాలను వివరించాలి. ఇది ఇన్నాళ్లూ తప్పనిసరిగా అవలంభించాల్సిన విధానం కాదుగానీ వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక రక్షణగా నిలుస్తుంది. అరెస్ట్ అయిన నిందితునికి అతను అర్థంచేసుకునే భాషలో రాతపూర్వకంగా కేసు వివరాలను తెలియజేయాలి. ఏ నేరానికిగాను ఏ చట్ట నిబంధనల మేరకు అరెస్ట్‌చేయాల్సి వచ్చిందో నిందితునికి వెంటనే చెప్పాలి.

అయితే అరెస్ట్ చేసిన రెండు గంటల్లోపే అతడిని రిమాండ్ నిమిత్తం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగలిగితే మాత్రం నిందితునికి ముందే ఇవన్నీ చెప్పాల్సిన అవసరం లేదు. మేజిస్ట్రేట్ ముందుకు తీసుకెళ్లలేని సందర్భాల్లో ఇవన్నీ చెప్పకపోతే మాత్రం అతని వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం వాటిల్లినట్లే. ఒక నిందితుడిని ఒకటి కంటే ఎక్కువ కేసుల్లో అరెస్ట్‌చేస్తే ఆ అన్ని కేసుల్లో పొందుపరిచిన చట్టాలు, సెక్షన్లు, నేరాల చిట్టాను అతనికి వివరించాలి. వాటిని నిందితునికి అర్థమయ్యే భాషలో రాతపూర్వకంగా అందివ్వాలి. పాత భారతశిక్షాస్మృతి 1860 లేదా కొత్త భారతీయ న్యాయసంహిత,2023 చట్టం ప్రకారం చూసినా అరెస్ట్ అయిన వ్యక్తికి అరెస్ట్‌కు కారణాలను వెల్లడించాలని రాజ్యాంగమే ఉద్బోధిస్తోంది'' అని ధర్మాసనం వివరించింది.

కనీసం మౌఖికంగానైనా వివరించాలి

''అరెస్ట్ చేసిన ప్రాంతంలో ఇలా అరెస్ట్‌కు కారణాలు లిఖితపూర్వకంగా వెల్లడించేందుకు పెన్ను, పేపర్ లాంటి ఏర్పాట్లు లేకపోతే సంబంధిత దర్యాప్తు అధికారి/పోలీసు కనీసం మౌఖికంగా నిందితునికి అరెస్ట్ కారణాలను తెలపాలి. మేజిస్ట్రేట్ వద్దకు తీసుకెళ్లని పక్షంలో అతనికి వివరాలు చెప్పకపోతే అలాంటి అరెస్ట్/రిమాండ్‌కు చట్టబద్ధత లేదని భావించాలి. అప్పుడు నిందితుడిని వదిలేయడమే ఉత్తమం. మా తీర్పు ప్రతిని అన్ని రాష్ట్రాల హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్స్‌కు, అన్ని రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు పంపించండి'' అని రిజిస్ట్రీకి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. ''అసాధారణ కేసుల్లోనూ తప్పనిసరిగా కేసు వివరాలను నిందితునికి చెప్పాల్సిందే. లేదంటే ఆ అరెస్ట్‌కు చట్టబద్ధత లేనట్లే భావించాలి. అరెస్ట్ వేళ రాతపూర్వకంగా అతనికి ఇచ్చిన సమాచారాన్ని అతను అర్థంచేసుకోలేకపోతున్నాడంటే అతని రాజ్యాంగంలోని 22వ అధికరణం ఉల్లంఘనకు గురైనట్లే. అతనికి అర్థంకాని భాషలో సమాచారం ఇచ్చినా అది అతనికున్న రాజ్యాంగబద్ధ రక్షణను ఊహాత్మకంగా మార్చినట్లే. అది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 22ల్లోని వ్యక్తిగత స్వేచ్ఛను హరించినట్లే'' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అరెస్ట్ చేసినప్పుడు తనకు కారణాలను చెప్పలేదంటూ నిందితుడు మిహిర్ బాంబే హైకోర్టులో కేసు వేశాడు. అయితే కారణాలను తెలపకపోవడం అనేది విధానపర తప్పిదమని ఒప్పుకున్న హైకోర్టు.. ఆ కేసు తీవ్రత దృష్ట్యా అరెస్ట్ సహేతుకమేనని తీర్పు చెప్పిన విషయం విదితమే.

రికార్డు స్థాయిలో ఓటింగ్

- బిహార్‌లో తొలి దశ పోలింగ్‌లో 64.66 శాతం నమోదు
- రాష్ట్ర చరిత్రలో ఇదే అత్యధికమని ఎన్నికల సంఘం వెల్లడి
- ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేసిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్



సీఎం నితీశ్

పట్నా: దేశమంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్‌లో రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదైంది. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏకంగా 64.66 శాతం ఓటింగ్ రికార్డు కావడం గమనార్హం. ఓటర్లు ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొన్నారు. మహిళలు భారీ సంఖ్యలో పోలింగ్ బూత్‌ల ముందు బారులు తీరి కనిపించారు. తొలి దశలో భాగంగా 18 జిల్లాల్లోని మొత్తం 121 శాసనసభ నియోజకవర్గాల్లో గురువారం పోలింగ్ నిర్వహించారు. 3.75 కోట్ల మంది ఓటర్లలో 64.66 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలియజేసింది. పండుగ వాతావరణంలో తొలి దశ పోలింగ్ జరిగినట్లు పేర్కొంది. 45,341 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల దాకా కొనసాగింది. అత్యధికంగా ముజఫర్‌పూర్ జిల్లాలో 70.96 శాతం, సమస్తీపూర్‌లో 70.63 శాతం, మాధేపురాలో 67.21 శాతం, వైశాలీలో 67.37 శాతం, సహర్సాలో 66.84 శాతం, ఖగారియాలో 66.36 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో అత్యధిక శాతం ఓటింగ్ నమోదు కావడం పట్ల ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ హర్షం వ్యక్తంచేశారు. బిహార్ ఓటర్లకు అభినందనలు తెలియజేశారు. ఎన్నికల సంఘం పట్ల సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పోలింగ్ శాతంపై శుక్రవారం పూర్తి స్పష్టత రానుంది. తొలి దశలో భాగంగా మొత్తం 1,314 మంది అభ్యర్థులు తమ అదృష్టం పరీక్షించుకుంటున్నారు. ఆర్జేడీ ముఖ్యనేత తేజస్వీ యాదవ్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్‌కుమార్ సిన్హాతోపాటు పలువురు మంత్రులు తొలి దశ ఎన్నికల్లో పోటీకి దిగారు.

ఎస్ఐఆర్ తర్వాత ఎన్నికలు

బిహార్‌లో 1951–52లో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో 42.6 శాతం ఓటింగ్ నమోదైంది. రాష్ట్ర చరిత్రలో ఇదే అత్యల్పం. 2000 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో 62.57 శాతం ఓటింగ్ రికార్డయ్యింది. 2020 నాటి ఎన్నికల్లో కోవిడ్–19 ప్రభావం వల్ల ఓటింగ్ శాతం 57.29కు పరిమితమైంది. ఈసారి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) పూర్తి చేసిన తర్వాత నిర్వహిస్తున్న ఎన్నికలు కావడంతో దేశవ్యాప్తంగా అందరి దృష్టి బిహార్‌పై కేంద్రీకృతమైంది. రెండో దశలో భాగంగా మిగిలిన 122 అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ ఈ నెల 11న జరుగనుంది.

ఓటేసిన ప్రముఖులు

తొలి దశ ఎన్నికల్లో పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్, ఆర్జేడీ అధ్యక్షుడు, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్, బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్, ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి తదితరులు ఓటు వేశారు. లాలూ ప్రసాద్ యాదవ్‌తోపాటు భార్య రబ్రీ దేవి, కుమారుడు తేజస్వీ యాదవ్ సహా ఇతర కుటుంబ సభ్యులు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.

పట్నాలో ఓటేసిన తేజస్వీ యాదవ్, ఆయన భార్య రాజశ్రీ, మిసా భారతి, లాలూ దంపతులు

డిప్యూటీ సీఎం కాన్వాయ్‌పై దాడి

తొలి దశ పోలింగ్ సందర్భంగా అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నాయి. లఖీ సరాయ్ నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి విజయ్‌కుమార్ సిన్హా కాన్వాయ్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి దిగారు. బక్సర్, ఫతుహా, సూర్యగఢ్ తదితర ప్రాంతాల్లో కొన్ని కేంద్రాల్లో ఓటింగ్‌ను జనం బహిష్కరించారు. మరోవైపు మహాగఠ్‌బంధన్‌కు బలం ఉన్న ప్రాంతాల్లో అధికారులు ఉద్దేశపూర్వకంగా ఓటింగ్‌ను తగ్గించారని ఆర్జేడీ ఆరోపించింది.

పెనంపై రొట్టెను తిరగేయకపోతే..

ఈ ఎన్నికల్లో ఆర్జేడీ–కాంగ్రెస్ కూటమిదే విజయమని లాలూ ప్రసాద్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. తన కుమారుడు తేజస్వీ యాదవ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాడని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేశారు. పెనంపై రొట్టెను తిరగేయకపోతే మాడిపోతుందని తెలిపారు. ఎన్డీయే 20 ఏళ్లుగా అధికారంలో ఉందని గుర్తుచేశారు. కొత్త ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. నూతన బిహార్ నిర్మాణానికి తేజస్వీ ప్రభుత్వం రావాల్సిందేనని తేల్చిచెప్పారు.

కూలిన ఫైటర్ జెట్లు 8

- నేను బెదిరించటం వల్లే భారత్, పాక్ యుద్ధం ఆగింది
- మరోసారి ట్రంప్ నోట అదే మాట

న్యూయార్క్: భారత్–పాక్ మధ్య ఈ ఏడాది మే నెలలో సాయుధ ఘర్షణను తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. మొదటి నుంచీ ఇదే మాట చెప్తున్న ఆయన.. ఈసారి మరిన్ని వివరాలు వెల్లడించారు. నాటి ఘర్షణలో మొత్తం 8 యుద్ధ విమానాలు నేలకూలాయని ప్రకటించారు. అయితే, ఏ దేశానికి చెందిన ఎన్ని విమానాలు కూలిపోయాయో మాత్రం చెప్పలేదు. బుధవారం ఫ్లోరిడాలోని 'అమెరికా బిజినెస్ ఫోరం మియామీ'సదస్సును ఉద్దేశించి ట్రంప్ మాట్లాడారు. దాడులను ఆపకుంటే అమెరికాతో ఆ దేశాలకు ఉన్న వాణిజ్య సంబంధాలను పూర్తిగా తెంపేస్తానని తాను బెదిరించటం వల్లే రెండు దేశాలు దిగొచ్చాయని పేర్కొన్నారు. '8 నెలల్లో 8 యుద్ధాలను ఆపాను. కొసావో–సెర్బియా, కాంగో–రువాండా ఇలా చెబుతూ పోతే చాలా ఉన్నాయి. భారత్–పాక్‌తో వాణిజ్య చర్చల్లో ఉండగా, ఆ రెండు దేశాలు యుద్ధానికి దిగాయని తెలిసింది. ఆ ఘర్షణలో 7 యుద్ధ విమానాలు నేలకూలాయి. 8వ విమానమైతే తీవ్రంగా దెబ్బతిన్నది. అప్పుడు నేను ఆ రెండు దేశాలకు ఒకటే మాట చెప్పాను. మీరు శాంతి ఒప్పందం చేసుకోకపోతే నేను మీతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోనని స్పష్టంగా చెప్పాను. వాళ్లు మొదట ఒప్పుకోలేదు. కానీ, నేను కచ్చితంగా కాల్పుల విరమణ పాటించాల్సిందేనని చెప్పాను. మీరు ఇద్దరూ అణ్వాయుధ సామర్థ్యం గలవారు. మీరు ఇలాగే పరస్పరం యుద్ధంలో ఉంటే, నేను మీతో వాణిజ్య ఒప్పందాలు చేసుకునే ప్రసక్తే లేదని తెగేసి చెప్పిన. ఒకరోజు తర్వాత వారు నాకు ఫోన్ చేసి శాంతి ఒప్పందం చేసుకున్నట్టు చెప్పారు. అప్పుడు ఇక మనం వాణిజ్యం చేద్దాం అని వారితో చెప్పాను. ఇది గొప్ప పని కాదా? సుంకాలే ఆ పని చేశాయి. సుంకాలే లేకపోతే ఆ శాంతి ఒప్పందం సాధ్యమయ్యేదే కాదు'అని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులను పాకిస్తాన్ ఉగ్రవాదులు హత్యచేయటంతో ప్రతీకారంగా భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ పేరుతో పొరుగు దేశంలోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే.



డొనాల్డ్ ట్రంప్

ఇప్పటికి 58 సార్లు
కాంగ్రెస్ ఎద్దేవా

న్యూఢిల్లీ: ట్రంప్ తాజా ప్రకటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. 'ఆపరేషన్ సిందూర్‌ను తానే ఆపానని ట్రంప్ ఇప్పటికి 58 సార్లు చెప్పారు. వాషింగ్టన్ డీసీ, రియాద్, దోహా, లండన్, ది హేగ్, షర్మ్ ఎల్ షేక్, టోక్యో, ఎయిర్‌ఫోర్స్ వన్, ఇప్పుడు మయామీ.. అన్నిచోట్లా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌లను బూచిగా చూపి ఆపరేషన్ సిందూర్‌ను ఆపానని ప్రకటించారు'అని కాంగ్రెస్ నేత జైరాంరమేశ్ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. మయామీలో ట్రంప్ మాట్లాడిన వీడియోను కూడా షేర్ చేశారు.

మమ్దానిఎవరైతే నాకేంటి?

- కమ్యూనిస్టును మేయర్‌గా తీసుకొచ్చారు
- డెమొక్రాట్లపై డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం

న్యూయార్క్: అమెరికాలో పెద్ద నగరమైన న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన డెమొక్రటిక్ సోషలిస్ట్, భారతీయ అమెరికన్ యువకుడు జొహ్రాన్ మమ్దానిపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అతడి పేరు ఏదైనా కావొచ్చు, అతడు ఎవరైతే నాకేంటి? అని హేళన చేశారు. అమెరికా ప్రజలు కమ్యూనిజం కావాలో లేక కామన్‌సెన్స్ కావాలో తేల్చుకొనే సమయం వచ్చిందని అన్నారు. మియామీలో అమెరికా బిజినెస్ ఫోరమ్‌లో ట్రంప్ ప్రసంగించారు. గత ఏడాది నవంబర్ 5న అమెరికా ప్రజలు తనను మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని, తద్వారా దేశ సార్వభౌమత్వాన్ని పునరుద్ధరించారని చెప్పారు. కానీ, మంగళవారం జరిగిన మేయర్ ఎన్నికల్లో సార్వభౌమత్వాన్ని కొంత కోల్పోయినట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఇకపై ఏదైనా జరిగితే తాను చూసుకుంటానని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. న్యూయార్క్‌లో జరిగింది నిజానికి భయానక ఘటన అని అభివర్ణించారు. అలా జరగకూడదని తాను కోరుకున్నానని.. కానీ, జరిగిపోయిందని చెప్పారు. ''న్యూయార్క్‌లో ఉన్న వ్యక్తి పేరు (మమ్దాని) ఏదైనా కావొచ్చు, పట్టించుకోవాల్సిన అవసరం లేదు. అతడు ఎవరైతే నాకేంటి? మహిళల క్రీడల్లో పురుషులు ఆడడం ఎలా ఉంటుందో ఆలోచించండి'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

డెమొక్రటిక్ పార్టీ న్యూయార్క్‌లో ఒక కమ్యూనిస్టుని మేయర్‌గా ప్రతిష్ఠించిందని ట్రంప్ మండిపడ్డారు. అమెరికాలో కమ్యూనిజం ఏనాడూ పనిచేయలేదని గుర్తుచేశారు. సోషలిస్టును కాదనుకొని అదేస్థానంలో కమ్యూనిస్టును తలకెత్తు కోవడం ఏమిటని ప్రశ్నించారు. అమెరికాను కమ్యూనిస్ట్ క్యూబాగా, సోషలిస్ట్ వెనుజులా మార్చడానికి తమ ప్రత్యర్థులు కుట్రలు సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. క్యూబా, వెనుజులాలో ఏం జరుగుతోందో చూస్తూనే ఉన్నామని చెప్పారు. డెమొక్రాట్లు అతివాదులుగా మారుతున్నారని ఆరోపించారు. కమ్యూనిజం పాలనలో ఉన్న న్యూయార్క్ నుంచి వచ్చేవారితో మియామీ శరణార్థి శిబిరంగా మారిపోతుందేమోనని డొనాల్డ్ ట్రంప్ అనుమానం వ్యక్తంచేశారు. కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, సోషలిస్టులు, గ్లోబలిస్టులతో విధ్వంసమే తప్ప ఒరిగిదేమీ ఉండదని తేల్చిచెప్పారు. తాను అధికా రంలో ఉన్నంత కాలం అమెరికా ఎట్టిపరిస్థితుల్లో కమ్యూనిస్ట్ దేశంగా మారబోదని ట్రంప్ పేర్కొన్నారు.

జేఎన్‌యూ ఎన్నికల్లో వామపక్షం క్లీన్ స్వీప్

ఆర్ఎస్ఎస్ అనుబంధ ఏబీవీపీకి షాక్

న్యూఢిల్లీ: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం(జేఎన్‌యూఎస్‌యూ) ఎన్నికల్లో వామపక్ష కూటమి తన ప్రాబల్యాన్ని నిలుపుకుంది. కీలకమైన నాలుగు పోస్టులనూ కైవసం చేసుకుంది. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఎస్ఏ), స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ), డెమోక్రాటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్(డీఎస్ఎఫ్)ల కూటమి ఈ ఎన్నికల్లో క్యాంపస్‌పై తమ ఆధిపత్యాన్ని మరోసారి రుజువు చేసుకున్నాయి. దాదాపు దశాబ్ద కాలం తర్వాత గత ఎన్నికల్లో జాయింట్ సెక్రటరీ పోస్టును దక్కించుకున్న ఆర్ఎస్ఎస్ అనుబంధ ఏబీవీపీకి ఈ దఫా ఆ ఒక్క పోస్టు కూడా నిలుపుకోలేక పోవడం గమనార్హం. ఏఐఎస్ఏ తరఫున ప్రెసిడెంట్ పదవికి పోటీ పడిన అదితి మిశ్రా, ఏబీవీపీకి చెందిన వికాస్ పటేల్‌పై 449 ఓట్ల తేడాతో విజయం సాధించారు. వైస్ ప్రెసిడెంట్ పదవికి కిఝాకూట్ గోపికా బాబు ఎన్నికయ్యారు. డీఎస్ఎఫ్ అభ్యర్థి సునీల్ యాదవ్, ఏఐఎస్ఏకు చెందిన డానిష్ అలీ జనరల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ పదవులకు ఎన్నికయ్యారు. మొత్తం అర్హులైన 9,043 మంది విద్యార్థుల్లో 67 శాతం మంది ఓటేశారు. గతేడాది 70 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకోవడం గమనార్హం.

వారిపై అంతప్రేమ ఎందుకు?

- చొరబాటుదారుల కోసం మన ప్రజలను బలి చేస్తారా?
- ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ ఆగ్రహం

భాగల్పూర్: బిహార్‌లో ఆర్జేడీ–కాంగ్రెస్ కూటమిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ రెండు పార్టీలు చొరబాటుదారులపై అంతులేని అనురాగం ప్రదర్శిస్తున్నాయని మండిపడ్డారు. మరోవైపు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం శ్రీరాముడిని, ఛఠ్ పూజలను వ్యతిరేకిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఓటు బ్యాంకును సంతృప్తిపర్చడానికి మన సంప్రదాయాలను తూలనాడుతున్నారని విమర్శించారు. గురువారం బిహార్‌లోని భాగల్పూర్, అరారియా జిల్లాల్లో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ప్రతిపక్ష నాయకులు అయోధ్య రామాలయాన్ని ఇప్పటికీ దర్శించుకోలేదని గుర్తుచేశారు. నిశాద్ రాజ్, మాత శబరి, మహర్షి వాల్మీకికి సంబంధించిన పవిత్ర క్షేత్రాలకు కూడా వెళ్లలేదని అన్నారు. దళితులు, వెనుకబడిన తరగతులపై విపక్షాలు విద్వేషం చూపుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో 15 ఏళ్ల జంగిల్‌రాజ్ పాలనలో జరిగిన అభివృద్ధి గుండు సున్నా అని దుయ్యబట్టారు. రహదారులు, వంతెనలు, ఉన్నత విద్యా సంస్థలు నిర్మించలేదని ఆక్షేపించారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం జంగిల్‌రాజ్ నుంచి బిహార్‌కు విముక్తి కల్పించిందని చెప్పారు.

''ఈరోజు బిహార్‌లో అభివృద్ధి



కళ్లెదుటే కనిపిస్తోంది. జాతీయ రహదారులు, వంతెనలు నిర్మితమయ్యాయి. నాలుగు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలు ఏర్పాటయ్యాయి. ఈ ప్రగతి ప్రయాణం నిరాటంకంగా కొనసాగాలంటే ఎన్డీయే మళ్లీ అధికారంలోకి రావాలి. అందుకే ప్రజలు ఆలోచించి ఓటువేయాలి. ఈ అభివృద్ధి వెనుక ఎన్నో కష్టాలు ఉన్నాయి. ప్రధానంగా చొరబాటుదారుల నుంచి పెద్ద సవాలు ఎదురయ్యింది. ఆర్జేడీ–కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే చొరబాటుదారులకు ఘన స్వాగతం పలుకుతాయి. ప్రతిపక్షాలకు ఓటు బ్యాంకు రాజకీయాలే ముఖ్యం. కానీ, అక్రమంగా మనదేశంలోకి ప్రవేశించినవారితో ఎన్నో సమస్యలు వస్తున్నాయి. స్థానికులు నష్టపోతున్నారు. మన పౌరుల ఆస్తుల్లో వాటా కావాలని చొరబాటుదారులు డిమాండ్ చేస్తున్నారు. అందుకోసం ఎంతకైనా తెగిస్తున్నారు. పరాయివాళ్ల కోసం మన ప్రజలను బలి చేయడం ఎంత వరకు న్యాయమో ప్రతిపక్ష నాయకులే చెప్పాలి'' అని మోదీ ప్రశ్నించారు.

ఒక్క ఓటు సైతం విలువైనదే

బిహార్‌లో తొలి దశ పోలింగ్‌లో జనం చురుగ్గా పాల్గొనడం సంతోషం కలిగిస్తోంది. యువత, వృద్ధులు అనే తేడాలేకుండా అందరూ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఉత్సాహం ముందుకొస్తున్నారు. పోలింగ్ బూత్‌ల ముందు బారులు తీరుతున్నారు. మరోసారి జంగిల్‌రాజ్ అధికారంలోకి రాకుండా చూడాలన్న పట్టుదల మహిళల్లో కనిపిస్తోంది. ఒక్క ఓటు కూడా ఎంతో విలువైనది. ఓటు శక్తి ఏమిటో అర్థం చేసుకోవాలి. ఆర్జేడీ పాలనలో అరాచకం రాజ్యమేలిన సంగతి మర్చిపోవద్దు. ఇక కాంగ్రెస్ డిక్షనరీలో స్వదేశీ, ఆత్మనిర్భరత అనే పదాలే లేవు. స్వయం సమృద్ధి, స్వదేశీ ఉత్పత్తులతో పేదలు లబ్ధి పొందడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదు. విపక్ష కూటమికి సొంత కుటుంబాలు, సొంత ప్రయోజనాలు తప్ప ప్రజా సంక్షేమం అంటే ఏమిటో కూడా తెలియదు. దేశంలో అత్యంత అవినీతి కుటుంబం కాంగ్రెస్‌దే. బిహార్‌లో అత్యంత అవినీతి కుటుంబం ఆర్జేడీదే'' అని ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు.

ఆశారాం బాపునకు ఆరునెలల బెయిల్

అహ్మదాబాద్: వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపు(84)నకు గుజరాత్ హైకోర్టు ఆరు నెలల బెయిల్ మంజూరు చేసింది. 2013నాటి అత్యాచారం కేసులో జీవిత కారాగారం అనుభవిస్తున్న ఆయనకు వైద్య చికిత్స కోసం ఈ వెసులుబాటు కల్పించింది. వారం క్రితం రాజస్తాన్ హైకోర్టు ఇచ్చిన విధంగా ఆశారాంనకు అదే కారణంతో బెయిలిస్తున్నట్లు జస్టిస్ ఇలేశ్ ఓరా, జస్టిస్ ఆర్‌టీ వచ్ఛానీ తెలిపారు. రాజస్తాన్‌లోని ఆశ్రమంలో 2013లో బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో అక్కడి హైకోర్టు కూడా ఆశారాంనకు జీవిత ఖైదు విధించింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆశారాంనకు అక్టోబర్ 29న ఆరు నెలల బెయిలిచ్చింది.

రష్యా రిఫైనరీపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు

కీవ్: రష్యాకు చెందిన వాల్గొగ్రాడ్ ప్రాంతంలోని ప్రధాన చమురు శుద్ధి ప్లాంట్‌పై లాంగ్ రేంజ్ డ్రోన్లతో దాడి చేసినట్లు ఉక్రెయిన్ ప్రకటించింది. మూడు నెలల వ్యవధిలో ఇది రెండో దాడి కావడం గమనార్హం. బుధవారం జరిపిన తాజా దాడిలో ప్లాంట్‌కు తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఉక్రెయిన్ సైన్యం తెలిపింది. ఈ ప్లాంట్‌లో ఏడాది కోటిన్నర టన్నుల క్రూడాయిల్ శుద్ధి అవుతుంది. దేశం మొత్తమ్మీద శుద్ధి అయ్యే చమురులో ఈ ప్లాంట్ వాటా 5.6శాతం. డొనెట్స్క్‌లోని షహీద్ డ్రోన్ల అసెంబ్లీ ప్లాంట్, ఆక్రమిత క్రిమియాలోని మూడు ఇంధన వనరులపై కూడా దాడి చేసినట్లు పేర్కొంది.



నేడు అమ్మవారి గ్రామోత్సవం

నాదెండ్ల: గణపవరం శివనాగేంద్రస్వామి పుట్ట వద్ద ఉన్న కనకదుర్గమ్మ వారి గ్రామోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 46,280 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 32,780 క్యూసెక్కులు వదులుతున్నారు.

వైభవంగా లక్ష దీపోత్సవం

రేపల్లె: కార్తిక మాసం సందర్భంగా అరవపల్లిలోని బాల కోటేశ్వరాలయ ఆవరణలో గుర్రం మణికంఠ, లక్ష్మీ ప్రసన్న దంపతుల ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు ఆచార్య ఎన్జీరంగా జయంతి వేడుకలు

గుంటూరు రూరల్: పద్మవిభూషణ్ ఆచార్య ఎన్.జి. రంగా 125వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నగర శివారులోని లాంఫాం నందున్న ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని కృష్ణ ఆడిటోరియంలో వేడుకలు నిర్వహించనున్నారు. ఆచార్య ఎన్.జి.రంగా ట్రస్ట్ సభ్యులు రామినేని కిషోర్‌బాబు, టి.యుగంధర్, బి.నాగేశ్వర్‌మిత్రలు గురువారం ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

బాలోత్సవ్‌కు సర్వం సిద్ధం

పెదకాకాని: ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీయూ బాలోత్సవ్ – 2025 సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రాంగణంలో సర్వం సిద్ధం చేశామని చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వీవీఐటీయూలో గురువారం ఆయన మాట్లాడుతూ.. 20 అంశాలు, 61 విభాగాలలో పోటీలు నిర్వహించేందుకు 32 వేదికలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వసతి కోసం 73862 25336 ఫోను నంబరును సంప్రదించాలన్నారు. గుంటూరు, కృష్ణా జిల్లాల విద్యార్థులకు 43 రూట్లలలో బస్సులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రో చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ మాట్లాడుతూ.. 600 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వలంటీర్లుగా సేవలు అందిస్తారన్నారు. విజేతలకు కొండపల్లి విశిష్ట జోడు ఎడ్ల బొమ్మలను బహుమతిగా అందించనున్నట్లు తెలిపారు.

గురుకుల పాఠశాలను పరిశీలించిన మంత్రి డోలా

అమరావతి: స్థానికంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను గురువారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని వంట గది, మరుగు దొడ్లు, తరగతి గదులు పరిశీలించి విద్యార్థులను సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఉమ్మడి జిల్లాకొక ప్రత్యేక వైద్యాధికారిని నియమించామని తెలిపారు.

జిందాల్ ప్లాంట్‌ను సందర్శించిన తమిళనాడు డీఎంఏ



గుంటూరు రూరల్: ఘన వ్యర్థాలను పర్యావరణహితంగా నిర్వహించడానికి, నగరాల్లో డంపింగ్ యార్డులు లేకుండా చేయడానికి వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లు దోహదపడతాయని తమిళనాడు డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) పి. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం గుంటూరు రూరల్ మండలం నాయుడుపేటలోని జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను నగర కమిషనర్ పి. శ్రీనివాసులుతో కలిసి ఆయన సందర్శించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్టడీ టూర్‌లో భాగంగా తమిళనాడు మున్సిపల్ విభాగం నుంచి గుంటూరు వచ్చిన డీఎంఏ, మదురై కార్పొరేషన్ కమిషనర్ చిత్ర విజయన్, హోసూర్ కార్పొరేషన్ ఈఈ విక్టర్ జ్ఞానరాజ్, ఏఈ (డీఎంఏ) రవి చంద్రన్‌లు ప్లాంట్, నగరంలోని ఎంఆర్ఎఫ్, వెట్, విండ్రో, వర్మి కంపోస్ట్ యూనిట్లను పరిశీలించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ జిందాల్ ప్లాంట్ నిర్వహణలో గుంటూరు నగరపాలక సంస్థ నోడల్ కార్పొరేషన్‌గా ఉండి, ప్రతి రోజు సుమారు నాలుగు వందల టన్నుల వ్యర్థాలను పంపుతున్నామన్నారు. దీని వలన గుంటూరు నగరంలో ఎక్కడా డంపింగ్ యార్డులు లేకుండా వీలు పడుతుందన్నారు.

గుంటూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో కింది నుంచి పైస్థాయి వరకు పర్సంటేజీల రూపంలో కమీషన్ ఇస్తే ఏ పనైనా జరుగుతుందని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. కాంట్రాక్టర్ దక్కించుకున్న టెండర్‌లో వర్క్ ప్రారంభానికి ముందే కమీషన్లు ఇచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కమీషన్లు ఇవ్వకుంటే కొర్రీలు వేసి చుక్కలు చూపిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కాసులిస్తే బిల్... లేదంటే నిల్!

జీఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో అవినీతి దందా

- కింది నుంచి పైస్థాయి వరకు కొనసాగుతున్న కమీషన్ల పర్వం
- వర్కు ప్రారంభం నుంచి బిల్ అయ్యే వరకు కాంట్రాక్టర్లపై ఒత్తిడి
- నిధి పోర్టల్‌లో బిల్లులు పెట్టాలంటే కంప్యూటర్ ఆపరేటర్లకూ ఇవ్వాల్సిందే
- ప్రజాప్రతినిధుల ఒత్తిడితో కొందరికి మాత్రం సకాలంలో బిల్లుల చెల్లింపు
- కూటమి సర్కార్ వచ్చాక యథేచ్ఛగా ప్రజాధనం దోపిడీ

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): నగరపాలక సంస్థ పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు విషయంలో అకౌంట్ సెక్షన్‌కి వెళితే పేమెంట్ చేస్తుంటారు. ఆ సెక్షన్‌కు వెళ్లే బిల్లులను ప్రాధాన్యత క్రమంలో చేయాల్సి ఉంటుంది. కానీ ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల మేరకు వారికి అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్లకు పేమెంట్ ఇస్తున్నారు. ఇటీవల ఓ ప్రజాప్రతినిధి తనకు కావాల్సిన కాంట్రాక్టర్‌కి బిల్లు చెల్లింపు చేయాలని కమిషనర్‌కు సూచించారు. కమిషనర్ కూడా సదరు బిల్లును రాయాలని అకౌంటెంట్‌ను ఆదేశిస్తే... ప్రాసెస్ చేయకుండా కమీషన్ల కోసం పక్కన పెట్టినట్లు సమాచారం. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధి వద్ద కాంట్రాక్టర్ మొరపెట్టుకున్నారని సమాచారం. కేంద్ర మంత్రి వద్ద కూడా గోడు వెళ్లబోసుకున్నట్లు తెలిసింది. దీంతో అకౌంటెంట్‌ను కమిషనర్ బదిలీ చేశారు.

రూ.20 లక్షలతో ఉడాయింపు

ఎమ్మెల్యేలు, మంత్రుల ద్వారా చాలా మంది కాంట్రాక్టర్లు చెప్పించుకుని బిల్లులు ప్రాసెస్ చేయించుకుంటున్నారు. ఇదే అదనుగా కమిషనర్ చాంబర్‌లో పనిచేసే ఓ ఉద్యోగి బిల్లులు చేయిస్తానని చెప్పి రూ. 20 లక్షల వరకు కాజేసినట్లు సమాచారం. డబ్బులు ఇచ్చినప్పటికీ బిల్లులు కాకపోవడంతో సదరు ఉద్యోగిని కాంట్రాక్టర్లు నిలదీశారని సమాచారం. అతను విధులకు గైర్హాజరయ్యారు. ఇంత వరకు ఎందుకు విధుల్లోకి రావడం లేదనేది ఎవరూ అడిగిన పాపాన పోలేదు.

పోర్టల్‌లో బిల్లు పెట్టాలన్నా...

గతంలో కాంట్రాక్టర్లకు బిల్లుల పేమెంట్ సీఎఫ్ఎంఎస్ ద్వారా జరిగేది. ఇప్పుడు నిధి పోర్టల్ ద్వారా చెల్లింపులు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నాలుగైదు నెలలుగా ఇలా చెల్లింపులు చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ అవి సక్రమంగా నమోదు కావడం లేదు. ఇటీవల నిధి పోర్టల్‌కు 18 బిల్లులు పంపారు. వాటిలో 14 ఫైల్స్ వెనక్కి వచ్చినట్లు సమాచారం. నిధి పోర్టల్‌లో బిల్లుల అప్‌లోడ్‌కు సంబంధించి కంప్యూటర్ ఆపరేటర్లకు అవగాహన లేకపోవడంతో సరైన ఫార్మెట్‌లో నమోదు చేయడం లేదని తెలిసింది. బిల్లులు అప్‌లోడ్ చేసే కొంత మంది కంప్యూటర్ ఆపరేటర్లకు మాత్రం కమీషన్ ఇస్తేనే సక్రమంగా నమోదు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల డ్రాయింగ్ బ్రాంచ్‌లో కమీషన్ల విషయంలో రచ్చ జరగడంతో అక్కడ పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్‌ను వేరో చోటుకు బదిలీ చేశారు. నిధి పోర్టల్ మళ్లీ రావడంతో సదరు కంప్యూటర్ ఆపరేటర్‌ను తిరిగి కూర్చోబెట్టి బేరసారాలు నడుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇంటర్ పరీక్షలకు సన్నద్ధం

- పరీక్ష ఫీజు చెల్లింపునకు ముగిసిన తుది గడువు
- ఫిబ్రవరి ఒకటి నుంచి సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్
- అదే నెల 23 నుంచి ప్రారంభం కానున్న థియరీ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారు. సీనియర్ ఇంటర్ సైన్స్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ప్రాక్టికల్స్ జరగనున్నాయి. జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ఫిబ్రవరి 23వ తేదీ నుంచి థియరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతూ వచ్చే ఏడాది జరగనున్న పబ్లిక్ పరీక్షలకు హాజరు కావాల్సిన విద్యార్థులు రూ.వెయ్యి అపరాధ రుసుంతో కలిపి తమ పరీక్ష ఫీజు చెల్లించేందుకు బోర్డు ఇచ్చిన తుది గడువు గురువారంతో ముగిసింది. గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల్లోని జూనియర్ కళాశాలలతోపాటు ప్లస్ టూ పాఠశాలలు కలుపుకొని 161 విద్యాసంస్థల నుంచి పరీక్షలకు 69,278 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో జూనియర్ ఇంటర్ వారు 35,447 మంది, సీనియర్ ఇంటర్ విద్యార్థులు 33,831 మంది ఉన్నారు.

పరీక్షల షెడ్యూల్ ఇలా..

జూనియర్ ఇంటర్ విద్యార్థులకు జనవరి 21వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 23న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు జరగనున్నాయి. అదే విధంగా జనవరి 27 నుంచి ఒకేషనల్, ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి సీనియర్ ఇంటర్ సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 23వ తేదీ నుంచి థియరీ పరీక్షలు జరగనున్నాయి.

లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదనలను సహించం

- కొమ్మమూరు కాలువ నుంచి నీటిని తరలిస్తే తప్పని నష్టం
- కూటమి ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకుంటే ఉద్యమిస్తాం
- కార్యాచరణ సమావేశంలో స్పష్టం చేసిన ఆయకట్టు రైతులు

సమావేశంలో రైతులు, నాయకులు

కారంచేడు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయంతో కొమ్మమూరు కాలువ చివరి ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని, వెంటనే ఆ నిర్ణయాన్ని విరమించుకోకుంటే పోరాటం తప్పదని రైతులు ధ్వజమెత్తారు. గురువారం స్వర్ణ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం ప్రాంగణం, కుంకలమర్రు చెన్నకేశవస్వామి గుడి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యాచరణ సమావేశంలో వారు దీనిపై చర్చించారు. గుంటూరు జిల్లా కాకుమాను ప్రాంతానికి కొమ్మమూరు కాలువ నుంచి లిఫ్ట్ చేసి నీటిని తరలించే ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన చెందిన రైతులు ఈ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన పీ4 పథకం ముసుగులో కొమ్మమూరు కాలువ ఎగువ ప్రాంతంలో ఉన్న అప్పాపురం మెయిన్ చానల్ చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదనే సాకుతో కొమ్మమూరు కాలువ 60.25 కిలోమీటరు వద్ద కాలువ కుడి కట్టపై 120 హెచ్‌పీ హైస్పీడ్ లిఫ్ట్ ఇరిగేషన్‌ను నిర్మించి సాగునీటిని తరలించడానికి తమకున్న పలుకుబడిని ఉపయోగిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో కొమ్మమూరు దిగువ ఆయకట్టులోని 4 అసెంబ్లీ నియోజకవర్గాలు, 10 మండలాలు, 50 గ్రామాలకు చెందిన రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. తాగు, సాగునీటిని పొందే దిగువ ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవాలని కోరారు.

బంగారం దుకాణాల్లో బీఐఎస్ అధికారుల సోదాలు

నకిలీ హాల్‌మార్క్ కలిగిన ఆభరణాలు స్వాధీనం

ఓ దుకాణ యజమానికి నోటీసులు జారీ చేస్తున్న బీఐఎస్ అధికారులు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలోని బంగారం దుకాణాల్లో గురువారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు బంగారు ఆభరణాల దుకాణాల్లో నకిలీ హాల్‌మార్క్ ముద్రిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న నేపథ్యంలో ఈ దాడులు చేశారు. లాలాపేట పరిధిలోని పలు దుకాణాల్లో హాల్‌మార్క్ లేజర్ మిషన్ ద్వారా 22కే, 916 ముద్రిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. బీఐఎస్ డైరెక్టర్ అర్జున్ నేతృత్వంలోని సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు.

ఈ సందర్భంగా బీఐఎస్ డైరెక్టర్ అర్జున్ మాట్లాడుతూ కొన్ని షాపుల్లో నకిలీ హాల్ మార్క్ వేసి బంగారం అమ్ముతునట్టు సమాచారం వచ్చిందన్నారు. నకిలీ మార్కు ఉన్న కేజీ 26 గ్రాముల బంగారాన్ని, లేజర్ మిషన్‌ను సీజ్ చేశామని తెలిపారు. కొనుగోలుదారులు హెచ్‌యూఐడీఅనే న్యూమరిక్ కోడ్ ఉన్న బంగారాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. గుంటూరులో మొట్టమొదటిగా షాపులను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. కొంత మంది వ్యాపారులు లైసెన్స్, హాల్‌మార్క్ లేకుండా అమ్మటంతోపాటు నకిలీ హాల్‌మార్క్ ముద్రిస్తున్నారని తెలిపారు. ఇది నేరమని పేర్కొన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం షాపుల యజమానులకు నోటీసులు జారీ చేశారు.

బెల్టు షాపుల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

ఎక్సైజ్ శాఖ గుంటూరు డీసీ డాక్టర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు, పల్నాడు జిల్లాల్లో బెల్టు షాపుల నిర్మూలనకు ఎక్సైజ్ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గుంటూరు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం బ్రాడీపేటలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో పల్నాడు, గుంటూరు జిల్లాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు జిల్లాలో బెల్టు షాపుల నిర్మూలన ప్రత్యేక కార్యచరణ రూపొందించాలన్నారు.. బార్ అండ్ రెస్టారెంట్స్‌లో నిబంధనల మేరకు విక్రయాలు జరిగేలా చూడాలని తెలిపారు. కేసులు పెండింగ్‌లో ఉంటే సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మద్యం సీసాలను స్కానింగ్ చేసి మాత్రమే విక్రయించేలా అవగాహన కల్పించాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ ఎం.రవికుమార్‌రెడ్డి, గుంటూరు, పల్నాడు జిల్లాల ఎక్సైజ్ అధికారులు వి.అరుణకుమారి, కె.మణికంఠ, ఏఈఎస్‌లు మారయ్యబాబు, రవీంద్ర, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

లారీని బైకు ఢీకొని ఇద్దరు మృతి

అతివేగమే ప్రమాదానికి కారణం

సంఘటన స్థలంలో యువకుల మృతదేహాలు

బాపట్ల టౌన్: లారీని బైకు ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన గురువారం తెల్లవారుజామున బాపట్ల గడియారస్తంభం సెంటర్‌లో చోటుచేసుకుంది. పట్టణ సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన ఆరుగురు యువకులు మూడు బైకులపై బుధవారం అర్ధరాత్రి సూర్యలంక సముద్రతీరానికి వెళ్లడానికి వచ్చారు. అర్ధరాత్రి సమయంలో బీచ్‌లోకి పోలీసులు అనుమతించకపోవడంతో తిరిగి బాపట్ల పట్టణానికి చేరుకున్నారు. వారిలో గుంటూరు కొరిటెపాడు ప్రాంతానికి చెందిన షేక్ రిజ్వాన్ (18) ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి కాగా, చింతల నాని (21) గుంటూరు నగరంలోని వస్త్ర దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. వీరు ప్రయాణిస్తున్న బైకు అతివేగంతో చీరాల వైపు నుంచి బాపట్ల పాత బస్టాండ్ వైపు వెళుతున్న లారీ వెనక టైర్లను ఢీకొంది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. షాక్‌కు గురైన మిగతా స్నేహితులు బోరున విలపించారు. గస్తీ పోలీసులు అందించిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి సీఐ రాంబాబు చేరుకున్నారు. మృతదేహాలను బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. లారీ డ్రైవర్‌ను కూడా విచారిస్తున్నామని పేర్కొన్నారు.

కిడ్నీ రోగుల పరేషాన్!

- గుంటూరు జీజీహెచ్ వైద్యుల తీరుపై విమర్శలు
- గతంలో విజయవంతంగా మార్పిడి శస్త్రచికిత్సలు
- 22 నెలలుగా ఒక్క ఆపరేషన్ కూడా జరగని వైనం
- ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న రోగులు
- వ్యయప్రయాసలతో ఇబ్బంది పడుతున్న పేదలు

కిడ్నీ మార్పిడి కోసం ఎదురు చూస్తున్న డయాలసిస్ రోగులు (ఫైల్)

గుంటూరు మెడికల్: కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన సీహెచ్ సందీప్‌కు గుంటూరు జీజీహెచ్‌లో 2023 డిసెంబరు 19న కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా చేశారు. సుమారు రూ. 10 లక్షలు ఖర్చయ్యే ఆపరేషన్ ఉచితంగా నిర్వహించారు. నాటి నుంచి నేటి వరకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేయకుండా జీజీహెచ్ వైద్యులు మిన్నకుండిపోతున్నా ఆసుపత్రి అధికారులు చోద్యం చూస్తుండటం పేద రోగుల పాలిట శాపంగా మారింది. ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ. 20 లక్షలకుపైగా ఖర్చు అవుతోందని, అంత మొత్తంలో చెల్లించుకోలేక జీజీహెచ్‌కు వస్తుంటే వైద్యులు ఆపరేషన్లు చేయకుండా వాయిదా వేస్తున్నారని పలువురు రోగులు వాపోతున్నారు.

చుక్కలు చూపిస్తూ..

రోగులు ఆపరేషన్ కోసం జీజీహెచ్‌కు వస్తున్నా వైద్యులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సుమారు 20 నెలలుగా నెఫ్రాలజీ, యూరాలజీ వైద్యులు పరస్పరం నెపం మోపుకొంటూ ప్రాణాపాయ స్థితిలో చికిత్స కోసం వస్తున్న రోగులకు చుక్కలు చూపిస్తున్నారు. జీజీహెచ్‌లో కిడ్నీ జబ్బులతో 100 నుంచి 150 మంది నెఫ్రాలజీ వైద్య విభాగంలో చికిత్స పొందుతున్నారు. కొంత మందికి డయాలసిస్ ద్వారా నయం అవుతుంది. ఇలా నయం కాని 30 శాతం మందికి తప్పనిసరిగా కిడ్నీ మార్చాలి. ఆపరేషన్ చేస్తేనే వారి ప్రాణాలు నిలుస్తాయి. ఇలా పేదలకు, అటు ఆస్పత్రికి కూడా ఆరోగ్యశ్రీ ద్వారా నిధులు వస్తాయి. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో కిడ్నీ ఆపరేషన్లు చేయించుకునేందుకు స్థోమత లేక ఎంతో మంది డయాలసిస్‌తోనే సరిపెట్టుకుంటూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

2016 నుంచి కిడ్నీ ఆపరేషన్లు....

గుంటూరు జీజీహెచ్‌లో 2016 ఫిబ్రవరి నుంచి 24 మందికి విజయవంతంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిధులు రావడంతో కిడ్నీ, యూరాలజీ వార్డులు బాగా వృద్ధి చెందాయి. కరోనా కాలంలో రెండేళ్లు ఆగిన ఆపరేషన్లను సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. 2023 డిసెంబర్‌లో మళ్లీ శస్త్రచికిత్సలు ప్రారంభించారు. సూపరింటెండెంట్‌గా డాక్టర్ యశస్వి రమణ వచ్చాక కిడ్నీ రోగులు ఆపరేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలకు చెందిన రోగులు ఆవేదన చెందుతున్నారు. వైద్యుల మధ్య సమన్వయలోపం, ఆస్పత్రి అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఈ దుస్థితి నెలకొంది. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చొరవ తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్న సందీప్‌తో జీజీహెచ్ వైద్య బృందం (ఫైల్)

రోగుల వివరాలు ఇలా..

- జీజీహెచ్‌లో రోజూ ఓపీకి వచ్చే కిడ్నీ రోగులు – 100 నుంచి 150 మంది
- డయాలసిస్ అవసరమైన వారు – 80 నుంచి 100 మంది
- కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు అవసరమయ్యే వారి సంఖ్య – సుమారు 30 నుంచి 40 మంది

ప్రతి నెలలో 15 మందికిపైగా..

జిల్లాలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేయించుకునేవారు తప్పనిసరిగా గుంటూరు జీజీహెచ్‌లో కిడ్నీ మార్పిడి కమిటీ వైద్యుల అనుమతి తీసుకోవాలి. దీనికంటే ముందు గ్రామంలోని రెవెన్యూ, పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాల్సిందే. ఇలా ప్రతి నెలా సుమారు 15 మందికిపైగా ఆపరేషన్లకు అనుమతులు తీసుకుంటున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేసినా కొంత మేరకు రోగుల నుంచి ఫీజులు వసూలు చేస్తారు. మందులకు ప్రత్యేకంగా బిల్లులు చెల్లించాల్సిందే. సుమారు రూ.10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు దీనికి ఖర్చు అవుతోంది. జీజీహెచ్‌లో ఉచితంగా కిడ్నీ మార్పిడి చేయటంతోపాటుగా ఏడాదిపాటు ఆరోగ్యశ్రీ ద్వారా మందులు కూడా ఉచితంగా ఇస్తారు.

డైట్ లెక్చరర్ పోస్టు కోసం వక్రమార్గం

గుంటూరు ఎడ్యుకేషన్: డైట్‌లో ఇంగ్లిషు అధ్యాపక పోస్టు భర్తీ కోసం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌ల నుంచి దరఖాస్తులను స్వీకరించిన విద్యాశాఖ గురువారం గుంటూరులోని స్తంభాలగరువులో ఉన్న నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల కేంద్రంలో పరీక్ష నిర్వహించింది. ఇంగ్లిషు పోస్టు కోసం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న ముగ్గురు అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఐదేళ్ల సర్వీసుతోపాటు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలనే నిబంధన అభ్యర్థులకు ఉంది. కాగా, పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం ములకలూరు జెడ్పీ హైస్కూల్లో పని చేస్తున్న ఉపాధ్యాయినికి సంబంధిత అర్హతలు లేకపోవడంతో ఆమె దరఖాస్తును డీఈవో కార్యాలయంలో తిరస్కరించారు. అయినప్పటికీ పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని హాల్ టిక్కెట్టు పొంది నేరుగా పరీక్ష రాసేందుకు వచ్చారు. ఇతర అభ్యర్థులకు విషయం తెలియడంతో విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. పరీక్ష కేంద్రం వద్ద ఉపాధ్యాయురాలి హాల్ టిక్కెట్‌ను పరిశీలించిన అధికారులు పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. ఈ సంఘటనను విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సీరియస్ అయ్యారు.

మిర్చి యార్డు సమాచారం
(గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	51,078
అమ్మకాలు	49,124
నిల్వ	13,404

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–15800
నంబరు–5	10,000–14,300
341	10,000–16,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–15,400
నంబరు–5	10,000–14,500
341	10,000–16,300
4884	11,000–13,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,700
బాడిగ–355	10,500 – 16,500
దేవనూరు డీలక్స్	10,000 – 15,300
ఆర్మూర్	10,000 – 13,500
తాలుకాయలు	5,500 – 8,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–15,500
బాడిగ – 355	10,000–16,1100
దేవనూరు డీలక్స్	10,500–15,500
తాలు	5,300 – 8,200

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 218

కొమ్ములు : 157 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,800	12,500	12,500

కాయలు : 61 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
11,800	12,400	12,400

మొత్తం అమ్మకాలు : 163.50 క్వింటాళ్లు

–దుగ్గిరాల

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 600 గరిష్టం : రూ. 900

మోడల్ ధర రూ. 700

భళా.. దుర్గి శిల్ప కళ

- ఖండాంతరాలు దాటిన శిల్ప ఖ్యాతి
- ప్రాచీన కాలం నాటి శిల్పకళా చాతుర్యానికి పుట్టినిల్లు దుర్గి
- 12వ శతాబ్దంలోనే శిల్ప కళకు బీజం
- అద్భుత నైపుణ్యంతో బండరాళ్లకు సజీవ రూపాన్ని ఇస్తున్న కళాకారులు
- దేవతామూర్తులు, బుద్ధుడి విగ్రహాలకు పెట్టింది పేరు
- 2017లో జియోగ్రాఫికల్ గుర్తింపు
- నాడు వందల్లో కళాకారులు... నేడు 25 మందే
- ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను రప్పించి శిల్పాలు చెక్కుతున్న వైనం



దుర్గి శిల్పకారులు చెక్కిన కృష్ణుడి విగ్రహం



యువతి విగ్రహం



బుద్ధుడి విగ్రహం



రాతి మండపం

శిల్పాన్ని చెక్కుతున్న కళాకారుడు

సాక్షి, నరసరావుపేట, దుర్గి : ఆ గ్రామం అమరశిల్పులకు పుట్టినిల్లు. జీవంలేని బండరాళ్లను ఉలిదెబ్బలతో గాయాలు చేసి జీవం పోసి అందమైన ఆకృతులను మలచడం వారి ప్రత్యేకత. రాజులు పోయినా, రాజ్యాలు కూలినా ఆనాటి శిల్పకళను మాత్రం కాపాడుకుంటూ వస్తున్నారు. ఆ గ్రామానికి చెందిన శిల్పుల చేతిలో దేవతామూర్తులు, పల్లె పడుచులూ, హొయలుపోతున్న సుందరాంగులూ, మహనీయుల విగ్రహాలు ఇలా ఒకటేంటి ఎన్నో అద్భుతాలను రూపుదిద్దుకుంటున్నాయి. ఖండాంతరాలు దాటిన ఖ్యాతిని గడించిన ఆ గ్రామం పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం దుర్గి. ఆ గ్రామంలో శాలివాహనులు, కాకతీయుల కాలం నాటి ప్రాచీన శిల్ప కళా చాతుర్యం ఉట్టిపడుతుంది. ఇక్కడ ఆరు అంగుళాల నుంచి ఆరు అడుగులు, ఇంకా ఎత్తయిన శిల్పాలు చెక్కడంలో ఇక్కడి శిల్పులు సిద్ధహస్తులు. దేవతామూర్తులు, బుద్ధుడు, రాధాకృష్ణులు, రాచరిక హుందాతనాన్ని తెలిపే విగ్రహాలను అలవోకగా చెక్కుతారు.

క్రీ.శ 12వ శతాబ్దంలో ఆరంభం...

దుర్గి శిల్ప కళకు శతాబ్దాల చరిత్ర ఉంది. క్రీస్తు శకం 12వ శతాబ్దంలోనే ఆ ప్రాంతంలో ప్రాచీన కళకు బీజం పడింది. ఆచార్య నాగార్జునులు పెందోట వాసి అని ఐతిహ్యం. పెందోట నుంచి కొంత మంది శిల్పులు ద్వారకాపురికి వలస వెళ్లారు. ప్రకృతి వైపరీత్యమో, శత్రువుల దాడుల కారణంగానో క్రీ.శ 11వ శతాబ్దంలో ద్వారకాపురి నాశనం అయింది. ఈ క్రమంలో ద్వారకాపురి నుంచి వలస వచ్చిన కొందరు శిల్పులు ఓ ప్రాంతంలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, శత్రువుల నుంచి రక్షణ కల్పించమని దుర్గా దేవి విగ్రహాన్ని ఒకటి చెక్కి అక్కడ ప్రతిష్ఠించారు. శిల్పులు ఆ ప్రాంతానికి 'దుర్గి'గా నామకరణం చేశారు. అమరావతి, నాగార్జున కొండల్లోని బౌద్ధ స్తూపాలను దుర్గి కళాకారులే మలిచారని చరిత్రకారులు చెబుతుంటారు. విజయపురిసౌత్, నాగార్జున కొండకు వచ్చే దేశ, విదేశీ బౌద్ధ ఆరాధికులు దుర్గి గ్రామాన్ని సందర్శించి ఇక్కడి శిల్పులు మలచిన బౌద్ధ విగ్రహాలు కొని తీసుకెళ్తుంటారు. రాష్ట్రంలోని పలు నగరాల్లోని దేవాలయాలు, పార్కులు, ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో దుర్గి విగ్రహాలు ఠీవిగా నిలబడి దర్శనమిస్తుంటాయి.

ప్రస్తుతం 25 కుటుంబాలే...

దుర్గి శిల్ప కళ నానాటికి అంతరించిపోయే దిశగా అడుగులు వేస్తోందని ఇక్కడి శిల్పులు చెబుతున్నారు. 1960 నుంచి 2000 సంవత్సరాల మధ్య 300 మంది వరకు శిల్పులు గ్రామంలో ఉండేవారు. కాల క్రమంలో వీరి సంఖ్య తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం 25 కుటుంబాలు మాత్రమే గ్రామంలో శిల్ప కళా వృత్తిలో ఉన్నారు. కనుమరుగవుతున్న దుర్గి శిల్పకళను రాబోయే తరాలకు అందించాలనే ఉద్దేశంతో 1962లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం శిల్పకళా శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పింది. ఈ కేంద్రం ద్వారా వందల మంది శిల్ప కళలో శిక్షణ పొందిన శిల్పులు ఏపీ, తెలంగాణాతో పాటు ఇతర రాష్ట్రాల్లో రాణిస్తున్నారు. ప్రస్తుతం స్థానిక కుటుంబాలు వేరే వృత్తులకు వెళ్లడంతో తమిళనాడు, ఒడిశాల నుంచి కార్మికులను రప్పించి, వారికి తగిన శిక్షణ ఇచ్చి పనిచేయించుకుంటున్నారు. శిల్ప తయారీ కేంద్రాలకు ఒప్పందాలు ఉన్నప్పుడు వారిని రప్పించి పని పూర్తి కాగానే పంపుతున్నారు. పెరుగుతున్న ఖర్చులు, మారుతున్న పరిస్థితులతో శిల్ప వృత్తికి దూరమవుతున్నారని ప్రభుత్వం తోడ్పాటు అందిస్తేనే ఈ కళ బతుకుతుందని స్థానికులు అంటున్నారు.

2017లో జియోగ్రాఫికల్ గుర్తింపు...

దుర్గి శిల్పాలకు ఖండాంతర ఖ్యాతి ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, దేశంలోని వివిధ రాష్ట్రాలకు, విదేశాలకు ఇక్కడి విగ్రహాలు ఎగుమతి అవుతాయి. ముఖ్యంగా ఇక్కడ మలిచే చిన్న చిన్న బుద్ధుడు, వినాయకుడు, రాధాకృష్ణుల విగ్రహాలు దేశ విదేశాలలో ఎక్కువ గిరాకీ ఉంటుంది. 2014లో శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మం దేవాలయానికి దశావతరాల విగ్రహాలు దుర్గి శిల్పకారులే అందజేశారు. తెలంగాణ రాష్ట్రం బుద్ధవనానికి విగ్రహాలను దుర్గి కళాకారులే తీర్చిదిద్దారు. 2017లో దుర్గి శిల్పాలకు కేంద్రప్రభుత్వం జియోగ్రాఫికల్ గుర్తింపును అందజేసింది. ఇక్కడ మలిచే లైమ్ హార్డ్ రాయి విగ్రహాలకు ప్రత్యేకత ఉంది. అరుదైన ఈ రాయి దుర్గి గ్రామంలోనే ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఓ క్వారీలో మాత్రమే లభిస్తుందని ఇక్కడి శిల్పులు చెబుతారు. దుర్గిలో మలిచిన శిల్పాలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని లేపాక్షి స్టాల్స్‌లో లభిస్తాయి. గ్రామంలో ఐదు శిల్ప తయారీ కేంద్రాలు ఉన్నాయి.

కళను బతికించాలనే...

రాష్ట్రంతోపాటు దేశమంతా మా శిల్ప కళ అద్భుతం అంటారు. ఎంత కష్టపడినా న్యాయం జరగటం లేదు. శిల్ప కళలను పెంపొందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కేవలం కళను బతికించాలనే కష్టనష్టాలను భరించి ఈ వృత్తిలో కొనసాగుతున్నాం. ప్రోత్సాహం లభిస్తే మరికొందరు యువకులు ఈ రంగంలో రాణించడానికి ముందుకు వస్తారు. ప్రభుత్వం విద్యుత్‌ను సబ్సిడీతో ఇవ్వాలి, శిల్ప కళాకారులకు వసతి గృహాలను నిర్మించాలి. క్వారీలకు ప్రభుత్వం రాయల్టీ కల్పించాలి.

– మల్లె రామాంజనేయులు, సాయి శివ దుర్గ శిల్ప కళా కేంద్ర నిర్వాహకుడు, దుర్గి.

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి...

దేశవ్యాప్తంగా దుర్గి శిల్ప కళలకు ఎంతో ప్రాచుర్యం ఉంది. ఈ ప్రాంతంలో ప్రత్యేకంగా లభించే దుర్గి రాయి ద్వారా మలిచే శిల్పాలకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉంది. ముఖ్యంగా బుద్ధుడి విగ్రహాలను ఎంతో మంది విదేశీయులు వచ్చి తీసుకెళ్లారు.. నేను యువకుడిగా ఉన్న సమయంలో వందల మంది ఉన్న శిల్పులు నేడు పదుల సంఖ్యలోకి వచ్చేశారు. ప్రభుత్వం చేయూతనిచ్చి శిల్ప కళలను ప్రోత్సహించాలి. అప్పుడే కళ పదికాలాల పాటు నిలిచి ఉంటుంది. లేకపోతే దుర్గి శిల్ప కళా వైభవం అంతరించిపోతుంది.

– శెట్టిపల్లి యలమంద, జెడ్పీటీసీ, దుర్గి

మూడు మండలాల్లోనే వర్షం

నరసరావుపేట: గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలోని 28 మండలాల్లో కేవలం మూడు మండలాల్లో 4.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు గురువారం వెల్లడించారు. నాదెండ్లలో 2.0, చిలకలూరిపేట 0.2, యడ్లపాడు 2.4 వర్షం కురిసిందన్నారు.

ఎస్‌ఐ, హెచ్‌సీ, పీసీ, హోంగార్డు సస్పెన్షన్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : జిల్లాలోని వేర్వేరు పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వర్తించే ఒక ఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ , హోం గార్డులను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరంపాలెం ఎస్‌ఐ షేక్.సలాం, హెచ్‌సీ బి.రమేష్, పెదకాకాని కానిస్టేబుల్ బి.సురేష్‌కుమార్, హోంగార్డు హరీష్‌ను సస్పెండ్ చేశామన్నారు. ఎస్‌ఐ, హెచ్‌సీలు అధికారిక విధుల్లో ప్రైవేట్ వ్యక్తులను అనుమతించి, నిర్లక్ష్యం వహించినట్లు వెల్లడైందని అన్నారు. ఇక బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వ్యక్తుల నుంచి రూ.3 వేలను కానిస్టేబుల్, హోంగార్డు తీసుకున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు.

చిన్నారులతో క్రీడా మైదానాలు కళకళలాడాలి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): క్రీడా మైదానాలు చిన్నారులతో కళకళలాడినప్పుడే ఆరోగ్యకరమైన ఆధునిక సమాజాన్ని చూడగలుగుతామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్ ఖాన్ తెలిపారు. గుంటూరు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్స్ ఫెన్సింగ్ యువతీ యువకుల విభాగంలో పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అఫ్రోజ్ మాట్లాడుతూ క్రీడా సంఘాలు క్రమం తప్పకుండా పోటీలు నిర్వహిస్తే ఎందరో ప్రతిభ ఉన్న క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చైర్మన్ క్రిస్టోఫర్ మాట్లాడుతూ పోటీల్లో విజయ సాధించిన యువతీ యువకులు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఉమెన్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.స్వర్ణలతాదేవి, టెక్నికల్ అఫీషియల్ ఖేలో ఇండియా కోచ్ చిరంజీవి, అఫ్రోజ్ ఖాన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్టేడియం ఫెన్సింగ్ కోచ్ సంగీత్ బాబు, కార్యదర్శి అశోక్‌బాబు పాల్గొన్నారు.

నాలుగు మండలాల్లో తేలిక పాటి వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు నాలుగు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. పెదనందిపాడు మండలంలో 13.4 మిల్లీ మీటర్లు, వట్టిచెరుకూరు 13.2, గుంటూరు పశ్చిమ 10.2, గుంటూరు తూర్పులో 6.2 మి.మీ చొప్పున వర్షం కురిసింది.

పలు ప్రత్యేక రైళ్లు కేటాయింపు

లక్ష్మీపురం: ప్రయాణికుల సౌకర్యార్థం గుంటూరు డివిజన్ మీదుగా పలు ప్రత్యేక రైళ్లను కేటాయించినట్లు పీఆర్వో వినయ్‌కాంత్ గురువారం తెలిపారు.

- (08551) అరకు–ఎలహంకా రైలు ఈనెల 13, 23వ తేదీల్లో, (08552) ఎలహంకా–అరకు రైలు ఈనెల 14, 24వ తేదీల్లో, (08555) అరకు–ఎలహంకా ఈనెల 17,24వ తేదీల్లో , (08556) ఎలహంకా–అరకు రైలు ఈనెల 18,25వ తేదీల్లో నడుస్తాయి. ఈ రైళ్లు అరకు, బొర్రా గుహలు, శృంగవరపుకోట, కొత్తవలస, దువ్వాడ, అనకాపల్లి, తుని, సామర్లకోట, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, మార్కాపూర్ రోడ్, నంద్యాల, గుత్తి, ధర్మవరం, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, ఎలహంకా ప్రయాణిస్తాయి.
- (08553) శ్రీకాకుళం –బెంగళూరు కాన్ట్ రైలు ఈనెల 21న, (08554) బెంగళూరు కాన్ట్ – శ్రీకాకుళం రైలు 24న నడుస్తాయి. (08463) భువనేశ్వర్–బెంగళూరు కాన్ట్ రైలు ఈనెల 16న, (08464) బెంగళూరు కాన్ట్–భువనేశ్వర్ రైలు ఈనెల 20న నడుస్తాయి. భువనేశ్వర్, కూర్ధ రోడ్, బాలూగాన్, ఛత్రపూర్, బ్రహ్మపూర్, ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, నౌపాడా, శ్రీకాకుళం రోడ్, చీపురుపల్లె, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ, అనకాపల్లి, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, మార్కాపూర్ రోడ్డు, నంద్యాల, గుత్తి, ధర్మవరం, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, బెంగళూరు కాన్ట్ స్టేషన్‌ల మీదుగా నడుస్తాయి.

గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతినిధుల పర్యటనకు ఏర్పాట్లు పరిశీలన

గుంటూరు రూరల్: గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతినిధుల పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. ఈ నెల 11వ తేదీన గుంటూరు సమీపంలోని వెంగళాయపాలెం గ్రామంలోని మంచినీటి చెరువు వద్ద జరగనున్న జాతీయ వాటర్ షెడ్ కార్యక్రమం, అమృత్ సరోవర్ అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతినిధులు రానున్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లను డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ వంశీధర్, ఎస్‌బీ సీఐ రాంబాబుతో ఎస్పీ సమావేశమై బందోబస్తును సమీక్షించారు.

సామాజిక రుగ్మతలను రూపుమాపాలి

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్ : జిల్లాలో సమష్టిగా పనిచేసి సామాజిక రుగ్మతలను రూపుమాపుదామని స్వచ్ఛంద సంస్థలకు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో గురువారం వివిధ స్వచ్ఛంద సంస్థలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో చెత్త కుప్పలు, కాలువ గట్లు, మురుగు కాలువలు తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్, ఇతర సామగ్రిని సేకరించే చిన్నారులు ఉన్నట్లు గమనించామని, వారిని బడికి పంపాల్సిన బాధ్యత అధికారులపై తెలిపారు. బాల్య వివాహాలు, బాల కార్మికులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని రూపుమాపాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. జిల్లాలో స్వచ్ఛంద సంస్థలు వివిధ రంగాల్లో పని చేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో సామాజిక రుగ్మతలపై సమరం సాగించి, జిల్లాను ఆదర్శంగా తీర్చిద్దడంలో భాగస్వామ్యంకావాలని కోరారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చేపడుతు న్న కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య, సీపీఓ శేషశ్రీ , జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.దుర్గాబాయి, రెడ్ క్రాస్ సంస్థ వైస్ చైర్మన్ పి.ఆర్.సి. రాజు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

హైటెక్ వ్యభిచారం గుట్టు రట్టు

- ఆన్‌లైన్‌లో బుకింగులు
- ఇంట్లో వ్యవహారాలు

వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుబ్బానాయుడు

యడ్లపాడు: ఆన్‌లైన్ వ్యభిచార దందా చేస్తున్న వారి గుట్టు పోలీసులు రట్టు చేశారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న యువతుల ఆసరాలను అవకాశంగా తీసుకుని వారిని వ్యభిచార ఊబిలోకి దింపుతున్న నిర్వాహకురాలిపై నిఘా నిర్వహించారు. కొద్దికాలంగా రహస్యంగా వ్యభిచారం నిర్వహించే గృహంపై మెరుపుదాడి చేసి ఇద్దరు విటులతో పాటు నిర్వాహకురాలిని అదుపులోకి తీసుకుని ఓ బాధితురాలిని కాపాడారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం యడ్లపాడు ఎస్‌ఐ టి.శివరామకృష్ణతో కలిసి చిలకలూరిపేట రూరల్‌సీఐ బి.సుబ్బానాయుడు కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామానికి చెందిన ఓ మహిళ కొంతకాలం కిందట భర్తతో విడిపోయి విడిగా ఉంటోంది. అయితే ఆమె వ్యభిచార నిర్వహణను ఉపాధి మార్గంగా ఎంచుకుంది. యడ్లపాడు గ్రామంలోని 16వ జాతీయ రహదారి పక్కన పిల్లికొండ సమీపంలో నివాసాలు పెద్దగా లేని ఓ ఇంటిని ఏర్పాటు చేసుకుంది. కొంతకాలంగా యువతుల ఫోటోలు పోస్ట్ చేసి విటులను ఆకర్షిస్తూ వ్యభిచారం నిర్వహిస్తోంది. ఫోన్ ద్వారా సంప్రదించడం, యువతుల ఫోటోలను వారికి వాట్సప్ ద్వారా పంపించడం.. నచ్చితే వెంటనే యూపీఐ ద్వారా నగదు పొందడం వంటి అన్ని కార్యాకలాపాలు హైటెక్ తరహాలో నిర్వహిస్తోంది. ఈ వ్యభిచార వ్యవహారంపై పోలీసులకు పక్కా సమాచారం రావడంతో గురువారం యడ్లపాడులోని వ్యభిచార గృహంపై పోలీసులు మెరుపుదాడి చేశారు. అక్కడ ఇద్దరు విటులను అదుపులోకి తీసుకుని ఓ బాధితురాలిని కాపాడారు. వారి నుంచి నిర్వాహకురాలి వివరాలు తెలుసుకుని చిలకలూరిపేట మండలం పసుమర్రులో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె ఫోన్ స్వాధీనం చేసుకుని మానవ అక్రమ రవాణా నిరోధక చట్టం కేసు నమోదు చేశారు.

గూడ్స్ రైలు ఢీకొని యువకుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

బాపట్ల టౌన్: బాపట్ల రైల్వే స్టేషన్‌లో గురువారం గూడ్స్ రైలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. జీఆర్పీ ఎస్‌ఐ సరస్వతి తెలిపిన వివరాల ప్రకారం... చీరాల పట్టణం విఠల్ నగర్ ప్రాంతానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మారుగడ సురేష్ బాబు (20) ప్రతిరోజు రైలులో వచ్చి బాపట్ల, కర్లపాలెం ప్రాంతాల్లో పనులు చేసుకొని తిరిగి వెళ్తుంటాడు. ఈ క్రమంలో గురువారం బాపట్లలో రైలు దిగి ఉప్పరపాలెం గేటు సమీపంలో ట్రాక్ దాటుతుండగా అదే సమయంలో అటువైపుగా వచ్చిన గూడ్స్ రైలు ఢీ కొట్టింది. ఈ ఘటనలో సురేష్‌బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఇయర్ ఫోన్స్ పెట్టుకొని పాటలు వింటూ గేటు దాటుతుండగా ప్రమాదం జరిగిందని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఆర్థికాభివృద్ధి

సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయం రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. రైతు సాధికార సంస్థ, జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐసీఆర్‌పీ శిక్షణ కార్యక్రమం గురువారం నాలుగవ రోజుకు చేరింది. కార్యక్రమంలో పాల్గొన్న అమలకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణాన్ని సంరక్షించవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న వరి, మిరప, పత్తి, మొక్కజొన్న, కూరగాయలతో పాటు పలు అంతర పంటలు వేసుకోవడం ద్వారా రైతులు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. భూమి ఆరోగ్యంగా ఉండాలంటే 365 రోజులు పచ్చని పంటలతో కప్పి ఉంచే విధానం పాటించాలని సూచించారు. జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం వంటి ప్రకృతి ఇన్‌పుట్స్, కషాయాలు గ్రామస్థాయిలో తయారు చేసి రైతుల కు సకాంలో అందించడం ద్వారా క్రిమిసంహారక ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర ఎన్‌ఎఫ్‌ఏ మల్లేశ్వరి, అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్, జిల్లా ఎన్‌ఎఫ్‌ఏలు సైదయ్య, అప్పలరాజు, నందకుమార్, సౌజన్య, మేరి పాల్గొన్నారు.

ఎల్‌ఎల్‌బీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ(పెదకాకాని): వర్సిటీ పరిధిలో త్రీ ఇయర్స్ ఎల్‌ఎల్‌బీ 3వ సెమిస్టర్, ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ 7వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు సీఐ ఆలపాటి శివ ప్రసాద రావు గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. విద్యార్థులంతా చూసుకోవాలని ఆయన సూచించారు.

బహిరంగ ప్రకటన (ఫారం–C)
[ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్ట్సీ (అప్లికేషన్ టు అడ్జుడికేటింగ్ అథారిటీ ఫర్ బ్యాంక్‌రప్ట్సీ ప్రాసెస్ ఫర్ పర్సనల్ గ్యారంటార్స్ టు కార్పొరేట్ డెటార్స్) రూల్స్, 2019లోని రూల్ 9(1) క్రింద]

శ్రీ కంచెర్ల మోహన్ రావు (సెగ్నో సిరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, వేమవరం–523301 యొక్క వ్యక్తిగత గ్యారంటార్) యొక్క క్రెడిటార్లకు గమనిక

1. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, అమరావతి బెంచ్ వారు CP(IB) No.12/95/AMR/2022లోని IA(IBC)/3/2025లో 31 అక్టోబర్ 2025 తేదీ గల తమ ఉత్తర్వుల ప్రకారం శ్రీ కంచెర్ల మోహన్ రావు తండ్రి వెంకటేశ్వర రావు, నివాసం: ఫ్లాట్ నం.301, DJ రత్నం టవర్స్, 6/13, బ్రాడీపేట, గుంటూరు–522002, ఆంధ్రప్రదేశ్ వారి కోసం దివాలా ప్రక్రియ మొదలుపెట్టే ఉత్తర్వు జారీ చేసారని ఇందుమూలంగా నోటీస్ ఇవ్వడమైనది.
2. శ్రీ కంచెర్ల మోహన్ రావు యొక్క క్రెడిటార్లు రుజువుతో తమ క్లెయిమ్‌లను ఫ్లాట్ నం.1, SLV భవన్, డి.నం. 1-2-597/1, 2వ అంతస్తు, లిబర్టీ బాగ్ కాలనీ, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్–500029 వద్ద గల బ్యాంక్‌రప్ట్సీ ట్రస్టీకి 14-11-2025న లేదా ఆలోగా దాఖలు చేయవలసిందిగా కోరబడుతున్నారు. (ఉత్తర్వులు 06-11-2025న బ్యాంక్‌రప్ట్సీ ట్రస్టీచే స్వీకరించబడతాయి)
3. క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు ఆఖరి తేదీ: 14-11-2025. క్రెడిటార్లు తమ క్లెయిమ్‌లను ఎలక్ట్రానిక్ విధానం ద్వారా లేదా స్వయంగా లేదా రిజిస్టర్డ్ పోస్ట్ లేదా స్పీడ్ పోస్ట్ లేదా కొరియర్ ద్వారా దాఖలు చేయవచ్చును.

బ్యాంక్‌రప్ట్సీ ట్రస్టీ అడ్రస్ వివరాలు:
శ్రీ మురళీ మోహన్ చెవుటూరి,
చిరునామా: పైన వివరించిన విధంగా, ఇ-మెయిల్: mohan.chevuturi@gmail.com,
మొబైల్: 8978844588, రిజిస్టర్డ్ నం. IBBI/IPA-003/00307/2020-2021/13464

తేది: 07-11-2025 సం/- శ్రీ మురళీ మోహన్ చెవుటూరి
ప్రదేశం: హైదరాబాద్ బ్యాంక్‌రప్ట్సీ ట్రస్టీ

గమనిక: తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే రుజువుతో క్లెయిమ్‌లు దాఖలు చేస్తే ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్ట్సీ కోడ్, 2016 మరియు ఏవేని ఇతర వర్తించే చట్టాలలోని నిబంధనల ప్రకారం జరిమానా లేదా జైలు శిక్ష విధించబడును.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
- గుంటూరు మిర్చి యార్డ్ ప్రక్కన చిలకలూరిపేట రోడ్డు నందు 1530 గజాలు, ఆర్.సి.సి. గోడౌన్ అమ్మకానికి కలదు. ✆ 9848752471

TOLET
- గుంటూరు అరండల్‌పేట 15/3 లైనులో గల ఒక పోర్షన్ ఫ్యామిలీకి గానీ ఆఫీస్ గానీ అద్దెకు ఇవ్వబడును. సంప్ర॥ 9885222462

SERVICES
GOLD FINANCE
- బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071
- బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999
- బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

WANTED
- గుంటూరు జిల్లా "వన్ లైఫ్ – వన్ కార్డ్" హెల్త్ కేర్ కంపెనీలో 1. హెల్త్ కార్డ్ ప్రమోషన్ కొరకు (కనోపిటెంట్ / Canopy Tent), 2.సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, 3.ప్రొక్యూర్మెంట్ మేనేజర్లుగా పని చేయుటకొరకు (స్త్రీలు/ పురుషులు) ఉద్యోగులు కావలెను. అర్హత : 10th/ ఇంటర్ / డిగ్రీ. సంప్రదించగలరు : 8030150481, 8484022442
- 7Hills ఆఫీసు నందు వర్క్ చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ లేడీ ఎంప్లాయిస్ కావలెను. మంచి జీతం, 35సం॥లోపు. గుంటూరు. సంప్ర॥ 7288877785
- కేర్ టేకర్స్ జీతం 18వేలు, నర్సింగ్ స్టాఫ్ జీతం 18వేలు, కోఆర్డినేటర్స్ డిగ్రీ, పి.జి, జీతం 18వేలు, ఇంటి వంట జీతం 18వేలు, భోజనం వసతి కలదు. సంప్రదించండి : 9885426486
- వేదం ఓల్డ్ ఏజ్ హోమ్ తక్కెళ్ళపాడు వృద్ధులకు సేవ చేయుటకు అనుభవం కలిగిన వర్కర్ వంట మనిషి కావలెను. భార్య భర్తలు. 7780791297, 9642791297
- మాచర్ల లోని గోదావరి ఆంధ్ర కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారి ఫైనాన్షియల్ ఆర్గనైజేషన్ నందు పని చేయుటకు బ్రాంచ్ మేనేజర్, లోన్ ఆఫీసర్స్ కావలెను. అర్హత: డిగ్రీ/ పి.జి రిటైర్డ్ బ్యాంకింగ్/ NBFC ఎంప్లాయిస్‌కి మరియు మాచర్ల లోకల్ వారికి ప్రాధాన్యత. సంప్ర: Ph: 7893794796, 7207494496, 8121294296, 7337394396
- ప్రముఖ Ltd కంలో సూపై, Asts, స్టోర్ ఇంచార్జి, డ్రైవర్స్ ITI Dip, B.Tech All Ex ఆర్మీ కావలెను, రూం+ఫో PF+ESI జీ: 18-32 వేలు. ✆ 91007 91079
- గుంటూరులో బస్టాండ్ ఎదురు మా సంస్థ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Qual: 10th-డిగ్రీ, టైం: 9 AM - 5-30 PM, Sal: 9000 ✆ 99893 98775
- GVK సంస్థ నందు గుంటూరు జిల్లాలో లేడి టెలికాలర్స్ కావలెను. మంచి శాలరీ కలదు. Cont: 8340855728, 7730997214
- ప్రముఖ ఫైనాన్స్ అనుబంధ సంస్థనందు పని చేయుటకు అనుభవం కలిగిన టెలికాలర్స్ & మార్కెటింగ్ ఏజెంట్స్ కావలెను. Q: ఇంటర్ /డిగ్రీ, Sal: 9000/- + Inc.✆ 95051 77327
- గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు SR Construction Site Incharges గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 35000/- నుండి 45000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Diploma మరియు Civil Engineering, వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429
- Job: senior sales officer company : Suma Spices, Salary : 15k to 20k + TA, contact: 8688947909, 8978894337
- తెనాలి దగ్గర, దుగ్గిరాలలో ప్రముఖ కాఫీ పరిశ్రమకు ASO (Ex. Service Man & Civil), సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ✆ 80961 61777, 70939 24466.

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించని పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ దినపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నిరంకుశ పాలనకు నిదర్శనం ‘ప్రైవేటీకరణ’

కోటి సంతకాల సేకరణలో వైఎస్సార్ సీపీ నేతలు

ఆత్మకూరులో కోటి సంతకాల సేకరణలో వైఎస్సార్ సీపీ నేతలు

మంగళగిరి టౌన్: కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అని పొన్నూరు నియోజకవర్గ పరిశీలకుడు, వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరు జగనన్న కాలనీలో గ్రామ అధ్యక్షుడు కొల్లి శ్యామ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన గురువారం రాత్రి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల సోమిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కన్నా కార్పొరేట్ ప్రయోజనాలే ముఖ్యమనే రీతిలో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసే కుట్రతో పేద విద్యార్థులకు కూటమి ప్రభుత్వం వైద్యవిద్యను దూరం చేస్తోందని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుని తీరుతామన్నారు. కూటమి ప్రభుత్వం మెడలు వంచి అయినా సరే ప్రైవేటీకరణను రద్దు చేసేలా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. అనంతరం వైద్యకళాశాలల ప్రైవేటీకరణతో చేకూరే నష్టాలపై గడపగడపకూ వెళ్లి ప్రజలకు వివరించి చైతన్యపరిచారు. కార్యక్రమంలో గ్రామ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, గ్రామ సోషల్ మీడియా అధ్యక్షుడు బుజ్జిబాబు, యూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, సీనియర్ నాయకులు కిషోర్ రెడ్డి, వెంకమయ్య, యేసుబాబు, మరియమ్మ, నాగేశ్వరరావు, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో

తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట 12వ వార్డులో గురువారం రాత్రి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వార్డు అధ్యక్షులు షేక్ నాగూర్ అధ్యక్షతన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడా వెంకటేశ్వరరావు, పట్టణ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ అలీ, వార్డు ప్రధాన కార్యదర్శి సుందరయ్య, ఎస్సీ సెల్ నాయకులు మోహన్,శేఖర్, వార్డ్ యూత్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన కాకానిలో..

చినకాకానిలో గురువారం రాత్రి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గ్రామ అధ్యక్షులు మల్లవరపు కాంతారావు నిర్వహించారు. కార్యక్రమంలో యువజన విభాగ రాష్ట్ర నాయకులు నూతక్కి జోష్, నాయకులు రామకృష్ణారెడ్డి, చిన్నా, రామనాగు, నరేంద్ర, రమేష్, కాటంరాజు, ప్రసాద్, చిన్నోడు, శ్యామ్, మాధవి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ శృంగారపురంలో జోరుగా కొనసాగింది. గురువారం దుగ్గిరాల మండలం శృంగారపురం గ్రామంలో కోటి సంతకాల సేకరణను వైఎస్సార్ సీపీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు, దుగ్గిరాల మండల అధ్యక్షులు టి.శివగోపయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు యస్. రత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల సెక్రటరీ వడ్డేశ్వరం రజనీ, గ్రామ పార్టీ అధ్యక్షులు పరిశా శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, ఉప్పాల శ్రీనివాస రావు, ఎస్.జోజిప్ప, చక్రవర్తి, కె.గోపి, వి.మోషే, కె. సుందర రావు, వై.బాలస్వామి. పి.బ్రహ్మేశ్వరరావు, పి.సోమయ్య, కె.వీరయ్య, కె.బాబురావు, డి.వంశీ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి 12వ వార్డులో సంతకాల సేకరణ

చినకాకానిలో ..

శృంగారపురంలో..

కలర్ కోటింగ్ పదార్థాలతో అనారోగ్యం

అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీనివాసరావు

మంగళగిరి టౌన్: హోటళ్లలో అధిక కలర్ కోటింగ్ పదార్థాలను కొనుగోలు చేయవద్దని, వాటితో అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీనివాసరావు సూచించారు. మంగళగిరి నగర పరిధిలో గురువారం ఫుడ్ సేఫ్టీ అధికారులు బృందాలుగా ఏర్పడి వివిధ హోటల్స్‌లో విస్తృత తనిఖీలు చేశారు. అనంతరం శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హోటల్స్‌లో తనిఖీలు నిర్వహించామని, పలు హోటళ్లలో నిల్వ ఉన్న మాంసాహారాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. చట్టపరంగా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అధిక కలర్ కోటింగ్ ఉన్న మాంసాహారాలను, ఆఫ్ బాయిల్ చేసిన, ఫ్రిజ్‌లో మాంసాహారాలు నిల్వచేయకూడదని హోటల్ యాజమాన్యాలకు ఆదేశించామని పేర్కొన్నారు. నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే ప్రజలకు అందజేయాలని హోటళ్ల యాజమాన్యానికి సూచించారు. ఆహార భద్రతలో లోపాలు ఉన్నా ప్రజలు ధైర్యంగా ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందజేయాలని ఆయన కోరారు.

ఉచిత వైద్యశిబిరం

తాడికొండ: తాడికొండలో బీఎస్ఎస్‌బీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన బస్‌స్టాండ్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి సమస్యలకు యంత్రంతో పరీక్షలు నిర్వహించి సమస్యలు ఉన్న వారిని ఆస్పత్రికి రిఫర్ చేశారు. బీపీ, షుగర్, ఈసీజీ పలు పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు ఎన్.వేణుబాబు, ఎన్ .సురేష్, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తరగతులు

మంగళగిరి టౌన్: తాడేపల్లి పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విజయవాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అన్నపురెడ్డి కోటిరెడ్డి విచ్చేశారు. 10వ తరగతి విద్యార్థులకు భవిష్యత్తులో వారు ఎదుర్కొనే సవాళ్లను, లక్ష్యాన్ని ఎంచుకోవడంలో, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఎలా నడుచుకోవాలో వివరించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప మాట్లాడుతూ విద్యార్థులు సమున్నత లక్ష్యాలతో, బలమైన కోరికతో ఆశయాలను సాధించుకోవాలని సూచించారు. ఇష్టపడి చదవాలని పేర్కొన్నారు. సోషల్‌మీడియాకు, మొబైల్ ఫోన్‌లకు బానిసలు కాకూడదని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ సందర్శన

మంగళగిరి టౌన్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీని రట్జర్స్‌లో భాగమైన ది స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూ జెర్సీలో భాగమైన రట్జర్స్ బిజినెస్ స్కూల్ అసిస్టెంట్ డీన్ థామస్ హిల్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా డీన్ థామస్ హిల్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న యూఎస్ జాబ్ మార్కెట్, బిజినెస్ అనలిటిక్స్, క్వాంటిటేటివ్ ఫైనాన్స్, హెల్త్‌కేర్ అనలిటిక్స్ రంగాల్లో వృత్తిపరమైన వృద్ధిని ఎలా వేగవంతం చేయగలవో వివరించారు. వర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ మాట్లాడుతూ టాప్ 15 యూఎస్ పబ్లిక్ యూనివర్సిటీలలో ఒకటిగా రట్జర్స్ నిలిచిందని పేర్కొన్నారు. కేఎల్‌యూ రట్జర్స్ బిజినెస్ స్కూల్ మధ్య సహకారానికి సంభావ్య రంగాలపై థామస్ హిల్‌తో చర్చించామన్నారు. అనంతరం థామస్‌ను వర్సిటీ వీసీ సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.వి.ఆర్. ప్రసాదరావు, డాక్టర్ అనూష, జమిందార్ తదితర సీనియర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరం

మంగళగిరి టౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి పేర్కొన్నారు. గురువారం రాత్రి తాడేపల్లి పరిధిలోని పలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న యువకులను, రాత్రి సమయాల్లో అకారణంగా రోడ్లపై తిరిగే వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఖాజావలి మాట్లాడుతూ అకారణంగా రాత్రి సమయాల్లో రోడ్లపై తిరుగుతున్న 20 మందితో పాటు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఐదుగురిపై న్యూసెన్స్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల జీవనానికి ఆటంకం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజల్ని కోరారు.

చేనేత వస్త్రాల స్టాక్‌తో కొత్త డిజైన్లు

మంగళగిరి టౌన్ : చేనేత వస్త్రాల స్టాక్‌తో కొత్త డిజైన్లతో చిన్నపిల్లల ఫ్రాక్స్, రెడీమేడ్ చీరలు, పంచెలు, క్యారీబ్యాగ్‌లు తయారు చేసి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మంగళగిరి పరిధిలోని యర్రబాలెంలో ఉన్న ఆప్కో గోడౌన్‌ను చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి హితోడియాతో కలసి గురువారం మంత్రి పరిశీలించారు. గోడౌన్‌లో స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. 15 కోట్ల రూపాయల విలువైన వస్త్రాలు గోడౌన్‌లో ఉన్నట్లు ఆప్కో మేనేజర్ మనోజ్‌కుమార్ తెలియజేశారు. ఆప్కో గోడౌన్, షోరూమ్‌లో ఉన్న స్టాక్‌ను త్వరగా విక్రయించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని మంత్రి తెలిపారు.

నేడు సామూహిక సత్యవ్రతం

ఫిరంగిపురం: స్థానిక సాయినాథ దేవస్థాన కళ్యాణ మండపంలో శుక్రవారం సామూహిక సత్యదేవ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ పాలకవర్గ సభ్యులు గురువారం తెలిపారు. ఉదయం 9 గంటలకు 108 మంది దంపతులతో వ్రతం నిర్వహిస్తామన్నారు. వ్రత కార్యక్రమాలను నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ, నరసింహమూర్తి నిర్వహిస్తారని తెలిపారు.

కార్మికుల బకాయిలు చెల్లించాలి

నిరసనలో ఎయిమ్స్ కార్మికులు

మంగళగిరి టౌన్: మంగళగిరి పరిధిలోని ఎయిమ్స్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు, కార్మికులకు వెంటనే ఎరియర్స్ చెల్లించాలని మంగళగిరి ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్ఎస్ చెంగయ్య డిమాండ్ చేశారు. కార్మికులు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమం గురువారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా చెంగయ్య మాట్లాడుతూ గతంలో పనిచేసిన కార్మికుల ఎరియర్స్ వెంటనే చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చినా యాజమాన్యం అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఉపాధి కోసం ఉద్యోగాలు లేక సెక్యూరిటీ గార్డులుగా చేసిన వారికి ఎరియర్స్, బోనస్‌లను కాంట్రాక్ట్ యాజమాన్యం ఇవ్వలేదని, దీనిపై సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్ లేబర్ కోర్టులో కేసు వేశారని తెలిపారు. కార్మికులను పనిలో నుంచి తొలగించి, వారి స్థానంలో నూతన కార్మికులను పెట్టుకుని వారి నుంచి లక్షల రూపాయలు లంచాలు తీసుకుంటున్నారని విమర్శించారు. కార్మికుల జీతం నుంచి పీఎఫ్ కట్ చేసి, అది మాత్రమే కార్మికుల ఖాతాలో జమచేస్తున్నారని, యాజమాన్యం వాటా చెల్లించడం లేదన్నారు. ఎయిమ్స్‌లో ఉద్యోగాల నోటిఫికేషన్ జారీ చేసినప్పుడు ఏళ్ల తరబడి పని చేస్తున్న కార్మిక, ఉద్యోగులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్మికులకు ప్రతినెలా 5వ తేదీ లోపు కాంట్రాక్ట్ యాజమాన్యం జీతాలు చెల్లించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.బాలాజి, యూనియన్ నాయకులు గాలి శ్రీనివాసరావు, కె.రాజమోహన్, ఎ. రవి, యు.వెంకటేశ్వరరావు, సీహెచ్ శ్రీకాంత్, జి.నాగరాజు, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయం చేయండి

ఎస్ఎఫ్ఐ డిమాండ్

మంగళగిరిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మంగళగిరి టౌన్: మంగళగిరి రూరల్ పరిధిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. కిరణ్ మాట్లాడుతూ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా 300 మంది విద్యార్థులు హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్నారన్నారు. మూడు నెలలుగా వర్సిటీలో భోజనం సరిగా లేదని విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని, యాజమాన్యం బెదిరించి వారిని అణచివేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ముందే ఎస్ఆర్ఎంపై చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా ఉండి, రాష్ట్ర రాజధానిలో వేలాది మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నారా లోకేష్ వెంటనే స్పందించి విచారణ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పవన్‌కుమార్, సమీర్, జిల్లా సహాయ కార్యదర్శి సౌమ్య, స్థానిక ఎస్ఎఫ్ఐ నాయకులు రాజశేఖర్, వంశీ, మున్నా, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సామాన్య ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సేవలు


సదస్సులో మాట్లాడుతున్న మల్లికార్జునరావు

మంగళగిరి టౌన్: ఖాతాదారుల విశ్వాసాన్ని సంపాదిస్తూ సామాన్యుల బ్యాంక్‌గా 110 సంవత్సరాలుగా ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ సేవలు అందిస్తోందని బ్యాంక్ డైరెక్టర్ పి.వి.ఎన్. మల్లికార్జునరావు అన్నారు. గురువారం మంగళగిరిలోని బ్యాంక్ శాఖ కార్యాలయం వద్ద సహకార సదస్సు నిర్వహించారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ సహకార స్ఫూర్తితో సభ్యుల సంక్షేమానికి అనుగుణంగా పథకాలు అమలు చేస్తున్నామన్నారు. దేశ ఆర్థిక పురోభివృద్ధిలో సహకార బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. ఖాతాదారుల పిల్లలకు వివిధ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన వారికి నగదు బహుమతులు అందిస్తున్నట్లు తెలియజేశారు. అరవింద స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలోబ్యాంక్ డైరెక్టర్ సీహెచ్ రామారావు, డైరెక్టర్ చిన్నంకోటేశ్వరరావు, బ్యాంక్ జోనల్ మేనేజర్ ఈరయ్య రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ రవిశంకర్, కమిటీ సభ్యులు ఎం. సాంబశివరావు, నాగకుమారి, పి.సుజాత, కాలేజ్ ప్రిన్సిపల్ సత్యశేఖర్, రావెల శ్రీనివాసరావు, ఖాతాదారులు పాల్గొన్నారు.

జోహ్రాన్ ఎన్నిక ట్రంప్ విధానాలకు చెంపపెట్టు

మంగళగిరి టౌన్: న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ ఎన్నిక అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలకు చెంపపెట్టు అని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు అన్నారు. గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జోహ్రాన్ ఎన్నిక సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ న్యూయార్క్ ప్రజలు డెమోక్రటిక్ పార్టీ నాయకుడు జోహ్రాన్‌ను గెలిపించడం సామ్రాజ్య వాదాన్ని వ్యతిరేకించడమేనన్నారు. ప్రధాని నరేంద్రమోదీ కార్పొరేట్ కంపెనీలకు తలొగ్గి ట్రంప్ విధానాలను బలపరుస్తూ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమానికి ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. కృష్ణయ్య, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై. కేశవరావు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్న శివశంకరరావు, తాడేపల్లి మండల రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అప్పలస్వామి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీ-20 క్రికెట్ జట్ల ఎంపిక

తెనాలి: పట్టణంలో టీ-20 క్రికెట్ పోటీలు జరగనున్నాయి. ఈనెల 8,9 తేదీల్లో స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ డిగ్రీ కాలేజీ క్రీడామైదానంలో అండర్-14, అండర్-17 టీ-20 క్రీడాపోటీలను క్రికెట్ అసోసియేషన్ నిర్వహించనుంది. ఇందు కోసం ఆయా విభాగాల్లో గుంటూరు జిల్లా జట్ల ఎంపికను గురువారం సాయంత్రం బుర్రిపాలెం రోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. క్రికెట్ కోచ్ మాలిక్ నేతృత్వంలో జరిగిన ఎంపికల్లో పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వివేకానంద సెంట్రల్ స్కూల్ డీన్ సునీల్‌కుమార్ అతిథిగా హాజరయ్యారు. క్రీడాభిమానులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి

తాడికొండ: విద్యార్థులు రాజ్యాంగం ఇచ్చిన హక్కులపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వృత్తి విద్యాధికారి జె.పద్మ అన్నారు. నవంబర్ 26న రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకొని తాడికొండ బీఎస్ఎస్‌బీ జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్ వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగం భారతదే అని, కోట్లాది మంది విభిన్న కులాలు, మతాలు, ప్రాంతాల ప్రజలను ఏకం చేసిన రాజ్యాంగంపై నేటి యువత అవగాహన పెంపొందించుకొని భావితరాలకు ఆ ఫలాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల జాబితాను ప్రకటించి వారికి నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం నాడు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి. ఉమాదేవి, అధ్యాపకులు సొపాటి రమేష్ బాబు, డి.శివనాగరాజు, వై.సునీత రాణి, మాధవీలత, స్వరూపరాణి, చావ రామారావు, మాధవి, కె.సంజీవరావు, ఏజీఎంసీ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్‌లో విస్తృత తనిఖీలు

మంగళగిరి టౌన్: మంగళగిరి మండల పరిధిలోని కాజా టోల్‌గేటు వద్ద గుంటూరుఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ప్రైవేట్ టూరిస్ట్ బస్సుల్లో గురువారం రాత్రి మంగళగిరి పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. వాహన పత్రాలు, డ్రైవర్ లైసెన్స్‌లు, బస్సుల్లోని భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. హెవీ వెహికల్స్, లారీలు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులను తనిఖీ చేసి డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేశారు. ఈ సందర్భంగా సీఐ వీరాస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవడం ప్రతి డ్రైవర్ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రతకు అవసరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వాహనాల్లో ఫైర్ సేఫ్టీ, మెడికల్ కిట్లు ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే బస్‌లను సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో పట్టణ ఎస్ఐ రవీంద్రనాయక్, మహిళా ఎస్ఐ అపర్ణ, గుంటూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉషాకిరణ్, మంగళగిరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, సిబ్బంది జాకీర్ హుస్సేన్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

338వ రోజుకు కార్మికుల దీక్షలు

తాడేపల్లి రూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు గురువారంతో 338వ రోజుకు చేరుకుంది. సీపీఎం పట్టణ అధ్యక్షుడు బూరుగ వెంకటేశ్వర్లు యూనియన్ నాయకులు కె.స్టీవెన్‌తో కలసి దీక్షా శిబిరాన్ని ప్రారంభించి మద్దతు తెలిపారు. కార్మికులకు నష్టపరిహారం అందే వరకు సీపీఎం, సీఐటీయూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సుమారు 30 సంవత్సరాల క్రితం సిమెంట్ ఫ్యాక్టరీని యాజమాన్యం అక్రమంగా లాకౌట్ చేసిందని దాంతో 300 దాదాపు కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కార్మికులకు వేతనాలు చెల్లించలేదన్నారు. కార్మికులు దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారావు, సుభాని, ఆశీర్వాదం, అంకయ్య, కార్మికులు వై. సాంబశివరావు, రమాదేవి, నాగేశ్వరరావు, దుర్గా భవాని, శికుమారి, ఇమాంబి, శారమ్మ, సువర్ణకుమారి, నవనీతమ్మ, శారద, రమణమ్మ, రిబ్కా నాగేశ్వరరావు, ఏసోబు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులూ.. ఆరోగ్యంపై అప్రమత్తం

అవగాహన కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా

మంగళగిరి టౌన్: ఎంటీఎంసీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు పనిచేసే సమయంలో తీసుకోవాల్సిన ఆరోగ్య, భద్రతపై అప్రమత్తంగా ఉండాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా సూచించారు. మంగళగిరిలో ఎంటీఎంసీ కార్యాలయంలో గురువారం పారిశుద్ధ్య కార్మికులకు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులు వ్యర్థాలను ఏ విధంగా వేరుచేయాలి, నగరాన్ని శుభ్రం చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అలీమ్ బాషా మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు కావాల్సిన పరికరాలను అందజేస్తామన్నారు. మెడికల్ క్యాంపులను ఉపయోగించుకుని ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. మంగళగిరి నగరానికి స్వచ్ఛ ర్యాంక్ వచ్చేలా కృషి చేసినందుకు కార్మికులను అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ఐఈసీ కో ఆర్డినేటర్ శంకర్, సీబీ కో ఆర్డినేటర్ విజయ్, ట్రైనర్స్ నీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో అవగాహన సదస్సు

సోషల్ యాక్టివిస్ట్ మాలతిని సత్కరిస్తున్న డాక్టర్ కె. రూతు రమ్య తదితరులు

మంగళగిరి టౌన్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో గురువారం నైతిక విలువలు – భావోద్రేకాల నియంత్రణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథి సోషల్ యాక్టివిస్ట్, కౌన్సిలర్ మాలతి ప్రసంగిస్తూ నైతిక విలువలతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు అధిరోహించవచ్చని చెప్పారు. పెడదోవ పట్టించే స్నేహాలు, బంధాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం మాలతిని వర్సిటీ ఉమన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూతురమ్య, సైకాలజిస్ట్ విజయరత్నం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, వర్సిటీ ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ కేఆర్ఎస్ ప్రసాద్, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్స్ శ్రీలక్ష్మి, విజయరత్నం, వీఈసీ విభాగం సైకాలజిస్టులు కిషోర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో ఆరోగ్య పరిరక్షణ

మాట్లాడుతున్న డాక్టర్ అనూష

మంగళగిరి టౌన్: ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు, పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు అత్యంత అవసరమని యూపీహెచ్‌సీ వైద్యురాలు అనూష చెప్పారు. మంగళగిరి నగర పరిధిలోని రత్నాల చెరువు ప్రాంతంలో గురువారం నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మన ఆరోగ్యం – మన సంపద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థి దశనుంచే సేవా దృక్పథం అలవర్చుకోవడం అభినందనీయమన్నారు. మనిషి ఆస్తి కంటే ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. ఎంటీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చేసే సేవా కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందన్నారు. గ్రామ ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచుతూ విద్యార్థులు నిజమైన సమాజ సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సిస్టర్ నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ పాములరెడ్డి, స్టూడెంట్ కో ఆర్డినేటర్లు బిందు ప్రియాంక, కీర్తి, మానస, ఫార్మకాలజీ అండ్ ఫార్మసీ శాఖాధిపతి షేక్ ఫైజన్ అలి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నరేష్‌బాబు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

తాడికొండ: అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్(ఏజీసీ)లోని ఏపీ సెక్రటేరియట్(హెచ్‌వోడీ, జీఏడీ) ఐకానిక్ టవర్లను సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ భార్గవతేజ గురువారం పరిశీలించారు. టవర్లు నిర్మిస్తున్న ప్రాంతంలో పనుల పురోగతిని చీఫ్ ఇంజినీర్ ఎంవీ రావు, ఇంజినీరింగ్ విభాగంలోని ముఖ్య అధికారులు అడిషనల్ కమిషనర్‌కు వివరించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇంటిగ్రేటెడ్ ఏపీ సెక్రటేరియట్, ఐకానిక్ టవర్ల వద్ద పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన గుత్తేదారులను, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

ఇకపై ఆన్‌లైన్‌లో అంగప్రదక్షిణ టోకెన్ల జారీ

తిరుమల: అంగప్రదక్షిణ టోకెన్ల కేటాయింపు విధానంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మార్పులు చేసింది. లక్కీడిప్ విధానాన్ని రద్దు చేసి ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ విధానంలో టోకెన్లు కేటాయించాలని నిర్ణయం తీసుకుంది. టోకెన్లు మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామని తెలిపింది.

సంపదను దోచిపెట్టేందుకే ఆపరేషన్ కగార్

కర్నూలు (అర్బన్): ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకే ఆపరేషన్ కగార్ పేరిట అడవులు, ఆదివాసీలపై అంతిమ యుద్ధం ప్రకటించారని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలుగు రాష్ట్రాల గౌరవాధ్యక్షురాలు విమలక్క ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) కార్యాలయంలో నీలం రామచంద్రయ్య, జంపాల చంద్రశేఖర్‌ప్రసాద్ పాటల సీడీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్షణమే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులను శాంతి చర్చలకు పిలవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు కరీంబాషా, డీటీఎఫ్ నాయకుడు రత్నం యేసోబు, కేఎన్‌పీఎస్ నాయకుడు సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో రాళ్లతో కొట్టి హత్య

సంతోషరావు (ఫైల్)

పిడుగురాళ్ల: మద్యం మత్తులో రాళ్లతో దాడి చేసి ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటన పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో జరిగింది. పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపిన వివరాలు.. పిడుగురాళ్లలోని లెనిన్‌నగర్‌కు చెందిన కొమ్ము సంతోషరావు(37) షేక్ సుభాని ఇందిరమ్మ కాలనీలోని ఓ పాడుబడిన ఇంట్లో మద్యం తాగారు. అనంతరం సంతోషరావు తనతో సంబంధం పెట్టుకోవాలంటూ సుభానిపై ఒత్తిడి చేశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. సుభాని వెంటనే తన స్నేహితుడైన నూర్‌బాషా సైదావలికి ఫోన్ చేసి ఘటనా స్థలానికి రప్పించాడు. సుభాని, సైదావలి ఇద్దరూ కలిసి సంతోషరావును రాళ్లతో కొట్టి హత్య చేశారు. అనంతరం వీరిద్దరూ రక్తపు మరకలతో వస్తుండగా పిల్లుట్ల బైపాస్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో సంతోషరావు హత్య గురించి వారు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఇది కదా మాతృత్వమంటే!

వైఎస్సార్ కడప జిల్లా వీరపునాయునిపల్లెలో కుక్క పిల్లకు ఓ మేక పాలిస్తోంది. ఎంపీటీసీ రాఘవ యాదవ్‌కు మేకల మంద ఉంది. అందులో ఓ మేకకు పిల్ల పుట్టి చనిపోయింది. అప్పటినుంచి ఆ మేక ఓ కుక్క పిల్లను తన బిడ్డలాగా దగ్గరకు తీసుకొని పాలిస్తోంది.

– వీరపునాయునిపల్లె

మత సామరస్యాన్ని చాటుకున్న ముస్లింలు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలోని ముత్యాలపాడులో ముస్లింలు అయిన వైఎస్సార్‌సీపీ నేత రజమ్మగారి చాంద్‌బాషా, ఉపాధ్యాయుడు మహబూబ్‌బాషా స్థానిక అయ్యప్ప మాలధారులు 50 మందికి గురువారం భిక్ష (అన్నదానం) ఏర్పాటు చేసి మత సామరస్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ ముత్యాలపాడులో హిందూముస్లింలు సోదరభావంతో జీవిస్తున్నామన్నారు. గురుస్వామి బోయిని శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఏటా ముస్లింలు అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.

– చాగలమర్రి

అంతరిక్ష యాత్రకు ఆంధ్రా బాలిక

అమెరికా సంస్థలో ఆస్ట్రోనాట్ అభ్యర్థిగా కైవల్యరెడ్డి ఎంపిక
నాలుగేళ్లపాటు కఠినమైన ఆస్ట్రోనాట్ తర్ఫీదు
అంతర్జాతీయ నిపుణుల మార్గదర్శకత్వంలో శిక్షణ

నిడదవోలు: తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన 17 ఏళ్ల కుంచాల కైవల్యరెడ్డి అమెరికాలోని ఫ్లోరిడాకు చెందిన అంతరిక్ష పరిశోధన సంస్థ టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ (టీఎస్ఐ) ఆధ్వర్యంలో 2029లో చేపట్టనున్న అంతరిక్ష యాత్రలో పాల్గొనేందుకు ఆస్ట్రోనాట్ అభ్యర్థిగా ఎంపికైంది. ఈ విషయాన్ని టీఎస్ఐ సీఈఓ నీల్ ఎస్.లచమన్ గురువారం ఆమెకు తెలిపారు. ఎంతో క్లిష్టమైన ఇంటర్వ్యూ ప్రక్రియ అనంతరం లచమన్, చీఫ్ ఆస్ట్రోనాట్ విలియం మెక్ ఆర్థర్, సీఓఓ అండ్ చీఫ్ ఇంజినీర్ డాక్టర్ వి.విజయ్‌ల బృందం కైవల్యరెడ్డిని ఆస్ట్రోనాట్ అభ్యర్థిగా ఎంపిక చేసింది. కైవల్యకు టీఎస్ఐ నాలుగేళ్ల కఠినమైన ఆస్ట్రోనాట్ శిక్షణను అందించనుంది. మూడు దశాబ్దాల అనుభవంతో 224 రోజులు అంతరిక్షంలో గడిపి, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) కమాండర్‌గా ఆరునెలలు సేవలందించిన నాసా వెటరన్ ఆస్ట్రోనాట్, టీఎస్ఐ చీఫ్ ఆస్ట్రోనాట్ విలియం బిల్ మెక్ ఆర్థర్‌తో పాటు బ్రెజిల్ తొలి వ్యోమగామి, టీఎస్ఐ డిప్యూటీ చీఫ్ ఆస్ట్రోనాట్ మార్కోస్ పోంటెస్, వ్యోమగామి శిక్షకుడు డాక్టర్ వ్లాదిమిర్ ప్లెట్సర్, టీఎస్ఐ చీఫ్ ఇంజినీర్ అండ్ సీఓఓ డాక్టర్ వి. విజయ్, మానసిక సంసిద్ధత నిపుణురాలు డాక్టర్ మిండీ హోవార్డ్ వంటి అంతర్జాతీయ నిపుణుల మార్గదర్శకత్వంలో కైవల్యరెడ్డి శిక్షణ పొందనున్నారు. జీరో గ్రావిటీ పారాబొలిక్ ఫ్లైట్స్, స్కూబా డైవింగ్, ఈవా డైవింగ్, న్యూట్రల్ బోయన్సీ శిక్షణ, హై–ఆల్టిట్యూడ్ స్కై డైవింగ్, హైకింగ్ వంటి వాటిలో శిక్షణ ఇస్తారు. శిక్షణ తర్వాత అభ్యర్థులు తమ మిషన్ అసైన్‌మెంట్లు అందుకుని, అధునాతన శిక్షణ దశలోకి ప్రవేశించి శాస్త్రీయ ప్రయోగాలు చేస్తారు. కుంచాల శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి దంపతులకు మొదటి సంతానం కైవల్యరెడ్డి. ఇంటర్ పూర్తి చేసుకుని ఆస్ట్రో ఫిజిక్స్‌లో డిగ్రీ చేయనుంది.

శిక్షణ అనంతరం..

- టీఎస్ఐ 2029లో తొలి స్పేస్ ఫ్లైట్ మిషన్‌ను కైవల్య ప్రారంభించనుంది.
- ఇది భూమి చుట్టూ రెండు కక్ష్యలను పూర్తిచేస్తూ 300 కి.మీ. ఎత్తుకు చేరి ఐదు గంటలపాటు సాగుతుంది.
- దీనిలో ఆస్ట్రోనాట్లు మూడు గంటలపాటు పూర్తి జీరో గ్రావిటీలో ఉండాలి.
- అంతరిక్షం నుంచి రెండు సూర్యోదయాలు, రెండు సూర్యాస్తమయాలు వీరు వీక్షిస్తారు.
- ఈ ప్రయాణంలో వ్యోమగాములు మైక్రోగ్రావిటీ ప్రయోగాలు నిర్వహిస్తారు.

కైవల్యరెడ్డి సాధించిన విజయాలు..

- అమెరికాలోని నాసా ఫెసిలిటీతో ఏక్సా వారు అలబామా నిర్వహించే ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాం–2023ను పూర్తిచేసిన అతి పిన్న వయసున్న భారతీయురాలు.
- నాసా సిటిజన్ సైంటిస్టుగా మార్స్, జూపిటర్ మధ్య ఉండే మెయిన్ ఆస్టరాయిడ్ బెల్ట్‌లో రెండు ప్రావిజినల్ ఆస్టరాయిడ్స్ 2020 పీఎస్ 20, 2021 సీఎం37ను కనుగొంది.
- నాసా నిర్వహించే సైంటిస్ట్ ఫర్ ఎ డే వ్యాసరచన పోటీల్లో 2021లో జాతీయ ఫైనలిస్ట్‌గా నిలిచింది.
- ఇంటర్నేషనల్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ పోటీల్లో 2021, 2025లో సిల్వర్ హానర్ సర్టిఫికెట్లు పొందింది.
- ఐఎస్ఆర్ఓ సంస్థ నిర్వహించిన స్పేస్ క్విజ్, సైన్స్ ఫెయిర్, ఆస్ట్రో ఫొటోగ్రఫీ, వక్తృత్వ పోటీల్లో అనేక అవార్డులు సొంతం చేసుకుంది.
- ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ అందుకుంది. పీరియాడిక్ టేబుల్ రసాయనిక ఆవర్తన పట్టికను నిమిషం 38 సెకన్లలో వేగంగా అమర్చి ప్రపంచ రికార్డ్ సృష్టించింది.
- వివిధ రకాల ఆర్ట్స్, క్రాఫ్ట్స్ తయారుచేసి ఇంటర్నేషనల్ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందింది.
- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ 2024లో మల్టీ టాలెంటెడ్ ఇండివిడ్యువల్ ఆఫ్ ద ఇయర్‌గా కైవల్య ఎంపికైంది.

ఖగోళ శాస్త్రవేత్తగా సేవలందిస్తా..

ఆస్ట్రోనాట్ అభ్యర్థిగా ఎంపిక చేసిన టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ వారికి నేను కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. వ్యోమగామిగా, ఖగోళ శాస్త్రవేత్తగా ఎదిగి దేశానికి సేవలందిస్తాను. – కుంచాల కైవల్యరెడ్డి

భీమవరం పంచారామ క్షేత్రం ఈవోపై జనసేన నేత దాడి

పంచారామక్షేత్రం ఈఓపై జనసేన నాయకుడు దాడి చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని పంచారామక్షేత్రం ఈఓడి.రామకృష్ణంరాజుపై జనసేన నాయకుడు, మాజీ కౌన్సిలర్ వానపల్లి సూర్యప్రకాష్ దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం రాత్రి పంచారామక్షేత్రంలోని గర్భగుడి నుంచి బయటకు వచ్చే క్యూలైన్ ద్వారా జనసేన నాయకుడు సూర్యప్రకాష్ తనవారిని లోపలకు పంపించే యత్నం చేశారు. దీనిని ఈఓ రామకృష్ణంరాజు అడ్డుకున్నారు. దీంతో సూర్యప్రకాష్ ఆగ్రహంతో ఈఓ రామకృష్ణంరాజును గెంటివేసి దాడికి దిగిన ఘటన ఆలయంలోని సీసీ కెమెరాల్లో రికార్డయింది. లోపలకు వెళ్లే క్యూలైన్‌లో కాకుండా తనవారిని, బయటికి వచ్చే మార్గం ద్వారా పంపించే యత్నం చేయడమే కాకుండా, ఈఓపై దాడికి పాల్పడడం తీవ్ర చర్చనీయాంశమైంది. జనసేన నాయకుడి ప్రవర్తనతో భక్తులు విస్తుపోయారు. సూర్యప్రకాష్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవగా ఎమ్మెల్యే అంజిబాబు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరిస్తానని చెప్పినట్టు ఈఓ రామకృష్ణంరాజు తెలిపారు.

ఈఓపై జనసేన నాయకుడు దాడి వీడియో కోసం క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అంబేడ్కర్‌ను రాజకీయకోణంలో చూసి అవమానిస్తారా?

దళిత, గిరిజన సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

సాక్షి, అమరావతి: విజయవాడ నగరంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజికన్యాయ మహాశిల్పం రాష్ట్రానికే గర్వకారణమని, దాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని పలువురు వక్తలు చెప్పారు. అంబేడ్కర్ సామాజికన్యాయ మహాశిల్పంపై కూటమి ప్రభుత్వ అలక్ష్యాన్ని నిరసిస్తూ విజయవాడలో దళిత, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. కులవివక్ష వ్యతిరేక పోరాటసంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సామాజికన్యాయ మహాశిల్పం స్ఫూర్తిని పథకం ప్రకారమే కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోందని మండిపడ్డారు. అంబేడ్కర్‌ను రాజకీయ కోణంలో చూసి అవమానిస్తారా? అని చంద్రబాబు ప్రభుత్వాన్ని వారు ప్రశ్నించారు. ఈ ప్రాంగణాన్ని ప్రైవేటుపరం కానివ్వబోమని, సిబ్బందిని కుదిస్తే సహించబోమని హెచ్చరించారు.

ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్ప ప్రాంగణాన్ని వ్యాపారకేంద్రంగా చేయవద్దని, దాన్ని స్ఫూర్తిదాయకమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వాన్ని కోరుతూ రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. అందుకు సంబంధించిన కార్యాచరణపై ప్రభుత్వం ఒక విధానపత్రం విడుదల చేయాలని కోరింది. దాని అభివృద్ధి, నిర్వహణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేసింది. పర్యవేక్షణ కోసం అధికారులు, పౌరసంస్థల ప్రతినిధులతో నిర్వహణ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించింది. యువతను, చిన్నపిల్లలను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయాలని, ఇందుకోసం సత్వర చర్యలు తీసుకోవాలని కోరింది. దీనిపై ఈ నెల 10న అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యండ్రపాటి అశోక్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వి.ఆంజనేయులు, ఆదివాసీ గిరిజనసంఘం రాష్ట్ర నాయకుడు ఎ.అశోక్, లోక్ జనశక్తి పార్టీ రాష్ట్ర నాయకుడు చింతా వెంకటేశ్వర్లు, దళిత అభ్యుదయసంఘం నాయకుడు వై.నరసింగరావు, దళిత పారిశ్రామిక వేత్తల సంఘం అధ్యక్షుడు పినమాల నాగకుమార్ తదితరులు మాట్లాడారు.

ఎమ్మెల్యే కన్నా ఇంట్లో చోరీ

- పని మనిషి కుమార్తె దొంగతనం చేసినట్లు గుర్తింపు
- కొంత బంగారం తిరిగిచ్చిన తల్లి, కూతురు
- మరికొంత బంగారం పోయిందని కన్నా కుటుంబం పోలీసులకు ఫిర్యాదు
- భయంతో గడ్డిమందు తాగిన తల్లి, కుమార్తె
- విషమంగా తల్లి పరిస్థితి?

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఇంట్లో బంగారం చోరీకి గురైంది. కన్నా ఇంట్లో పని చేస్తున్న మహిళ కుమార్తె ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. కొంత బంగారం తిరిగి ఇచ్చిన తల్లి, కుమార్తెలను పోలీసులు పిలిచి ప్రశ్నించగా, భయంతో వారు గడ్డి మందుతాగి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలిసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు... గుంటూరు నగరంపాలెంలోని కన్నా లక్ష్మీనారాయణ ఇంటికి సమీపంలోనే నివాసం ఉంటున్న తల్లి, కుమార్తెలు చాలాకాలంగా ఆయన ఇంట్లో పని చేస్తున్నారు. వారం రోజుల కిందట కన్నా లక్ష్మీనారాయణ ఇంట్లో పనిమనిషి కుమార్తె బంగారు బిస్కెట్ దొంగలించినట్లు ఆయన కుటుంబ సభ్యులు గుర్తించారు. పని మనిషిని పిలిపించి సీసీ కెమెరా ఫుటేజీ చూపించడంతో చోరీ చేసిన బంగారు బిస్కెట్‌ను తమ ఇంట్లో కారం డబ్బాలో దాచి పెట్టినట్టు చెప్పింది. దాన్ని తిరిగి కన్నా కుటుంబ సభ్యులకు అప్పగించింది. ఇంకా చిన్న చిన్న బంగారు వస్తువులు కనిపించడం లేదంటూ నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో కన్నా కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో కన్నా ఇంట్లో పని చేస్తున్న తల్లి, కుమార్తెలను స్టేషన్‌కు పిలిపించారు. భయపడిన వారిద్దరూ వాష్‌రూమ్‌కు అని చెప్పి పక్కనే ఉన్న ఇంటికి వెళ్లి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. వారిని హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే, ఈ విషయం బయటిక తెలియకుండా ఉండేందుకు నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయిస్తున్నట్లు విశ్వసనీయం సమాచారం. తల్లి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

చిన్నవెంకన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్నను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి శ్రీవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

వేడుకగా కడప పెద్దదర్గా ఉరుసు ఉత్సవం

ప్రభుత్వ పక్షాన చాదర్ సమర్పణ • దర్గా పీఠాధిపతి ప్రత్యేక ప్రార్థనలు

కడప సెవెన్ రోడ్స్: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కడప అమీన్‌పీర్ దర్గాలోని హజరత్ సూఫీ సరమస్తసాని చల్లాకష్ ఖ్వాజా సయ్యద్ షా ఆరీఫుల్లా మొహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్తివుల్ ఖాద్రి సాహెబ్ ఉరుసు ఉత్సవం రెండోరోజు గురువారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ప్రభుత్వం తరఫున వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, స్థానిక ఎమ్మెల్యే మాధవీరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఫరూఖ్ కుమారుడు ఫైరోజ్‌తోపాటు అధికారులు చాదర్ సమర్పించారు. పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ పర్యవేక్షణలో ఆయన సంప్రదాయంగా ఫకీర్ల మేళతాళాలు, విన్యాసాలు, నాత్ గీతాలాపనల మధ్య ఊరేగింపుగా దర్గా వద్దకు చాదర్‌ను తీసుకెళ్లారు. పీఠాధిపతి ఆధ్వర్యంలో గురువుల మజార్ వద్ద గంధంతోపాటు చాదర్‌ను సమర్పించారు.

దర్గాలో అపచారం..: కాగా, ప్రభుత్వం సమర్పించే పూల చాదర్‌ను పాదరక్షలు లేకుండా తీసుకొచ్చి దర్గాలో సమర్పిస్తారు. కానీ వైఎస్సార్ జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ షూ వేసుకొని దర్గా ఆవరణలోకి వచ్చారు. కాసేపటి తరువాత పీఠాధిపతి, శిష్యులు అడ్డుగా వచ్చి.. షూ తీసి వేశారు. తరువాత కలెక్టర్ లోపలికి వెళ్లారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
GSWS Department
RFP No. RFP 320/2025-ADMIN-GSWS-HK&SGS, Dt. 30.10.2025
RFP is floated inviting bids from the interested bidders to provide man-power for Housekeeping and Security Services to the Directorate of GSWS Department, Nirman Bhavan, Auto Nagar, Vijayawada. For details, please visit https://tender.apeprocurement.gov.in from 12.00 PM onwards on 07.11.2025
Sd/- DIRECTOR, GSWSD
DIPR RO No. 4550PP/CL/ADVT/1/1/2021-22, Dt: 06.11.2025

కారు 'మంచి'కి కాలువనీరు...
ప్రజలకు మురుగు నీరు

- రూ.32.88 కోట్లతో ఎత్తిపోతల పథకం నిర్మించేందుకు సిద్ధమైన కూటమి సర్కారు
- పారిశ్రామికవేత్త కారుమంచి ప్రసాద్ భూములు, పరిశ్రమల కోసం నీటిని తరలించేలా చర్యలు
- ఇది పూర్తయితే పర్చూరు, చీరాల, బాపట్ల, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు నీళ్లు హుళక్కే
- ఎత్తిపోతలతో దిగువ భూములు ఎడారిగా మారతాయని రైతుల ఆందోళన
- బాపట్ల, చీరాల పట్టణాలతోపాటు 50 గ్రామాల ప్రజల గొంతులు ఎండే పరిస్థితి
- ఇప్పటికే దిగువ ఆయకట్టుకు ఏటా సాగునీటి ఇబ్బందులు
- అమరావతి కేంద్రంగా పోరాటానికి సిద్ధమంటున్న రైతులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఓ పారిశ్రామికవేత్త ,అయన పరిశ్రమల కోసం చంద్రబాబు ప్రభుత్వం 50 గ్రామాలు, 1.20 లక్షల ఎకరాల సాగుకు గండి కొడుతోంది. పారిశ్రామికవేత్తకు కాలువనీర్చి..ప్రజలకు మురుగునీరు సరఫరా చేస్తామనంటోంది. పారిశ్రామికవేత్త కారుమంచి ప్రసాద్‌బాబు భూములు, పరిశ్రమల కోసం కూటమి ప్రభుత్వం కొమ్మమూరు కాలువపై గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని చినకాకుమాను వద్ద కొత్తగా ఎత్తిపోతల (లిఫ్ట్) పథకం నిర్మించి నీటిని మళ్లించేందుకు సిద్ధమవడంపై కాలువ దిగువ ప్రాంత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం వల్ల దిగువ ప్రాంతంలో లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టు ఎడారిగా మారుతుందని.. బాపట్ల, చీరాల పట్టణాలతో పాటు 50 గ్రామాల పరిధిలో 5 లక్షల మందికి తాగునీరందక గొంతులెండుతాయని ఆందోళన చెందుతున్నారు. తక్షణం ప్రభుత్వం ఈ పథకాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మొండిగా ముందుకెళితే ఉద్యమానికి వెనుకాడబోమని రైతులు హెచ్చరిస్తున్నారు. బుధవారం కొత్తపాలెం, నర్సాయిపాలెంలో రైతులు సమావేశాలు నిర్వహించి ఎత్తిపోతల పథకం నిర్మాణానికి వ్యతిరేకంగా గళమెత్తారు. గురువారం స్వర్ణలో రైతులు సమావేశమై ఉద్యమ కార్యాచరణకు సిద్ధమయ్యారు. ఇప్పటికే కరపత్రాలు ముద్రించి పంచుతున్నారు. ఈ నెల 8న కారంచేడులో భారీ సభ నిర్వహించనున్నారు. కాలువ పరిధిలో అన్ని గ్రామాల్లో రైతులతో కమిటీలు వేస్తున్నారు. ఈ పథకం నిర్మాణ ప్రతిపాదనలను నిలిపివేయకపోతే వేలాది రైతులతో అమరావతిలో ఆందోళనకు సిద్ధపడుతున్నారు.

లిఫ్ట్ నిర్మాణం వెనుక అసలు కథ ఇదీ

లిఫ్ట్ నిర్మిస్తున్న చినకాకుమానువద్ద ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్‌బాబుతోపాటు ఆయన కుటుంబ సభ్యులకు వందలాది ఎకరాల భూములు ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. పైగా ప్రసాద్ చినకాకుమానులో త్వరలో పరిశ్రమ పెట్టబోతున్నారని, దాంతోపాటు విత్తనోత్పత్తి క్షేత్రాలు, ప్రాసెసింగ్ యూనిట్లను కూడా నెలకొల్పుతున్నారని సమాచారం. ఇందుకోసం ఈ ప్రాంతంలో ఉన్న దాదాపు 5 వేల ఎకరాలలో కొంత భూమిని ఇప్పటికే కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. విత్తనోత్పత్తికి అవసరమైన మరిన్ని భూములను కౌలుకు తీసుకుంటున్నారని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు. తన భూములతోపాటు పరిశ్రమల నీటి అవసరాల కోసం కారుమంచి ప్రసాద్ ప్రభుత్వంలో తనకున్న పలుకుబడితో కొమ్మమూరు కాలువపై ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తున్నారని రైతులు చెబుతున్నారు.

కొత్త లిఫ్ట్ పెట్టబోయే కొమ్మమూరు కాలువ

కొత్త లిఫ్ట్ పెడితే దిగువ ఆయకట్టు ఎడారే

కొమ్మమూరు కాలువపై చినకాకుమానువద్ద కొత్తగా లిఫ్ట్ పథకం ఏర్పాటు చేస్తే కాలువ దిగువనున్న లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టు ఎడారిగా మారుతుంది. ఇప్పటికే సక్రమంగా నీళ్లందక శివారు ఆయకట్టు రైతులు పంటలు ఎండబెట్టుకుంటున్నారు. కాలువల్లో ఇంజిన్లు పెట్టి నీటిని తోడుకున్నా సక్రమంగా పంటలు పండటం లేదు. ఈ పరిస్థితిలో వ్యాపారవేత్త ప్రయోజనాల కోసం లిఫ్ట్ పెట్టి దిగువ రైతుల కడుపు కొట్టడం సరికాదు. తక్షణం ప్రభుత్వం కొత్త లిఫ్ట్ పథకాన్ని విరమించుకోవాలి.

– యార్లగడ్డ సుబ్బారావు, రైతు, కారంచేడు

ప్రభుత్వం చెబుతున్న కథ ఏమిటంటే..

కొమ్మమూరు ప్రధాన కాలువ కుడిగట్టుపై గుంటూరు జిల్లా కాకుమాను మండలం చినకాకుమాను వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించి 48.39 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం నాలుగు హైస్పీడ్ విద్యుత్ మోటార్లతో రెండు 135 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండే సబ్‌స్టేషన్‌తో దీనిని నిర్మించతలపెట్టారు. కొమ్మమూరు కాలువలో నీటిని వాడుకున్నందుకు ప్రతిగా సమీపంలోని నల్లమడ డ్రెయిన్ నుంచి అంతే మొత్తంలో మురుగు నీటిని మరో లిఫ్ట్ ద్వారా కొమ్మమూరులోకి ఎత్తిపోస్తామని ప్రభుత్వం చెబుతోంది. పీ–4 పథకంలో భాగంగా చినకాకుమానుకు చెందిన ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్ ఈ పథకానికి రూ.10 కోట్లు ఇస్తున్నట్టు ప్రకటించిన ప్రభుత్వం మిగిలిన రూ.23 కోట్లు తామే భరిస్తామని చెబుతోంది. ఈ లిఫ్ట్ వల్ల సుమారు 5 వేల ఎకరాలకు నీటిని అందించనున్నట్టు పేర్కొంటోంది.

సాగునీటికి కటకటే

కొమ్మమూరు ప్రధాన కాలువ పరిధిలో బాపట్ల, పర్చూరు, చీరాల, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో 50 గ్రామాల పరిధిలో దాదాపు 1.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉంది. ఈ గ్రామాల పరిధిలో చెరువులు, ఇతర తాగునీటి స్కీములు మరో 50కి పైగా ఉన్నాయి. వీటన్నిటికీ కొమ్మమూరు కాలువే ఏకైక ఆధారం. ఇప్పటికే ఎగువ ప్రాంతం నుంచి సక్రమంగా నీరు చేరకపోవడంతో కాలువ పరిధిలోని శివారు ఆయకట్టుకు నీరందక పంటలు పండటం లేదు. కాలువల్లో ఆయిల్ ఇంజిన్లు పెట్టుకుని నీటిని తోడుకుంటే తప్ప సాగునీరందని పరిస్థితి. దీంతో ఎగువ ప్రాంత రైతులతో దిగువ ప్రాంత రైతులు తరచూ గొడవలకు దిగాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు,అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోకుండా కొమ్మమూరు కాలువపై పారిశ్రామిక వేత్త సొంత ప్రయోజనం కోసం ఎత్తిపోతల పథకం నిర్మించాలనుకోవడంపై రైతులు మండిపడుతున్నారు.

ప్రజలకు, పొలాలకు మురికినీరు ఇస్తారట

కొమ్మమూరులో నీటిని వాడుకున్నందుకు ప్రతిగా రూ.12 కోట్లతో మరో లిఫ్ట్ ఏర్పాటు చేసి నల్లమడ డ్రైయిన్‌నుంచి మురుగునీరు ఎత్తి కొమ్మమూరులో పోస్తామని ప్రభుత్వం మెలిక పెట్టడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నల్లమడ డ్రైయిన్‌లోకి నరసరావుపేట, చిలుకలూరిపేట పట్టణాలు మొదలుకొని అన్నిగ్రామాల నుంచి మురుగునీరు వచ్చి చేరుతుంది. ఆ ప్రాంతంలోని పరిశ్రమల వ్యర్థాలు సైతం నల్లమడ డ్రైయిన్‌లో కలుస్తాయి. సముద్రం నీరు ఇందులో చేరుతుంది. దీంతో ఆ నీరు విషతుల్యంగా మారి పంటలకు, తాగునీటి అవసరాలకు పనికిరాదు. నీరు పెట్టినా పంటతోపాటు భూమి పనికిరాకుండా పోతుందని రైతులు చెబుతున్నారు.

క్లుప్తంగా...

టీటీడీ చరిత్రలో అట్టర్ ఫ్లాప్ చైర్మన్

టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుమల చరిత్రలో అట్టర్ ఫ్లాప్ చైర్మన్ బీఆర్ నాయుడే అని, ఏడాదిగా భక్తులకు ఒక్క మేలు కూడా చేయలేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. గురువారం తిరుపతిలోని కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ నాయుడి వ్యవహారం చేతలకు చెల్లుచీటీ.. కోతలకు మాత్రం ధనుషోకటి అన్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. టీటీడీపై కనీస పరిజ్ఞానం లేకపోవడంతో ఆయనను ఏ అధికారి పట్టించుకోవడం లేదన్న విషయం అందరికీ తెలిసిపోయిందని చెప్పారు. ఆ అసహనాన్ని మీ చానెళ్ల సహకారంతో వైఎస్సార్‌సీపీ నేతల మీద చూపిస్తున్నారన్నారు. ‘మీరు బాధ్యతలు చేపట్టాక వైకుంఠ ఏకాదశి పర్వదినాన జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు చనిపోయారు. మరో 50 మంది క్షతగాత్రులయ్యారు. చైర్మన్–అధికారుల మధ్య సమన్వయ లోపం వల్లే ఈ ఘటన జరిగిందని మీ అనుకూల పత్రికల్లోనే కథనాలు వచ్చాయి. శ్రీవాణి ట్రస్టును, టిక్కెట్లను రద్దు చేస్తామని ప్రకటించారు. ఆ తర్వాత ఆ టిక్కెట్లను వెయ్యి నుంచి రెండు వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుని గొప్పలు చెప్పుకున్నారు. ఇప్పుడు కూడా అదే అన్నం, సాంబారు, అంతే మంది భక్తులు.. అయితే అదనంగా ఒక వడ చేర్చి.. దాన్ని వేయి డీజే సౌండ్‌ల కంటే బలంగా ప్రచారం చేసుకున్నారు. ఆ వడ భక్తులందరికీ అందడం లేదన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి. టీటీడీ పరిధిలో గోవులు చనిపోతున్నాయని, శ్రీమహా విష్ణువు విగ్రహాన్ని అవమానించారని చెబితే.. నాపై కేసులు పెట్టించారు. ఇప్పుడు అదే గోశాల నిర్వహణ సక్రమంగా లేదు కాబట్టి, ఒక స్వచ్ఛంద సంస్థకు ఇచ్చేందుకు నిపుణుల కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు ఆ విగ్రహాన్నే మాయం చేశారు. తిరుమలలో తాగుబోతుల వీరంగం, అసభ్య ప్రవర్తన, మద్యం విక్రయం, మహాద్వారం వద్ద అపవిత్రం, ఇలా ఒకటా.. రెండా.. మీ పాలనలో నిర్వాకాలు కోకొల్లలు. మీ హయాంలో బ్లాక్‌లో దర్శనం టికెట్లు విక్రయిస్తున్నారనేది వాస్తవం కాదా? మీ ప్రతి అడుగులోనూ అబద్ధాలు, మోసం, వంచన’ అంటూ భూమన మండిపడ్డారు.

పాలకుల ప్రోత్సాహంతోనే రాష్ట్రంలో అవినీతి

సీపీఐ కార్యదర్శి ఈశ్వరయ్య

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతికి పాలకుల ప్రోత్సాహం ఉందని, కొంతమంది ఎమ్మెల్యేలే అవినీతికి ఊతమిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య గురువారం ఓ ప్రకటనలో ఆరోపించారు. అవినీతికి పాల్పడుతున్న సబ్ రిజిస్ట్రార్ల వెనుక ప్రభుత్వ నేతలు ప్రత్యక్షంగా ఉన్నారనేది బహిరంగ రహస్యమేనన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకు అవినీతి తాండవమాడుతోందన్నారు. ముఖ్యమంత్రి చూసీచూడనట్టు వ్యవహరించడం వల్లే ఇంత భారీస్థాయిలో అక్రమాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. అవినీతిపరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ధర్నా చేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

భీమవరం: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ మాట్లాడుతూ.. చేనేత కార్మికులు అప్పులు, ఆకలి చావులకు బలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేస్తామని హామీ ఇచ్చి 14 నెలలు గడిచినా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. చేనేత కార్మికులకు ఏటా రూ.25 వేలు ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించి అమలు చేయకపోవడం దారుణమన్నారు. చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.176 కోట్లు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కో కొనుగోలు చేసిన దుస్తులకు సొమ్ములు విడుదల చేయాలని కోరారు. ధర్నా అనంతరం కలెక్టర్ చదలవాడ నాగరాణికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా వీరభద్రుడు, కార్యదర్శి జోగేశ్వరరావు పాల్గొన్నారు.

రాజ్‌భవన్ నిర్మాణ పనులకు టెండర్

రూ.162.40 కోట్ల కాంట్రాక్టు విలువతో సీఆర్‌డీఏ నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతిలో రాజ్‌భవన్ నిర్మాణ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం కాంట్రాక్టు విలువను రూ.162.40 కోట్లుగా నిర్ణయించింది. ఏడాదిలోగా పనులు పూర్తి చేసి, మరో రెండేళ్లు నిర్వహించాలనే షరతుతో రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(సీఆర్‌డీఏ) గురువారం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది.

‘వల’దన్న చోటా వేట

ఇకపై సముద్ర లోతు జలాల్లోనూ చేపల వేటకు అవకాశం

సాక్షి, అమరావతి: చేపల వేటే జీవనాధారంగా బతికే మత్స్యకారులకు నిజంగా ఇది శుభవార్త. ఇక నుంచి సముద్ర లోతు జలాల్లోకీ నిశ్చింతగా వెళ్లి వేటాడుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉండే 200 నాటికల్ మైళ్లు (తీరం నుంచి 370 కిలోమీటర్ల) వరకు వెళ్లి వేటాడుకునే వెసులుబాటు కల్పిస్తూ కేంద్రం గురువారం గెజిట్ విడుదల చేసింది.

ఇప్పటి వరకు లోతు జలాల్లోకి వేటకు వెళ్తే..

సముద్ర జలాల్లో తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల(22 కి.మీ.) వరకు రాష్ట్రాల పరిధిలో ఉండగా, ఆ తర్వాత 200 నాటికల్ మైళ్ల (370 కి.మీ.) వరకు ఉండే లోతు జలాలు కేంద్ర పరిధిలో ఉంటాయి. ఈ పరిధిని దేశానికి సంబంధించిన ప్రత్యేక ఆర్థిక మండలి (ఈఈజెడ్)గా పరిగణిస్తారు. ఆ తర్వాత అంతా అంతర్జాతీయ జలాలుగా పరిగణిస్తారు. ఇప్పటివరకు మత్స్యకారులు తమ రాష్ట్రాల పరిధిలో 12 నాటికల్ మైళ్ల లోపు మాత్రమే చేపలు వేట చేసుకునేందుకు అవకాశం ఉండేది. కేంద్ర పరిధిలో ఉండే జలాల్లోకి అనుమతి ఉండేది కాదు. పొరపాటున లోతు జలాల్లోకి వెళ్తే ఓ వైపు పొరుగు రాష్ట్రాల నుంచి సరిహద్దు సమస్యలు, మరొక వైపు అక్రమంగా లోతు జలాల్లోకి వచ్చారంటూ కోస్టు గార్డు, నేవీ నమోదు చేసే కేసుల్లో ఇరుక్కోవడం వంటి సమస్యలతో గంగపుత్రులు ఇబ్బందిపడేవారు.

సముద్ర వనరులను సద్వినియోగమే లక్ష్యంగా..

ప్రస్తుతం కాలుష్య ప్రభావంతో తీర ప్రాంతంలో మత్స్యసంపద అడుగంటిపోవడంతో వేటకు వెళ్లిన మత్స్యకారులకు ఆశించిన స్థాయిలో వేట లభించడం లేదు. దీంతో గంగపుత్రులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారణంగా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల వైపు మత్స్యకారులు వెళ్లిపోతున్నారు. వేటపైనే ఆధారపడి జీవించే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఈఈజెడ్ పరిధిలోని సముద్ర వనరులను సమర్థంగా సద్వినియోగం చేసుకోవాలన్న సంకల్పంతో కేంద్రం లోతు జలాల్లో మత్స్యకారుల వేటకు అనుమతినిచ్చింది. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన నియమ, నిబంధనలతో కూడిన గెజిట్ విడుదల చేసింది. ఈ నిర్ణయం వేటపై ఆధారపడి జీవనం సాగించే మత్స్యకారులు, మత్స్యకార సహకార సంఘాలకు ఎంతో తోడ్పడనుంది.

స్వీయరక్షణ చర్యలు తప్పనిసరి

అయితే వేటకు వెళ్లే మత్స్యకారులు స్వీయ రక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని కేంద్రం షరతు విధించింది. కేంద్రం నిర్దేశించిన నిబంధనల ప్రకారం.. మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లు తప్పనిసరిగా లైసెన్సు, యాక్సెస్ పాస్ కలిగి ఉండాలి. ప్రాణ రక్షణ పరికరాలు కలిగి ఉండటంతో పాటు జీపీఎస్ ట్రాన్స్‌పాండర్స్ అమర్చి ఉండాలి. లైసెన్సులను కనీసం మూడేళ్ల కాలపరిమితితో జారీ చేస్తారు. ఈఈజెడ్‌లో చేపల వేటకు సంబంధించిన రాష్ట్రాల మధ్య సరిహద్దు, నిర్వహణా వివాదాల పరిష్కారానికి లైసెన్సులు ఉపకరిస్తాయి. లోతు జలాల్లో వేటాడే మత్స్యకారులు, సహకార సంఘాలకు కేంద్రమే ఆర్థిక, సాంకేతిక మద్దతు అందిస్తుంది. లోతు జలాల్లో ఏదైనా సమస్యలకు గురైతే.. కోస్ట్ గార్డు, నేవీ నుంచి అవసరమైన తోడ్పాటు లభిస్తుంది. కాగా విధ్వంసకర మత్స్యవేట, చిన్న చేపల వేట, అక్రమ, నిషేధించిన, నియంత్రణలో లేని నిషేధిత ప్రాంతాల్లో వేటాడితే మాత్రం కఠిన చర్యలు తప్పవని కేంద్రం తాజా ఆదేశాల్లో హెచ్చరించింది.

మత్స్యకారులకు వరం

లోతు జలాల్లో వేటాడే అవకాశం కల్పిస్తూ కేంద్రం జారీ చేసిన గెజిట్ మత్స్యకారులు, మత్స్యకార సహకార సంఘాలకు నిజంగా ఓ వరం. మత్స్యవనరుల సుస్థిరత, జీవ వైవిధ్య పరిరక్షణకు ఇది ఎంతగానో దోహదపడనుంది. సాంకేతిక పద్ధతుల్లో మత్స్య వనరులను సేకరించడం వలన మత్స్య కారులకు ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. సముద్ర మత్స్య ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. ప్రాసెసింగ్, ఎగుమతికి అవకాశాలు మెరుగుపడతాయి.

–రామ్‌శంకర్‌నాయక్, కమిషనర్, రాష్ట్ర మత్స్యశాఖ

కేసుల బాధ ఉండదు

ఇప్పటివరకు సముద్రంలో 22 కిలోమీటర్లకు పైబడి లోపలికి వెళ్తే కోస్ట్ గార్డ్స్ ఆంక్షలు పెట్టేవారు. కేసులు నమోదు చేసేవారు. తీర ప్రాంతాల్లో మత్స్యసంపద సరిగా పడక డీజిల్ ఖర్చులు కూడా రావడం లేదు. ఇప్పుడు 370 కిలోమీటర్లు లోపలికి వెళ్లే అవకాశం రావడం నిజంగా వరం. ఎక్కువ మత్స్య సంపద వేటాడే అవకాశం లభించింది. జీపీఎస్ ట్రాన్స్‌పాండర్స్ బిగించడం వల్ల ఎంత లోతు జలాల్లోకి వెళ్లాం, ఎక్కడ మత్స్యసంపద ఎక్కువగా ఉందో తెలుస్తుంది.

– తిరుమాని బలరామ్మూర్తి, మత్స్యకారుడు, కృష్ణా జిల్లా

టీడీపీ డైరెక్షన్‌లో ఖాకీల ‘డ్రగుల్బాజీ’ చిత్రం

నిగ్గు తేల్చిన నిఘా నేత్రాలు

- పోలీసుల మెడకే చుట్టుకోనున్న కేసు
- కుట్రపూరితంగానే వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డితోపాటు ఇద్దరిని అరెస్టు
- బెంగళూరు నుంచి విశాఖకు డ్రగ్స్ రప్పించినట్లు పోలీసులు స్క్రీన్‌ప్లే
- 2వ తేదీ సాయంత్రం 5.45గంటలకు రైల్వేస్టేషన్ వద్ద వారిని పట్టుకున్నట్లు ఎఫ్ఐఆర్‌లో నమోదు
- కానీ ఉదయం 7.10కి మద్దిలపాలెంలో అదుపులోకి తీసుకున్నట్లు సీసీ పుటేజీలు లభ్యం
- సాయంత్రం అరెస్టు చేస్తే టీడీపీ హ్యాండిల్స్‌లో ఉదయం 11.45కే పోస్టులు ఎలా సాధ్యం?
- ఎంవీపీ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుకుని ఫోర్త్ టౌన్‌లో కేసు ఎందుకు నమోదు చేశారు?
- టీడీపీ ఆదేశాలతోనే పోలీసులు కుట్ర పూరితంగా విద్యార్థులపై కేసు పెట్టారంటున్న తల్లిదండ్రులు

విశాఖ సిటీ: తెలుగుదేశం పార్టీ డైరెక్షన్‌లో విశాఖ ఖాకీలు చూపిన కక్షపూరిత డ్రగ్స్ కథా చిత్రంలో అసలు వ్యవహారం బయటపడింది. బెంగుళూరు నుంచి విశాఖకు డ్రగ్స్ తరలించారన్న నెపంతో ముగ్గురు విద్యార్థులను అరెస్టు చేసిన కేసు.. ఇప్పుడు పోలీసుల మెడకు చుట్టుకునేలా ఉంది. కేవలం రాజకీయ కుట్రలో భాగంగానే వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పులగం కొండారెడ్డి(23)ని డ్రగ్స్ కేసులో ఇరికించినట్లు అతడి తల్లిదండ్రులు సీసీ పుటేజ్ ఆధారాలను బయటపెట్టారు. పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన వివరాలు.. సీసీ పుటేజీలు, ఇతర వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

పక్కా స్కెచ్ ప్రకారమే..?

విశాఖలో డ్రగ్స్ కేసులో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డితోపాటు ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న మురాడ గీత్ చరణ్, తంగి హర్షవర్ధన్ నాయుడులను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో పోలీసుల తీరు అనేక అనుమానాలకు తావిస్తోంది. కొండారెడ్డి ఆదేశాల మేరకు గీత్ చరణ్ బెంగుళూరు నుంచి 48 ఎల్ఎస్‌డీ బ్లాట్స్‌ను విశాఖకు తీసుకువచ్చినట్లు పోలీసులు చెప్పారు. ఈ నెల 2వ తేదీ సాయంత్రం 5.45కు రైల్వే న్యూకాలనీ సాయిబాబా మందిరంలో వద్ద వీరిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అక్కడ హర్షవర్ధన్‌నాయుడుతో కలిసి ఓలా స్కూటీపై వచ్చిన కొండారెడ్డికి గీత్ చరణ్ ఆ డ్రగ్స్ ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అయితే కొండారెడ్డి తల్లిదండ్రులు రిలీజ్ చేసిన సీసీ పుటేజ్ వీడియోలు ఇప్పుడు సంచలనం రేపుతున్నాయి.

2న ఉదయం 7.10 ఓలా స్కూటీపై సింగిల్‌గా ఉన్న కొండారెడ్డిని పట్టుకున్న పోలీసులు

ఒక్కడినే పట్టుకున్నారు

2వ తేదీ ఉదయం 7.10కి మద్దిలపాలెం ప్రాంతంలో ఉన్న జయభేరి కొండారెడ్డి ఓలా స్కూటీపై సింగిల్‌గా వెళుతున్నట్లు సీసీ పుటేజ్‌లో రికార్డ్ అయింది. ఆ వెనుకే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి కొండారెడ్డిని ఆపారు. అందులో ఒక వ్యక్తి బైక్ దిగి కొండారెడ్డి చెంపపై కొట్టాడు. ఇంతలో మరో ఏడు బైక్‌లపై 14 మంది చేరుకున్నారు. కొండారెడ్డిని బైక్‌పై ఎక్కించుకుని తీసుకువెళుతున్న దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో స్పష్టంగా రికార్డ్ అయ్యాయి. వీరు పోలీసులేనని కొండారెడ్డి తల్లిదండ్రులు చెబుతున్నారు.

2న ఉదయం 11.45కి కొండారెడ్డిని అరెస్టు చేసినట్లు టీడీపీ పోస్టు



2వ తేదీ సాయంత్రం 5.45కి అదుపులోకి తీసుకున్నట్లు ఎఫ్ఐఆర్

టీడీపీ మాధ్యమాల్లో ఉదయమే పోస్టులెలా సాధ్యం?

పోలీసులు మాత్రం 2వ తేదీ సాయంత్రం 5.45కు అరెస్టు చేసినట్లు మీడియాకు వెల్లడించడంతోపాటు ఎఫ్ఐఆర్‌లో కూడా అలాగే నమోదు చేశారు. అతడిని సాయంత్రం అరెస్టు చేస్తే.. టీడీపీ సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో ఆ రోజు ఉదయం 11.45 గంటలకే కొండారెడ్డిని అరెస్టు చేసినట్లు ఫొటోలు ప్రత్యక్షమవడం విశేషం. వైఎస్సార్ సీపీ నాయకులతో కొండారెడ్డి కలిసి దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేయడం గమనార్హం.

మద్దిలపాలెం నుంచి తీసుకెళ్లి..!

ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్దిలపాలెంలో సింగిల్‌గా వెళుతున్న కొండారెడ్డిని కొట్టి తీసుకువెళ్లినట్లు కెమెరాలో స్పష్టంగా ఉంది. పోలీసులు మాత్రం ఆ రోజు సాయంత్రం 5.45కు ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వే న్యూకాలనీ వద్ద స్నేహితులిద్దరితో కలిసి ఉండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎఫ్ఐఆర్‌లో చూపించారు.

జీపీఎస్‌తో గుట్టు రట్టు..!

కొండారెడ్డి ఓలా స్కూటీకి జీపీఎస్ ఉంది. మద్దిలపాలెంలో అతడిని పట్టుకున్న తర్వాత స్కూటీని టాస్క్‌ఫోర్స్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి స్టేషన్‌కు 3.1 కిలోమీటర్లు ప్రయాణించినట్లు రికార్డు అయింది. కానీ సాయంత్రానికి 14.3 కిలోమీటర్లు ప్రయాణించినట్లు ఉంది. రైల్వే న్యూకాలనీలో అరెస్టు చేసినట్లు చూపించాలని ముందుగానే ప్లాన్ చేసుకుని ఆ స్కూటీని అక్కడికి తీసుకువెళ్లినట్లు అతడి తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యార్థుల సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్న కారణంగానే రాజకీయ కుట్రలో భాగంగానే ప్రభుత్వం, పోలీసులు తన కుమారుడు కొండారెడ్డిపై డ్రగ్స్ కేసు నమోదు చేసినట్లు అతడి తండ్రి సూర్యనారాయణరెడ్డి ఆరోపిస్తున్నారు.

కొండారెడ్డిది ముమ్మాటికీ అక్రమ అరెస్టే

- వైఎస్సార్‌సీపీ మీద బురదజల్లడమే లక్ష్యంగా కుట్ర
- విశాఖ జిల్లా విద్యార్థి విభాగం నాయకుడి మీద తప్పుడు కేసు
- విద్యార్థుల జీవితాలనూ నాశనం చేయడానికి వెనుకాడని సర్కారు
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజం

విశాఖ సిటీ: ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే ఓర్వలేక కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలనూ నాశనం చేయడానికి వెనుకాడటం లేదని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం విశాఖ జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డి మీద అక్రమంగా డ్రగ్స్ కేసు పెట్టి అరెస్టు చేయడమే నిదర్శనమని పేర్కొన్నారు. గురువారం మద్దిలపాలెంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజుతో కలిసి అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాడన్న కోపంతోనే కుట్ర పన్ని కొండారెడ్డి మీద అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన వివరాలన్నీ తప్పని చెప్పడానికి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని సీసీ టీవీ పుటేజీలను ప్రదర్శించారు. కొండారెడ్డికి డ్రగ్స్ అలవాటు లేకపోయినా అతడిని పోలీసులు తీవ్రంగా కొట్టి సంతకాలు తీసుకున్నారని చెప్పారు. ఇదే విషయాన్ని అతడు జడ్జి ముందు చెప్పి, తాను ఎలాంటి టెస్ట్‌కైనా సిద్ధమని అంగీకరించినట్లు వెల్లడించారు. కొండారెడ్డితో పాటు అరెస్ట్ అయిన విద్యార్థులు దాడి ఇంజినీరింగ్ కాలేజీ, గీతం యూనివర్సిటీల్లో చదువుతుంటే వాటిపేర్లు ఎందుకు బయటపెట్టడం లేదన్నారు. అమర్‌నాథ్ ఇంకా ఏమన్నారంటే..

రాజకీయ కారణాలతోనే కొండారెడ్డి అరెస్టు

రాజకీయ కారణాలతోనే కొండారెడ్డితోపాటు మరో ఇద్దరిని పోలీసులు తప్పుడు కేసులతో అరెస్టు చేశారు. కొండారెడ్డిని 2న సాయంత్రం అరెస్టు చేశామని పోలీసులు చెబుతుంటే తెలుగు దేశం పార్టీ అధికారిక ఎక్స్ ఖాతాలో ఆ వార్తను ఉదయమే ఎలా పోస్ట్ చేశారు? సాయంత్రం అరెస్ట్ చేయబోతున్నట్టు ముందే టీడీపీ సోషల్ మీడియాకి ఎలా తెలుసు? చంద్రబాబు దగ్గర ఏమైనా టైమ్ మెషీన్ ఉందా? భవిష్యత్తులో ఏం జరుగుతుందో కాలజ్ఞానం తెలుసా? పోలీసులను వాడుకుని రాజకీయ కుట్రకు పాల్పడ్డారు. దీనికి సీసీ పుటేజీ వీడియోనే ప్రత్యక్ష సాక్ష్యం.

న్యూకాలనీలో అరెస్ట్ చేసినట్టు ఫేక్ ఆధారం సృష్టి

మద్దిలపాలెంలో కొండారెడ్డిని పట్టుకున్నప్పుడు, కేసు సంబంధిత ఎంవీపీ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదు చేయాలి. కానీ ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఏ రకంగా నమోదు చేస్తారు? మద్దిలపాలెంలో కొండారెడ్డిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నపుడు ఆ స్కూటీని 3.1 కిలోమీటర్ల దూరంగా ఉన్న టాస్క్‌ఫోర్స్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇది స్కూటీలో ఉన్న జీపీఎస్‌లో రికార్డ్ అయి ఉంది. కొండారెడ్డి అరెస్టయిన తర్వాత కూడా మధ్యాహ్నం 3:59 గంటలకు 14.3 కి.మీ ప్రయాణం చేసింది. ఇదెలా సాధ్యం? పోలీసులు రాసుకున్న ప్లాన్ ప్రకారం, న్యూకాలనీలో వాళ్లు సంచరించినట్టుగా ఒక ఫేక్ ఆధారం ఉండాలని ఉద్దేశ పూర్వకంగా ఆ స్కూటీని అన్ని కిలోమీటర్లు డ్రైవ్ చేశారు. మరి దీన్ని తప్పుడు కేసు కాదంటారా? కోర్టులో జడ్జి మందలించిన తర్వాత రిమాండ్ రిపోర్టులను పోలీసులు మార్చేశారు. మొదటిరోజు ఏ2గా ఉన్న కొండారెడ్డిని రెండో రోజు రిమాండ్ రిపోర్టులో ఏ1గా చేర్చారు. ఎఫ్ఐఆర్‌లో గీత్‌చరణ్ ఇచ్చిన రిపోర్టును సీఐ ఇచ్చినట్టుగా రాశారు. తనను తీవ్రంగా కొట్టి పోలీసులు స్టేట్‌మెంట్ తీసుకున్నారే తప్ప తాను డ్రగ్స్ వాడలేదని కొండారెడ్డి చెబుతున్నాడు.

హోంమంత్రి సమాధానం చెప్పాలి

తనకు ఎలాంటి పరీక్షలు చేసినా సిద్ధమేనని కొండారెడ్డి సవాల్ చేస్తున్నాడు. మరి టీడీపీ పెద్దలకు, పోలీసులకు ఆ ధైర్యం ఉందా? హోంమంత్రి అనిత ఒక ప్రెస్‌మీట్ పెట్టి ఈ తప్పుడు కేసును అడ్డంగా పెట్టుకుని ఇష్టానుసారంగా మాట్లాడారు. ఇది తప్పుడు కేసే అనడానికి అనేక ఆధారాలు చూపాము.. ఇప్పుడు హోంమంత్రి సమాధానం చెప్పాలి.

టీడీపీ సోషల్ మీడియా కోసం పోలీసులు పని చేస్తున్నారా?

వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

‘కొండారెడ్డి అరెస్టు కుట్రపూరితం. ఇది మొత్తం టీడీపీ సోషల్ మీడియా కోసం పోలీసులు పనిచేస్తున్నట్టు అనిపిస్తోంది’ అని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణలను నిరసిస్తూ కొండారెడ్డి బలంగా పోరాడడంతో ప్రభుత్వం టార్గెట్ చేసి అక్రమ కేసు పెట్టిందని మండిపడ్డారు. సమావేశంలో విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు, పార్టీ నాయకులు పులగం సూర్య నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఇండిచిప్.. ఇది మరో ఉర్సా!

కోటి రూపాయల కంపెనీ రూ.22,976 కోట్ల పెట్టుబడి

జనవరి 12న జరిగిన ఒప్పందంలో లోకేశ్, కంపెనీ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో ఉర్సా తరహా పెట్టుబడికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపనుందా? సొంత కార్యాలయం కూడా లేని ఉర్సా లాంటి కంపెనీకి విశాఖలో వేల కోట్ల రూపాయల విలువైన భూమి కట్టబెట్టడానికి ప్రయత్నించిన కూటమి సర్కారు, ఇప్పుడు అదే తరహాలో ఇండిచిప్ సెమికండక్టర్స్ అనే అతి తక్కువ మూలధనం కలిగిన కంపెనీ భారీ పెట్టుబడి ప్రతిపాదనకు ఆమోదం తెలపడానికి సిద్ధమయ్యింది.

10 లక్షల చొప్పున 150 ఎకరాలు

కేవలం కోటి రూపాయల మూలధనం కలిగిన ఇండిచిప్ సెమికండక్టర్స్ రాష్ట్రంలోని ఓర్వకల్లులో ఏకంగా రూ.22,976 కోట్ల భారీ పెట్టుబడితో సెమీకండక్టర్ల తయారీ యూనిట్ పెట్టడానికి ముందుకు వచ్చింది. ఈ ప్రతిపాదనకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయనంద్ అధ్యక్షతన సమావేశమైన పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ (ఎస్ఐపీసీ) ఆమోదం తెలపడమే కాకుండా అనేక రాయితీలను ప్రకటించింది. ఎకరం భూమి కేవలం 10 లక్షల చొప్పున 150 ఎకరాలు కట్టబెట్టడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రతిపాదనకు శుక్రవారం ముఖ్యమంత్రి అధ్యక్షతన సమావేశమయ్యే రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదం తెలపనుంది. తరువాత 10వ తేదీన జరగబోయే మంత్రివర్గ సమావేశం కూడా దీనికి ఆమోదముద్ర వేయనుంది.

భాగస్వామ్య కంపెనీ మూలధనమూ అరకొరే..!

జపాన్‌కు చెందిన ఇతో మైక్రో టెక్నాలజీతో కలిసి ఈ యూనిట్‌ను ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వంతో ఇండిచిప్ ఒప్పందం చేసుకుంది. సెమీ కండక్టర్స్ తయారీ రంగంలో ఉన్న ఇతి మైక్రో కంపెనీ పలు దేశాల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నా, ఆర్థికంగా భారీ కంపెనీ ఏమీ కాదు. షెన్‌ఝునోస్టాక్ మార్కెట్‌లో ఇతో మైక్రో టెక్నాలజీస్ నమోదైంది. ఇప్పుడు ఆ కంపెనీ మార్కెట్ క్యాప్ మన భారతీయ కరెన్సీలో కేవలం రూ.249 కోట్లని జపాన్‌కు చెందిన ఈఎన్–ఏఎంబీఐ డాట్ కామ్‌లో ఫైలింగ్స్‌ను పరిశీలిస్తే అర్థమవుతోంది. కేవలం కోటి రూపాయలతో ఏర్పాటైన ఇండిచిప్ కేవలం రూ.249 కోట్ల మార్కెట్ క్యాప్ కలిగిన ఇతో మైక్రో టెక్నాలజీస్‌తో కలిపి ఏకంగా రూ.22,976 కోట్ల విలువైన పెట్టుబడులను ఎలా సమకూర్చుకుంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. ఇటువంటి కంపెనీకి వందల కోట్ల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారన్న అంశంపై చర్చ జరుగుతోంది. అందులోనూ కేంద్ర ప్రభుత్వ నిక్‌డిక్ట్ (ఎన్ఐసీడీఐటీ) నిధులతో అభివృద్ధి అవుతున్న ఓర్వకల్లు పారిశ్రామిక వాడ ప్రాంతంలో ఈ భూములను ఎలా కేటాయిస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఆశ్చర్యకరమైన ‘అడుగులు’!

- ఇండిచిప్ ఒప్పందం పూర్తిగా పరిశీలిస్తే పలు ఆశ్చర్యకరమైన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి.
- 2024 డిసెంబర్ నెలలో కొంతమంది వ్యక్తులు కూటమి సర్కారులో కీలకంగా వ్యవహరిస్తున్న వ్యక్తితో సమావేశమయ్యారు.
- తర్వాత జనవరి 2, 2025న నొయిడా కేంద్రంగా ఇండిచిప్ సెమికండక్టర్స్ పేరిట కంపెనీ ఏర్పాటు చేశారు.
- కేవలం కోటి రూపాయల మూలధనంతో కాన్పూరు ఆర్‌వోసీలో ఈ కంపెనీ నమోదైనట్లు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రికార్డులు వెల్లడిస్తున్నాయి.
- ఇలా ఏర్పాటైన 10 రోజుల్లోనే అంటే ఈ ఏడాది జనవరి 12న మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ సమక్షంలో రాష్ట్రంలో రూ.14,000 కోట్ల విలువైన పెట్టుబడులు పెడుతున్నట్లుగా కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది.
- ఇది జరిగిన 10 నెలలకే ఇప్పుడు ఈ ప్రతిపాదనను దాదాపు 9 వేల కోట్లు పెంచేసి ఏకంగా రూ.22,976 కోట్లకు చేర్చడం గమనార్హం.
- నోయిడా కేంద్రంగా ఏర్పాటైన ఇండిచిప్‌లో పీయూష్ బిచోరియా, వెబ్ చాంగ్, సందీప్ గార్గ్ డైరెక్టర్లుగా, కీలక అధికారిగా రాజీవ్ వ్యవహరిస్తున్నారు. సందీప్ గార్గ్ 2024లో రెండు కంపెనీలు, 2025లో రెండు కంపెనీల్లో డైరెక్టర్లుగా చేరారు. హృషికేష్ దాస్ ఈ ఏడాది జూలై 31న అడిషనల్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.
- వీరెవ్వరికి సెమికండక్టర్స్ తయారీ రంగంలో అనుభవం లేకపోవడం గమనించాల్సిన అంశం.

గతంలో నెక్స్ ఆర్బిట్.. ఇప్పుడు ఇండిచిప్

గతంలో ముఖ్యమంత్రిగా వ్యవహరించిన చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో భారీ సెమీకండక్టర్ యూనిట్ వస్తోందని తెగ ప్రచారం చేశారు. నెక్స్ ఆర్బిట్ అనే సంస్థ రూ.50,000 కోట్లతో రాష్ట్రంలో సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటు చేస్తోందని, తద్వారా 1.10 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని 2017లో చంద్రబాబు నాయుడు తెగ ఊదరగొట్టారు. అబుదాబీకి చెందిన నెక్స్ ఆర్బిట్ వెంచర్స్ అప్పట్లోనే రెండు బిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన పెట్టుబడులు పెడుతోందంటూ ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందం కుదిరాక ఆయన మూడేళ్లు అధికారంలో ఉన్నా.. కార్యాచరణ విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. విభజన తర్వాత రెండోసారి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత కూడా చంద్రబాబు అదే ధోరణిని కొనసాగిస్తున్నారు. ప్రజలకు గత పెట్టుబడుల ప్రకటనలు ఏవీ గుర్తుండవని బలంగా విశ్వసించే ముఖ్యమంత్రి.. అబుదాబి నెక్స్ ఆర్బిట్ స్థానంలో ఇప్పుడు జపాన్ భాగస్వామ్యంతో ఇండిచిప్‌ను ప్రచారంలోకి తీసుకొచ్చారు.

ఆహార అలవాట్లకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా చాలామంది 'హరా హచి బు' విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇది ప్రాచీన జపనీస్ విధానం. 80 శాతం కడుపు నిండే వరకు మాత్రమే తినాలంటుంది...హరా హచి బు. మితంగా తినడం, కడుపు నిండే ముందే తినడాన్ని ఆపడం గురించి హరా హచి బు నొక్కి చెబుతుంది. బరువు తగ్గడానికి కూడా 80 శాతం రూల్‌ను అనుసరిస్తున్నారు.

బిడ్డ పుట్టిన తొలి రోజుల్లో తల్లికి డిప్రెషన్ రావడం సహజం. దాన్నే పోస్ట్ పార్టమ్ డిప్రెషన్ అంటారు. అయితే తల్లులతోపాటు తండ్రులూ ఆ డిప్రెషన్‌ను ఎదుర్కొంటున్నారని నిపుణులు అంటున్నారు. మైక్రో ఫ్యామిలీగా ఉండటం వల్ల పెంపకం బాధ్యత ఒత్తిడి కారణంగా డిప్రెషన్, యాంగ్జయిటీ ఎదుర్కొంటున్న తండ్రుల గురించి పట్టించుకోవాల్సి ఉంది.

● పోస్ట్ పార్టమ్

నాన్నలూ అమ్మలవుతారు... కుంగిపోతారు

కుంగిపోతారు

'ఒక బిడ్డను పెంచడానికి ఓ ఊరంతా కావాలని' సామెత. గతంలో ఉమ్మడి కుటుంబాల్లో బిడ్డల పెంపకానికి వెసులుబాటు ఉండేది. బాధ్యతను అందరూ పంచుకొని బిడ్డను కంటికి రెప్పలా కాపాడేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. బిడ్డల పెంపకమంతా తల్లిదండ్రుల మీదే పడింది. ఈ కారణం వల్ల కొంత, భౌతిక–మానసిక మార్పుల వల్ల కొంత బిడ్డ పుట్టిన తొలి రోజుల్లో తల్లి కుంగుబాటుకు గురవడం చాలామందికి తెలిసిందే! దాన్నే పోస్ట్ పార్టమ్ డిప్రెషన్ అంటారు. అయితే తల్లులతోపాటు తండ్రులూ ఆ డిప్రెషన్‌ను ఎదుర్కొంటున్నారని వైద్యనిపుణులు అంటున్నారు.

అసలేంటీ పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్?

స్త్రీ జీవితంలో మాతృత్వం మధురమైన అనుభవం. ఆ సమయంలో ఆమెలో అనేక శారీరక, మానసిక మార్పులు ఏర్పడతాయి. దాంతో ఒత్తిడి, చిరాకు, యాంక్సైటీ, కోపం, కుంగుబాటు ఆమెను చుట్టుముడతాయి. బిడ్డను రోజంతా చూసుకోవాల్సి రావడం, నిద్ర సరిగ్గా లేకపోవడం, ఒకేచోట గంటల తరబడి ఉండిపోవడం వల్ల పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్‌కి గురవుతారు. ఇది కొందరితో గర్భధారణ సమయం నుంచే మొదలవుతుందని వైద్యులు అంటున్నారు. ఇన్నాళ్లూ ఈ సమస్య అమ్మలకే వస్తుందనే ఆలోచన ఉండగా, ప్రస్తుతం నాన్నలు కూడా ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని తేలింది.

నాన్నల్ని అర్థం చేసుకునేదెవరు?

ప్రస్తుతం చాలామంది 27 దాటాక పెళ్లిళ్లు చేసుకొని 30 ఏళ్లకు తండ్రవుతున్నారు. అటు ఉద్యోగం, ఇటు కెరీర్, ఈఎంఐలు, బాధ్యతలు, ఖర్చులు, అవసరాలతో సతమతమైపోతున్నారు. ఇలాంటి నేపథ్యంలో బిడ్డ పుట్టిన ఆనందం ఉన్నా, మెల్లగా ఆ ఆనందం స్థానంలో కొత్తగా రాబోయే ఖర్చులు, బాధ్యతలు వారిని భయపెడుతున్నాయి. బిడ్డ పుట్టాక రాత్రుళ్లు నిద్ర సరిగ్గా లేకపోవడం, భార్యాబిడ్డల్ని చూసుకోవాల్సి రావడం వంటి కారణాలతో మగవారు సైతం పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్‌కు గురవుతన్నారు. ఉన్నట్టుండి కోపం రావడం, చిన్న విషయాలకు చిరాకు పడటం, అరవడం, ఇంటికి దూరంగా ఉండాలనుకోవడం వంటివి ఈ డిప్రెషన్ తాలూకు లక్షణాలు. తలనొప్పి, వాంతులు, అజీర్తి, కీళ్ల నొప్పులు సైతం వీరిని వేధిస్తాయి.

మగవారికి అందాల్సిన చేయూత

బిడ్డ పుట్టిన తర్వాత చాలా మంది తల్లి ఆరోగ్యంపైనే దృష్టి నిలుపుతారు. ఆమెను జాగ్రత్త చూసుకోవాలని భావిస్తుంటారు. తండ్రి పరిస్థితి ఏమిటి... అతను పడుతున్న ఇబ్బందులేమిటన్న విషయాన్ని చాలా మంది పరిగణనలోకి తీసుకోరు. మగవారు కూడా తమ సమస్యల్ని బయటకు చెప్పుకునేందుకు మొహమాట పడతారు. లోలోపలే దాచుకొని సతమతమవుతారు. దీంతో వారి సమస్య మరింత పెరిగి ఒక్కోసారి ఆత్మహత్యా ప్రేరేపిత ఆలోచనల వరకూ వెళ్తుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలో తల్లితో పాటు తండ్రికీ కుటుంబ సభ్యుల చేయూత అవసరమని, వారితో మాట్లాడుతూ, వారి సమస్యల్ని విని ఓదార్పు అందించాలని అంటున్నారు. అవసరమైతే మానసిక వైద్యుల వద్దకు తీసుకెళ్లి కౌన్సిలింగ్ అందించాలంటున్నారు.

ఫ్యాషన్

వివాహ వేడుకలో... ఫ్యూజన్ స్టైల్

వివాహ వేడుకలలో సంప్రదాయ పట్టు చీరల రెపరెపలు ఆధునికపు హంగులతో మరింత వైభవంగా వెలిగిపోతున్నాయి. కట్టు, కట్స్, కలర్‌తో కొంగొత్తగా రూపుకడుతున్నాయి. ఫ్యూజన్ స్టైల్స్‌ని ఇష్టపడుతున్న నవతరం ఈ వెడ్డింగ్ సీజన్‌ని అటు సంప్రదాయం ఇటు ఆధునికతల మేళవింపుతో సరికొత్తగా చూపుతోంది.

పేస్టెల్ షేడ్స్ ఎంపిక

ఈ సీజన్‌లో పెళ్లి కూతురి లుక్ పూర్తిగా నేటి కాలానికి తగినట్టుగా మారిపోతోంది. వధువు ధరించే సంప్రదాయ పట్టు చీరలకు బదులు ఫ్యూజన్ స్టైల్స్ బాగా హిట్ అవుతున్నాయి. బెనారస్ ఫ్యాబ్రిక్ మోడర్న్ కట్స్, టాప్ టు బాటమ్ ఒకే కలర్‌తో ఉండే మోనోటోన్ లెహెంగాస్ లేదా పేస్టెల్ షేడ్స్ లో శారీస్ ఇవే ఇప్పుడు నూతన వధువుల ఎంపిక అవుతుంది. హ్యాండ్ ఎంబ్రాయిడరీ, సీక్విన్ వర్క్, పెర్ల్ డీటైలింగ్ వంటివి వధువు లుక్‌కి రాయల్ టచ్ ఇస్తున్నాయి. చాలా మంది ఇప్పుడు లైట్‌వెయిట్ చీరలు లేదా జామెట్రిక్ ప్యాటర్న్స్ తో కూడిన లెహెంగాస్ ను ఇష్టపడుతున్నారు. ఇవి ఫొటోలలో చాలా బ్రైట్‌గా కనిపిస్తాయి. వధువులే కాదు, వధువు తరఫున వేడుకలో పాల్గొనబోయే అమ్మాయిలు కూడా పేస్టెల్ కలర్స్, ఫ్లోరల్ ప్రింట్స్ తో తమదైన స్టేట్‌మెంట్‌ని సృష్టిస్తున్నారు. మొత్తానికి, ఈ సంవత్సరం వధూవరుల ఫ్యాషన్ అనేది 'ట్రెడిషన్ మీట్స్ మోడర్నిటీ' అని చెప్పొచ్చు.

- చంద్రిక కంచెర్ల,
ఫ్యాషన్ డిజైనర్

సంప్రదాయానికి ఆధునికతను జత చేస్తున్న ఈ ఫ్యూజన్ లుక్స్ ఈ తరం వధువులలో కొత్త ఉత్సాహాన్ని తీసుకువస్తున్నాయి ● పట్టు బ్లౌజ్‌కి నెటెడ్ స్లీవ్స్, ఆర్గంజా దుపట్టాతో బెనారసీ లెహంగా మ్యాచ్ చేయడం.. వంటివి నేటి ట్రెండ్ ● టెంపుల్ నెక్లెస్‌కి మరో డైమండ్ పెండెంట్ ఉన్న చైన్ లేదా ఆక్సిడైజ్డ్ జ్యువెలరీని సిల్క్ శారీస్‌తో ధరించడం ఫ్యూజన్ స్టైల్‌గా మారింది ● సంప్రదాయ ఆభరణాలతో న్యూడ్ మేకప్, లైట్ బీచ్ వేవ్స్ హెయిర్‌స్టైల్స్ ఈ అలంకరణకు బాగా సూట్ అవుతున్నాయి.

పీచ్ టోన్స్

గతంలో రెడ్, మెరూన్ వివాహవేడుకలలో ప్రధానంగా కనిపించేవి. ఇప్పుడు పీచ్, రోజ్ గోల్డ్, బీజ్ టోన్స్ ట్రెండ్‌లో ఉన్నాయి. ఇవి సాఫ్ట్ లుక్ ఇవ్వడంతో పాటు అందాన్ని పెంచుతున్నాయి.

ట్రెడిషన్ – ట్రెండ్ కలయిక

కంచిపట్టు లెహంగా ధరించి, దానిపైన సీక్వెన్స్ బ్లౌజ్ వేసుకోవడం. అలాగే, క్లాసిక్ ఫ్యాబ్రిక్ శారీ అయితే మోడ్రన్ కట్ బ్లౌజ్ ధరించడం ఈ స్టైల్ ప్రత్యేకత.

ఇండియన్ – వెస్టర్న్

లెహంగాకి క్రాప్‌టాప్ లేదా ష్రగ్ వంటి వెస్టర్న్ టాప్స్ ధరించడం. ఇది ట్రెడిషనల్ సిల్హౌట్‌కి వెస్ట్రన్ టచ్ ఇస్తుంది. షరారా ప్యాంట్స్, జాకెట్ స్టైల్ చోలీలు లేదా అంగరఖా టాప్స్ ఇవి వధువుల రిసెప్షన్ లుక్స్‌లో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

సంప్రదాయ స్టైల్స్‌కి ఆధునికపు హంగులను జోడించడమే నేటి ట్రెండ్. ఫ్యూజన్ స్టైల్‌గా పిలిచే ఈ ఫ్యాషన్‌లో క్రియేటివిటీ ప్రధానంగా చూస్తున్నారు.

లెహంగా విత్ కేప్ దుపట్టా

ట్రెడిషనల్ దుపట్టా స్థానంలో లైట్ షిమ్మర్ కేప్ వాడటం ఈ సీజన్‌లో హిట్. ఇది లుక్‌కు రాయల్ టచ్ ఇస్తుంది. ఇవి సంగీత్ వంటి వేడుకలకు హైలైట్‌గా మారాయి.

సాక్షి సినిమా

● కయాదు లోహర్, విశ్వక్ సేన్

నవ్వుల తుఫాను

విశ్వక్ సేన్ హీరోగా 'జాతి రత్నాలు' ఫేమ్ కేవీ అనుదీప్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఫంకీ'. ఈ చిత్రంలో కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 3న విడుదల చేయనున్నట్లుగా గురువారం మేకర్స్ ప్రకటించి, ఈ సినిమా కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''థియేటర్స్‌లో నవ్వుల తుఫాను ('ఫంకీ' సినిమాను ఉద్దేశించి..) కోసం సిద్ధంగా ఉండండి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

ఇక దుల్కర్‌ని నట చక్రవర్తి అని పిలుస్తారు - రానా

● ప్రశాంత్ పొట్లూరి, సెల్వమణి సెల్వరాజ్, దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, రానా

''కాంత' చిత్రం ట్రైలర్ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాని థియేటర్స్‌లో చూస్తే గొప్ప అనుభూతినిస్తుంది. తెలుగు ప్రేక్షకులు ఇచ్చే ఎనర్జీ ఓ రేంజ్‌లో ఉంటుంది. నా బెస్ట్ ఫ్రెండ్ రానాతో కలిసి ఈ సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది'' అని దుల్కర్ సల్మాన్ చెప్పారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జోడీగా నటించిన చిత్రం 'కాంత'. రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ని హీరో ప్రభాస్ లాంచ్ చేశారు. అనంతరం జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రానా మాట్లాడుతూ– ''కాలాన్ని సినిమా మాత్రమే రీ క్రియేట్ చేయగలదు. అలాంటి నేపథ్యంలో సెల్వ చెప్పిన 'కాంత' కథ విన్న వెంటనే కచ్చితంగా సినిమా చేయాలనిపించింది. ఈ నెల 14 తర్వాత దుల్కర్‌ని అందరూ నట చక్రవర్తి అని పిలుస్తారు'' అని చెప్పారు. భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ–''ఇప్పటి వరకు నా సినిమాలు చూశారు. ఈ చిత్రంలో నా నటన చూస్తారు'' అన్నారు. ''కాంత'లో నటించడం గర్వంగా ఉంది'' అన్నారు సముద్ర ఖని. ''ఈ సినిమా విడుదలైన రోజునే మీ అందరితో కలిసి సినిమా చూడాలని ఉంది'' అని సెల్వమణి సెల్వరాజ్ తెలిపారు. ''ఈ చిత్రానికి ప్రాణం పోసి మీ ముందుకు తీసుకొస్తున్నాం'' అని ప్రశాంత్ పొట్లూరి పేర్కొన్నారు.

● ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్

బీస్ట్ మోడ్‌కి సిద్ధం

హీరో ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్) అనే చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామా షూటింగ్‌కి కొన్ని కారణాల వల్ల బ్రేక్ పడింది. అయితే ఈ సినిమా కొత్త షూటింగ్ షెడ్యూల్ అతి త్వరలోనే ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్‌కు సంబంధించిన చర్చలు, ఎన్టీఆర్ మేకోవర్‌పై వర్క్ జరుగుతోంది. ''సిద్ధం అవుతున్నాను'' అంటూ తన ఇన్‌స్టా స్టోరీలో ప్రశాంత్ నీల్‌తో ఉన్న ఫొటోను షేర్ చేశారు ఎన్టీఆర్. ''బీస్ట్ మోడ్ మళ్లీ మొదలవుతుంది. త్వరలోనే కొత్త షెడ్యూల్ స్టార్ట్ చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. కల్యాణ్ రామ్, నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఈ సంగతి ఇలా ఉంచితే..'ఎన్టీఆర్‌నీల్' సినిమా రెండు భాగాలుగా విడుదల కానుందనే టాక్ తెరపైకి వచ్చింది. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్.

● చాందిని, విక్రాంత్, 'దిల్' రాజు, ఆనంద్ దేవరకొండ, మధుర శ్రీధర్

సంతాన ప్రాప్తిరస్తు విజయం సాధించాలి

''సినిమా తీయడం, ట్రైలర్ లాంచ్ చేసుకోవడం కంటే మార్నింగ్ షోస్‌కు ప్రేక్షకుల్ని రప్పించి సినిమా సక్సెస్ అనిపించుకోవడం గొప్ప విషయం. దీని కోసం ఎక్కువ శ్రమ పెట్టాలి. 'సంతాన ప్రాప్తిరస్తు' మంచి విజయం సాధించాలి'' అని నిర్మాత 'దిల్' రాజు తెలిపారు. **- 'దిల్' రాజు**

విక్రాంత్, చాందినీ చౌదరి జోడీగా నటించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించారు. మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి 'దిల్' రాజు, హీరో ఆనంద్ దేవరకొండ అతిథులుగా హాజరయ్యారు. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ''మధుర శ్రీధర్‌గారితో నేను 'దొరసాని' సినిమా చేయడం వల్లే 'బేబి' మూవీ చేయగలిగాను. ప్రేక్షకులంతా 'సంతాన ప్రాప్తిరస్తు'ని ఆదరించాలి'' అని చెప్పారు. ''స్వచ్ఛమైన ప్రేమకథకి సోషల్ ఇష్యూను కూడా జత చేశాం'' అన్నారు సంజీవ్ రెడ్డి. ''మీ అందరికీ నచ్చేలా 'సంతాన ప్రాప్తిరస్తు'ని రూపొందించాం'' అని నిర్వి హరిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ''మా సినిమా ట్రైలర్ ఎలా ఉందో సినిమా కూడా అదే స్థాయిలో ఉంటుంది'' అని 'మధుర' శ్రీధర్ రెడ్డి చెప్పారు. ''మా చిత్రంలో మేల్ ఫెర్టిలిటీ అనే కొత్త విషయం ఉంది'' అని విక్రాంత్, చాందినీ చౌదరి పేర్కొన్నారు.



ఏఐ మన జీవితాల్లో భాగమైపోయింది

- సంగీతదర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్

''తెలుగులో నేను అంగీకరించిన తొలి సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. కాకపోతే 'ఖుషి' తో నా ఎంట్రీ జరిగింది. 'ఖుషి, హాయ్ నాన్న, మనమే, 8 వసంతాలు'... ఇలా నా మ్యూజిక్ డైరెక్షన్‌లో వచ్చిన ప్రేమకథా చిత్రాలతో పోల్చినప్పుడు 'ది గర్ల్ ఫ్రెండ్' కి కాస్త విభిన్నమైన సంగీతం అందించాను. ఎందుకంటే... ఇది ఇంటెన్స్ లవ్‌స్టోరీ'' అని చెప్పారు సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్. రష్మికా మందన్నా ప్రధాన పాత్రలో, దీక్షిత్ శెట్టి మరో లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా హేషమ్ అబ్దుల్ వహాబ్ మాట్లాడుతూ– ''మహిళలు, నేటి తరం యువత, తల్లిదండ్రులు 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాను కచ్చితంగా చూడాలన్నది నా అభిప్రాయం. నా భార్యతో కలిసి నేను ఈ సినిమా చూశాను. మేం భావోద్వేగానికి లోనయ్యాం. నేటి సమాజంలోని ఓ అంశాన్ని ప్రస్తావించారు రాహుల్ రవీంద్రన్. రష్మిక, దీక్షిత్ అద్భుతంగా నటించారు. సంగీతానికి ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వాడలేదు. కానీ సినిమా మేకింగ్ ప్రాసెస్‌లో కొంత ఏఐ వాడాం. 'హాయ్ నాన్న' సినిమాకు సంగీతంలో ఏఐ వాడాను. ఏఐ మన జీవితాల్లో భాగమైపోయింది. హైదరాబాద్ నా సెకండ్ హోమ్ అయిపోయింది. ప్రస్తుతం తెలుగు నేర్చుకుంటున్నాను. ప్రస్తుతం ఆనంద్ దేవరకొండ కొత్త సినిమాకు సంగీతం అందిస్తున్నాను. తమిళంలో ఓ సినిమాకు, కన్నడంలో గణేశ్‌గారి సినిమాకు సంగీతం అందిస్తున్నాను. కన్నడలో నా తొలి మూవీ ఇది. హిందీలో నా తొలి సినిమా ఖరారైంది. త్వరలోనే అనౌన్స్‌మెంట్ ఉంటుంది'' అని చెప్పారు.

మైఖేల్ డేట్ ఫిక్స్

పాప్ మ్యూజిక్ ఐకాన్ మైఖేల్ జాక్సన్ జీవితం ఆధారంగా రూపొందుతున్న హాలీవుడ్ చిత్రం 'మైఖేల్'. ఈ బయోపిక్‌లో మైఖేల్ జాక్సన్ సోదరుడు జెర్మైన్ జాక్సన్ తనయుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్ చేస్తున్నారు. జాఫర్‌కి ఇది తొలి ఫీచర్ ఫిల్మ్ కావడం విశేషం. నియా లాంగ్, లారా హారికర్, జూలియానో క్రూ వాల్డి, కోల్మన్ డొమింగో ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ బయోగ్రాఫికల్ మ్యూజికల్ డ్రామాని ఆంటోయిన్ ఫుక్వా దర్శకత్వంలో గ్రాహం కింగ్, జాన్ బ్రాంకా, జాన్ మెక్‌క్లైన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ ట్రైలర్, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసి, ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 24న రిలీజ్ చేయనున్నట్లుగా ప్రకటించారు మేకర్స్.

ఆ ధైర్యంతోనే ప్రీమియర్లు వేశాం

● టీనా, తిరువీర్

''ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' కథ, సినిమాపై నమ్మకం వల్లే ధైర్యంగా విడుదలకు రెండు రోజుల ముందే ప్రీమియర్లు వేశాం. ఈ ప్రీమియర్లకు అద్భుతమైన స్పందన రావడం చాలా ఆనందంగా ఉంది'' అని హీరో తిరువీర్ తెలిపారు. **- తిరువీర్**

రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వంలో తిరువీర్, టీనా శ్రావ్య జోడీగా నటించిన చిత్రం 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో'. రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వంలో సందీప్ అగరం, అస్మితా రెడ్డి బాసిని నిర్మించారు. కల్పనా రావు సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో రాహుల్ శ్రీనివాస్ మాట్లాడుతూ– ''మా చిత్రాన్ని ఫ్యామిలీ, ఫ్రెండ్స్... అందరితో కలిసి చూస్తే మరింతగా నచ్చుతుంది'' అని చెప్పారు. ''మా డైరెక్టర్ రాహుల్ వల్లే నిర్మాతగా మారాను'' అన్నారు సందీప్ అగరం.

● ప్రీతి, సాత్విక్

అందమైన ప్రేమకథ

సాత్విక్ వర్మ, ప్రీతి నేహా జంటగా భాను దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రేమిస్తున్నా'. వరలక్ష్మీ పప్పుల సమర్పణలో కనకదుర్గారావు పప్పుల నిర్మాతగా మధ్రి రవికుమార్ నిర్వాహణలో రూపొందిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హీరోలు పూరి ఆకాశ్, రోషన్ కనకాల అతిథులుగా హాజరయ్యారు. పూరి ఆకాశ్ మాట్లాడుతూ–''ప్రేమిస్తున్నా' టీజర్, పాటలు చూసినప్పుడు సాత్విక్ నటన సినిమాకు ప్రధాన ఆకర్షణ అని తెలిసింది'' అన్నారు. ''ప్రేమిస్తున్నా' విజయం సాధించాలి'' అన్నారు రోషన్ కనకాల. ''ఇదొక అందమైన ప్రేమకథా చిత్రం'' అని భాను చెప్పారు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
148	88
83,311	25,510

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	23,078	▽	421
డోజోన్స్	46,879	▽	432
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,728	▽	49
డాక్స్	23,736	▽	1
షాంఘై	4,008	△	39
నికాయ్	50,915	△	703

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.16	89.18
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.37	117.31
€	యూరో	ఎస్‌బీఐ	100.65	103.42
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.11	58.54
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.25	59.14
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.59	69.31
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.75	24.25
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.24	24.50
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.56	13.39

ఎల్‌ఐసీ లాభం జూమ్

క్యూ2లో రూ. 10,053 కోట్లు

న్యూఢిల్లీ: బీమా రంగ ప్రభుత్వ దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్‌ఐసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 32 శాతం జంప్‌చేసి రూ. 10,053 కోట్లను తాకింది. కమిషన్ల చెల్లింపు తగ్గడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 7,621 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,29,620 కోట్ల నుంచి రూ. 2,39,614 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 2,22,366 కోట్ల నుంచి రూ. 2,30,160 కోట్లకు పెరిగాయి. కమిషన్ చెల్లింపులు రూ. 6,542 కోట్ల నుంచి రూ. 5,772 కోట్లకు తగ్గాయి. కాగా.. నికర ప్రీమియం ఆదాయం రూ. 1,19,901 కోట్ల నుంచి రూ. 1,26,479 కోట్లకు పుంజుకోగా.. రెన్యువల్ ప్రీమియం రూ. 61,910 కోట్ల నుంచి రూ. 64,996 కోట్లకు బలపడింది. తొలి ఏడాది ప్రీమియం రూ. 11,201 కోట్ల నుంచి రూ. 10,836 కోట్లకు క్షీణించింది. ఇందుకు జీఎస్‌టీ సవరణలు ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. వ్యక్తిగత జీవిత బీమా ప్రీమియంను 18% జీఎస్‌టీ నుంచి మినహాయించడం సానుకూల ఫలితాలను చూపనున్నట్లు ఎల్‌ఐసీ సీఈవో, ఎండీ ఆర్.దొరైస్వామి పేర్కొన్నారు. స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) 1.72% నుంచి 1.34%కి తగ్గాయని చెప్పారు.

అన్ అకాడెమీపై అప్‌గ్రేడ్ కన్ను!

400 మిలియన్ డాలర్లకు కొనుగోలు యోచన

న్యూఢిల్లీ: ఎడ్‌టెక్ దిగ్గజం అన్‌అకాడెమీని కొనుగోలు చేయడంపై అప్‌గ్రాడ్ దృష్టి పెట్టింది. ఈ డీల్ విలువ సుమారు 300–400 మిలియన్ డాలర్లుగా ఉండొచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇరు సంస్థలు సుమారు మూడు వారాల్లో ఇందుకు సంబంధించిన టర్మ్ షీట్‌పై సంతకాలు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ప్రతిపాదిత డీల్ ప్రకారం అన్‌అకాడెమీకి చెందిన ల్యాంగ్వేజ్ లెర్నింగ్ యాప్ ఎయిర్ లెర్న్‌ను ప్రత్యేక విభాగంగా విడగొడతారు. ఆఫ్‌లైన్ లెర్నింగ్ సెంటర్ల నెట్‌వర్క్‌తో కూడుకున్న టెస్ట్ ప్రిపరేషన్ విభాగాన్ని అప్‌గ్రాడ్‌కి విక్రయిస్తారు. 2021లో 3.44 బిలియన్ డాలర్ల పైగా ఉన్న అన్‌అకాడెమీ వేల్యుయేషన్ ఆ తర్వాత గణనీయంగా పడిపోయింది. కార్యకలాపాలపై కంపెనీ చేసే వ్యయాలు సైతం గత మూడేళ్లలో వార్షికంగా రూ. 1,000 కోట్ల నుంచి రూ. 100 కోట్లకు తగ్గింది. సంస్థ వద్ద ప్రస్తుతం రూ. 1,200 నగదు నిల్వలు కూడా ఉన్నాయి. 2015లో ఏర్పడిన అన్ అకాడెమీ, కరోనా మహమ్మారి సమయంలో ప్రముఖ ఎడ్‌టెక్ యూనికార్న్‌గా ఎదిగింది. జనరల్ అట్లాంటిక్, సాఫ్ట్‌బ్యాంక్, టెమాసెక్‌లాంటి దిగ్గజాలు ఇన్వెస్ట్ చేశాయి.

ఫిజిక్స్‌వాలా @ రూ. 103-109

- ఈ నెల 11–13 మధ్య ఐపీవో
- రూ. 3,480 కోట్ల సమీకరణకు సై
- కంపెనీ విస్తరణకు నిధుల వెచ్చింపు

PHYSICS WALLAH

న్యూఢిల్లీ: విద్యా సంబంధ స్టార్టప్(ఎడ్‌టెక్ యూనికార్న్) ఫిజిక్స్‌వాలా పబ్లిక్ ఇష్యూకి రూ. 103–109 ధరల శ్రేణి నిర్ణయించింది. ఇష్యూ ఈ నెల 11న ప్రారంభమై 13న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 10న షేర్లను ఆఫర్ చేయనుంది. ఇష్యూలో భాగంగా రూ.3,100 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ.380 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. ప్రమోటర్లలో అలఖ్ పాండే, ప్రతీక్ బూబ్ ఒక్కొక్కరూ రూ. 190 కోట్ల విలువైన వాటా ఆఫర్ చేయనున్నారు. ప్రస్తుతం ఇరువురూ కంపెనీలో 40.31% చొప్పున వాటా కలిగి ఉన్నారు. లిస్టింగ్‌లో కంపెనీ రూ. 31,500 కోట్ల మార్కెట్ విలువను అంచనా వేస్తోంది.

కంపెనీ బ్యాక్‌గ్రౌండ్ ఇదీ..: ఫిజిక్స్‌వాలా ప్రధానంగా జేఈఈ, నీట్, గేట్, యూపీఎస్‌సీ పోటీ పరీక్షల టెస్ట్ ప్రిపరేషన్ కోర్సులు ఆఫర్ చేస్తోంది. యూట్యూబ్, వెబ్‌సైట్, యాప్స్ తదితర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా నైపుణ్యాపెంపు కార్యక్రమాలు చేపడుతోంది. ఆఫ్‌లైన్, హైబ్రిడ్ సెంటర్లను నిర్వహిస్తోంది. ఫిజిక్స్ వాలా–అలఖ్ పాండే యూట్యూబ్ చానల్‌కు 1.37 కోట్ల మంది సబ్‌స్క్రయిబర్లను సాధించింది. కంపెనీలో పీఈ దిగ్గజాలు వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్, హార్న్‌బిల్, జీఎస్‌వీ వెంచర్స్‌కు పెట్టుబడులున్నాయి. గతేడాది (2024–25)లో ఆదాయం రూ. 1,941 కోట్ల నుంచి రూ. 2,887 కోట్లకు జంప్ చేసింది. నష్టాలు రూ. 1,131 కోట్ల నుంచి రూ. 243 కోట్లకు భారీగా తగ్గాయి.

ఐదు నెలల కనిష్టానికి సేవల పనితీరు

- అక్టోబర్‌లో పీఎంఐ 58.9

న్యూఢిల్లీ: సేవల రంగంలో కార్యకలాపాలు నిదానించాయి. సేవల రంగ పనితీరును సూచించే హెచ్‌ఎస్‌బీసీ ఇండియా పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) అక్టోబర్‌లో 58.9 పాయింట్లకు పరిమితమైంది. సెప్టెంబర్‌లో ఇది 60.9 పాయింట్లుగా ఉండడం గమనార్హం. ఈ సూచీ సాధారణంగా 50 పాయింట్లకు పైన ఉంటే విస్తరణగానే పరిగణిస్తుంటారు. ఈ ఏడాది మే తర్వాత సేవల రంగ పీఎంఐ ఇంత తక్కువగా నమోదు కావడం మళ్లీ ఇదే మొదటిసారి. పోటీపరమైన ఒత్తిళ్లు, భారీ వర్షాలు నెలవారీగా వృద్ధిని నిదానించేలా చేసినట్టు హెచ్‌ఎస్‌బీసీ ఇండియా ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారీ చెప్పారు. డిమాండ్ జోరు, జీఎస్‌టీ ఉపశమనంతో నిర్వహణ పరిస్థితులు మెరుగుపడినప్పటికీ, పోటీ, అధిక వర్షాలు వృద్ధికి అడ్డుపడినట్టు చెప్పారు. వచ్చే 12 నెలల కాలంలో వ్యాపార కార్యకలాపాలు బలంగా ఉంటాయన్న విశ్వాసం కంపెనీల నుంచి వ్యక్తమైనట్టు హెచ్‌ఎస్‌బీసీ ఇండియా పీఎంఐ సర్వే వెల్లడించింది. ఇక అక్టోబర్ నెలకు సంబంధించి తయారీ, సేవల రంగ పనితీరును సూచించే హెచ్‌ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ పీఎంఐ 60.4గా నమోదైంది. సెప్టెంబర్‌లో 61గా ఉంది.

బ్యాంక్ సిబ్బంది స్థానిక భాషలో మాట్లాడాలి

- పీఎస్‌బీలు చర్యలు చేపట్టాలి
- మనకు ప్రపంచ స్థాయి బ్యాంకులు అవసరం
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

ముంబై: కస్టమర్లతో మరింత మమేకం అయ్యేందుకు గాను బ్యాంకు సిబ్బంది స్థానిక భాషలో మాట్లాడే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రభుత్వరంగ బ్యాంకులకు (పీఎస్‌బీలు) సూచించారు. స్థానిక భాష తెలిసిన వారినే నియమించాలన్న డిమాండ్లు ఇటీవలి కాలంలో పలు రాష్ట్రాల్లో వినిపిస్తుండడంతో కేంద్ర మంత్రి దీనిపై స్పందించారు. బెంగళూరులో ఇటీవల ఎస్‌బీఐ మేనేజర్ ఒకరు కన్నడ భాష తెలియక, దురుసు ప్రవర్తనతో విమర్శల పాలు కావడం తెలిసిందే. ''బ్రాంచ్‌లో నియమించే ప్రతీ ఉద్యోగి తన కస్టమర్‌ను అర్థం చేసుకుని, స్థానిక భాషలో మాట్లాడే విధంగా ఉండాలి. ముఖ్యంగా యాజమాన్యానికి స్థానిక భాష తెలియని పరిస్థితుల్లో, బ్రాంచ్ స్థాయి అధికారులు అయినా స్థానిక భాషలో మాట్లాడగలగాలి. స్థానిక భాషలో ప్రావీణ్యం ఆధారంగా ఉద్యోగుల పనితీరును మదింపు వేసే విధానం ఉండాలి''అని ఎస్‌బీఐ నిర్వహించిన ఒక కార్యక్రమంలో భాగంగా మంత్రి స్పష్టం చేశారు. వివిధ మాతృభాషల అధికారులను వేర్వేరు భిన్న ప్రాంతాల్లో నియమించరాదన్న విధానాన్ని మాత్రం తాను సమర్థించబోనన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..	
అపోలో హాస్పిటల్స్ లాభం జూమ్	ఐపీవో వేల్యుయేషన్స్‌లో సెబీ జోక్యం చేసుకోదు!

కస్టమర్లతో అనుబంధమే కీలకం

బ్యాంకు తన కార్యకలాపాల నిర్వహణకు స్థానిక కస్టమర్లు కీలకమని, బ్యాంకు వృద్ధి అవసరాల పరంగా చూసినా వారితో అనుసంధానత ఎంతో కీలకమని మంత్రి గుర్తు చేశారు. కస్టమర్లతో అనుబంధం తగ్గిపోతుండడంతో క్రెడిట్ సమాచార సంస్థలపై (సిబిల్ తదితర క్రెడిట్ బ్యూరోలు) బ్యాంకులు ఎక్కువగా ఆధారపడాల్సి వస్తున్నట్టు మంత్రి చెప్పారు. ఆయా సంస్థలు తాజా సమాచారాన్ని అప్‌డేట్ చేసేందుకు ఎక్కువ సమయం తీసుకుంటున్నాయని, దీంతో కొన్ని సందర్భాల్లో కస్టమర్లు రుణ తిరస్కరణలు ఎదుర్కోవాల్సి వస్తున్నట్టు గుర్తు చేశారు. గతంలో బ్యాంక్ అధికారులకు తన కస్టమర్ల రుణ సామర్థ్యం గురించి అవగాహన ఉండేదన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు.

ఎఫ్‌అండ్‌వో ట్రేడింగ్‌ను అడ్డుకోము

రిటైల్ ఇన్వెస్టర్లు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌అండ్‌వో)లో ట్రేడింగ్ చేయకుండా ప్రభుత్వం అడ్డుకోబోదని మంత్రి సీతారామన్ స్పష్టం చేశారు. కాకపోతే అందులో ఉండే రిస్కుల గురించి అవగాహన కల్పిస్తామని ప్రకటించారు. ఎఫ్‌అండ్‌వో మార్కెట్లో రిటైల్ ఇన్వెస్టర్లలో ప్రతి 100 మందికి 91 మంది నష్టపోతున్నట్టు సెబీ అధ్యయనంలో వెల్లడి కావడం తెలిసిందే.

పెద్ద బ్యాంక్‌లు కావాలి..

మన దేశానికి అతిపెద్ద, ప్రపంచ స్థాయి బ్యాంకులు అవసరమని ఆర్థిక మంత్రి సీతారామన్ అన్నారు. ఇందుకు సంబంధించి ఆర్‌బీఐ, బ్యాంకులతో సంప్రదింపులు కొనసాగుతున్నట్టు చెప్పారు. ఈ విషయమై ఒక నిర్ణయం తీసుకునే ముందు ఎంతో కసరత్తు చేయాల్సి ఉందంటూ.. బడా బ్యాంకుల ఏర్పాటుకు ఎలా ముందుకు వెళ్లాలనే విషయమైన ఆర్‌బీఐ అభిప్రాయాలు కూడా తీసుకుంటామని ప్రకటించారు. బ్యాంకుల విలీనం కూడా ఒక మార్గమని చెప్పారు. పరిశ్రమలకు బ్యాంకుల నుంచి రుణ వితరణ మరింత విస్తృతం కావాలన్నారు. జీఎస్‌టీ రేట్ల కోతతో డిమాండ్ పెరిగి, అది పెట్టుబడుల సైకిల్‌కు దారితీస్తుందని అభిప్రాయపడ్డారు. బలమైన బ్యాంకుల అంశంతోనే కేంద్ర సర్కారు 2019లో ప్రభుత్వరంగ బ్యాంకుల మెగా విలీనాన్ని చేపట్టడం తెలిసిందే. దీంతో 27 ప్రభుత్వరంగ బ్యాంకులు విలీనాల అనంతరం 12కు తగ్గాయి. మరో విడత ప్రభుత్వరంగ బ్యాంకుల విలీనంపై కేంద్ర సర్కారు యోచిస్తున్నట్టు ఇటీవలే వార్తలు రావడం గమనార్హం. ఇప్పటికే ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ దిశగా చర్యలు కూడా కొనసాగుతున్నాయి.

ఫైనాన్స్, మెటల్ షేర్లలో అమ్మకాలు

- సూచీలకు రెండో రోజూ నష్టాలు

ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదొడుకులకు లోనైన స్టాక్ మార్కెట్ గురువారం నష్టాలతో ముగిసింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, ఐసీఐసీఐ బ్యాంకు షేరు (–1.21%) పతనం సెంటిమెంట్‌ను దెబ్బ తీశాయి. భారతీయ సేవల రంగం అక్టోబర్‌లో నెమ్మదించడమూ నిరాశపరిచింది. ఫలితంగా సెన్సెక్స్ 148 పాయింట్లు కోల్పోయి 83,311 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 88 పాయింట్లు పతనమై 25,510 వద్ద నిలిచింది. సూచీలకిది రెండో రోజూ నష్టాల ముగింపు.

- ఎంటీఆర్, ఈస్ట్రన్‌ల మాతృసంస్థ ఓర్క్లా ఇండియా లిస్టింగ్ మెప్పించలేకపోయింది. ఇష్యూ ధర (రూ.730)తో పోలిస్తే బీఎస్‌ఈ 3% ప్రీమియంతో రూ.751.50 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో రూ.755 వద్ద గరిష్టాన్ని, రూ.693 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 2% నష్టంతో రూ.713 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.9,773 కోట్లుగా నమోదైంది.

బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో ధావన్, రైనా ఆస్తులు జప్తు

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ వివాదానికి సంబంధించి భారత మాజీ క్రికెటర్లు శిఖర్ ధావన్, సురేశ్ రైనాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీవ్ర చర్యలు తీసుకుంది. వీరిద్దరికి సంబంధించి రూ. 11.14 కోట్ల ఆస్తులను ఈడీ జప్తు చేసింది. చట్టవిరుద్ధమైన బెట్టింగ్ సైట్‌లతో కలిసి పని చేసినందుకు వీరిపై చర్యలు తీసుకున్నట్లు ఈడీ వెల్లడించింది. 1xబెట్ అనే విదేశీ బెట్టింగ్ సంస్థ, దానికి సంబంధించి పలు అనుబంధ కంపెనీలు ఉన్నాయి. ధావన్, రైనా అన్నీ తెలిసే ఈ కంపెనీకి ప్రచారకర్తలుగా వ్యవహరించారు. దీనికి ప్రతిఫలంగా అక్రమ మార్గాల ద్వారా సొమ్ములు తీసుకున్నారు. ఈ కంపెనీకి భారతదేశంలో అనుమతే లేదు. ఆటగాళ్లు చేసిందంతా చట్టవిరుద్ధం' అని ఈడీ స్పష్టం చేసింది. జప్తు చేసిన ఆస్తుల్లో రైనాకు చెందినవి రూ.6.64 కోట్లు కాగా, ధావన్ ఆస్తులు రూ.4.5 కోట్లుగా గుర్తించారు. రైనా నాలుగేళ్ల క్రితమే రిటైర్ కాగా, ధావన్ ఇటీవలే అన్ని ఫార్మాట్‌ల నుంచి తప్పుకున్నాడు.

'మీ కాంతివంతమైన చర్మ రహస్యమేంటి'

- ప్రధానమంత్రిని అడిగిన హర్లీన్ డియోల్
- ప్రపంచకప్ విజేతలతో మోదీ సరదా సంభాషణ



ప్రధానితో హర్లీన్

న్యూఢిల్లీ: వన్డే వరల్డ్ కప్ విజేతలుగా నిలిచిన భారత మహిళా క్రికెట్ జట్టు సభ్యులతో ప్రధాని నరేంద్ర మోదీ సంభాషణ ఆసక్తికరంగా సాగింది. బుధవారం తనను కలిసిన క్రికెటర్లను అభినందించిన ఆయన వారితో పలు అంశాలు మాట్లాడారు. ఇందులో బ్యాటర్ హర్లీన్ డియోల్ అడిగిన ప్రశ్న ఒక్కసారిగా నవ్వులు పూయించింది. ప్రధాని చర్మ సంరక్షణ గురించి నేరుగా ప్రధానినే హర్లీన్ అడిగేసింది. 'మీ చర్మ సంరక్షణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారో తెలుసుకోవాలని ఉంది. మీ చర్మం చాలా మెరుస్తూ ఉంటుంది' అని హర్లీన్ చెప్పింది. దానిపై ప్రధాని కూడా స్పందించారు. 'నేను ఎప్పుడూ ఈ విషయాన్ని పట్టించుకోలేదు' అని ఆయన బదులిచ్చారు. జట్టులోని ఇతర సభ్యులతో కూడా మోదీ విభిన్న అంశాలపై మాట్లాడి వారి స్పందనను తెలుసుకున్నారు. దీప్తి శర్మ చేతిపై ఉన్న హనుమంతుడి టాటూ గురించి, ఇన్‌స్టాగామ్‌లో ఆమె జైశ్రీరామ్ అని రాసుకోవడం గురించి కూడా మోదీ అడిగారు. తమ టీమ్‌లో ఐకమత్యం చాలా బలంగా ఉందని, ఎవరు మంచి ప్రదర్శన కనబర్చినా పరస్పరం ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగామని జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. గత జూన్‌లో ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న సమయంలో తాము కింగ్ చార్లెస్‌తో ఫోటో దిగేందుకు అవకాశం రాగా, ప్రొటోకాల్ నిబంధనల కారణంగా సహాయక సిబ్బందికి అవకాశం దక్కలేదని హెడ్ కోచ్ అమోల్ మజుందార్ గుర్తు చేసుకున్నాడు. అయితే వరల్డ్ కప్ గెలిచి మన ప్రధానితో ఫోటో దిగుదామని ఆ రోజే తన సహచరులకు చెప్పి ఉత్సాహం నింపానని, అది ఈ రోజు వాస్తవంగా మారిందని అతను అన్నాడు. 2017లో తాము వరల్డ్ కప్ ఫైనల్లో ఓడిన తర్వాత కూడా ప్రధానిని కలిశామని... ఇప్పుడు విజేతగా నిలిచి మళ్లీ వచ్చి గెలవడం సంతోషంగా ఉందని టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన వ్యాఖ్యానించింది. ఫైనల్లో చివరి క్యాచ్ అందుకొని బంతిని అపురూపంగా దాచుకోవడంపై కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌ను కూడా ప్రధాని అడగగా... 'దేవుడే నేను చివరి క్యాచ్ అందుకునే అవకాశం ఇచ్చాడు. నేను దానిని ఊహించలేదు. ఎన్నో ఏళ్ల శ్రమ తర్వాత దక్కిన విజయమిది. అందుకే ఆ బంతిని నాతోనే ఉంచుకోవాలనుకున్నా' అని హర్మన్‌ప్రీత్ స్పందించింది.

అహ్మదాబాద్‌లో ఫైనల్

- వచ్చే వారం పురుషుల టి20 వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 2026లో జరిగే టి20 వరల్డ్ కప్ వేదికలను షార్ట్ లిస్ట్ చేసింది. ఇందులో ఐదు వేదికలు భారత్‌లో, మూడు శ్రీలంకలో కలిపి మొత్తం 8 నగరాల్లో టోర్నీ జరుగుతుంది. అహ్మదాబాద్‌లో ఫైనల్ మ్యాచ్ జరగడం ఖాయమైంది. అహ్మదాబాద్‌తో పాటు ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతా, చెన్నై నగరాలను భారత్‌లో వేదికలుగా నిర్ణయించారు. శ్రీలంకలో ప్రస్తుతానికి కొలంబో, కాండీలను వేదికలు నిర్ణయించింది. లంకలో మరో వేదికను ఇంకా ఖాయం చేయాల్సి ఉంది. ఇప్పటికే చేసుకున్న ఒప్పందం ప్రకారం పాకిస్తాన్ తమ మ్యాచ్‌లన్నీ శ్రీలంకలోనే ఆడుతుంది. ఒకవేళ పాక్ ఫైనల్ చేరితే ఆ మ్యాచ్ అహ్మదాబాద్‌లో కాకుండా శ్రీలంకలోనే జరుగుతుంది. టి20 వరల్డ్ కప్ ఫిబ్రవరి 7న మొదలై మార్చి 8న ముగుస్తుంది. టోర్నీకి మరో మూడు నెలల సమయమే ఉన్నందున మ్యాచ్‌ల వేదికలు, తేదీలకు సంబంధించి ఐసీసీ పూర్తి స్థాయి షెడ్యూల్‌ను వచ్చే వారం విడుదల చేయనుంది.

శివమ్ దూబే, వరుణ్, అక్షర్ పటేల్, తిలక్ వర్మ

భారత్‌ను గెలిపించిన బౌలర్లు

నాలుగో టి20లో 48 పరుగులతో ఆసీస్ ఓటమి

- సిరీస్‌లో టీమిండియా 2-1తో ముందంజ
- రాణించిన అక్షర్, సుందర్
- రేపు బ్రిస్బేన్‌లో ఆఖరి టి20

కరారా: ఆస్ట్రేలియా పర్యటనలో వన్డే సిరీస్‌ను కోల్పోయిన భారత జట్టు టి20 సిరీస్‌ను కోల్పోకుండా తిరిగి రావడం ఖాయమైంది. చివరి పోరులో సత్తా చాటితే సిరీస్‌ను గెలుచుకునే అవకాశం కూడా టీమిండియా ముందుంది. గురువారం ఏకపక్షంగా సాగిన నాలుగో టి20 మ్యాచ్‌లో భారత్ 48 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. తాజా ఫలితంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2–1తో ఆధిక్యంలో నిలిచింది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. శుబ్‌మన్ గిల్ (39 బంతుల్లో 46; 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలవగా... అభిషేక్ శర్మ (21 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్), శివమ్ దూబే (18 బంతుల్లో 22; 1 ఫోర్, 1 సిక్స్), అక్షర్ పటేల్ (11 బంతుల్లో 21 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్), సూర్యకుమార్ యాదవ్ (10 బంతుల్లో 20; 2 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించారు. గిల్, అభిషేక్ తొలి వికెట్‌కు 40 బంతుల్లో 56 పరుగులు జోడించి సరైన ఆరంభం అందించగా, తర్వాతి బ్యాటర్లు తలా ఓ చేయి వేశారు. ఆసీస్ బౌలర్లలో ఎలిస్, జంపా చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఆస్ట్రేలియా 18.2 ఓవర్లలో 119 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (24 బంతుల్లో 30; 4 ఫోర్లు), మాథ్యూ షార్ట్ (19 బంతుల్లో 25; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా ఇతర బ్యాటర్లు ప్రభావం చూపలేకపోయారు. ఒకదశలో 91/3తో మెరుగైన స్థితిలో కనిపించిన ఆసీస్ తర్వాతి 28 పరుగులకే మిగిలిన 7 వికెట్లు చేజార్చుకొని కుదేలైంది. వాషింగ్టన్ సుందర్ 8 బంతులు వేసి 3 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... అక్షర్ పటేల్, శివమ్ దూబే చెరో 2 వికెట్లు తీశారు. ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన అక్షర్ పటేల్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు. ఇరు జట్ల మధ్య చివరిదైన ఐదో టి20 శనివారం బ్రిస్బేన్‌లో జరుగుతుంది.

సుందర్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) డేవిడ్ (బి) జంపా 28; గిల్ (బి) ఎలిస్ 46; దూబే (బి) ఎలిస్ 22; సూర్యకుమార్ (సి) డేవిడ్ (బి) బార్త్‌లెట్ 20; తిలక్ వర్మ (సి) ఇన్‌గ్లిస్ (బి) జంపా 5; జితేశ్ (ఎల్బీ) (బి) జంపా 3; సుందర్ (సి) (సబ్) కునెమన్ (బి) ఎలిస్ 12; అక్షర్ పటేల్ (నాటౌట్) 21; అర్ష్‌దీప్ (సి) ఫిలిప్ (బి) స్టొయినిస్ 0; వరుణ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 167. వికెట్ల పతనం:** 1–56, 2–88, 3–121, 4–125, 5–131, 6–136, 7–152, 8–164. **బౌలింగ్:** ద్వార్‌షుయిస్ 4–0–31–0, బార్త్‌లెట్ 4–0–26–1, ఎలిస్ 4–0–21–3, స్టొయినిస్ 4–0–41–1, జంపా 4–0–45–3. **ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** మార్ష్ (సి) అర్ష్‌దీప్ (బి) దూబే 30; షార్ట్ (ఎల్బీ) (బి) అక్షర్ 25; ఇన్‌గ్లిస్ (బి) అక్షర్ 12; డేవిడ్ (సి) సూర్యకుమార్ (బి) దూబే 14; ఫిలిప్ (సి) వరుణ్ (బి) అర్ష్‌దీప్ 10; స్టొయినిస్ (ఎల్బీ) (బి) సుందర్ 17; మ్యాక్స్‌వెల్ (బి) వరుణ్ 2; ద్వార్‌షుయిస్ (బి) బుమ్రా 5; బార్త్‌లెట్ (సి అండ్ బి) సుందర్ 0; ఎలిస్ (నాటౌట్) 2; జంపా (సి) గిల్ (బి) సుందర్ 0; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (18.2 ఓవర్లలో ఆలౌట్) 119. వికెట్ల పతనం:** 1–37, 2–67, 3–70, 4–91, 5–98, 6–103, 7–116, 8–116, 9–118, 10–119. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3–0–22–1, బుమ్రా 4–0–27–1, వరుణ్ 4–0–26–1, అక్షర్ 4–0–20–2, దూబే 2–0–20–2, సుందర్ 1.2–0–3–3.

'మన అమ్మాయిలు అందరికీ స్ఫూర్తి'

- భారత మహిళా క్రికెటర్లపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు

న్యూఢిల్లీ: దేశంలోని వేర్వేరు ప్రాంతాలు, భిన్న నేపథ్యాల నుంచి వచ్చిన అమ్మాయిలంతా ఒకే లక్ష్యంతో పని చేసి దేశానికి ప్రపంచ కప్‌ను అందించారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. మహిళల వన్డే వరల్డ్ కప్ నెగ్గిన టీమిండియా సభ్యులు గురువారం రాష్ట్రపతి భవన్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమ్మాయిల ఘనతలను రాష్ట్రపతి కొనియాడారు. వ్యక్తిగతంగా ఎదురైన ఎన్నో సవాళ్లను అధిగమించి వారు సాధించిన విజయం అపూర్వమని ఆమె అన్నారు. 'మన మహిళల క్రికెట్ జట్టు అసలైన భారత్‌కు ప్రతీక. భిన్న ప్రాంతాలు, విభిన్న నేపథ్యాలు, వేర్వేరు పరిస్థితుల నుంచి వచ్చినవారు ఒక జట్టుగా ఆడి విజేతగా నిలిచారు. ఎన్నో త్యాగాలు చేసి మరీ వీరంతా ట్రోఫీని సాధించారు. న్యూజిలాండ్‌పై గెలుపు తర్వాత మనవాళ్లు సాధించగలరనే నమ్మకం కలిగింది. ఇదే తరహాలో మున్ముందూ మన క్రికెట్‌ను వీరంతా మరింత ముందుకు తీసుకెళతారనే నమ్మకం ఉంది. ముఖ్యంగా కొత్త తరం అమ్మాయిలు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు' అని ముర్ము సందేశానిచ్చారు. ఈ సందర్భంగా జట్టు సభ్యుల సంతకాలతో కూడిన జెర్సీని రాష్ట్రపతికి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ బహూకరించింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ప్రేమ పేరుతో విద్యార్థినిపై అధ్యాపకుడి వేధింపులు

- జనసేనలో చురుగ్గా వ్యవహరిస్తున్న గెస్ట్ లెక్చరర్
- నర్సీపట్నంలో ఘటన

జనసేన ఫ్లెక్సీలో నారాయణరావు (వృత్తంలో)

నర్సీపట్నం : అనకాపల్లి జిల్లా నర్సీపట్నం అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓ విద్యార్థినిపై గెస్ట్ లెక్చరర్ వేధింపుల ఉదంతం వెలుగుచూసింది. ఈ కళాశాలలో రెండేళ్లుగా మండల కేంద్రమైన గొలుగొండకు చెందిన కోనా నారాయణ రావు గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తూ జనసేన పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తున్నాడు. పార్టీ పదవి కోసం ఈయన పేరును ఇటీవల స్థానిక నాయకత్వం సిఫారసు కూడా చేసినట్లు తెలిసింది. అయితే, ఇటీవలే డిగ్రీ ఫస్టియర్‌లో చేరిన ఓ విద్యార్థినిని నారాయణ రావు ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతున్నాడు. నిజానికి.. వివాహితుడైన నారాయణరావుకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. తాను గతంలో ప్రేమించిన అమ్మాయి చనిపోయిందని, ఆమె అచ్చు నీలాగే ఉంటుందని అతను ఆ విద్యార్థినికి చెప్పుకొచ్చాడు. నువ్వు అంగీకరిస్తే నిన్ను చదివించి అన్ని విధాలా చూసుకుంటానంటూ లోబరుచుకునే ప్రయత్నం చేశాడు. దీంతో ఆ విద్యార్థిని ఈ విషయాన్ని సహచర విద్యార్థులకు చెప్పింది. ఈ విషయం విద్యార్థి సంఘాల నాయకుల వరకు వెళ్లడంతో గురువారం విద్యార్థులు ఆందోళనకు దిగి కళాశాల ముందు బైఠాయించారు. ఆ అధ్యాపకుడిని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. అంతవరకు తరగతులకు హాజరుకాబోమని భీష్మించారు. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా చూస్తామని ప్రిన్సిపాల్ ఎస్.రాజు, ఇతర అధ్యాపకులు విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తప్పును సరిదిద్దేందుకు అవకాశం ఇవ్వాలని విద్యార్థినులను కోరారు. అయినప్పటికీ విద్యార్థులు ఆందోళన కొనసాగించారు. దీంతో చేసేది లేక ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది నారాయణ రావుతో రాజీనామా చేయించారు. నారాయణరావు గతంలో యలమంచిలి, అరకులలో కూడా పనిచేశాడు. అక్కడ కూడా ఇలాంటి ఆరోపణలే ఎదుర్కొన్నట్లు తెలిసింది.

ప్రిన్సిపాల్ వేధింపుల వల్లే... భవనంపై నుంచి దూకేశా

పొందూరు కేజీబీవీలో ఇటీవల ఆత్మహత్యకు ప్రయత్నించిన ఇంటర్ విద్యార్థిని వెల్లడి

మీరు ఎస్సీ వాళ్లు అసహ్యంగా ఉంటారు.. మీ పక్కన నిల్చోవాలంటే చాలా అసహ్యం

- మీ అమ్మ బ్యాండ్ మేళానికి వెళ్తుంది కదా? నీవు కూడా వెళ్తావా?
- మీరు ఎందుకింత మురికిగా ఉన్నారు?
- మీ అమ్మ తప్పుడు మనిషి కదా?
- ఇలా కులం పేరిట అసభ్య మాటలతో తీవ్రంగా టార్చర్ చేశారు
- తన తల్లి గురించి కూడా తప్పుడు మాటలు మాట్లాడారని బాలిక ఆవేదన

రిమ్స్ ఆర్థోపెడిక్ వార్డులో చికిత్స పొందుతోన్న దళిత విద్యార్థిని

శ్రీకాకుళం క్రైమ్: 'నేను బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడటానికి, రెండు కాళ్లు విరిగి నా చదువు అర్ధంతరంగా ఆగిపోవడానికి ప్రిన్సిపాల్ సీపాన లలిత కారణం' అని శ్రీకాకుళం జిల్లా పొందూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో రెండు నెలల కిందట ఆత్మహత్యకు ప్రయత్నించిన దళిత విద్యార్థిని తెలిపింది. కులం పేరుతో తనను, తన తల్లిని ప్రిన్సిపాల్ తీవ్రంగా దూషించడం వల్లే చనిపోవాలని ప్రయత్నించానని ఆమె వెల్లడించింది. ప్రస్తుతం శ్రీకాకుళం రిమ్స్‌లోని ఆర్థోపెడిక్ వార్డులో చికిత్స పొందుతున్న ఆ విద్యార్థిని గురువారం మీడియాతో మాట్లాడుతూ తన ఆవేదనను తెలియజేసింది. 'మీరు ఎస్సీ వాళ్లు అసహ్యంగా ఉంటారు. మీ ఎస్సీ కాలనీలో నుంచి రావాలంటే చాలా చిరాకుగా ఉంటుంది. ఇప్పుడు మీరు మా హాస్టల్‌లో జాయిన్ అయ్యారు. మీ పక్కన నిల్చోవాలంటే చాలా అసహ్యం. మీ అమ్మ బ్యాండ్ మేళానికి వెళ్తుంది కదా? నీవు కూడా వెళ్తావా? మీరు ఎందుకింత మురికిగా ఉన్నారు. మీ అమ్మ తప్పుడు మనిషి కదా? నువ్వు అబ్బాయిలా బిహేవ్ చేస్తున్నావు. పీజీటీ మేడమ్స్ ఏమైనా నీకు తప్పుడు పనులు నేర్పిస్తున్నారా?' అని ఎస్‌వో(ప్రిన్సిపాల్) మేడమ్ తరచూ వేధించేవారు అని విద్యార్థిని ఆవేదన వ్యక్తంచేసింది. అంతేకాకుండా తనపై తన తల్లిపై పలు తప్పుడు వదంతులు వ్యాప్తిచేశారని తెలిపింది. ఏఎన్ఎం, అటెండర్, అకౌంటెంట్ సర్ కూడా వేధించారు. ఇలా తరచూ అసభ్య మాటలతో వేధించడం వల్లే అందరూ పడుకున్నాక బిల్డింగ్‌పై నుంచి దూకేశానని తెలిపింది. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో ఉన్న తన వద్దకు ఏపీసీ సర్, ప్రిన్సిపాల్ మేడమ్ వచ్చి బెదిరించారని, అందువల్లే అప్పుడు కాలుజారి పడిపోయినట్లు పోలీసులకు తప్పుగా చెప్పానని వివరించింది. రెండు నెలలుగా రిమ్స్‌లో చికిత్స పొందుతున్నానని, కుడి కాలికి ఆరు ఆపరేషన్లు అయ్యాయని, ఎడమ కాలికి పిండికట్టు కట్టారని, పట్టించుకునే నాథుడే లేరని ఆ విద్యార్థిని వాపోయింది.

న్యాయం చేస్తామని తప్పించుకున్నారు: విద్యార్థిని తల్లి

తన భర్త చనిపోయాక కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నానని బాలిక తల్లి లక్ష్మి తెలిపారు. తన కుమార్తెను ఆరో తరగతి నుంచి కేజీబీవీలోనే చదివించానని చెప్పారు. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో ఉన్న తన కుమార్తె వద్దకు తాను లేని సమయంలో ప్రిన్సిపాల్ లలిత, ఏపీసీ వచ్చి తప్పుగా స్టేట్‌మెంట్ ఇప్పించారని పేర్కొన్నారు. ఆ రోజు వారిని ప్రశ్నిస్తే న్యాయం చేస్తామని చెప్పి తప్పించుకున్నారని తెలిపారు. ఇప్పటి వరకు వారి నుంచి గానీ, ప్రభుత్వం నుంచి గానీ ఎలాంటి సాయం అందలేదన్నారు. తన కుమార్తెకు జరిగిన అన్యాయంపై గత నెల 25న శక్తి యాప్‌లో, పది రోజుల క్రితం పొందూరు పోలీస్‌స్టేషన్‌లో, గత నెల 15న నేషనల్ చైల్డ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు.

ప్రాథమిక మెరిట్ జాబితా విడుదల

సాక్షి, అమరావతి: 2025–26 విద్యా సంవత్సరానికి మెడికల్ పీజీ కోర్సుల్లో కన్వీనర్ కోటా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రాథమిక మెరిట్ జాబితాను ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసింది. ఇన్–సర్వీస్ కోటాలో 172, నాన్–సర్వీస్ కోటాలో 4,097 మంది దరఖాస్తులను ఆమోదించినట్టు ప్రకటించింది. అభ్యంతరాలను ఈ నెల 10వ తేదీలోగా తెలపాలని కోరింది. మరిన్ని వివరాలకు 90007 80707, 80082 50842 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఏపీఎస్పీలో ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నిర్ణయం

సాక్షి, అమరావతి: ఏపీఎస్పీ విభాగంలో రెండు దశల్లో 19 సబ్ ఇన్‌స్పెక్టర్, 245 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. మొదటి దశ కింద 2026–27లో 10 సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు, 125 కానిస్టేబుల్ పోస్టులు, రెండో దశ కింద 2027–28లో 9 సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు, 120 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయాలని పేర్కొంది. ఈమేరకు రాష్ట్ర పోలీసు నియామక మండలికి అనుమతినిస్తూ ఆర్థిక శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

లోకేశ్ టూర్‌లో ప్రమాదం

- మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలికేందుకు 11 మంది మహిళలు ఒకే ఆటోలో తరలింపు
- తిరిగి వస్తుండగా కారు ఢీకొని రోడ్డు ప్రమాదం
- డ్రైవర్‌తోపాటు 11 మంది మహిళలకు గాయాలు

ఆటోను ఢీకొట్టిన కారు

ఉలవపాడు: మంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం పలికేందుకు వెళితే కూలి డబ్బులు ఇస్తారనే ఆశతో వెళ్లిన 11 మంది పేద మహిళలు... టీడీపీ నేతల కక్కుర్తి కారణంగా రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డారు. లోకేశ్ గురువారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పర్యటనకు వస్తున్నారని, స్వాగతం పలకడానికి గుడ్లూరు మండలం మోచెర్ల వస్తే ఒక్కొక్కరికి రూ.300 కూలి ఇస్తామని ఉలవపాడు మండలంలోని కరేడు పంచాయతీ టీడీపీ నాయకులు అలగాయపాలెం ఎస్సీ కాలనీ మహిళలకు చెప్పారు. కానీ, సరిపడా ఆటోలు ఏర్పాటు చేయకపోవడంతో అదే కాలనీకి చెందిన చెరుకూరి హరి ఆటోలో 11 మంది మహిళలు ఇరుక్కుని మోచెర్ల వద్దకు వెళ్లారు. తిరిగి అలగాయపాలెం ఎస్సీ కాలనీకి వస్తూ ఉలవపాడు సమీపంలోని దక్షిణ బైపాస్ వద్ద ఉన్న పెట్రోల్ బంకులో ఆటోకు డీజిల్ కొట్టించుకుని హైవే ఎక్కే సమయంలో నెల్లూరు వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌తోపాటు దానిలో ఉన్న మహిళలు అందరూ గాయపడ్డారు. రావినూతల యలమందమ్మ, రావినూతల ప్రభావతి, రావినూతల లక్ష్మి, చెరుకూరి మరియమ్మ, చెరుకూరి లక్ష్మి, చెరుకూరి సునంద, చెరుకూరి అనూష, శిరీషతోపాటు డ్రైవర్ హరిని హైవే అంబులెన్స్‌లో ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. రావినూతల నాగమ్మ, రావినూతల ప్రసన్నబేబీ, రావినూతల మరియమ్మకు తీవ్ర గాయాలు కావడంతో ఒంగోలు జీజీహెచ్‌కి తీసుకెళ్లారు.

ప్రజాధనంతో బాబు, లోకేశ్ షికార్లు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరి వెంకటరెడ్డి

సాక్షి, అమరావతి: 'మోంథా తుపానుతో తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలు, రైతులను ఆదుకోవడంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. చంద్రబాబు విదేశాలకు, ఆయన కొడుకు మంత్రి లోకేశ్ క్రికెట్ మ్యాచ్‌లకు ప్రత్యేక విమానాల్లో వెళ్లి షికార్లు చేశారు. దీనిపై విమర్శలు రావడంతో డైవర్ట్ చేయడానికి ఎల్లో మీడియా ద్వారా అబద్ధపు కథనాలను వండి వార్చుతున్నారు' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. మోంథా తుపానుతో 8 మంది చనిపోయారని, 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లి రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారని, వారికి ప్రభుత్వం అండగా నిలవలేదన్నారు. తండ్రీ కొడుకుల టూర్లపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో గ్రీవెన్స్ డ్రామా మొదలుపెట్టారని.. లోకేశ్ 4 గంటల్లోనే 4 వేల అర్జీలను పరిశీలించారంటూ జాకీ లెత్తి ప్రచారం చేస్తున్నారని చెప్పారు. 'అసలు అన్ని అర్జీలు పరిశీలించడం సాధ్యమా? ఇద్దరూ అతిపెద్ద ఈవెంట్ మేనేజర్లుగా మారి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేస్తున్నారు. పాలనను గాలికొదిలేసి పబ్లిసిటీ స్టంట్స్ చేస్తున్నారు' అని మండిపడ్డారు. ప్రజాధనంతో చంద్రబాబు 75 సార్లు, లోకేశ్ 80 సార్లు హైదరాబాద్‌కు స్పెషల్ ఫ్లైట్లలో తిరిగారని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 120 సార్లకు పైగానే వెళ్లారని అన్నారు.

కేజీఎఫ్ చాచా కన్నుమూత

హరీశ్ రాయ్ (ఫైల్)

బెంగళూరు (యశవంతపుర): హిట్ మూవీ కేజీఎఫ్‌లో ఖాశీం చాచాగా పేరుగాంచిన కన్నడ నటుడు హరీశ్ రాయ్ (55) అనారోగ్యంతో కన్నుమూశారు. థైరాయిడ్ క్యాన్సర్‌కు గురై కొన్నిరోజుల నుంచి బెంగళూరు కిద్వాయి ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నారు. ఆరోగ్యం విషమించి గురువారం ఉదయం మరణించారు. హరీశ్ రాయ్ సొంతూరు ఉడుపి జిల్లా అంబలపాడి, శుక్రవారం అక్కడే అంత్యక్రియలు జరపనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. బెంగళూరు అంజనాపురలో ఆయన నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. అనారోగ్యంతో ఉండగా ఆయనకు కన్నడ నటులు శివరాజ్‌కుమార్, ధ్రువ, దర్శన్, యశ్ ఆర్థిక సాయం చేశారు. ఓం సినిమాలో విలన్‌గా నటించిన హరీశ్‌రాయ్.. జోడి హక్కి, చక్రవర్తి, కాశీ, సంజు వెడ్స్ గీత, నల్లతాయవ్వతో పాటు అనేక కన్నడ సినిమాలలో మెరిశారు.

SHOWROOM: ANDHRA PRADESH: RENAULT GUNTUR Ph: 8860086167.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

నేడు పీపీఏ సమావేశం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి, వచ్చే సీజన్‌లో పనుల కార్యాచరణ ప్రణాళిక, నిర్వాసితులకు పునరావాసం కల్పన, అడ్వాన్సు నిధుల మళ్లింపు, బ్యాక్ వాటర్ ప్రభావంపై తెలంగాణ లేవనెత్తుతున్న అనుమానాల నివృత్తి తదితర 15 అంశాలతో కూడిన అజెండాతో శుక్రవారం 17వ సమావేశాన్ని పీపీఏ(పోలవరం ప్రాజెక్టు అథారిటీ) నిర్వహిస్తోంది. హైదరాబాద్‌లో **పీపీఏ కార్యాలయం**లో పీపీఏ సీఈవో, సీడబ్ల్యూసీ **చైర్మన్** అతుల్ జైన్ అధ్యక్షతన జరిగే ఈ **సమావేశంలో** తెలుగు రాష్ట్రాల జలవనరుల శాఖల **ఉన్నతా**ధికారులు పాల్గొంటారు.

సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్‌కు 52 మంది ఏపీ విద్యార్థులు

గజియాబాద్‌లో రాకెట్ సైన్స్‌పై అవగాహన

సాక్షి, న్యూఢిల్లీ: 'సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్ టు న్యూఢిల్లీ' కార్యక్రమానికి ఎంపికైన రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 52 మంది విద్యార్థులు దేశ రాజధాని ఢిల్లీకి చేరుకున్నారు. మూడ్రోజుల ఈ పర్యటనలో తొలిరోజు గురువారం గజియాబాద్‌లోని కైట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన సదస్సులో విద్యార్థులకు రాకెట్ సైన్స్‌పై సమగ్ర అవగాహన కల్పించారు. రాకెట్లు పనిచేసే విధానం, వాటిలో ఉపయోగించే ఇంధనం, భూమ్యాకర్షణ శక్తిని దాటి ఆకాశంలో ప్రయాణించడం, రాకెట్ ప్రయోగం వంటి తదితర అంశాలను విద్యార్థులకు ఇస్రో శాస్త్రవేత్తలు వివరించారు. ఈ సందర్భంగా.. పాఠశాల స్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు తమ భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని విద్యార్థులు సంతోషం వ్యక్తంచేశారు. సైన్స్ టూర్‌లో భాగంగా ఢిల్లీకి వచ్చిన విద్యార్థులతో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు భేటీ అయ్యారు. ఢిల్లీలో చూసిన విషయాలను ఇతర విద్యార్థులతో పంచుకోవాలని కేంద్రమంత్రి విద్యార్థులకు సూచించారు.

వ్యూహాత్మక ప్రణాళికతో పట్టణాల అభివృద్ధి

మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్

సాక్షి, అమరావతి: సుస్థిర పట్టణీకరణ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ప్రగతి పథంలో పయనిస్తోందని, వ్యూహాత్మక ప్రణాళికతో ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే విధంగా విధానాలు అమలు చేస్తున్నట్లు మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ అన్నారు. రాష్ట్రంలోని పట్టణీకరణ, ప్రణాళికలు, సమగ్ర నగరాభివృద్ధి విధానాలను ఆయన ప్రపంచ ప్రతినిధులకు వివరించారు. బార్సిలోనాలో జరుగుతున్న వరల్డ్ స్మార్ట్ సిటీ ఎక్స్‌పో కాంగ్రెస్–2025లో భారతదేశం నుంచి ప్రధాన వక్తగా పాల్గొన్న ఆయన రాష్ట్రంలోని పట్టణ పరిపాలనపై ప్రసంగించినట్టు మున్సిపల్ శాఖ కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. అమరావతి కేవలం మౌలిక సదుపాయాల నగరమే కాదని, ఇందులో మొబిలిటీ, యుటిలిటీ, పర్యావరణం వంటివి కలగలిసిన ఉత్తమ ఎకోసిస్టం అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.

కొత్త టీచర్లకు సెలవులపై స్పష్టత ఇవ్వాలి

స్కూల్ టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: డీఎస్సీ–2025 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు సెలవులపై స్పష్టత ఇవ్వాలని, లీప్ యాప్‌లో సెలవులు పొందుపరచాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వాన్ని కోరారు. వీరికి అక్టోబర్ 3 నుంచి వేతనాలు చెల్లించేలా ఎస్టీవోలకు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 10 నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మూడో కార్తీక సోమవారం, నవంబర్ 14న బాలల దినోత్సవం రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల పరీక్షలకు ఇబ్బందులు కలగకుండా పరీక్షల షెడ్యూల్ మార్చాలని కోరారు.

పాఠశాలలకు పని దినాలు మినహాయించాలి

2025–26 విద్యా సంవత్సరానికి 220 పని దినాలు సర్దుబాటయ్యే పాఠశాలలకు పరిహార పని దినాలు మినహాయించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ విద్యాశాఖను కోరారు. తుపాను కారణంగా ఇచ్చిన సెలవులకు పరిహారంగా రెండు శనివారాలు పనిచేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వులను సమీక్షించాలని గురువారం ఓ ప్రకటనలో కోరారు.

ఉల్లి రైతులు ఆందోళన చెందొద్దు

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: ఉల్లి రైతులకు ఎకరాకు రూ.20 వేలు (హెక్టార్‌కు రూ.50 వేలు) చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించిందని, ఈ మొత్తాన్ని త్వరలోనే వారి ఖాతాల్లో జమ చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఉల్లి రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ధరలు పతనమైనప్పుడు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ద్వారా క్వింటా రూ.1,200తో మార్క్‌ఫెడ్ ద్వారా రూ.18 కోట్ల విలువైన ఉల్లిని కొనుగోలు చేశామని చెప్పారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే రూ.10 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని, మిగిలిన రూ.8 కోట్లను త్వరలోనే జమ చేస్తామన్నారు.

నాణ్యత పరంగా అంతర్జాతీయంగా పేరొందిన మన్యం కాఫీ పంటకు గిట్టుబాటు ధర ప్రకటనలో జాప్యం జరుగుతోంది. ఈఏడాది తోటలన్నీ అధిక దిగుబడితో కళకళాడుతున్నాయి. చాలా చోట్ల గిరిజన రైతులు పండ్ల సేకరణ మొదలుపెట్టారు. అయితే కాఫీ పండ్లు, పాచ్‌మెంట్ గింజల కొనుగోలుకు సంబంధించి పాడేరు ఐటీడీఏ, గిరిజన సహకార సంస్థలు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాఫీ రైతుకు గిట్టుబాటు ధరేది?

కాఫీ పండ్లను సేకరిస్తున్న గిరిజన మహిళ

- కొనుగోలు ధర ప్రకటనలో జాప్యం
- ఉలుకుపలుకూ లేని జీసీసీ
- ఐటీడీఏ మౌనం
- అయోమయంలో గిరి రైతులు

గుర్రగరువులో గిరిజనులు సేకరించిన కాఫీ పండ్లు

సాక్షి, పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు డివిజన్ పరిధిలో 1.50లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. ఏటా సుమారు 17వేల మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను గిరిజన రైతులు విక్రయిస్తారు. కాఫీ గింజల కొనుగోలు ధరల ప్రకటనలో గిరిజన సహకార సంస్థ ఎటువంటి ప్రకటన చేయలేదు.

- కాఫీ గింజల సీజన్‌కు ముందే జీసీసీ అపెక్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి పాచ్‌మెంట్, చెర్రీ రకం కాఫీ గింజల కొనుగోలు ధరలను ప్రకటించాల్సి ఉంది.అయితే నవంబర్ నెల ప్రారంభమై,గిరిజన రైతులు కాఫీ పండ్ల సేకరణ చేపడుతున్న ఇంతవరకు జీసీసీ నుంచి ఎటువంటి ప్రకటన వెలువడలేదు. గతేడాది పాచ్‌మెంట్‌ను కిలో రూ.40, చెర్రీ రకం కిలో రూ.250 చొప్పున 752 టన్నులను మాత్రమే కొనుగోలు చేసింది. ఈ ఏడాది ఇప్పటివరకు ధరలు ప్రకటించకపోవడంతో కొనుగోలు విషయంలో ఆ సంస్థ వైఖరి కాఫీ రైతులకు అర్థం కావడం లేదు.
- పాడేరు ఐటీడీఏ కూడా కాఫీ పండ్ల కొనుగోలు ధరను ప్రకటించడంలో ఆలస్యం చేస్తోంది. గతేడాది కాఫీ పంటను పండ్ల దశలోనే కిలో రూ.43 ధరతో చింతపల్లి మాక్స్ సంస్థ ద్వారా ఐటీడీఏ కొనుగోలు చేసింది. సుమారు 5వేల కిలోల వరకు కాఫీ పండ్లను ఐటీడీఏ సేకరించింది.అయితే ఈ ఏడాది సీజన్ ప్రారంభమైనా కాఫీ పండ్ల ధరను ఐటీడీఏ ప్రకటించలేదు. ప్రస్తుతం సేకరించిన పండ్లను ప్రైవేట్ వ్యాపార సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అమ్ముకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఐటీడీఏ ధర ప్రకటన కోసం వారంతా ఎదురు చూస్తున్నారు.

మన్యం కాఫీ గింజలకు గిరాకీ

నాణ్యతలో నంబర్ వన్‌గా నిలుస్తున్న మన్యం కాఫీగింజలకు బెంగళూరు కాఫీ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. గత ఏడాది మన్యం నుంచి పంపిన కాఫీ పాచ్‌మెంట్ గింజలకు కిలో రూ.500ధరతో వ్యాపారం జరిగింది. ఈ ఏడాది మాత్రం ఇదే **ధరతో మన్యం**లో జీసీసీతో పాటు ప్రైవేట్ **వ్యాపారులు కొను**గోలు చేయాలని గిరిజన రైతులు **డిమాండ్ చేస్తు**న్నారు. ఏజెన్సీలో 1.50 లక్షల **ఎకరాల్లో కాఫీ** తోటలను గిరిజన రైతులు సాగు **చేస్తున్నారు. ఎక**రాకు 600కిలోల మేర పండ్లు దిగు**బడి వస్తుంది. వీ**టిని గిరిజన రైతులు అమ్మకుండా **పల్పింగ్ చేసి** పాచ్‌మెంట్ కాఫీ గింజలుగా **తయారు చేసుకుం**టే సుమారు 200 కిలోల దాటే **మార్కెట్ చేస్తారు**. గత ఏడాది కిలో రూ.400 ధరతో అమ్ముకున్న గిరిజన రైతులు ఎకరానికి రూ.80 వేల వరకు ఆదాయం పొందారు. నాణ్యమైన కాఫీ గింజల దృష్ట్యా ఈ సీజన్‌లో కిలో పాచ్‌మెంట్ రూ.500, పండ్లు కిలో రూ.100 ధరకు కొనుగోలు చేయాలని కాఫీ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కిలో రూ.500కు కొనాలి

గత ఏడాది బెంగళూరు మార్కెట్‌లో అధిక ధరలతో జీసీసీతో పాటు అన్ని వ్యాపార సంస్థలు కాఫీ గింజలను అమ్మి మంచి లాభాలు పొందాయి. గిరిజన రైతుల వద్ద మాత్రం ప్రారంభంలో తక్కువ ధరకు కొనుగోలు చేసి మోసం చేశాయి. ఈ ఏడాది కిలో రూ.500తో పాచ్‌మెంట్‌ను జీసీసీ కొనుగోలు చేయాలి.

– పాలికి లక్కు, కాఫీ రైతుల సంక్షేమ సంఘ ప్రతినిధి, పాడేరు

కాఫీ పండ్లు కిలో రూ.100కు అమ్ముతాం

కాఫీ పండ్లను కూడా ఐటీడీఏ, పలు రైతు ఉత్పత్తి సంఘాలు తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం.గత సీజన్‌లో ఐటీడీఏ కిలో రూ.43తో పండ్లను కొనుగోలు చేయడంతో తామంతా మోసపోయాం. ఈసీజన్‌లో కిలో పండ్లను రూ.100 ధరతో అమ్మాలని నిర్ణయించాం.

– మర్రి జ్యోతి, కాఫీ మహిళా రైతు, గుర్రగరువు, పాడేరు మండలం

త్వరలో కొనుగోలు ధర ప్రకటన

ఈసీజన్‌లో కాఫీ పంటకు గిట్టుబాటు ధర కల్పించి గిరిజన రైతులకు న్యాయం చేస్తాం. జీసీసీ అధికారులతో మాట్లాడడం జరిగింది.అపెక్స్ కమిటీ సమావేశం ఈవారంలో నిర్వహించి జీసీసీ ద్వారా పాచ్‌మెంట్, చెర్రీ రకం కాఫీ గింజల కొనుగోలు ధరలు ప్రకటిస్తాం.ఐటీడీఏ పండ్ల కొనుగోలు ధరపై సమావేశం నిర్వహిస్తాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్, పాడేరు

ఏపీ ట్రాన్స్‌కో కార్యకలాపాలపై ఫొటోగ్రఫీ పోటీలు

జేఎండీ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ వెల్లడి

సాక్షి, అమరావతి: విద్యుత్ ఉద్యోగులకు, ప్రజలకు వారి ప్రతిభను, సృజనాత్మకతను కనబరిచేందుకు అవకాశమిస్తూ ఏపీట్రాన్స్‌కో కార్యకలాపాలపై ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు చేసినట్లు ఏపీ జేఎండీ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు ఫొటోలు తీసి ఈ మెయిల్ photocontest@aptransco.gov.in కు పంపించాలన్నారు. ఫొటోలను భవిష్యత్తులో సంస్థ ఉపయోగించుకునేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని డిక్లరేషన్ జత చేయాలని ఆయన తెలిపారు. విద్యుత్ మౌలిక సదుపాయాలు, కఠిన పరిస్థితుల్లో పనిచేస్తున్న సిబ్బంది, స్థిరమైన అభివృద్ధి (సస్టెయినబిలిటీ), 400 కేవీ ఉపకేంద్రాలు, 220 కేవీ ఉపకేంద్రాలు, 132 కేవీ ఉపకేంద్రాలు, విద్యుత్ ప్రసరణ, హాట్ లైన్లు వంటి అంశాలపై స్వయంగా తీసిన అసలు(ఒరిజినల్) ఫొటోలను ఈ నెల 15వ తేదీలోగా పోటీకి సమర్పించవచ్చని, డ్రోన్ షాట్స్ కూడా స్వీకరిస్తామని ఆయన వివరించారు. మొదటి బహుమతి రూ. 10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు నగదు బహుమతులు, పోటీలో పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలు ఇస్తామని జేఎండీ చెప్పారు. డిక్లరేషన్ పత్రం నమూనాతో పాటు ఇతర సమాచారాన్ని వెబ్‌సైట్ www.aptransco.gov.in నుండి పొందవచ్చని జేఎండీ సూచించారు.

కౌలు రైతులందరికీ పరిహారం అందించాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: ఈ–క్రాప్ నమోదుతో నిమిత్తం లేకుండా గ్రామసభల ద్వారా వాస్తవ సాగుదారులను గుర్తించి తుపాను ప్రభావంతో నష్టపోయిన కౌలు రైతులందరికీ పరిహారం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్నవారికే తుపాను సహాయం అందించాలనే ప్రభుత్వ నిర్ణయం వల్ల అత్యధిక మంది కౌలుదారులు నష్టపోతున్నార మండిపడ్డారు.

చిత్తూరు జిల్లాలో క్వారీలను కొల్లగొడుతున్నారు. గుట్టలతో పాటు అటవీ భూముల్లో సైతం దుమ్ముదులిపేస్తున్నారు. ఖనిజ సంపదను అక్రమంగా కొల్లగొట్టేస్తున్నారు. లీజు పేరిట రాయల్టీకి కుచ్చుటోపీ పెడుతున్నారు. దొంగ బిల్లుల దందాకు రైట్ రైట్ అంటున్నారు. ఈ దందా జిల్లాలో జోరుగా సాగుతోంది. అక్రమార్కులకు కొండలు, గుట్టలు, అటవీ భూములు బద్ధలవున్నారు. ఈ దందాలో పలువురు కూటమి నేతలు పైచేయిగా నిలుస్తున్నారు. అక్రమాలు బహిరంగంగా జరుగుతున్నా మైనింగ్, అటవీశాఖ, రెవెన్యూ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై జిల్లా ప్రజానీకం భగ్గుమంటోంది.

యాదమరిలో అక్రమంగా నిర్వహణలో ఉన్న క్వారీలు



ఖనిజం కొల్లగొడుతున్నారు

- చిత్తూరు జిల్లావ్యాప్తంగా ప్రకృతిలోని ఖనిజ సంపదను దోచేస్తున్న కూటమి నేతలు
- యాదమరిలో క్వారీల అక్రమాలకు అంతే లేదు
- కుప్పం, చిత్తూరు, గంగాధరనెల్లూరులో అదే తంతు
- గుట్టలతో పాటు అడవిలో యథేచ్ఛగా గ్రానైట్ తవ్వకాలు
- జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్ల పేలుళ్లతో జనావాసాల్లోకి చేరుతున్న వన్యప్రాణులు
- వన్యప్రాణుల సంరక్షణ చట్టానికి తూట్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు జిల్లావ్యాప్తంగా ఖనిజ సంపద పక్క రాష్ట్రాలకు తరలిపోతోంది. అధికారం అండతో ప్రతి నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు చేస్తున్న అక్రమాలకు కొండలు కనుమరుగవుతున్నాయి. జిల్లాలో 400 పైగా క్వారీలు ఉన్నాయి. వీటిలో 200 క్వారీలకు పైగా తవ్వకాలు జరుగున్నాయి. మిగిలినవి నాణ్యత, నెర్రెలు ఉండడంతో బ్రేకులు పడ్డాయి. జిల్లాలో అనధికారికంగా వందకు పైగా క్వారీలు నడుస్తున్నట్లు విశ్వసనీయమైన సమాచారం. కుప్పం, పలమనేరు, బంగారుపాళ్యం, యాదమరి, జీడీనెల్లూరు, ఎస్‌ఆర్ పురం, పాలసముద్రం, వెదురుకుప్పం, చిత్తూరు తదితర మండలాల్లో అక్రమ క్వారీలు నిర్వహణలో ఉన్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి.

జీడీనెల్లూరులో వారి దందానే సెప'రేటు'..

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఓ ప్రజాప్రతినిధి అనుచరులు ప్రకృతి సంపదను కొల్లగొట్టడమే పనిగా పెట్టుకున్నారు. క్వారీల నిర్వహణకు అనుమతి కావాలన్నా, అక్రమంగా నిర్వహిస్తున్న వాటిపై అధికారుల దాడులు చేయకుండా వీరే పైరవీలు చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో పెనుమూరు మండలానికి చెందిన ఓ కూటమి నాయకుడు ఒక్కో బ్లేడ్‌కు రూ.40 వేలు ప్రతీ నెలా మామూలు వసూలు చేస్తున్నాడని, దొంగబిల్లులతో క్వారీల నుంచి వసూళ్లకు పాల్పడున్నట్లు సొంత పార్టీ నేతలే బహిరంగంగా చెబుతున్నారు.

మైనింగ్ అధికారి అండదండ..

చిత్తూరు ప్రాంతంలో జరుగుతున్న కొన్ని అక్రమ క్వారీల నిర్వాహకులపై మైనింగ్ శాఖలోని ఓ అధికారి అండదండలు ఉండడంతో అక్రమ క్వారీలు మూడు పువ్వులు.. ఆరుకాయలుగా విరాజిల్లుతోంది. అనుమతి లేకున్నా.. ఉన్నట్టు అక్రమాలకు రక్షణ కవచంలా నిలుస్తున్నారు. దొంగ బిల్లుల వ్యవహారం లోలోపల జరిగిపోతోందని కూటమిలోని ఓ వర్గం కోడైకూస్తోంది.

జరిమానాతో సరిపెట్టి..

బంగారుపాళ్యంలో అక్రమ క్వారీల్లో దందా జోరుగా సాగుతోంది. ఇటీవల పట్టుబడిన ఓ క్వారీనే ఇందుకు నిదర్శనం. అయితే ఆ క్వారీలో అక్రమాలకు అధికారులు జరిమానాతో సరిపెట్టారు. చట్టపరమైన చర్యలేవీ తీసుకోలేదు. స్థానికంగా ఉన్న ఓ నేత అండదండలతో ఈ దందా నడవడంతో అధికారులు కళ్లు మూసుకుని కూర్చున్నారనే విమర్శలు వస్తున్నాయి.

అక్రమాలు బయటపెడితే బెదిరింపులు

యాదమరిలో అక్రమంగా నిర్వహణలో ఉన్న క్వారీలు

అక్రమ క్వారీల విషయాన్ని బయట పెట్టే వ్యక్తులను కూటమి నేతలు టార్గెట్ చేసి బెదిరింపులకు దిగుతున్నారు. ఆఖరికి కూటమి నేతలు ఉన్నా.. వారిని హింసిస్తున్నారు. వార్తా పత్రికల్లో వార్తలు వస్తే.. మనుషులతో కొట్టిస్తామని వార్నింగ్ ఇస్తున్నారు. ఫ్యామిలీని రోడ్డుపైకి లాగేస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మండలంలోని ఓ నేత గుప్పెట్లో జరుగుతున్న అక్రమ క్వారీ విషయాన్ని బట్టబయలు చేస్తే.. ఆ నేత బెదిరింపులు హద్దులు దాటాయి. అధికారులు సైతం ఆ నేతకు కొమ్ము కాస్తున్నారు. దీంతో నెల నెలా అక్రమ క్వారీల నుంచి రూ.20 లక్షలు వసూళ్లు చేస్తూ..అన్ని రకాలుగా కాపాడతానని భరోసా ఇస్తున్నారని, అయితే అక్రమాలు బహిర్గతం కావడంతో ఆ వసూళ్లకు అడ్డుకట్ట పడుతుందని సదరు నేత లోలోపల కుమిలిపోతున్నారని తెలిసింది. ఆ నేత అక్రమాల చిట్టాను వ్యతిరేకవర్గం పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

వన్యప్రాణులే భయపడి పరుగులు..

యాదమరి రక్షిత అటవీ ప్రాంతంలో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా గ్రానైట్ తవ్వకాలు చేపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధం అని తెలిసినా సంబంధిత అటవీ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ ఆ అక్రమార్కులకు 'భజన' చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అత్యంత విలువైన ప్రకృతి సంపదను కొల్లగొడుతూ..అటు పర్యావరణానికి, ఇటు వన్యప్రాణులకు హానీ కలిగిస్తున్నారు. యాదమరి మండలం భూమిరెడ్డిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో విలువైన ఖనిజ సంపద కలిగి ఉంది. దీనిపై కన్నేసిన ఓ కూటమి నేత అధికార బలాన్ని ఉపయోగించి అడవిని చెరబడుతున్నాడు. రూ.కోట్లు కురిపిస్తున్న ఈ కల్పవనాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవడానికి సదరు నేత ఊసరవెల్లిలా రాజకీయ రంగులు మార్చుతుంటాడనే విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కొన్ని నెలలు పాటు స్తబ్దుగా ఉన్న ఆ నాయకుడు.. ఇప్పుడు తన క్వారీ దందాను ప్రారంభించాడు. భారీ యంత్రాలతో, నిషేధిత జిలెటిన్ స్టిక్స్‌తో బ్లాస్టింగ్‌లు జరిపి నింగిని తాకేలా ఉండే భారీ కొండలను సైతం నేలమట్టం చేస్తున్నారు. దీంతో అడవి జంతువులు జనావాసాల్లోకి, పొలాల్లోకి వచ్చి రైతులను నట్టేట ముంచుతున్నాయి. అడవుల్లోని క్వారీల తవ్వకాలతో అక్కడ లభ్యమయ్యే నీటి వనరులు ఆవిరవుతున్నాయి. తద్వారా వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల కాలంలో మండలంలో అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాల్లోకి ఏనుగుల గుంపు వెళ్లి పంట పొలాలపై నానా బీభత్సం సృష్టించిన ఘటన తెలిసిందే. అడవిలో జరుగుతున్న ఈ నయా దందాకు సంబంధించి అటవీ ఉన్నతాధికారులకు, మైనింగ్ అధికారులకు తెలిసినా నెలావారి మామూళ్లు అందుకుంటూ మిన్నకుండిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం అవి సంచరించే చోట తవ్వకాలు చేపట్టడం, భారీ శబ్దాలతో కొండలను పేల్చడం వంటివి చట్ట విరుద్ధం. అయినా రూ.కోట్లు అక్రమార్జన కోసం చట్టాలను తుంగలో తొక్కేస్తున్నారు.

సీఎం నియోజకవర్గంలో కూడా..

అయితే ఈ క్వారీల దందాలో కూటమి నేతలు సహాయ సహకారాలు మెండుగా ఉండడంతోనే కొందరు అక్రమార్కులు విచ్చలవిడిగా చెలరేగిపోతున్నారు. సీఎం సొంత నియోజకవర్గం కుప్పంలో దాదాపు 10 అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. అటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దులో ఉండడం వీరికి కలిసి వస్తోంది. రాష్ట్ర ఖజానాకు గండి కొడుతూ యథేచ్ఛగా ఖనిజ సంపదను సరిహద్దులు దాటిస్తున్నారు. ఈ వ్యవహారం అంతా ముఖ్యమంత్రికి తెలియనివ్వకుండా నియోజకవర్గంలోని కొందరు ప్రధాన నాయకులు జాగ్రత్తలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఓ అధికారిపై విచారణ..

గత కొన్ని రోజులుగా సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రంగంలోకి దిగింది. అక్రమాలను గుర్తించడంతో పాటు.. వచ్చిన కథనాల వాస్తవాలను గుర్తించే పనిలో పడింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టింది. ఇందులో తేలిన వాస్తవాలను నివేదికల రూపంలో రాష్ట్ర అధికార యంత్రాంగానికి సమర్పించినట్లు తెలిసింది. ఇక కార్యాలయంలో అధికారిని నేరుగా పిలిచి విచారించారు. దీంతో ఆ అధికారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో విచారణ జరుగుతోందని, ఆపై వేటు పడే అవకాశాలు ఉన్నాయని ఆ శాఖలోని అధికారులే చెబుతున్నారు.

గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఏపీ

గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ అడ్వైజరీ బోర్డు సమావేశంలో సీఎస్

సాక్షి, అమరావతి : రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ అడ్వైజరీ బోర్డు కో చైర్మన్ కె.విజయానంద్ చెప్పారు. రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడితో 20 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ సామర్థ్యంతో రోజుకు సుమారు 1,500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి కృషి జరుగుతోందన్నారు. గురువారం సచివాలయంలో జరిగిన ఏపీ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ అడ్వైజరీ బోర్డు మొదటి సమావేశంలో ఆయన మాట్లాడారు. 2027 నాటికి 2 గిగావాట్ ఎలక్ట్రోలైజర్ తయారీ సామర్థ్యం ఏర్పరచడంతో పాటు 2029 నాటికి సుమారు 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి లక్ష్యంతో పని చేస్తున్నట్లు సీఎస్ వివరించారు. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ద్వారా విశాఖపట్నం సమీపంలోని పూడిమడక వద్ద హైడ్రోజన్ హబ్ రూపొందుతున్నట్లు వెల్లడించారు. నీతి ఆయోగ్ సభ్యులు, ఏపీ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ డా.వి.కె సరస్వత్ మాట్లాడుతూ.. బయోమాస్ విషయంలో ఏపీ.. దేశంలో మొదటి స్థానంలో ఉందన్నారు.

రెండేళ్లలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

సాక్షి, అమరావతి: రెండేళ్లలో రూ.2 వేల కోట్లకుపైగా ఖర్చు చేసి ఉత్తరాంధ్రలో కీలక ప్రాజెక్టులు పూర్తి చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. గురువారం సచివాలయంలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై ఆయన సమీక్ష నిర్వహించారు. వంశధార, తోటపల్లి, వంశధార–నాగావళి లింక్, జంఝావతి రిజర్వాయర్, హిరమండలం లిఫ్ట్, నాగావళి– చంపావతి, మహేంద్ర తనయ, తారకరామతీర్థసాగర్, మడ్డువలస రిజర్వాయర్ వంటి కీలకమైన ప్రాజెక్టులను పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. ఈనెలలో సీఎం చంద్రబాబు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించి ప్రాజెక్టు పనులను పరిశీలించి.. వాటిని పూర్తి చేయడంపై దిశానిర్దేశం చేస్తారని చెప్పారు.

రాష్ట్రంలో సమగ్ర ఓటర్ల జాబితా సవరణకు సిద్ధంకండి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్

సాక్షి, అమరావతి: వచ్చే ఆర్థిక సంవత్సరం రాష్ట్రంలో నిర్వహించనున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)పై అధికారులంతా పూర్తి అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. ఎస్‌ఐఆర్‌పై కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో 21 ఏళ్ల క్రితం 2002లో ఎస్‌ఐఆర్ జరిగిందని, ఇప్పుడు ఇందులో చాలామంది వలస వెళ్లిపోవడం, మరణించినవారి పేర్లు తొలగించకపోవడం, విదేశీయులను తప్పుగా చేర్చడం వంటివి ఉండటంతో మరోసారి ఎస్‌ఐఆర్ నిర్వహించాల్సి వస్తోందన్నారు. ఏ ఒక్క పోలింగ్ కేంద్రంలోనూ 1,200 మందికి మించి ఓటర్లు ఉండకుండా చూడాలన్నారు. 2025 ఓటర్ల జాబితాలోని ఓటర్లను చివరి ఎస్‌ఐఆర్ జాబితాతో మ్యాపింగ్‌ను త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్లందరూ ఎస్‌ఐఆర్ గురించి తెలుసుకోవాలని అలాగే తమ పరిధిలోని ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లందరికీ సమగ్ర శిక్షణ పూర్తి చేయాలన్నారు. బీఎల్‌వోలకు వారంలోగా ఐడీ కార్డులు మంజూరు చేయాలని ఆదేశించారు.

బిజినెస్ రీల్

ట్రావెల్ బుకింగ్ యాప్ 'పేటీఎం చెకిన్'

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ దిగ్గజం పేటీఎం తాజాగా ఏఐ ఆధారిత ట్రావెల్ బుకింగ్ యాప్ 'పేటీఎం చెకిన్'ని ప్రారంభించింది. విమానాలు, రైళ్లు, బస్సులు, మెట్రో సర్వీసులను దీని ద్వారా బుక్ చేసుకోవచ్చు. అలాగే, పర్యటనలను ప్లాన్ చేసుకోవడంలోను ఇది సహాయకరంగా ఉంటుంది. ట్రావెల్ బుకింగ్స్ చేసే విధానాన్ని ఈ ఏఐ ఆధారిత యాప్ సమూలంగా మార్చేస్తుందని విశ్వసిస్తున్నట్లు పేటీఎం ట్రావెల్ సీఈవో వికాస్ జలాన్ తెలిపారు. ఇది గూగుల్ ప్లేస్టోర్, ఐవోఎస్ యాప్ స్టోర్‌లో అందుబాటులో ఉంటుంది.

భారత్‌లో ఏడబ్ల్యూఎస్ మార్కెట్‌ప్లేస్ విస్తరణ

న్యూఢిల్లీ: అమెజాన్ వెబ్ సర్వీసెస్ భారత్‌లో తమ ఏడబ్ల్యూఎస్ మార్కెట్‌ప్లేస్‌ను విస్తరించినట్లు వెల్లడించింది. సిస్కో, క్రౌడ్‌స్ట్రైక్, డెలాయిట్, ఈముద్రలాంటి టెక్నాలజీ ప్రొవైడర్లు, ఇతరత్రా సంస్థలు సాఫ్ట్‌వేర్, సర్వీసులను రూపాయి మారకంలో విక్రయించేందుకు ఇది ఉపయోగపడగలదని సంస్థ తెలిపింది. అబ్జర్వ్‌ఏఐ, స్విగ్గీ, టీసీఎస్‌లాంటి భారతీయ కంపెనీలు ఇప్పటికే తమ కొనుగోళ్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఏడబ్ల్యూఎస్ మార్కెట్‌ప్లేస్‌ను వినియోగించుకుంటున్నట్లు వివరించింది.

ర్యాపిడోలో టీవీఎస్ మోటర్స్ వాటాల విక్రయం

విలువ రూ. 287.93 కోట్లు

న్యూఢిల్లీ: బైక్–ట్యాక్సీ అగ్రిగేటర్ సంస్థ ర్యాపిడోలో వాటాలను రూ. 287.93 కోట్లకు విక్రయించనున్నట్లు టీవీఎస్ మోటర్స్ వెల్లడించింది. ఇందుకు సంబంధించి యాక్సెల్ ఇండియా ఎయిట్ (మారిషస్), ఎంఐహెచ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వన్ బీవీతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఇరు సంస్థలకు ఆసక్తి ఉన్న అంశాల్లో కలిసి పని చేసేందుకు 2022లో రాపెన్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసెస్ (ర్యాపిడో)తో టీవీఎస్ మోటర్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-11-2025

విశాఖ	580–00
చిత్తూరు	613–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	595–00
విజయవాడ	585–00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	580–00
వరంగల్	582–00
రిటైల్ ధర	6.40

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ASIANPAINT	2,602.10	4.64
RELIANCE	1,494.80	1.47
ULTRACEMCO	11,942.00	1.04
M&M	3,615.10	0.95
WIPRO	240.05	0.9

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
GRASIM	2,697.00	-6.42
HINDALCO	786.55	-5.39
ADANIENT	2,311.00	-4.5
POWERGRID	270.25	-3.15
ETERNAL	305.3	-2.62

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	7,718
ఎన్‌ఎస్‌ఈ	1,14,454
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,52,167
ఎఫ్‌ఐఐ	- 3,606
డీఐఐ	+ 4,815

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	59.16 (రాత్రి 11.30కు)	$ 59.06 (క్రితం ముగింపు)
బ్రెంట్	63.16 (రాత్రి 11.30కు)	$ 63.52 (క్రితం ముగింపు)

ఇళ్ల ధరలకు రెక్కలు!

- ఏటా 5–10 శాతం మేర పెరుగుతాయి
- 2047 నాటికి రెట్టింపుకానున్న మార్కెట్
- సీఐఐ, కొలియర్స్ నివేదిక అంచనా

న్యూఢిల్లీ: బలమైన డిమాండ్ నేపథ్యంలో ఇళ్ల ధరలు వచ్చే రెండు దశాబ్దాలపాటు ఏటా 5–10 శాతం మేర పెరుగుతాయని సీఐఐ, కొలియర్స్ ఇండియా సంయక్త నివేదిక అంచనా వేసింది. ప్రస్తుతం వార్షికంగా ఇళ్ల అమ్మకాలు 3–4 లక్షల యూనిట్ల స్థాయిలో ఉండగా, 2047 నాటికి 10 లక్షల యూనిట్ల విక్రయాలకు చేరతాయని పేర్కొంది. అంటే 2047 నాటికి రెట్టింపు కానున్నట్టు అంచనా వేసింది. పరిశ్రమల మండలి సీఐఐ, రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ కొలియర్స్ ఇండియా తమ నివేదికను తాజాగా విడుదల చేశాయి. పెరుగుతున్న ఆదాయం, ఇళ్లకు సంబంధించి సానుకూల విధానాలు, పట్టణాలకు వలసలు, ప్రీమియం ఇళ్ల పట్ల ఆసక్తిని పరిగణనలోకి తీసుకుని ఈ అంచనాకు వచ్చాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తుండడం , కొనుగోలుదారులకు ప్రోత్సాహకాలను సైతం ప్రస్తావించింది. ఇప్పటికే పేరొందిన ముఖ్య నివాస మార్కెట్లకు అదనంగా, టైర్ 2, 3 పట్టణాలు, ఆధ్యాత్మిక కేంద్రాల్లో ఇళ్లకు వచ్చే దశాబ్ద కాలంపాటు డిమాండ్ స్థిరంగా పెరుగుతుందని అంచనా వేసింది.

10 ట్రిలియన్ డాలర్లు..

దేశ రియల్ ఎస్టేట్ మార్కెట్ పరిమాణం ప్రస్తుతం 0.3 ట్రిలియన్ డాలర్ల స్థాయిలో ఉండగా, 2047 నాటికి 5–10 ట్రిలియన్ డాలర్లకు విస్తరిస్తుందని సీఐఐ, కొలియర్స్ ఇండియా నివేదిక అంచనా వేసింది. ''మౌలిక వసతుల విస్తరణ రియల్ ఎస్టేట్ మార్కెట్ రూపురేఖలను మార్చేయనుంది. కొత్త మార్కెట్ల వృద్ధికి అవకాశాలు కల్పించనుంది. టైర్–2, 3 పట్టణాలనూ మార్చనుంది. బహుళ ట్రిలియన్ డాలర్ల రియల్ ఎస్టేట్ మార్కెట్ దిశగా అడుగులు వేస్తున్నాం. ప్రపంచస్థాయి నిర్మాణాలు, సమగ్ర రవాణా కేంద్రాలు, బలమైన రవాణా పరిష్కారాలు ఇవన్నీ మరింత ప్రముఖంగా మారనున్నాయి''అని ఈ నివేదికను ఆవిష్కరించిన సందర్భంగా కేంద్ర రవాణా, రహదారుల శాఖ డిప్యూటీ సెక్రటరీ హర్లీన్ కౌర్ పేర్కొన్నారు. మౌలిక వసతులు, రియల్ ఎస్టేట్ రంగం ఒకదానికి మరొకటి ప్రేరణగా నిలుస్తాయన్నారు. ''ఎక్స్‌ప్రెస్ రహదారులు, పారిశ్రామిక కారిడార్ల అనుసంధానతను పెంచుతాయి. పట్టణాభివృద్ధికి దారితీస్తాయి''అని చెప్పారు. స్థిరమైన వృద్ధికి వీలుగా రియల్ ఎస్టేట్, ఇన్‌ఫ్రా రంగాల్లో టెక్నాలజీ అనుసరణను పెంచాలని సిగ్నేచర్ గ్లోబల్ ఇండియా చైర్మన్ ప్రదీప్ అగర్వాల్ పేర్కొన్నారు.

ఎస్‌బీఐ ఫండ్స్‌లో వాటా విక్రయం

- ఐపీవో ద్వారా 6.3 శాతం ఆఫర్
- ఐపీవోకు ఎస్‌బీఐ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: అనుబంధ సంస్థ ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్(ఎస్‌బీఐఎఫ్‌ఎంఎల్)లో 6 శాతం వాటా విక్రయించనున్నట్లు బ్యాంకింగ్ రంగ పీఎస్‌యూ దిగ్గజం స్టేట్‌బ్యాంక్(ఎస్‌బీఐ) పేర్కొంది. ఇందుకు బ్యాంక్ కేంద్ర బోర్డు తాజాగా అనుమతించినట్లు వెల్లడించింది. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ స్పాన్సర్‌లలో ఒకటైన కంపెనీ.. ఎస్‌బీఐ కార్డ్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ తదుపరి ఎస్‌బీఐకు మూడో అనుబంధ సంస్థగా వ్యవహరిస్తోంది. కాగా.. ఐపీవో ద్వారా ఎస్‌బీఐ ఫండ్స్‌లో 6.3 శాతం వాటాకు సమానమైన 3,20,60,000 ఈక్విటీ షేర్లను ఆఫ్‌లోడ్ చేయనున్నట్లు ఎస్‌బీఐ తెలియజేసింది. అయితే ఎస్‌బీఐ ఫండ్స్‌కు మరో ప్రమోటర్ అయిన అముండి ఇండియా హోల్డింగ్ సైతం 3.7 శాతం వాటాకు సమానమైన 1,88,30,000 ఈక్విటీ షేర్లను ఆఫర్ చేయనున్నట్లు ఎస్‌బీఐ వెల్లడించింది. వెరసి ఐపీవో ద్వారా ఎస్‌బీఐ ఫండ్స్‌లో 10 శాతం వాటాను విక్రయానికి ఉంచనున్నట్లు వివరించింది. ప్రమోటర్ సంస్థలు సంయుక్తంగా ఐపీవో సన్నాహాలు ప్రారంభించినట్లు తెలియజేసింది. 2026లో పూర్తయ్యే వీలున్నట్లు అంచనా వేసింది. ప్రస్తుతం ఎస్‌బీఐ ఫండ్స్‌లో ఎస్‌బీఐకు 61.91 శాతం, అముండి ఇండియాకు 36.36 శాతం చొప్పున వాటా ఉంది.

నాన్‌యూటీఐ ఫండ్..

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో 1987లో దేశీయంగా తొలి నాన్‌యూటీఐ మ్యూచువల్ ఫండ్‌గా ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఏర్పాటైంది. 1992లో ఎస్‌బీఐకు సొంత అనుబంధ సంస్థగా ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఆవిర్భవించింది. తద్వారా ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్‌కు ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్‌గా వ్యవహరిస్తోంది. విభిన్న అసెట్ క్లాసెస్‌లో ఇన్వెస్ట్‌మెంట్ సొల్యూషన్స్ అందిస్తోంది. ఎస్‌బీఐ ఫండ్స్ దేశీయంగా 15.55 శాతం మార్కెట్ వాటాతో అతి పెద్ద అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీగా నిలుస్తోంది. 2025 సెప్టెంబర్30కల్లా ఆల్టర్నేట్ ఫండ్స్ ద్వారా రూ. 16.32 లక్షల కోట్ల నిర్వహణలోని ఆస్తులను కలిగి ఉంది.

ఏఐ హబ్‌ని విస్తరించిన మెల్ట్‌వాటర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మీడియా, కన్స్యూమర్ ఇంటెలిజెన్స్ సంస్థ మెల్ట్‌వాటర్, హైదరాబాద్‌లోని తమ ఏఐ హబ్‌ని మరింతగా విస్తరించింది. ఈ కార్యాలయం వైశాల్యం దాదాపు 14,000 చ.అ.గా ఉంటుంది. ఇందులో 60 మంది ఇంజినీర్ల ఆర్‌అండ్‌డీ (పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు) బృందం, కొత్త తరం ఏఐ సొల్యూషన్స్‌ను రూపొందించడంపై పని చేస్తోందని సంస్థ తెలిపింది. హైదరాబాద్‌లోని ఐఐటీ, బిట్స్ పిలానీ, ట్రిపుల్‌ఐటీలాంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల నుంచి వీరిని రిక్రూట్ చేసుకున్నట్లు వివరించింది. 2026 నాటికి ఇంజినీర్ల సంఖ్యను 150కి పెంచుకోనున్నట్లు కంపెనీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఆదిత్య జామీ తెలిపారు. భారత్‌లో రిజర్వ్ బ్యాంక్, ఎయిరిండియా, టాటా గ్రూప్, అమెజాన్ ఇండియా లాంటి దిగ్గజాలకు సర్వీసులు అందిస్తున్నట్లు వివరించారు.

రీటెక్ ఎన్విరోటెక్‌లో బ్లాక్ గోల్డ్ రీసైక్లింగ్‌కి వాటాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అమెరికాకు చెందిన లీ టోంగ్ గ్రూప్‌లో భాగమైన రీటెక్ ఎన్విరోటెక్‌లో మెజారిటీ వాటాలను కొనుగోలు చేసినట్లు హైదరాబాద్‌కి చెందిన అంకుర సంస్థ బ్లాక్ గోల్డ్ రీసైక్లింగ్ వెల్లడించింది. పర్యావరణ హితమైన విధంగా లిథియం అయాన్ బ్యాటరీలు, ప్లాస్టిక్స్, సోలార్ ప్యానెళ్లు మొదలైన వాటి రీసైక్లింగ్ కార్యకలాపాలను మరింతగా విస్తరించేందుకు ఇది తోడ్పడుతుందని సంస్థ వ్యవస్థాపకుడు ప్రభు రామ్ తెలిపారు. ఈ డీల్‌లో భాగంగా రీటెక్ ఎన్విరోటెక్ సీఈవో పంకజ్ తిర్మన్‌వార్.. బ్లాక్ గోల్డ్‌లో సహ వ్యవస్థాపకుడిగా, బోర్డు సభ్యుడిగా చేరతారని పేర్కొన్నారు. వ్యర్థాలను విలువైన వనరులుగా మార్చే అధునాతన సాంకేతికతలపై తాము గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వివరించారు.

తెలంగాణలో పీఅండ్‌జీ ఇండియా నీటి సంరక్షణ ప్రాజెక్టు

హైదరాబాద్: వ్యాపార దిగ్గజం ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్ (పీఅండ్‌జీ) ఇండియా 2030 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాల్లో భాగంగా తెలంగాణలో నీటి సంరక్షణ ప్రాజెక్టును ప్రారంభించింది. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో వనరులను పునరుద్ధరించడంపై ప్రధానంగా దృష్టి పెడుతున్నట్లు సంస్థ తెలిపింది. మూసీ–కృష్ణా నది బేసిన్‌లో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఎస్‌డబ్ల్యూఏఆర్ (వ్యవసాయ పునరుద్ధరణకు తోడ్పడే నీటి వ్యవస్థ) టెక్నాలజీని ఉపయోగిస్తున్నట్లు కంపెనీ వివరించింది. అవసరమైనంత మాత్రమే ఉపయోగించుకుని, నీరు వ్యర్థం కాకుండా నివారించేందుకు ఇది తోడ్పడుతుందని పేర్కొంది. దీర్ఘకాలంలో భూగర్భ జలాలను, వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ఉపయోగపడగలదని వివరించింది. ఈ ప్రాజెక్టు కోసం ఎంచుకున్న రెండు గ్లోబల్ సైట్లలో తెలంగాణ ఒకటని తెలిపింది. బోన్‌విల్లే ఎన్విరాన్‌మెంటల్ ఫౌండేషన్, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కన్సర్న్స్ భాగస్వామ్యంతో 100 ఎకరాల వ్యవసాయ భూమిలో దీన్ని చేపట్టినట్లు కంపెనీ తెలిపింది. వినూత్న నీటి పారుదల విధానాలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

ఐపీవో వేల్యుయేషన్స్‌లో

సెబీ జోక్యం చేసుకోదు

సంస్థ చైర్మన్ తుహిన్ కాంత పాండే స్పష్టీకరణ

ముంబై: ఐపీవోలకు సంబంధించిన వేల్యుయేషన్స్ విషయంలో తాము జోక్యం చేసుకోబోమని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే స్పష్టం చేశారు. ఇన్వెస్టర్ల దృష్టి కోణాన్ని బట్టే వేల్యుయేషన్ ఉంటుందన్నారు. అవకాశాలను బట్టి మార్కెట్టే దాన్ని స్వేచ్ఛగా నిర్ణయించుకోవాల్సి ఉంటుందని ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా చెప్పారు. ఇటీవలి కాలంలో లెన్స్‌కార్ట్‌లాంటి సంస్థలు భారీ వేల్యుయేషన్లతో పబ్లిక్ ఇష్యూలకు రావడంపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో పాండే వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గతంలో కూడా నైకా, పేటీఎంలాంటి కొత్త తరం, డిజిటల్ కంపెనీల విషయంలోనూ ఇలాంటి ఆందోళనే వ్యక్తమైంది. మరోవైపు, ఈఎస్‌జీ లక్ష్యాలపై కంపెనీలు నిబద్ధతతో పని చేయాలని పాండే సూచించారు. సైబర్ రిస్క్, డేటా ఎథిక్స్‌లాంటి కీలక అంశాల్లో డైరెక్టర్లు, సీనియర్ మేనేజ్‌మెంట్ అధికారులు తమ పరిజ్ఞానాన్ని మరింతగా పెంచుకోవాలని పేర్కొన్నారు.

సోషల్ మీడియాలో మోసాల కట్టడికి చర్యలు..

పెట్టుబడి అవకాశాల పేరిట సోషల్ మీడియా, ఆన్‌లైన్‌లో జరిగే మోసాలను కట్టడి చేయడంపై సెబీ మరింతగా దృష్టి పెడుతోంది. ఇందుకోసం దిగ్గజ సోషల్ మీడియా, ఇంటర్నెట్ సెర్చ్ ప్లాట్‌ఫాంల సహాయాన్ని తీసుకుంటోంది. ఈ తరహా మోసపూరిత కార్యకలాపాల కోసం తమ నెట్‌వర్క్‌లు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని వాటికి సూచించింది. కేవలం సెబీ రిజిస్టర్డ్ వ్యక్తులు, సంస్థలు మాత్రమే ఇన్వెస్ట్‌మెంట్ ప్రోడక్టులను, సర్వీసులను ప్రచారం చేసే విధంగా వెరిఫికేషన్ ప్రక్రియను అమలు చేయాలి పేర్కొంది. అలాగే, ఇన్వెస్టర్లు మోసపూరిత యాప్‌లకు దూరంగా ఉండేలా, నికార్సైన ట్రేడింగ్ యాప్‌లను ప్రత్యేకమైన వెరిఫైడ్ లేబుల్‌తో చూపించే విధానాన్ని ప్రవేశపెట్టాలని వివరించింది. ఇన్వెస్టర్లు కూడా పెట్టుబడులు పెట్టే ముందు సదరు సంస్థ, యూపీఐ హ్యాండిల్స్ మొదలైనవి సిసలైనవేనా కాదా అనేది ధృవీకరించుకునేందుకు సెబీ పోర్టల్‌ను సందర్శించాలని పేర్కొంది. అంతర్జాతీయ సెక్యూరిటీస్ కమీషన్స్ సంస్థ (ఐవోఎస్‌సీవో) ఇటీవలే ఇలాంటి పెట్టుబడుల మోసాల కట్టడి గురించి పలు సిఫార్సులు చేసింది.

క్యూ2 ఫలితాలు

అపోలో హాస్పిటల్స్ లాభం జూమ్

క్యూ2లో రూ. 477 కోట్లు

న్యూఢిల్లీ: ఆరోగ్య పరిరక్షణ రంగ దిగ్గజం అపోలో హాస్పిటల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 26 శాతం జంప్‌చేసి రూ. 477 కోట్లను తాకింది. హెల్త్‌కేర్ సర్వీసులకుతోడు రిటైల్, ఫార్మా పంపిణీ విభాగాలలో వృద్ధి ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 379 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 5,589 కోట్ల నుంచి రూ. 6,304 కోట్లకు బలపడింది. హెల్త్‌కేర్ సర్వీసుల(ఆసుపత్రుల) విభాగం ఆదాయం 9 శాతం మెరుగుపడి రూ. 3,169 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 2,903 కోట్ల టర్నోవర్ నమోదైంది. కీలకమైన మూడు విభాగాల్లోనూ రెండంకెల వృద్ధిని అందుకున్నందుకు సంతోషిస్తున్నట్లు అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ చైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో అపోలో హాస్పిటల్స్ షేరు 0.4% నీరసించి రూ. 7,784 వద్ద ముగిసింది.

లుపిన్ లాభం హైజంప్

రూ. 1,485 కోట్లు

న్యూఢిల్లీ: ఔషధ రంగ దిగ్గజం లుపిన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 73 శాతం జంప్‌చేసి రూ. 1,485 కోట్లను తాకింది. యూఎస్, వర్ధమాన మార్కెట్ల అమ్మకాలలో వృద్ధి ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 859 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 5,497 కోట్ల నుంచి రూ. 6,831 కోట్లకు ఎగసింది. యూఎస్ అమ్మకాలు 47 శాతం జంప్‌చేసి రూ. 2,762 కోట్లను తాకాయి. గత క్యూ2లో ఇవి రూ. 1,875 కోట్లుగా నమోదయ్యాయి. దేశీ అమ్మకాలు రూ. 2,009 కోట్ల నుంచి రూ. 2,078 కోట్లకు పుంజుకున్నాయి. వర్ధమాన మార్కెట్లలో అమ్మకాలు 45 శాతం పెరిగి రూ. 923 కోట్లకు చేరాయి. గత క్యూ2లో రూ. 635 కోట్ల అమ్మకాలు సాధించింది.

ఫలితాల నేపథ్యంలో లుపిన్ షేరు బీఎస్‌ఈలో 2.1 శాతం క్షీణించి రూ. 1,956 వద్ద ముగిసింది.

ఎన్‌సీసీఎల్ ఆదాయం రూ. 4,585 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఎన్‌సీసీ లిమిటెడ్ (ఎన్‌సీసీఎల్) ఆదాయం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 4,585 కోట్లుగా, లాభం రూ. 151 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో ఆదాయం రూ. 5,224 కోట్లు కాగా, లాభం రూ. 163 కోట్లు. సమీక్షాకాలంలో రూ. 6,223 కోట్ల విలువ చేసే ఆర్డర్లు రాగా మొత్తం ఆర్డర్ బుక్ రూ. 71,957 కోట్లకు చేరినట్లు సంస్థ ఎండీ ఏఏవీ రంగరాజు తెలిపారు.

ఎన్‌హెచ్‌పీసీ మెరుగైన వృద్ధి

15 శాతం పెరిగిన లాభం

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ విద్యుదుత్పత్తి సంస్థ ఎన్‌హెచ్‌పీసీ సెప్టెంబర్ త్రైమాసికానికి రూ.1,219 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.1,060 కోట్లతో పోల్చి చూసినప్పుడు 15 శాతం వృద్ధి నమోదైంది. ఇదే కాలంలో ఆదాయం సైతం రూ.3,402 కోట్ల నుంచి రూ.3,629 కోట్లకు వృద్ధి చెందింది. డైరెక్టర్ (ఫైనాన్స్)గా ఉన్న ముఖేశ్ కుమార్ శర్మను 2025 నవంబర్ 6 నుంచి కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా బోర్డు నియమించింది. ఐసీఏఐ సభ్యుడైన శర్మకు 30 ఏళ్లకు పైగా అనుభవం ఉన్నట్టు కంపెనీ ప్రకటించింది.

బీఎస్‌ఈలో ఎన్‌హెచ్‌పీసీ షేరు ధర ఒక శాతానికి పైగా నష్టంతో రూ.83 వద్ద స్థిరపడింది.

జీఎస్‌కే ఫార్మా లాభం ఫ్లాట్

రూ. 255 కోట్లు

న్యూఢిల్లీ: ఫార్మా రంగ దిగ్గజం గ్లాక్సోస్మిత్‌క్లెయిన్ ఫార్మాస్యూటికల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం స్వల్ప(2 శాతం) వృద్ధితో రూ. 255 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 249 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 1,000 కోట్ల నుంచి రూ. 974 కోట్లకు స్వల్పంగా బలహీనపడింది. సీజనల్ అవాంతరాలు, జీఎస్‌టీ సవరణల ప్రభావం, సరఫరా చైన్ సర్దుబాట్లు అమ్మకాలపై ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. ఒక యూనిట్‌లో అగ్నిప్రమాదం కారణంగా కంపెనీకిగల కాంట్రాక్ట్ తయారీ కార్యకలాపాలు ప్రభావితమైనట్లు తెలియజేసింది. దీంతో జనరల్ మెడిసిన్స్ పోర్ట్‌ఫోలియోలో కొన్ని బ్రాండ్ల సరఫరాలు దెబ్బతిన్నట్లు వెల్లడించింది. రానున్న త్రైమాసికాలలో వృద్ధిని కొనసాగించేందుకు తగిన చర్యలు చేపట్టినట్లు వివరించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 2.3 శాతం క్షీణించి రూ. 2,600 వద్ద ముగిసింది.

క్రాంప్టన్ గ్రీవ్స్ మిశ్రమ పనితీరు

41 % తగ్గిపోయిన లాభం

న్యూఢిల్లీ: క్రాంప్టన్‌గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ సెప్టెంబర్‌తో అంతమైన త్రైమాసికానికి మిశ్రమ పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 41 శాతం తగ్గి రూ.75 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.128 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆదాయం ఇదే కాలంలో ఒక శాతం పెరిగి రూ.1,915 కోట్లకు చేరింది. ''అమ్మకాలు 3 శాతం పెరగడం ఆదాయంలో స్వల్ప వృద్ధికి సాయపడింది. ఇందుకు ధరల్లో స్వల్ప సర్దుబాటు కారణం. సవాళ్లతో కూడిన, అననుకూల పరిస్థితుల్లోనూ ఈ స్థాయి పనితీరు సాధించాం''అని కంపెనీ తెలిపింది. వడోదర ప్లాంట్ పునర్‌నిర్మాణానికి వెచ్చించిన రూ.20 కోట్ల ఏకీకృత అంశం కూడా ఇందులో కలసి ఉన్నట్టు పేర్కొంది. ముఖ్యంగా వ్యయాలు 3.64 శాతం మేర పెరగడం (రూ.1,806 కోట్లు) కూడా లాభాలకు గండికొట్టినట్టు తెలుస్తోంది. ఎలక్ట్రిక్ కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఆదాయం 1.54 శాతం పెరిగి రూ.1,371 కోట్లుగా ఉంటే, లైటింగ్ ఉత్పత్తుల ఆదాయం 3 శాతం పెరిగి రూ.261 కోట్లుగా ఉంది. గతేడాది కొనుగోలు చేసిన సబ్సిడరీ సంస్థ బటర్‌ఫ్లై ఆదాయం 13 శాతం పెరిగి రూ.283 కోట్లకు చేరింది.

బీఎస్‌ఈలో కంపెనీ షేరు రెండు శాతం నష్టపోయి రూ.278 వద్ద స్థిరపడింది.

వర్ల్‌పూల్ బలహీనం

లాభం, ఆదాయంలో క్షీణత

న్యూఢిల్లీ: కన్స్యూమర్ డ్యూరబుల్స్ సంస్థ వర్ల్‌పూల్ ఇండియా సెప్టెంబర్ త్రైమాసికంలో బలహీన పనితీరు నమోదు చేసింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 22 శాతం తగ్గి రూ.42 కోట్లకు పరిమితమైంది. ఆదాయం సైతం 4 శాతం తగ్గి రూ.1,647 కోట్లుగా ఉంది. క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో లాభం రూ.53 కోట్లు, ఆదాయం రూ.1,713 కోట్ల చొప్పున ఉండడం గమనార్హం. వ్యయాలు 2 శాతం తగ్గి రూ.1,649 కోట్లుగా ఉన్నాయి. అమెరికాకు చెందిన వర్ల్‌పూల్ కార్పొరేషన్‌కు వర్ల్‌పూల్ ఇండియా అనుబంధ సంస్థగా ఉంది.

బీఎస్‌ఈలో కంపెనీ షేరు 2% నష్టపోయి రూ.1,351 వద్ద ముగిసింది.



మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్ విజేత భారత జట్టు సభ్యులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ధ్రువ్ జురేల్ 132 నాటౌట్

భారత్ 'ఎ' 255 ఆలౌట్

బెంగళూరు: సహచరులు తక్కువ స్కోరుకే వెనుదిరిగినా... ధ్రువ్ జురేల్ పట్టుదలతో ఆడి వీరోచిత అజేయ సెంచరీ సాధించాడు. జురేల్ (175 బంతుల్లో 132 నాటౌట్; 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) అద్భుత శతకం పుణ్యమాని... దక్షిణాఫ్రికా 'ఎ' జట్టుతో గురువారం మొదలైన రెండో అనధికారిక టెస్టులో భారత 'ఎ' జట్టు గౌరవప్రద స్కోరు నమోదు చేసింది. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా 'ఎ' కెప్టెన్ ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత 'ఎ' జట్టు 77.1 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరగా... కేఎల్ రాహుల్ (40 బంతుల్లో 19; 3 ఫోర్లు), సాయి సుదర్శన్ (52 బంతుల్లో 17; 3 ఫోర్లు) క్రీజులో కుదురుకుంటున్న దశలో అవుటయ్యారు. ఒకదశలో 126 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన భారత జట్టును జురేల్ ఆదుకున్నాడు. ఎనిమిదో వికెట్‌కు కుల్దీప్ యాదవ్ (88 బంతుల్లో 20; 1 ఫోర్)తో కలిసి జురేల్ 79 పరుగులు జత చేసి భారత స్కోరును 200 దాటించాడు. కుల్దీప్ అవుటయ్యాక సిరాజ్ (31 బంతుల్లో 15; 3 ఫోర్లు)తో కలిసి జురేల్ 34 పరుగులు జోడించాడు. 62 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న జురేల్... 145 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో సెంచరీ మైలురాయిని దాటాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో వాన్ వురెన్ నాలుగు వికెట్లు పడగొట్టగా... సుబ్రాయెన్, మోరెకిలకు రెండు వికెట్ల చొప్పున లభించాయి.

భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్: కేఎల్ రాహుల్ (సి) ఎస్టెర్‌హ్యూజెన్ (బి) వాన్ వురెన్ 19; అభిమన్యు ఈశ్వరన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మోరెకి 0; సాయి సుదర్శన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సుబ్రాయెన్ 17; దేవ్‌దత్ పడిక్కల్ (సి) ఎస్టెర్‌హ్యూజెన్ (బి) వాన్ వురెన్ 5; రిషభ్ పంత్ (సి) అకెర్‌మన్ (బి) మోరెకి 24; ధ్రువ్ జురేల్ (నాటౌట్) 132; హర్ష్ దూబే (బి) వాన్ వురెన్ 14; ఆకాశ్‌దీప్ (బి) సుబ్రాయెన్ 0; కుల్దీప్ యాదవ్ (రనౌట్) 20; సిరాజ్ (సి) ఎస్టెర్‌హ్యూజెన్ (బి) సెలి 15; ప్రసిధ్ కృష్ణ (సి అండ్ బి) వాన్ వురెన్ 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (77.1 ఓవర్లలో ఆలౌట్) 255. వికెట్ల పతనం:** 1–2, 2–37, 3–41, 4–59, 5–86, 6–119, 7–126, 8–205, 9–239, 10–255. **బౌలింగ్:** ఒకులె సెలి 16–6–57–1, మోరెకి 18–2–52–2, ప్రెనెలన్ సుబ్రాయెన్ 19–1–73–2, వాన్ వురెన్ 16.1–2–52–4, కైల్ సిమండ్స్ 8–1–14–0.

శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టులో ఆకిబ్

సాక్షి, హైదరాబాద్: వచ్చే జాతీయ ఫుట్‌బాల్ లీగ్ ఐ–లీగ్ టోర్నీ కోసం హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు కొత్త ప్లేయర్‌ను తీసుకుంది. ఈ ఏడాది డ్యూరాండ్ కప్‌లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మొహమ్మద్ ఆకిబ్‌తో శ్రీనిధి డెక్కన్ జట్టు ఒప్పందం చేసుకుంది. 2024–2025 ఐ–లీగ్‌లో ఆకిబ్ రియల్ కశ్మీర్ జట్టుకు ఆడాడు. తన ప్రొఫెషనల్ కెరీర్‌ను సరీ్వసెస్ జట్టుతో ప్రారంభించిన ఆకిబ్ ఆ తర్వాత ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ జట్టులో చేరాడు. ఆ తర్వాత రియల్ కశ్మీర్ జట్టుకు మారాడు. గత ఐ–లీగ్ సీజన్‌లో మేటి డిఫెండర్‌గా పేరు తెచ్చుకున్న ఆకిబ్ 22 మ్యాచ్‌లు ఆడాడు. ప్రత్యర్థి ఫార్వర్డ్ ఆటగాళ్లను నిలువరించడంలో ఆకిబ్ సిద్ధహస్తుడు. 'శ్రీనిధి జట్టుతో ఒప్పందం చేసుకోవడం ఆనందంగా ఉంది. కొత్త సీజన్, కొత్త సవాళ్లకు సిద్ధంగా ఉన్నా. శ్రీనిధి జట్టుకు, అభిమానులకు మధురజ్ఞాపకాలు అందిస్తా' అని 28 ఏళ్ల ఆకిబ్ వ్యాఖ్యానించాడు. వచ్చే సీజన్ కోసం స్ట్రయికర్ డేవిడ్ కాస్టనెడా, మిడ్‌ఫీల్డర్లు బ్రాండన్ వాన్‌లాల్‌రెమ్డికా, లాల్‌రోమావియా, డిఫెండర్ గుర్‌ముఖ్ సింగ్, గోల్‌కీపర్ ఆర్యన్ లాంబాలతో శ్రీనిధి డెక్కన్ క్లబ్ ఒప్పందం పొడిగించుకుందని జట్టు చీఫ్ ఫుట్‌బాల్ ఆఫీసర్ ఫాబియో ఫెరీరా తెలిపారు.

ఆర్‌సీబీ మహిళల జట్టు హెడ్ కోచ్‌గా రంగరాజన్

బెంగళూరు: గత ఆరేళ్లుగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మహిళల జట్టు శిక్షణ సహాయక సిబ్బందిలో ఉన్న తమిళనాడు మాజీ స్పిన్నర్ మలోలన్ రంగరాజన్‌కు పదోన్నతి లభించింది. వచ్చే ఏడాది మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో పాల్గొనే ఆర్‌సీబీ జట్టుకు రంగరాజన్‌ను హెడ్ కోచ్‌గా నియమిస్తున్నట్లు ఫ్రాంచైజీ గురువారం ప్రకటించింది. గత రెండు సీజన్‌లలో ల్యూక్ విలియమ్స్ ఆర్‌సీబీ జట్టుకు హెడ్ కోచ్‌గా ఉన్నారు. అయితే బిగ్ బాష్ లీగ్‌లో అడిలైడ్ స్ట్రయికర్స్ జట్టుకు ల్యూక్ విలియమ్స్ కోచ్‌గా వెళ్లడంతో వచ్చే డబ్ల్యూపీఎల్ సీజన్‌కు అతను అందుబాటులో ఉండటంలేదు. వచ్చే ఏడాది భారత్ వేదికగా ఫిబ్రవరి–మార్చిలో పురుషుల టి20 ప్రపంచకప్ ఉండటంతో 2025 డబ్ల్యూపీఎల్ టోర్నీ జనవరిలోనే నిర్వహించనున్నారు.

వేలంలో దీప్తి శర్మ

న్యూఢిల్లీ: వన్డే ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో విశేషంగా రాణించిన భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ... దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా వోల్వార్ట్... మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ వేలంలో భాగం కానున్నారు. 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచిన దీప్తి శర్మను యూపీ వారియర్స్ జట్టు... 'టోర్నీ టాప్ స్కోరర్' వోల్వార్ట్‌ను గుజరాత్ జెయింట్స్ జట్టు రీటెయిన్ చేసుకోకుండా విడుదల చేశాయి. 2024 డబ్ల్యూపీఎల్ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచిన దీప్తి శర్మను వదులుకొని భారత అండర్–19 ప్రపంచకప్ విజేత జట్టు సభ్యురాలైన శ్వేత సెహ్రావత్‌ను యూపీ వారియర్స్ జట్టు అట్టిపెట్టుకోవడం గమనార్హం. ఆస్ట్రేలియా స్టార్స్ అలీసా హీలీ, మెగ్ లానింగ్, కివీస్ ఆల్‌రౌండర్ అమెలియా కెర్‌లను కూడా ఆయా ఫ్రాంచైజీలు విడుదల చేశాయి. భారత స్టార్స్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, షఫాలీ వర్మలను ఆయా ఫ్రాంచైజీలు అట్టిపెట్టుకున్నాయి. డబ్ల్యూపీఎల్ రిటెన్షన్ నిబంధనల ప్రకారం ఒక్కో ఫ్రాంచైజీ గరిష్టంగా ఐదుగురిని అట్టిపెట్టుకోవచ్చు. ఇందులో ముగ్గురు భారత క్రికెటర్లు, ఇద్దరు విదేశీ క్రికెటర్లు ఉండాలి. డబ్ల్యూపీఎల్–2026 సీజన్ కోసం ఈనెల 27న న్యూఢిల్లీలో వేలం కార్యక్రమం నిర్వహిస్తారు. ఢిల్లీ క్యాపిటల్స్ గరిష్టంగా ఐదుగురిని రీటెయిన్ చేసుకోగా... ముంబై ఇండియన్స్ నలుగురిని... రాయల్ చాలెంజర్స్ బెంగళూరు నలుగురిని... గుజరాత్ జెయింట్స్ ఇద్దరిని... యూపీ వారియర్స్ ఒక్కరిని రీటెయిన్ చేసుకుంది.

- ఈనెల 27న న్యూఢిల్లీలో డబ్ల్యూపీఎల్ వేలం
- హర్మన్‌ప్రీత్, స్మృతి, జెమీమా, షఫాలీలను రీటెయిన్ చేసుకున్న ఫ్రాంచైజీలు

రీటెయిన్ ప్లేయర్ల జాబితా

ముంబై ఇండియన్స్: నాట్ సీవర్ బ్రంట్ (రూ. 3 కోట్ల 50 లక్షలు), హర్మన్‌ప్రీత్ కౌర్ (రూ. 2 కోట్ల 50 లక్షలు), హేలీ మాథ్యూస్ (రూ. 1 కోటీ 75 లక్షలు), అమన్‌జోత్ కౌర్ (రూ. 1 కోటి), కమలిని (రూ. 50 లక్షలు).
రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: స్మృతి మంధాన (రూ. 3 కోట్ల 50 లక్షలు), రిచా ఘోష్ (రూ. 2 కోట్ల 75 లక్షలు), ఎలీస్ పెరీ (రూ. 2 కోట్లు), శ్రేయాంక పాటిల్ (రూ. 60 లక్షలు). **గుజరాత్ జెయింట్స్:** యాష్లే గార్డ్‌నర్ (రూ. 3 కోట్ల 50 లక్షలు), బెత్ మూనీ (రూ. 2 కోట్ల 50 లక్షలు). **యూపీ వారియర్స్:** శ్వేతా సెహ్రావత్ (రూ. 50 లక్షలు).
ఢిల్లీ క్యాపిటల్స్: జెమీమా రోడ్రిగ్స్ (రూ. 2 కోట్ల 20 లక్షలు), షఫాలీ వర్మ (రూ. 2 కోట్ల 20 లక్షలు), అనాబెల్ సదర్లాండ్ (రూ. 2 కోట్ల 20 లక్షలు), మరిజాన్ కాప్ (రూ. 2 కోట్ల 20 లక్షలు), నికీ ప్రసాద్ (రూ. 50 లక్షలు).

శీతల్ దేవి

పారా ఆర్చరీని దాటి ప్రధాన జట్టులోకి...

భారత జూనియర్ ఆర్చరీ టీమ్‌లో శీతల్ దేవి

న్యూఢిల్లీ: రెండు చేతులు లేకుండానే బరిలోకి దిగి పారా ఆర్చరీలో సంచలన విజయాలు సాధించిన శీతల్ దేవి ఇప్పుడు ఓపెన్ ఆర్చరీ (ఏబుల్డ్) పోటీల్లో సత్తా చాటేందుకు సిద్ధమైంది. 2024 పారాలింపిక్స్‌లో మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్ ఈవెంట్‌లో కాంస్యం సాధించిన శీతల్... భారత జూనియర్ జట్టులోకి ఎంపికైంది. సౌదీ అరేబియాలోని జిద్దాలో జరిగే ఆసియా కప్ స్టేజ్–3 టోర్నీలో భారత జట్టు పోటీ పడనుంది. సోనీపథ్‌లో నాలుగు రోజుల పాటు 60 మంది పోటీ పడిన సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొని శీతల్ క్వాలిఫై కావడం విశేషం. 'నేను ఆర్చరీ మొదలు పెట్టినప్పుడు ఏదో ఒక రోజు అందరిలాగే ఓపెన్ (ఏబుల్డ్) పోటీల్లో పాల్గొనాలని కలలుగన్నా. గతంలో ప్రయత్నించినా ఇది సాధ్యం కాలేదు. కానీ లోపాలు సరిదిద్దుకుంటూ మళ్లీ మళ్లీ ప్రయత్నించాను. ఇప్పుడు ఇలా అవకాశం దక్కింది' అని శీతల్ వ్యాఖ్యానించింది. ఈ టోర్నీ కోసం ప్రకటించిన భారత జూనియర్ జట్టులో మహిళల రికర్వ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొండపావులూరి యుక్తశ్రీ కూడా ఎంపికైంది.

గట్టెక్కిన ప్రజ్ఞానంద

టైబ్రేక్‌లో నెగ్గిన భారత గ్రాండ్‌మాస్టర్ • నిహాల్ సరీన్ పరాజయం

పనాజీ: ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ ఏడో ర్యాంకర్ ప్రజ్ఞానంద మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. తెమూర్ కుయ్‌బొకరోవ్ (ఆస్ట్రేలియా)తో గురువారం జరిగిన 'టైబ్రేక్'లో ప్రజ్ఞానంద 4–2తో విజయం సాధించాడు. వీరిద్దరి మధ్య నిర్ణీత రెండు క్లాసికల్ గేమ్‌లు 'డ్రా' కావడంతో విజేతను నిర్ణయించేందుకు టైబ్రేక్‌ను నిర్వహించారు. నిబంధనల ప్రకారం ముందుగా 15 నిమిషాల నిడివిగల రెండు ర్యాపిడ్ గేమ్‌లు నిర్వహించారు. ఈ రెండు గేమ్‌లు 'డ్రా'గా ముగియడంతో స్కోరు 1–1తో సమమైంది. దాంతో ఫలితం తేలేందుకు ఈసారి 10 నిమిషాల నిడివిగల మరో రెండు గేమ్‌లు ఆడించారు. తొలి గేమ్‌లో ప్రజ్ఞానంద 38 ఎత్తుల్లో ఓడిపోయాడు. బరిలో నిలవాలంటే రెండో గేమ్‌లో ప్రజ్ఞానంద తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజ్ఞానంద 31 ఎత్తుల్లో తెమూర్‌ను ఓడించడంతో స్కోరు 2–2తో సమమైంది. దాంతో ఈసారి 5 నిమిషాల నిడివిగల రెండు గేమ్‌లు ఆడించారు. తొలి గేమ్‌లో ప్రజ్ఞానంద 46 ఎత్తుల్లో గెలుపొంది 3–2తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అనంతరం రెండో గేమ్‌లో ప్రజ్ఞానంద 41 ఎత్తుల్లో నెగ్గి 4–2తో విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన విదిత్, నారాయణన్, ప్రాణేశ్, ప్రణవ్ కూడా మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లగా... నిహాల్ సరీన్, కార్తికేయన్ మురళీలకు నిరాశ ఎదురైంది. టైబ్రేక్‌లో విదిత్ 1.5–0.5తో ఫాస్టొనో (అర్జెంటీనా)పై, నారాయణన్ 4–2తో వితియుగోవ్ (ఇంగ్లండ్)పై, ప్రాణేశ్ 2–0తోదిమిత్రిజ్ (జర్మనీ)పై, ప్రణవ్ 2–0తో తారి ఆర్యన్ (నార్వే)పై విజయం సాధించారు.

చాప్‌మన్

చెలరేగిన చాప్‌మన్

- 28 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్స్‌లతో 78
- రెండో టి20లో వెస్టిండీస్‌పై 3 పరుగులతో నెగ్గిన న్యూజిలాండ్

ఆక్లాండ్: చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన రెండో టి20 మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై న్యూజిలాండ్ పైచేయి సాధించింది. గెలిచేందుకు చివరి ఓవర్‌లో 16 పరుగులు చేయాల్సిన వెస్టిండీస్ 12 పరుగులతో సరిపెట్టుకుంది. ఫలితంగా న్యూజిలాండ్ 3 పరుగులతో గెలిచి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 1–1తో సమం చేసింది. అంతకుముందు మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 207 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మార్క్ చాప్‌మన్ (28 బంతుల్లో 78; 6 ఫోర్లు, 7 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. 19 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన చాప్‌మన్ ధాటికి న్యూజిలాండ్ స్కోరుబోర్డు పరుగెత్తింది. కివీస్ బ్యాటర్లు ఓవర్‌కు పది చొప్పున రన్‌రేట్ నమోదు చేశారు. ఓపెనర్ టిమ్ రాబిన్సన్ (25 బంతుల్లో 39; 5 ఫోర్లు, 1 సిక్స్)తోపాటు చివర్లో డరైల్ మిచెల్ (14 బంతుల్లో 28 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ సాంట్నెర్ (8 బంతుల్లో 18 నాటౌట్; 2 సిక్స్‌లు) మెరిపించారు.

మెరిసిన పావెల్, షెఫర్డ్

208 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 204 పరుగులు చేసి ఓడిపోయింది. ఓపెనర్ బ్రాండన్ కింగ్ 'డకౌట్'కాగా... అలిక్ అతనాజ్ (25 బంతుల్లో 33; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ షై హోప్ (26 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్) రెండో వికెట్‌కు 49 పరుగులు జోడించారు. మిడిలార్డర్ తడబడటంతో విండీస్ ఒకదశలో 93 పరుగులకు 6 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. అయితే రోవ్‌మన్ పావెల్ (16 బంతుల్లో 45; 1 ఫోర్, 6 సిక్స్‌లు), రొమారియో షెఫర్డ్ (16 బంతుల్లో 34; 1 ఫోర్, 4 సిక్స్‌లు) ఏడో వికెట్‌కు 24 బంతుల్లో 62 పరుగులు జోడించడంతో విండీస్ విజయంపై ఆశలు పెంచుకుంది. షెఫర్డ్ అవుటయ్యాక పావెల్‌తో కలిసి మాథ్యూ ఫోర్డ్ (13 బంతుల్లో 29 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) విండీస్‌ను లక్ష్యం దిశగా నడిపించాడు. జేమీసన్ వేసిన చివరి ఓవర్లో ఫోర్డ్ రెండు ఫోర్లు కొట్టగా... నాలుగో బంతికి పావెల్‌ను జేమీసన్ అవుట్ చేశాడు. గెలవాలంటే చివరి బంతికి 5 పరుగులు చేయాల్సిన స్థితిలో ఫోర్డ్ సింగిల్ మాత్రమే తీయడంతో విండీస్‌కు ఓటమి తప్పలేదు. సిరీస్‌లోని మూడో టి20 నెల్సన్‌లో ఆదివారం జరుగుతుంది.

డికాక్

దక్షిణాఫ్రికాను గెలిపించిన డికాక్

ఫైసలాబాద్: పాకిస్తాన్‌తో గురువారం జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1–1తో సమం చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 269 పరుగులు చేసింది. సయీమ్ అయూబ్ (53; 5 ఫోర్లు, 1 సిక్స్), సల్మాన్ ఆఘా (69; 5 ఫోర్లు), నవాజ్ (59; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. దక్షిణాఫ్రికా బౌలర్లు నాండ్రె బర్గర్ 4 వికెట్లు, పీటర్ 3 వికెట్లు తీశారు. అనంతరం దక్షిణాఫ్రికా 40.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 270 పరుగులు సాధించి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డికాక్ (119 బంతుల్లో 123; 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) అజేయ సెంచరీతో దక్షిణాఫ్రికాను విజయతీరాలకు చేర్చాడు. టోనీ జోర్జి (63 బంతుల్లో 76; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా రాణించాడు.

114 మంది మృతి
127 మంది గల్లంతు

'కల్మెగి'బీభత్సంతో ఫిలిప్పీన్స్‌లో అత్యవసర పరిస్థితి

మనీలా: ఫిలిప్పీన్స్‌లో 'కల్మెగి'తుపాను పెను విధ్వంసం సృష్టించింది. ఆకస్మికంగా సంభవించిన వరదల్లో 114 మంది చనిపోగా, మరో 127 మంది జాడ తెలియకుండా పోయారు. ఈ నేపథ్యంలో దేశాధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ గురువారం దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. దీనివల్ల అత్యవసర నిధులను ప్రభావిత ప్రాంతాలకు వేగంగా అందజేయడంతోపాటు, ఆహారం ధరల పెరుగుదలను అడ్డుకునేందుకు వీలవుతుంది. కల్మెగి తుపాను సుమారు 20 లక్షల మంది ప్రజలపై ప్రభావం చూపించింది. ఫిలిప్పీన్స్‌లో ప్రభుత్వం 4.50 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. సెబు ప్రావిన్స్‌లో అత్యధికంగా 71 మంది చనిపోగా, 65 మంది గల్లంతయ్యారు. మరో 69 మంది గాయపడ్డారు. మంగళవారం ఒక్క రోజే ఇక్కడ నెలన్నరపాటు కురవాల్సిన వర్షం కురిసిందని అధికారులు తెలిపారు. దీంతో, భారీగా సంభవించిన వరదలు సెబు నగరంలోని లోతట్టు ప్రాంతాలను ముంచివేశాయి. దీంతో, జనం ఇళ్ల పైకప్పుల పైకి చేరుకుని, సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఇలా ఉండగా, దక్షిణ చైనా సముద్రంలో మరో శక్తివంతమైన తుపాను రూపుదిద్దుకుంటోందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వచ్చే వారంలో ఇది దేశ ఉత్తర ప్రాంతాన్ని అతలాకుతలం చేసే ప్రమాదముందంటున్నారు. ఈ రెండు తుపాన్లు దేశంలోని మూడింట రెండొంతుల భూభాగంలో నష్టాన్ని కలుగజేస్తాయని అధ్యక్షుడు మార్కోస్ అన్నారు. ఇలా ఉండగా, కల్మెగి ఫిలిప్పీన్స్ వీడి వియత్నాం దిశగా కదలుతోంది. దీని ప్రభావంతో భీకరమైన గాలులు, కుండపోత వానలు కురుస్తున్నాయి. హోచిమిన్, దనంగ్ నగరాల్లో వరదలు సంభవించే అవకాశముందని, లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.ఈ ప్రాంతాల్లో కనీసం 60 సెంటీమీటర్ల వాన పడుతుందని అంచనా వేస్తున్నారు.

ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్‌-1 ధరించిన వజ్రపు పెండెంట్ ఇది. 1810వ సంవత్సరంలో తయారైన ఆభరణాన్ని తాజాగా స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో సోథెబీలో ప్రదర్శనకు ఉంచారు

జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నగరానికి సమీప టానస్ ప్రాంతంలో చెట్లు, వ్యవసాయక్షేత్రాలపై అలల మాదిరిగా కమ్ముకున్న పొగమంచు

నిషిద్ధ నగరానికి 'వంద'నం

- క్యాన్లాంగ్ గార్డెన్‌కు పునర్జన్మ
- ఫర్బిడెన్ సిటీలో 'శతాబ్దపు రహస్యం' ఆవిష్కరణ
- పూర్వ వైభవం వెనుక పాతికేళ్ల కఠోర శ్రమ

'భయంకరం'..!!

సింగపూర్‌కు చెందిన ఆర్కిటెక్ట్ హో పుయ్‌–పెంగ్, 1980ల చివర్లో బీజింగ్‌లోని నిషిద్ధ నగరాన్ని మొదటిసారి సందర్శించినప్పుడు, ఆయన నోటి నుండి వచ్చిన మొదటి మాట ఇదే. 600 ఏళ్ల చరిత్ర ఉన్న ఒకప్పటి రాజప్రాసాదం చెత్తతో, పాడుబడిన గిడ్డంగులతో నిండిపోవడం ఆయనను నివ్వెరపరిచింది. కానీ అదే 'భయంకరమైన' దృశ్యం ఇప్పుడు చైనా అత్యంత అద్భుతమైన వారసత్వ సంపదగా ఎలా మారింది? ఒకప్పుడు మూతపడిన ఓ చిన్న వనం, యావత్ ప్రపంచ దృష్టిని ఎలా ఆకర్షిస్తోంది? ఈ మార్పు వెనుక శతాబ్దపు రహస్యం దాగుంది. పాతికేళ్ల కఠోర శ్రమ ఉంది.

చరిత్రలో నిషిద్ధ నగరం

పదిహేనో శతాబ్దంలో మింగ్ రాజవంశం పాలనలో కుటుంబం నివాసం, కార్యకలాపాల కోసం దీనిని నిర్మించారు. ఆ తర్వాత క్వింగ్ రాజవంశపు చక్రవర్తులు దీనిని స్వాధీనం చేసుకుని ఎన్నో భాగాలను పునరుద్ధరించారు. 1925లో, చివరి క్వింగ్ చక్రవర్తి పు యిని ఇక్కడి నుంచి పంపించేసిన తర్వాత ఈ ప్రదేశంలో 'ప్యాలెస్ మ్యూజియం' ప్రారంభమైంది. అయితే, పునరుద్ధరణ పనులు చాలా ఆలస్యంగా మొదలయ్యాయి. చాలా ఏళ్లపాటు ఆ ప్రాంతాల మరమ్మతులు సరిగ్గా జరగకపోవడం, ఈ కట్టడాలు ఎక్కువగా చెక్కతో నిర్మించడం వల్ల తరచూ మంటలు చెలరేగి తీవ్రంగా దెబ్బ తిన్నాయి.

వందేళ్ల తర్వాత గార్డెన్ కనువిందు

దశాబ్దాలు గడిచాయి.. మళ్లీ హో పుయే–పెంగ్ సందర్శించేసరికి రూపురేఖలు మారిపోయాయి. ప్యాలెస్ మ్యూజియం 100వ వార్షికోత్సవం సందర్భంగా, దాని ఈశాన్య భాగంలోని ఒక చిన్న ప్రదేశంపై అందరి దృష్టి పడింది. సెప్టెంబర్ 30న ప్రజల కోసం తెరిచిన ఈ ప్రాంతాన్ని మ్యూజియం వర్గాలు 'మొత్తం ప్రాంగణంలోనే అత్యంత అందమైన తోట'గా అభివర్ణించాయి.

బీజింగ్‌లోని క్యాన్లాంగ్ గార్డెన్‌ను తిలకిస్తున్న సందర్శకులు

అదే 'ఖియాన్ లాంగ్ గార్డెన్'

సుమారు ఒక శతాబ్దం పాటు మూతపడిన ఈ గార్డెన్, 1770ల్లో కేవలం ఐదేళ్లలోనే నిర్మాణం పూర్తి చేసుకుంది. దీని పునరుద్ధరణకు ప్యాలెస్ మ్యూజియం, వరల్డ్ మాన్యుమెంట్ ఫండ్‌తో కలిసి ఏకంగా 25 ఏళ్లపాటు శ్రమించింది.

వానలోనూ సందర్శకుల తాకిడి

ఇటీవల చైనాలో గోల్డెన్ వీక్ సెలవుల్లో, వర్షం పడుతున్నా ఈ 'ఖియాన్ లాంగ్ గార్డెన్' లోపల సందర్శకులు బారులు తీరారు. చక్రవర్తి ఖియాన్ లాంగ్ పేరు మీదుగా ఈ తోటకు ఆ పేరు వచ్చింది. ఇది చక్రవర్తికి ఒక వ్యక్తిగత ఏకాంత నివాసంగా ఉండాలనే ఉద్దేశంతోనే దీనిని చాలా గోప్యంగా డిజైన్ చేశారు. 6,000 చదరపు మీటర్ల విస్తీర్ణంతో, ఇది ఒక ఫుట్‌బాల్ మైదానం కంటే చిన్నది. ఈ అద్భుత ప్రయత్నాన్ని చైనా నాయకుడు జి జిన్‌పింగ్ కూడా ప్రశంసించారు, నిషిద్ధ నగరం కేవలం ఒక భవన సముదాయం కాదు.. అది గత వైభవం. ఆ వంద సంవత్సరాల ప్రయాణానికి 'వందనం'.

– సాక్షి, నేషనల్ డెస్క్

భారత్ నుంచి దక్షిణాఫ్రికా వెళ్లే నౌకపై..

సొమాలియా తీరంలో పైరేట్ల దాడి

మెషీన్ గన్లు, రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనేడ్లతో కాల్పులు

దుబాయ్: సొమాలియా పైరెట్లు మరోసారి రెచ్చిపోయారు. భారత్ నుంచి దక్షిణాఫ్రికాకు వెళ్తున్న నౌకపై సొమాలియా తీరానికి సమీపంలో దాడికి దిగారు. మెషీన్ గన్లు, రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనేడ్లతో నౌకపై కాల్పులకు దిగారు. మాల్టాకు చెందిన ఈ నౌక గుజరాత్‌లోని సిక్కా ఓడరేవు నుంచి బయలుదేరి దక్షిణాఫ్రికాలోని డర్బన్ వైపు వెళ్తోందని ఆంబ్రే అనే ప్రైవేట్ భద్రతా సంస్థ తెలిపింది. నౌకలో ప్రత్యేకంగా భద్రత సిబ్బంది లేరని పేర్కొంది. అందులోని మొత్తం 24 మంది సిబ్బంది ఓడలోని ఓ గదిలో లోపలి నుంచి తాళం వేసుకుని ఉండిపోయారంది. దాడి నేపథ్యంలో నౌక మార్గం మార్చుకుని, వేగం తగ్గించుకుందని వివరించింది. సముద్రం దొంగల దాడి కొనసాగుతోందని వివరించింది. ఈ ప్రాంతంలో ప్రయాణించే నౌకలు అప్రమత్తంగా ఉండాలని బ్రిటిష్ మిలటరీలోని యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైం ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ హెచ్చరికలు జారీ చేసింది. ఇటీవల ఇరాన్‌కు చెందిన మత్స్యకార పడవను అడ్డగించి, స్వాధీనం చేసుకున్న పైరేట్లు దాడులకు పాల్పడుతున్నారంది. తాజాగా కేమెన్ దీవులకు చెందిన నౌకపై పైరేట్లు కాల్పులకు తెగబడ్డారని, ఓడలోని భద్రతా సిబ్బంది ప్రతిదాడికి దిగడంతో వారు తోకముడిచారని పేర్కొంది. సొమాలీ తీరంలో 2011లో అత్యధికంగా 237 దాడులు జరిగాయి. అంతర్జాతీయ సహకారం, నిఘాతో పైరేట్ల బెడద చాలా వరకు తగ్గిపోయింది. గతేడాది నాలుగు దాడులు జరిగినట్లు సమాచారం. తిరిగి ఈ ఏడాదిలో మళ్లీ దాడుల పరంపర మొదలవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

మయన్మార్ స్కామ్ సెంటర్ నుంచి థాయ్‌లాండ్‌కు..

మిలటరీ విమానంలో ఢిల్లీకి 270 మంది భారతీయులు

న్యూఢిల్లీ: మయన్మార్‌లో స్కామ్ సెంటర్ నుంచి పరారై సరిహద్దుల్లోని థాయ్‌ల్యాండ్ పట్టణం మే సాట్‌లో తలదాచుకున్న 270 మంది భారతీయులు గురువారం సురక్షితంగా ఢిల్లీకి చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రెండు మిలటరీ రవాణా విమానాల్లో వారిని తీసుకువచ్చింది. మయన్మార్‌లోని మ్యావద్దీ నగరంలోని కేకే పార్క్‌లో ఉన్న సైబర్‌క్రైం హబ్‌పై అక్కడి అధికారులు దాడులు జరిపి అక్కడున్న సిబ్బందిని విడిపించారు. ఇందులో సుమారు 500 మంది భారతీయులు సహా 28 దేశాలకు చెందిన మొత్తం 1,500 మంది ఉన్నారు. అంతా కలిసి సరిహద్దుల్లోని థాయ్‌ల్యాండ్ పట్టణం మే సాట్‌కు చేరుకున్నారు. అక్రమంగా ప్రవేశించిన ఆరోపణలపై అక్కడి అధికారులు నిర్బంధంలోకి తీసుకున్నారు. సైబర్ మోసాల్లో భాగస్వాములుగా మారిన వీరిని సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు థాయ్‌ల్యాండ్, మయన్మార్‌లలోని భారత రాయబార కార్యాలయాలు అక్కడి ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపాయి. ఈ చర్చలు సఫలం కావడంతో వైమానిక దళానికి చెందిన రెండు విమానాల్లో మొదటి విడతలో 26 మంది మహిళలు సహా 270 మంది ఢిల్లీకి చేరుకున్నారు. వీరిలో అక్కడ బాధితులుగా మారిన వారు, నేరాల్లో పాలుపంచుకున్న వారు ఉన్నారు. అధికారులు వీరిని ప్రశ్నించే అవకాశముంది. విదేశీ ఏజెంట్ల వలలో ఎలా పడ్డారు? అక్కడ ఎలాంటి విధులు నిర్వహించారు? వంటి వివరాలను తెలుసుకుంటారు. మయన్మార్‌లో స్కామ్ సెంటర్‌లు అనేక దేశాల్లో విస్తరించి ఉన్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా, థాయ్‌ల్యాండ్‌లో ఉన్న మిగతా వారి కోసం మరిన్ని విమానాలను పంపుతామని అధికారులు తెలిపారు.

బిహార్ బాతాఖాని

ఓటు చోరీని యువతే అడ్డుకోవాలి: రాహుల్

పూర్ణియా: తమ అమేయ శక్తితో ఆశించిన మేరకు బిహార్‌లో ఓట్ల చోరీని బీజేపీ కొనసాగిస్తుందని దానిని అడ్డుకునే బాధ్యత యువతపై ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. గురువారం పూర్ణియాలో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ''హరియాణా ఎన్నికల్లో బీజేపీ, ఎలక్షన్ కమిషన్ కలిసి ఎలా ఓట్లను చోరీ చేసిన విధానాన్ని మీకు కళ్లకు కట్టినట్లు విడమర్చి చెప్పా. వాళ్లు బిహార్‌లోనూ అదే పనిచేస్తారు. వీళ్లను యువతే అడ్డుకోవాలి. దేశ రాజ్యాంగాన్ని కాపాడాలి. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద యువత అప్రమత్తంగా వ్యవహరించాలి. కుబేరుల దన్నుతో నడిచే తమ పాలనలో యువత నిరుద్యోగులుగా మిగిలిపోవాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారు''అని రాహుల్ వ్యాఖ్యానించారు. అరారియాలోనూ ఎన్నికల ప్రచార సభలో రాహుల్ ప్రసంగించారు. ''ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ, ఆదాయ పన్ను శాఖలకు తోడు విద్వేషం, నిరుద్యోగంతో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాల సారథ్యంలో దేశంలో ఆటవిక పాలన కొనసాగుతోంది. బిహార్‌లో జంగిల్ రాజ్ అని వాళ్లు ఆరోపిస్తున్నారు. కానీ నిజమైన ఆటవిక పాలన బీజేపీదే''అని రాహుల్ అన్నారు.

ఆర్మీ జవాన్ల కుల, మతాలు ఎందుకు?

రాహుల్‌గాంధీపై అమిత్ షా ఆగ్రహం

మధుబని: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మన సైనికుల కులం, మతం తెల్సుకోవాలనుకోవడం సిగ్గుచేటు అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. గురువారం బిహార్‌లో మధుబని, వెస్ట్ చంపారన్, మోతిహరి జిల్లాల్లో ప్రచార ర్యాలీల్లో అమిత్‌షా ప్రసంగించారు. ''ఆర్మీ జవాన్ల మతమేంటి, కులమేంటి అనేవి రాహుల్‌కు ఎందుకు? రాహుల్ ఆలోచనలు సిగ్గుమాలినవి. సాయుధ బలగాలను కుల ప్రాతిపదికన మేం ఏనాడూ వివక్ష చూపలేదు''అని అన్నారు. ''చొరబడుతున్న బంగ్లాదేశీయులు భారత్‌లో లక్షల ఉద్యోగాల్లో చేరిపోయి స్థానికుల ఉపాధి అవకాశాలను దారుణంగా దెబ్బతీస్తున్నారు. వీళ్లతో దేశ భద్రతకు సైతం ముప్పు వాటిల్లుతోంది. ఇలాంటి చొరబాటుదారుల నుంచి బిహార్‌కు స్వేచ్ఛ ప్రసాదిస్తాం''అని అన్నారు. ''ఆర్జేడీ పాలనలో ఊచకోతలు, అత్యాచారాలే కనిపించేవి. ఎన్‌డీఏ ప్రభుత్వం వస్తే శక్తివంతమైన(బాహుబలి) నేతలు అంటూ ఎవరూ ఉండరు. మోదీ బిహార్‌లో తామర గింజల సాగుకు సంబంధించిన మఖానా బోర్డ్ ఏర్పాటుచేయదలిస్తే లాలూ అండ్ కంపెనీ అధికారంలోకి వస్తే మాత్రం వాళ్లు 'చొరబాటుదారులను ప్రోత్సహించే బోర్డ్'కు ఏర్పాటుచేస్తారు''అని అమిత్ ఆరోపించారు.

చోరీకి ఎన్‌డీఏ సిద్ధమైంది: ప్రియాంక

మోతీహరి: హరియాణాలో ఓట్ల చోరీకి పాల్పడిన ఎన్‌డీఏ ఇప్పుడు బిహార్‌లోనూ అదే తరహా దొంగతనానికి బయల్దేరిందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ఆరోపించారు. గురువారం సీతామఢి, ఈస్ట్ చంపారన్, మధుబని జిల్లాలో పలు ప్రచార ర్యాలీల్లో ప్రియాంక ప్రసంగించారు. ''హరియాణాలో మొత్తం ఎన్నికల ప్రక్రియను చోరీతో తమ వశంచేసుకున్నారు. ఇప్పుడు బిహార్‌లో 65 లక్షల నిజమైన ఓటర్లను తీసేసి చోరీని కొనసాగించబోతున్నారు. దమ్ముంటే స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరపండి. అప్పుడు తెలుస్తుంది. ఎవరు గెలుస్తారో ఓడతారో''అని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ప్రియాంక సవాల్ విసిరారు. ''ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్, ఎలక్షన్ కమిషనర్లు వివేక్ జోషి, ఎస్‌ఎస్ సంధూలు రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నారు. నితీశ్‌తోపాటు ఎన్నికల ప్రచారవేదికలను పంచుకోకుండా మోదీ ఆయనను, బిహారీలను అవమానిస్తున్నారు. ఎన్‌డీఏ హయాంలో బిహార్‌లో మౌలికవసతులే కాదు బ్రిడ్జీలు కుప్పకూలాయి. గత మూడేళ్లలో 27 వంతెనలు కూలాయి''అని ప్రియాంక చెప్పారు.

ఓటమి భయంతోనే ఆరోపణలు: రాజ్‌నాథ్

సీతామఢి: బిహార్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే మహాగఠ్‌బంధన్ కూటమి నేతలు ఏకంగా ఈసీ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై ఆరోపణల బురద చల్లుతున్నారని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. గురువారం సీతామఢి, మోతీహరిల్లో ఆయన ఎన్నికల ప్రచార ర్యాలీల్లో ప్రసంగించారు. ''ఆర్జేడీ వాళ్లు మళ్లీ బిహార్‌లో ఆటవిక పాలనలో తెద్దామనుకుంటున్నారు. కానీ ప్రజలు బిహార్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా చూడాలనుకుంటున్నారు. వీళ్ల ఆశలను ఎన్‌డీఏ మాత్రమే నెరవేర్చగలదు. ఈసారి మూడింట రెండొంతుల మెజార్టీతో మేం గెలుస్తాం. గతంలో బిహార్ అంటే పేదప్రజలు ఉండే రాష్ట్రంగా మిగిలిపోయింది. వాస్తవానికి బిహార్ అంటే ప్రతిభావంతులు, కష్టజీవుల పురిటిగడ్డ. ఓడిపోతామనే భయంతో విపక్ష నేతలు రాజ్యాంగబద్ధ సంస్థలపై నిందలేస్తున్నారు. ఆధారాలు ఇవ్వాలని ఈసీ కోరితే మాత్రం ఇవ్వలేక చేతులెత్తేస్తున్నారు. ఈసారి 'ఇండియా'కూటమి అవమానకరస్థాయిలో ఓటమిని చవిచూడబోతోంది''అని రాజ్‌నాథ్ జోస్యం చెప్పారు.

కారుపై కన్పిస్తున్న స్వస్తిక గుర్తు

జర్మనీ నగరంలో మానవ రక్తంతో స్వస్తికా గుర్తులు

- కార్లు, గోడలు, పోస్ట్‌బాక్స్‌లపై ప్రత్యక్షమైన నిషేధిత గుర్తు
- ఉలిక్కిపడిన హనావూ నగరవాసులు

హనావూ: జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ పాలనాకాలంలో యూదుల ఊచకోత చరిత్రలో ఎంతటి చీకటి అధ్యాయంగా మారిందో స్వస్తికా గుర్తు సైతం అంతటి చెడ్డ పేరు తెచ్చుకుంది. హిట్లర్ నాజీ సైనికులు ధరించిన ఈ స్వస్తికా గుర్తు తాజాగా జర్మనీలోని హనావూ నగరంలో పలు చోట్ల ప్రత్యక్షమవడంతో స్థానికుల్లో ఒక్కసారిగా భయాందోళనలు పెరిగాయి. మనిషి రక్తంతో కార్లు, గోడలు, పోస్ట్‌బాక్స్‌లపై స్వస్తికా చిహ్నం కనిపించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఒక ప్రత్యక్ష సాక్షి ఇచ్చిన ఫిర్యాదుతో ఎట్టకేలకు ఒక అనుమానితుడిని అరెస్ట్‌చేశారు. అతని మానసిక స్థితి సరిగా లేదని, సొంత రక్తంతోనే ఇవన్నీ రాసి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలో అసలు కారణాలు బయటికొస్తాయని పోలీస్ అధికారి థామస్ లీపోల్డ్ చెప్పారు. చట్టవ్యతిరేక సంఘాలతో ఇతనికి భాగస్వామ్యం ఉందా అనే కోణంలోనూ కేసును దర్యాప్తు చేస్తున్నారు. అనుమానితుడిని 31 ఏళ్ల రొమేనియా దేశస్థుడిగా గుర్తించారు. అతనిని నివాసంలో పోలీసులు అరెస్ట్ చేసినప్పుడు పూటుగా తాగి ఉన్నాడని తెలుస్తోంది. యూదులపై విద్వేషానికి గుర్తుగా అప్పట్లో హిట్లర్ సైన్యం ఈ గుర్తును తమ యూనిఫామ్‌లపై ధరించేవాళ్లు.

బిహార్ పోరులో మాయావతి

- కైమూర్ జిల్లాలో తొలి ఎన్నికల ర్యాలీ
- రెండో దశలో 100 చోట్ల బీఎస్పీ పోటీ
- యూపీ సరిహద్దు జిల్లాలపై గురి
- గెలుపోటములపై మాయా ప్రభావం

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు తొలి దశ వరకు ఎక్కడా కనిపించని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి రెండో దశ ఎన్నికలకు శంఖారావం పూరించారు. తొలి దశ ఓటింగ్ జరిగిన గురువారం నుంచే ఆమె ఎన్నికల ప్రచారాన్ని కై మూర్ జిల్లా భభువా నుంచి ప్రారంభించారు. రెండో దశ ఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో అత్యధికం ఉత్తరప్రదేశ్‌ను ఆనుకుని ఉన్నవే. దీంతో ఈ ప్రాంతాలపై ఆమె దృష్టి పెట్టారని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఎవరి గెలుపును అడ్డుకుంటుందో..?

బిహార్‌లో ఒంటరిగా పోటీ చేస్తామని అందరి కంటే ముందుగానే ప్రకటించిన బీఎస్పీ అందుకు తగ్గట్లుగానే అభ్యర్థులను కూడా ప్రకటించింది. కొన్ని చోట్ల నామినేషన్లు తిరస్కరణకు గురికాగా 190 చోట్ల ప్రస్తుతం బరిలో ఉంది. ఇందులో రెండో విడతలో ఎన్నికలు జరిగే 122 స్థానాలకు గానూ బీఎస్పీ వంద చోట్ల పోటీలో ఉంది. గత 20 ఏళ్లుగా బిహార్ ఎన్నికల్లో బీఎస్పీ పోటీ చేస్తున్నా రెండంకెల స్థానాలను ఎన్నడూ గెలుచుకోలేదు. 2000 ఎన్నికల్లో 5 స్థానాలను, 2020 ఎన్నికల్లో ఒక్క స్థానంలో విజయం సాధించింది. గడిచిన ఎన్నికల్లో ఎంఐఎం, రాష్ట్రీయ్ లోక్ సమతా పార్టీలతో కలిసి పోటీ చేసిన బీఎస్పీ 1.49 శాతం ఓట్లను సాధించింది. బీఎస్పీ పోటీ చేసిన 78 స్థానాల్లో చాలా చోట్ల 4.5 శాతానికి పైగా ఓట్లు సాధించి ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమి ఓట్లకు గండి కొట్టింది. బీఎస్పీ పోటీ చేసిన స్థానాలన్నీ ఎస్సీలు, ముస్లింలు అధికంగా ఉన్న స్థానాలే కావడంతో అక్కడ ఓట్ల చీలిక ఆ పార్టీల గెలుపు అవకాశాలకు దెబ్బకొట్టింది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌కు సరిహద్దుగా ఉన్న బిహార్‌లోని సరన్, సివాన్, గోపాల్‌గంజ్, భోజ్‌పూర్, పశ్చిమ చంపారన్, రోహ్‌తాస్, బక్సర్, కై మూర్ జిల్లాల్లోని నియోజకవర్గాలపై దృష్టి పెట్టింది. ఈ జిల్లాల్లో భోజ్‌పురి మాండలికం, జీవన శైలి, సాంస్కృతిక రీతులు చాలావరకు ఒకే విధంగా ఉంటాయి. ఈ ప్రాంతంలోని కుల, రాజకీయ పరిస్థితులు సారూప్యంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆమె తన తొలి ఎన్నికల ర్యాలీని కైమూర్ నుంచి మొదలుపెట్టారు. ఈ జిల్లాలోని భభువా, మోహనియా, రామ్‌గఢ్, చైన్పూర్ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులను నిలబెట్టింది. గతంలో చైన్పూర్‌లో రెండుసార్లు బీఎస్పీ అభ్యర్థులు గెలిచారు. ఈ ప్రాంతంలో ఇతర ప్రాంతాల కంటే బీఎస్పీ బలంగా ఉండటంతో ఇక్కడే రాజకీయ ర్యాలీకి మాయావతి శ్రీకారం చుట్టారు. ప్రధానంగా బీఎస్పీకి తొలినుంచి అండగా నిలిచిన ఎస్సీ వర్గాలతో పాటు మైనార్టీలను కలుపుకునేలా బీఎస్పీ ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్రంలో 15.5 శాతం ఎస్సీలు, 17.70శాతం ముస్లింలు కలిపి 32శాతం పైగా ఉండటంతో బీఎస్పీ వీరు అధికంగా ఉన్న సీట్లనే ఫోకస్ చేయనుంది. అదే జరిగితే ముస్లిం ఓట్లను నమ్ముకున్న కాంగ్రెస్, ఆర్జేడీల ఓట్లకు గండి పడటం ఖాయంగా కనిపిస్తోంది.

బిహార్ డెప్యూటీ సీఎం కాన్వాయ్‌పై రాళ్లదాడి

లఖీసరాయ్: లఖీసరాయ్ నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రం ఆర్జేడీ నేతల ఇష్టారాజ్యంగా మారిందని బిహార్ డెప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హా ఆరోపించారు. ఆర్జేడీ అభ్యర్థికే ఓటేయాలంటూ అత్యత వెనుకబడిన వర్గాలకు చెందిన ఓటర్లను పోలింగ్ కేంద్రం వద్ద ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ''ఓటర్లతో బలవంతంగా ఓటేయించుకుంటున్నారు. ఉదయం నుంచి ఇదే తంతు. అడ్డుకోబోయిన తమ వారిపై దాడ చేశారు. నా కాన్వాయ్‌లోని వాహనంపై రాళ్లదాడి చేశారు. కాన్వాయ్ మీదకు చెప్పులు విసిరేశారు. పేడ కొట్టారు. బీజేపీ కార్యకర్త విభీషణ్ కేవత్‌ను చితకబాదారు. తీవ్ర గాయాలతో అతను ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇంత జరిగినా ఆర్జేడీ నేతలను ఒక్కరిని కూడా అరెస్ట్‌చేయలేదు. స్థానిక ఎస్పీ ఒక పిరికిపంద. ఆర్జేడీ నేతలను అడ్డుకోలేక చోద్యం చూస్తున్నారు. ఈ అంశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం వద్ద ఫిర్యాదుచేస్తా''అని విజయ్ సిన్హా అన్నారు. దీనిపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్పందించారు. తక్షణం చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఘటనపై లఖీసరాయ్ ఎస్పీ అజయ్ స్పందించారు. ''డెప్యూటీ సీఎం చెబుతున్న చోట ఎలాంటి దాడి ఘటన జరిగినట్లు ఫిర్యాదు అందలేదు. ఘటనాస్థలికి వెళ్లాకే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి''అని ఆయన అన్నారు. ఆర్జేడీ నేతలు దాడి చేశారన్న ఆరోపణలపై ఆర్జేడీ అధికార ప్రతినిధి శక్తి యాదవ్ ఘాటుగా స్పందించారు. ''రాష్ట్రంలో అధికారం వాళ్లదే. డెప్యూటీ సీఎంకు జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉంది. అయినా అక్కడ మురికికాలువ అధ్వాన్నంగా తయారైందని స్థానికులు నిరసన వ్యక్తంచేశారు. అంతకుమించి ఏమీ జరగలేదు''అని ఆయన తెలిపారు.

ట్యాంకర్‌ను ఢీకొట్టిన బస్సు..

నలుగురు మృతి, 21 మందికి గాయాలు

హథ్రాస్: ఉత్తరప్రదేశ్‌లోని హథ్రాస్ జిల్లాలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్న బస్సు ప్రమాదంలో నలుగురు చనిపోగా 21 మంది గాయపడ్డారు. అలీగఢ్ నుంచి హథ్రాస్ వైపు వెళ్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సును అలీగఢ్‌–ఆగ్రా హైవేపైనున్న సమామాయి గ్రామ సమీపంలో ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో 12 ఏళ్ల బాలుడు సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన 21 మందిని ఆస్పత్రులకు తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బస్సు డ్రైవర్ బైక్‌ను తప్పించేందుకు ప్రయత్నించిన క్రమంలో అదుపుతప్పి ట్యాంకర్‌ను ఢీకొట్టినట్లు చెబుతున్నారు.

ట్రక్కును ఢీకొట్టిన డబుల్ డెకర్ బస్సు..

యూపీలోని ఉన్నావ్‌లో బుధవారం అర్ధరాత్రి ఆగ్రా–లక్నో ఎక్స్‌ప్రెస్‌వే పైన ప్రైవేట్ డబుల్ డెకర్ బస్సు, కూరగాయలతో వెళ్తున్న ట్రక్కును ఢీకొట్టింది. అనంతరం డివైడర్ మీదుగా దూసుకెళ్లి రోడ్డు పక్కన గుంతలో పడిపోయింది. హసన్‌పూర్‌లో జరిగిన ఈ ప్రమాదంలో బస్సు లోని 60 మందికి గాను 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. సమీప గ్రామస్తులు అక్కడికి చేరుకుని, బస్సు అద్దాలు పగులగొట్టి, ప్ర యాణికులను బయటకు లాగారు. పోలీసులు వచ్చి తీవ్రంగా గాయపడిన కొందరిని లక్నోకు తరలించారు. బస్సు మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణంగా భావిస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఢిల్లీలో మళ్లీ క్షీణించిన వాయు నాణ్యత

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత మళ్లీ పడిపోయింది. గురువారం నగరం మొత్తం గాలి నాణ్యత పేలవంగా మారింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు(పీసీబీ) ప్రకారం ఏక్యూఐ 264కి పెరిగింది. రాబోయే రోజుల్లో మరింత క్షీణిస్తుందని పీసీబీ హెచ్చరించింది. రాజధానిలోని అనేక ప్రాంతాల్లో ముఖ్యంగా ఐటీవో చుట్టూ దట్టమైన పొగమంచు ఆవరించింది. ఇక్కడ గురువారం ఉదయం ఏక్యూఐ 290ని తాకింది. ఉత్తర ఢిల్లీలోని నరేలాలోనూ గాలి నాణ్యత దారుణంగా ఉంది. ఏక్యూఐ ఇక్కడ 294గా నమోదైంది. ఢిల్లీలో దాదాపు వారం తర్వాత బుధవారం అత్యంత స్వచ్ఛమైన గాలి నమోదైంది. గురువారానికి తిరోగమించింది. బుధవారం తగ్గిన కీలకమైన కాలుష్య కారకాల స్థాయిలు గురువారం ఉదయం నాటికి, నగరంలోని 38 పర్యవేక్షణ కేంద్రాలలో చాలా వరకు ఆందోళనకరమైన స్థాయికి తిరిగొచ్చాయి. ఒక్క ఢిల్లీనే కాదు, రాజధానికి ఆనుకుని ఉన్న నగరాల్లోనూ గాలి నాణ్యత క్షీణించింది. ఏక్యూఐ గురుగ్రామ్‌లో 229, నోయిడాలో 216, ఘజియాబాద్‌లో 274గా నమోదైంది. ఫరీదాబాద్‌లో ఏక్యూఐ 187 నమోదైంది. ఢిల్లీ కంటే కొంచెం మెరుగ్గా ఉంది.

గాలి వేగం తగ్గటం వల్లే...

గాలి వేగం గంటకు 10 కిలోమీటర్ల కంటే తక్కువగా పడిపోవడం వల్లే కాలుష్య కారకాలు పేరుకుపోతున్నాయని ఎయిర్ క్వాలిటీ హెచ్చరిక వ్యవస్థ తెలిపింది. మరో రెండు రోజుల పాటు గాలి నాణ్యత పేలవంగానే ఉంటుందంది.

18 ఏళ్ల తర్వాత.. కరాచీలో బంగ్లా కళాకారులు

కరాచీ: పాకిస్తాన్, బంగ్లాదేశ్ మధ్య సాంస్కృతిక సంబంధాల్లో నూతన అధ్యాయం మొదలైంది. బంగ్లాదేశ్ కళాకారులు 18 ఏళ్ల అనంతరం పాకిస్తాన్‌లో అడుగుపెట్టారు. ప్రపంచ సాంస్కృతిక ఉత్సవంలో భాగంగా వీరు కరాచీలో బుధవారం ప్రదర్శన ఇచ్చారు. నిహారికా ముంతాజ్ సారథ్యంలోని బంగ్లాదేశ్ బృందంలో కొందరు హిందూ కళాకారులు సైతం ఉండటం విశేషం. షిరీన్ జవాద్ పాడిన బెంగాలీ పాటలు ఆహూతులను అలరించాయి. అక్టోబర్ 30వ తేదీన మొదలైన వీరి ప్రదర్శనలు డిసెంబర్ 7వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ ఉత్సవాల్లో 140 దేశాలకు చెందిన కళాకారులున్నారు. రెండు దేశాల నడుమ తలెత్తిన దౌత్యపరమైన రాజకీయ విభేదాల కారణంగా పాకిస్తాన్, బంగ్లాదేశ్ మధ్య సాంస్కృతిక సంబంధాలు పదేళ్లపాటు కొనసాగలేదు. షేక్ హసీనా సారథ్యంలోని అవామీ లీగ్ ప్రభుత్వ హయాంలో రెండు దేశాల మధ్య సంబంధాలు కనిష్టస్థాయిలో కొనసాగాయి. 2024లో విద్యార్థుల సారథ్యంలో కొనసాగిన ఉద్యమంతో హసీనా ప్రభుత్వం పడిపోయింది. యూనస్ సారథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాకిస్తాన్‌తో సంబంధాలు తిరిగి గాడినపడ్డాయి.

వేద కాలం నాటి 'పాణిలు' అంటే?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

వైదిక నాగరికత - 2

తొలి వేద కాలంలో ఆర్యులు ప్రధానంగా సప్త సింధూ ప్రాంతానికే పరిమితమయ్యారు. తూర్పున యమునా నదిని దాటి విస్తరించలేదు. అందుకే తొలివేద కాలానికి చెందిన రుగ్వేదంలో సింధూ, దాని ఐదు ఉపనదులతోపాటు సరస్వతిని అధికంగా ప్రస్తావించారు. కానీ మలివేద కాలానికి ఆర్యులు యమునను దాటి గంగామైదాన ప్రాంతానికి విస్తరించారు. ఈ భౌగోళిక విస్తరణతో పాటే మలివేద కాలం నాటికి ఆర్యుల ఆర్థిక,సామాజిక, రాజకీయ, మత వ్యవస్థల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

వైదిక నాగరికత లక్షణాలు

సామాజిక వ్యవస్థ: ఆర్యులు భారతదేశంలో వర్ణ వ్యవస్థను ప్రవేశపెట్టారు. సమాజాన్ని నాలుగు వర్ణాలుగా విభజించారు. ఇందులో మొదటి మూడు వర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను ద్విజులుగా పరిగణించారు. నాలుగో వర్ణమైన శూద్రులు రుగ్వేద కాలం చివరలో కనిపిస్తారు. అయితే ఈ వర్ణ వ్యవస్థ అంత కఠినంగా లేదు. ఏ వర్ణం వారైనా ఏ వృత్తినైనా చేపట్టవచ్చు. వర్ణాంతర వివాహాలు అధికంగానే జరిగేవి. అయితే అనులోమ వివాహాల సంఖ్య అధికంగా ఉంది. ఆనాటి సమాజంలో పైన పేర్కొన్న నాలుగు వర్ణాలతోపాటు దస్యులు అనే మరొక వర్గం కూడా ఉంది. వీరు ఆర్యుల చేతిలో ఓడిపోయిన స్థానిక ప్రజలు. వాస్తవంగా 'వర్ణం' అనే పదానికి రంగు అని అర్థం. నలుపు వర్ణంలో ఉన్న స్థానిక ప్రజలను సూచించేందుకు దీన్ని వాడారు. నాటి సమాజంలో స్త్రీలకు గౌరవప్రదమైన స్థానం ఉండేది. పాలనా సభల్లో కూడా మహిళలకు ప్రాతినిధ్యం ఉంది. స్త్రీలు భర్తతోపాటు యజ్ఞ యాగాది క్రతువుల్లో పాల్గొనేవారు. తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడంలోనూ స్వేచ్ఛ ఉండేది. వీరికి విద్యా హక్కు కూడా ఉండేది. ఉన్నత విద్యను అభ్యసించిన 20 మంది మహిళా మేధావుల ప్రస్తావన రుగ్వేదంలో కనిపిస్తోంది. బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి దురాచారాలకు తావు లేదు. వితంతు పునర్వివాహాలకు, నియోగ వివాహాలకు అవకాశముండేది. అపాల, విశ్వవర, ఘోష మొదలైన బ్రహ్మవాదినులు.. జీవితాంతం వివాహం లేకుండా విద్యార్జనకే తమ జీవితాలను అంకితం చేసినట్లు తెలుస్తోంది. రుగ్వేదంలోని చాలా శ్లోకాలను మహిళలే రచించారని చరిత్రకారుల అభిప్రాయం. బృహదారణ్యక ఉపనిషత్‌లో గార్గి అనే బ్రహ్మవాదినికి యజ్ఞవల్క్య మహర్షికి మధ్య జరిగిన తాత్విక చర్చల ప్రస్తావన ఉంది.

మలివేద కాలం నాటికి చాతుర్వర్ణ వ్యవస్థ బాగా స్థిరపడింది. వర్ణ వ్యవస్థ కఠినంగా మారింది. దీనికితోడు వర్ణాశ్రమ ధర్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దీని ప్రకారం జీవితాన్ని బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం అనే నాలుగు దశలుగా విభజించారు. ఒకే వర్ణానికి చెందిన వారి మధ్య మాత్రమే వివాహాలను అనుమతించేవారు. గోత్ర సంప్రదాయం అమల్లోకి వచ్చింది. ఒకే గోత్రానికి చెందిన వారి మధ్య వివాహాలను అనుమతించేవారు కాదు. వర్ణాంతర వివాహాలు నిషేధించినా అవి ఆగలేదు. అందుకే వర్ణ సంకర సిద్ధాంతాన్ని రూపొందించారు. ఈ కాలంలోనే అష్ట వివాహ పద్ధతి ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇందులో బ్రహ్మ, దైవ, అర్ష, ప్రజాపత్య, గాంధర్వ, అసుర, రాక్షస, పైశాచ అనే 8 రకాల పద్ధతులున్నాయి. వీటిలో గాంధర్వ, రాక్షస వివాహాలకు క్షత్రియులను అనుమతించారు. వర్ణాంతర వివాహాల వల్ల సమాజంలో అనేక మిశ్రమ కులాలు వచ్చి చేరాయి. రుగ్వేద కాలంతో పోలిస్తే స్త్రీల గౌరవ మర్యాదలు క్షీణించాయి. వారిపై అనేక రకాలైన ఆంక్షలను విధించారు. స్త్రీలకు సంబంధించి అనేక సామాజిక దురాచారాలు ప్రారంభమయ్యాయి. బాల్య వివాహాలు, సతీ సహగమనం, వితంతు వివాహాలను నిషేధించారు. వేదాధ్యయనం చేసే అవకాశం స్త్రీలకు లేదు. పున్నామ నరకాన్ని తప్పించేవాడు అని పుత్ర సంతానానికి ప్రాధా న్యం పెరిగింది. సభ, సమితి వంటి వాటిలోనూ స్త్రీలకు సభ్యత్వం లేకుండా పోయింది.

ఆర్థిక వ్యవస్థ: రుగ్వేద ఆర్యుల ప్రధాన వృత్తి పశు పోషణ. కాబట్టి గోవులకు అమిత ప్రాధాన్యతనిచ్చారు. రుగ్వేదంలో 'గోవ్' అనే పదాన్ని 176సార్లు ప్రస్తావించారు. వీరి సంపదకు మూలం పశువులే. కాబట్టి పశువుల దొంగతనాలను ఘోరాపరాధంగా పరిగణించేవారు. ఈ నేరానికి కఠినమైన శిక్షలుండేవి. ఆ కాలంలో 'పాణిలు' అనేవారు పశువుల దొంగతనాలకు పాల్పడేవారు. పశు సంపదను రక్షించడం రాజన్ ముఖ్య విధి. కాబట్టి రాజన్‌ను 'గోప, గోపతి' అనే పేర్లతో పిలిచేవారు. సంపన్నమైన వ్యక్తిని 'గోమత్' అనేవారు. 'గవిష్టి' అంటే గోవుల కోసం చేసే యుద్ధం లేదా గోవుల కోసం వెదకడం అని అర్థం. ఈ విధంగా వీరి ఆర్థిక వ్యవస్థలో సమస్త పదాలు గోవులతో ముడిపడి ఉండడాన్ని బట్టి చూస్తే పశువులు రుగ్వేదార్యుల ఆర్థిక వ్యవస్థలో ముఖ్య స్థానం ఆక్రమించినట్లు తెలుస్తోంది. పశుపోషణ తర్వాత ఆర్యుల ప్రధాన వృత్తి వ్యవసాయం. ఇంకా స్థిర జీవనం ఏర్పడనందున వ్యవసాయాన్ని పరిమితంగానే చేపట్టారు. వీరి ముఖ్య పంటలు గోధుమ, బార్లీ. తొలివేద కాలంలో అనేక రకాల చేతివృత్తుల వారు ఉన్నారు. చేతివృత్తుల్లో రథాలను తయారు చేసే రథకారులకు (వడ్రంగులు) ప్రముఖ స్థానముండేది.

ఇంకా ఇతర వృత్తుల్లో వస్త్రాలు, కుండలు, చర్మ వస్తువుల తయారీ మొదలైనవి పేర్కొనదగినవి. లోహాన్ని 'ఆయాస్' అని పిలిచారు. లోహ వస్తువులను తయారు చేసేవారిని 'కర్మార' అనేవారు. ఆ కాలంలో రాగి లేదా కంచును అధికంగా ఉపయోగించారు. తొలివేద కాలంలో పరిమిత స్థాయిలో వ్యాపార, వాణిజ్యాలు జరిగాయి. రుగ్వేదంలో 'నిష్క' అనే నిర్దిష్ట విలువ కలిగిన బంగారు ఆభరణం గురించి ప్రస్తావన ఉంది. దీన్ని నాణెంగా ఉపయోగించారని కొందరి అభిప్రాయం. అయినప్పటికీ వాణిజ్యం ప్రధానం వస్తు మార్పిడి పద్ధతిలోనే జరిగేది. వేదాల్లో 'ఫణి' అనే అనార్య జాతికి చెందిన వ్యాపారస్థుల ప్రస్తావన ఉంది.

మలివేద కాలానికి ఆర్యుల ఆర్థిక జీవనంలో పెనుమార్పులు సంభవించాయి. దీనికి ప్రధాన కారణం వీరు సప్త సింధూ నుంచి ప్రపంచంలోనే అత్యంత సారవంతమైన గంగా మైదానానికి విస్తరించడమే. ఈ విస్తరణకు ఇనుప పరిజ్ఞానం తోడై ఆర్యుల ఆర్థిక వ్యవస్థ వ్యవసాయాధార ఆర్థిక వ్యవస్థగా మారడానికి కారణమైంది. ఇనుమును వీరు 'కృష్ణ ఆయా' లేదా 'శ్యామ ఆయా' అని పిలిచారు. ఇనుప నాగళ్ల ఉపయోగం ప్రారంభమైంది. శతపథ బ్రాహ్మణంలో వివిధ రకాలైన వ్యవసాయ కార్యకలాపాల గురించిన ప్రస్తావన ఉంది. గోధుమ, బార్లీ తోపాటు వరి ప్రధాన పంటగా రూపొందింది. ఈ వ్యవసాయాభివృద్ధి వల్ల ఆర్యుల సంచార జీవితం అంతమై స్థిర జీవనం ప్రారంభమైంది. తొలివేద కాలంతో పోలిస్తే వృత్తుల సంఖ్య కూడా పెరిగింది. లోహకారులకు ప్రాధాన్యం పెరిగింది. ఈ అభివృద్ధి అంతా కలిసి చిన్న చిన్న పట్టణాలు ఏర్పడటానికి దారి తీసింది. మలివేద గ్రంథాల్లో కనిపించే 'నగరం' అనే పదాన్ని ఈ పట్టణాలకు సంకేతంగా భావించవచ్చు. అయితే వాస్తవంగా పట్టణాలు ఏర్పడింది మాత్రం మలివేద యుగం చివరలో మాత్రమే. మలివేద గ్రంథాల్లో పేర్కొన్న కొన్ని ముఖ్య పట్టణాలు.. కాశీ, కౌశాంబి, వైదేహ, అయోధ్య, హస్తినాపూర్, ఇంద్రప్రస్థ మొదలైనవి. విస్తృత వ్యవసాయం, స్థిరమైన జీవన విధానం, పట్టణ జీవితం, చేతి వృత్తులు ఇవన్నీ కలిసి వ్యాపార వాణిజ్యాల అభివృద్ధికి దోహదపడ్డాయి. దీంతో వ్యాపార నిర్వహణకు వ్యాపారస్తులు 'శ్రేణులు' లేదా 'గణ'లుగా ఏర్పడ్డారు. రుగ్వేద కాలపు నిష్కతోపాటు అనేక రకాలైన నాణేలు వచ్చాయి. అవి.. శతమాన, క్రిష్ణాల, సువర్ణ, హిరణ్య పిండ మొదలైనవి. బృహదారణ్యక ఉపనిషత్‌లో 'పడ' అనే నాణెం ప్రస్తావన ఉంది. అయితే వాస్తవంగా ఇవన్నీ నిర్ణీత విలువ కలిగిన ఆభరణాలు మాత్రమే. అసలైన నాణేలు వాస్తవంగా క్రీ.పూ. 6వ శతాబ్దంలో ప్రారంభమయ్యాయి. అవే విద్ధాంక నాణేలు. అధర్వణ వేదం సంతల గురించి, అక్కడి సందడిని గురించి ప్రస్తావిస్తోంది. ఈ కాలంలో వడ్డీ వ్యాపారం కూడా ఒక వృత్తిగా గుర్తింపు పొందింది. వడ్డీ వ్యాపారిని 'కుసిదిన్' అని పిలిచేవారు.



రాజకీయ వ్యవస్థ: రుగ్వేద కాలంలో పూర్తిస్థాయి రాచరిక వ్యవస్థ ఏర్పడలేదు. పాలక వర్గాలను రాజన్య అని పిలిచేవారు. ఈ వర్గాల నుంచే రాజన్‌ను ఎన్నుకునేవారు. రాజన్‌ను రాజుగా కంటే తెగ నాయకుడిగా పరిగణించడమే సబబుగా ఉంటుంది. రాజన్ ముఖ్య విధి ప్రజలను కాపాడడంతో పాటు వారి ప్రధాన సంపద అయిన గోవులను దొంగిలింపకుండా కాపాడటం. దీని కోసం గూఢచారులను నియమించేవారు. ఇంకా పురోహితుడు, సేనాపతి, ప్రజాపతి మొదలైన వారు రాజుకు సహాయకులుగా ఉండేవారు. 'ప్రజాపతి' ముఖ్య విధి గడ్డి మైదానాల పర్యవేక్షణ. రుగ్వేద కాలంలో వశిష్ఠుడు, విశ్వామిత్రుడు ప్రసిద్ధి చెందిన పురోహితులు. దశరాజ యుద్ధానికి వీరు పరోక్ష కారకులు. రుగ్వేద కాలంలో కుటుంబాన్ని 'కుల' అన్నారు. కుటుంబ పెద్దను 'కులప' అని పిలిచేవారు. కొన్ని కులాల కలయికతో ఏర్పడేదే గ్రామం. దీనికి 'గ్రామణి' అధిపతిగా ఉండేవాడు. కొన్ని గ్రామాల సమూహాన్ని 'విస్' అనేవారు. దీనికి విస్పతి అధిపతిగా ఉండేవాడు. ఇలాంటి విస్‌ల సముదాయంతో 'జన' లేదా 'తెగ' ఏర్పడుతుంది. దీని నాయకుడే 'రాజన్'. అయితే రుగ్వేద కాలంలో రాజన్ అధికారం అపరిమితమైంది కాదు. సభ, సమితి, విధాత, గణ అనే ప్రజా సభలు రాజన్ అధికారాన్ని నియంత్రించేవి. రుగ్వేదంలో బలి, భాగ అనే పన్నుల ప్రస్తావన ఉంది. ఇవి వాస్తవంగా పన్నులు కావు. 'బలి' అనేది ప్రజలు రాజుకు ఇచ్చే కానుక. 'భాగ' అనేది యుద్ధంలో కొల్లగొట్టిన సంపదలో రాజు వాటా.

మలివేద కాలానికి ఆర్యులు స్థిర జీవనానికి అలవాటు పడ్డారు. కాబట్టి రుగ్వేద కాలం నాటి తెగల ఆధారిత పాలనా వ్యవస్థ స్థానంలో ప్రదేశం ఆధారిత పాలనా వ్యవస్థ ఏర్పడింది. వీటినే 'జనపదాలు' అంటారు. ఈ కాలంలో రాజన్ కేవలం గోవులను రక్షించే గోపతి మాత్రమే కాదు.. సుశిక్షిత సైన్యాన్ని కలిగి ఉండి పక్క రాజ్యాలను ఆక్రమించే స్థాయికి ఎదిగాడు. దీనికోసం రాజసూయ, అశ్వమేధ, వాజపేయ వంటి యజ్ఞ, యాగాలూ ప్రారంభమయ్యాయి. రాజుపై నియంత్రణాధికారమున్న సభలు క్షీణించి సభ, సమితులు మాత్రమే మిగిలాయి. అవి కూడా నామమాత్రపు సలహా మండళ్లుగా మారిపోయాయి. దీనివల్ల సభలతో ఎంపికయ్యే రాజన్ పదవి వంశపారంపర్య పదవిగా మారిపోయింది. ఈ కాలంలో రాజుకు సహాయ సహకారాలు అందించేందుకు 'ద్వాదశ రత్నిన్' అనే మంత్రి మండలి ఏర్పడింది. వీరిలో ప్రధాన పురోహితుడు, పట్టమహిషి, సేనాని, సూత, సంగ్రహిత్రి, భాగదుఘ, అక్షావాప, గోవికర్తన, గ్రామణి మొదలైనవారు సభ్యులుగా ఉండేవారు. బలి, భాగ అనేవి పూర్తిస్థాయి పన్నులుగా మారాయి. వాటి వసూలుకు బాగదుఘ అనే అధికారి ఉండేవాడు. అయినప్పటికీ ఈ కాలానికి పూర్తిస్థాయి అధికార యంత్రాంగం మాత్రం ఏర్పడలేదు.

మత వ్యవస్థ: రుగ్వేద కాలపు ఆర్యులు ప్రకృతి శక్తులను అర్థం చేసుకోలేకపోవడంతో వాటికి దైవత్వాన్ని ఆపాదించారు. మానవ రూపమిచ్చి పూజించారు. రుగ్వేదంలో మొత్తం 33 మంది దేవతల ప్రస్తావన ఉంది. వీరందరిలో అతిముఖ్య దైవం ఇంద్రుడు లేదా పురంధరుడు. ఇతడు యుద్ధ దేవత. రెండో ముఖ్య దైవం అగ్ని. ఇతడిని మానవులకు, దేవతలకు మధ్య వారధిగా భావించారు. వరుణుడు ప్రకృతిని క్రమబద్ధీకరించే దేవత. ఇంకా సోమ, ఉషస్, అదితి, పృథ్వీ, అరణ్యాని మొదలైన దేవతల ప్రస్తావన ఉంది. వీరి పూజా విధానంలో భక్తికి ప్రాధాన్యముండేది. భక్తి శ్లోకాలను ఆలపించడం, కానుకలను సమర్పించడం ద్వారా దేవతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. తమకు ప్రీతిపాత్రమైన సోమ, సుర అనే పానీయాల్ని నైవేద్యంగా సమర్పించేవారు. వీరు ప్రధానంగా సంతానం, పశు సంపద కోసం దేవతలను ప్రార్థించారు.

మలివేద కాలానికి రుగ్వేదపు ప్రధాన దేవతల ప్రాధాన్యత తగ్గిపోయింది. ఇంద్రుడు, అగ్ని వంటి దేవతల స్థానాన్ని త్రిమూర్తులు ఆక్రమించారు. రుగ్వేదపు ప్రధాన దేవతలు అష్టదిక్పాలకులుగా మారిపోయారు. సృష్టికర్త అయిన ప్రజాపతి ప్రధాన దేవతగా, రుద్రుడు, విష్ణువు మొదలైనవారు ఇతర ముఖ్య దేవతలుగా అవతరించారు. ఈ కాలంలో వచ్చిన మరొక ముఖ్యమైన మార్పు వర్ణాల వారీగా దేవతలు ఏర్పడటం. ఈ విధంగా ఏర్పడిన దేవతే 'పుషాన్' అనే శూద్రుల దేవత. ఆర్యుల పూజా విధానంలోనూ మార్పులు సంభవించాయి. భక్తి ప్రాధాన్యత తగ్గి యజ్ఞ యాగాలు, బలిదానాలకు ప్రాధాన్యత పెరిగింది. విపరీతమైన జంతు బలుల వల్ల పశు సంపదకు పెద్ద నష్టం వాటిల్లింది. మోక్ష మార్గం సంక్లిష్టం, వ్యయభరితం అవడమే కాకుండా శూద్రులు, స్త్రీలు వంటి కొన్ని వర్గాలకు మోక్ష మార్గాన్ని నిరాకరించారు. మలివేద కాలంలో మత వ్యవస్థలో చోటు చేసుకున్న ఈ పరిణామాలన్నీ కలిసి వైదిక యుగం చివరినాటికి అంటే క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి వైదిక మతంపై తిరుగుబాటుగా అనేక మత ఉద్యమాలు రావడానికి కారణమయ్యాయి.

మాదిరి ప్రశ్నలు

1. వేద కాలం నాటి 'పాణిలు' అంటే?
   1) నాణేలు 2) సైనిక వర్గం
   3) వ్యాపారులు 4)పశువుల దొంగలు
2. రుగ్వేదంలో వ్యవసాయదారుడిని ఏ పేరుతో సూచించారు?
   1) కినాస 2) శూద్ర 3) క్షేత్రక 4) కర్షక
3. వీటిలో తప్పుగా జతపర్చిన దాన్ని గుర్తించండి?
   1) గోఘన – అతిథి 2) దౌహిత్రి – కూతురు
   3) గోప – పశుకాపరి
   4) గవిష్టి – యుద్ధం
4. వీరిలో పురోహితుల దైవం?
   1) ఇంద్రుడు 2) అగ్ని
   3) వరుణుడు 4) సూర్యుడు
5. వైదిక యుగంలోని ఏ సభలను ప్రజాపతి (బ్రహ్మ) పుత్రికలుగా భావిస్తారు?
   1) సభ, సమితి 2) సమితి, విధాత
   3) విధాత, గణ 4) గణ, పరిషత్
6. వేద కాలంలో ఏ వృత్తి వారికి ఉపనయనం ధరించే అర్హతను కల్పించారు?
   1) స్వర్ణకారులు 2) రథకారులు
   3) చర్మకారులు 4) లోహకారులు
7. వీటిలో సరైన జతను గుర్తించండి?
   1) కులాల–కుండలు తయారు చేసేవారు
   2) నిషాద – చేపలు పట్టేవారు
   3) కైవర్త – బుట్టలు అల్లేవారు
   4) వేణ – వేటాడేవారు
8. కింద ఇచ్చిన జాబితాల నుంచి సరైన సమాధానాన్ని గుర్తించండి?

జాబితా -1	జాబితా-2
ఎ) సూత	1) మంగలి
బి) దౌహిత్రి	2) వధించరానిది(ఆవు)
సి) గోఘన	3) రథకారుడు
డి) అఘన్య	4) కూతురు
ఇ) వాప్త	5) అతిథి

కోడ్స్:	ఎ బి సి డి ఇ	కోడ్స్:	ఎ బి సి డి ఇ
1	5 4 1 2 3	2	3 4 5 2 1
3	3 4 1 2 5	4	1 2 3 4 5

9. దశరాజ యుద్ధానికి కారకుడైన పురోహితుడు?
   1) దుర్వాసుడు 2) విశ్వామిత్రుడు
   3) యజ్ఞవల్క్య 4) సుదాసు
10. వైదిక యుగ పాలనా విభాగాలను సరైన ఆరోహణ క్రమంలో అమర్చండి?
   1) రాష్ట్ర, జన, విశ్, గ్రామ, కుల
   2) జన, రాష్ట్ర, గ్రామ, కుల, విశ్
   3) కుల, గ్రామ, విశ్, జన, రాష్ట్ర
   4) కుల, గ్రామ, విశ్, రాష్ట్ర, జన

సమాధానాలు

1) 4; 2) 1; 3) 3; 4) 2; 5) 1; 6) 2; 7) 1; 8) 2; 9) 2; 10) 3.

స్వరంబు కంటే పరంబైన స్వరంబునకు..

టెట్/డీఎస్సీ ప్రత్యేకం

తెలుగు

సంధులు - వ్యాకరణ పరిభాషలు

డీఎస్సీ అభ్యర్థులు శ్రద్ధగా చదవాల్సిన వ్యాకరణాంశాలు సంధులు, వ్యాకరణ పరిభాషలు. వీటిపై ఎక్కువ ప్రశ్నలు రావచ్చు. స్కూల్ అసిస్టెంట్స్, లాంగ్వేజ్ పండిట్స్ అభ్యర్థులందరూ వీటిని తప్పకుండా అధ్యయనం చేయాలి. **సంధులు:** I. సంస్కృత సంధులు, II. తెలుగు సంధులు.

సంస్కృత సంధులు

1. సవర్ణదీర్ఘ సంధి 2. గుణ సంధి
3. వృద్ధి సంధి 4. యణాదేశ సంధి
5. జశ్త్వ సంధి 6. శ్చుత్వ సంధి
7. అనునాసిక సంధి 8. విసర్గ సంధి
9. పరసవర్ణ సంధి 10. పరరూప సంధి

II. తెలుగు సంధులు:

1. ఉత్వ సంధి 2. ఇత్వ సంధి
3. అత్వ సంధి 4. యడాగమ సంధి
5. టుగాగమ సంధి 6. రుగాగమ సంధి
7. దుగాగమ సంధి 8. నుగాగమ సంధి
9. ద్విరుక్తటకార సంధి 10. సరళాదేశ సంధి
11. గ, స, డ, ద, వా దేశ సంధి
12. ఆమ్రేడిత సంధి 13. పుంప్వాదేశ సంధి
14. త్రిక సంధి 15. పడ్వాది సంధి
16. ప్రాంతాది సంధి 17. లు, ల, నల సంధి

సంధులకు సంబంధించి ఒక పదాన్నిచ్చి దాన్ని సరిగా విడదీయమని అడుగుతారు. లేదా విభజించిన రూపాన్నిచ్చి సరిగా కలుపమని అడుగుతారు. సంధి సూత్రాలు రాయాల్సిన అవసరం లేకపోయినా అవగాహన కోసం సూత్రాలు తెలుసుకోవడం మంచిది.

సంస్కృత సంధులు

1. సవర్ణదీర్ఘ సంధి

అ–ఇ–ఉ–ఋలకు అవే అచ్చులు పరమైనా వాటి దీర్ఘాలు ఏకాదేశమవడాన్ని సవర్ణ దీర్ఘ సంధి అంటారు.

ఉదా: రామ + ఆజ్ఞ = రామాజ్ఞ
మహి + ఈశుడు = మహీశుడు
గురు + ఉపదేశం = గురూపదేశం
పితృ + ఋణం = పితౄణం

2. గుణ సంధి: అకారానికి ఇ–ఉ–ఋలు పరమైతే క్రమంగా ఏ–ఓ–అర్‌లు ఏకాదేశ మవడాన్ని గుణసంధి అంటారు.

ఉదా: సూర్య + ఉదయం = సూర్యోదయం
మహా + ఈశ్వరుడు = మహేశ్వరుడు
ఇతర + ఇతర = ఇతరేతర
రాజ + ఋషి = రాజర్షి

3. వృద్ధి సంధి: అకారానికి ఏ, ఐలు పరమైతే ఐకారాన్ని; ఓ, ఔలు పరమైతే ఔకారాన్ని; ఋ, ౠలు పరమైతే ఆర్ ఏకాదేశమవడాన్ని వృద్ధి సంధి అంటారు. ఐ, ఔలను వృద్ధులు అంటారు.

ఉదా: భువన + ఏక = భువనైక
అఖండ + ఐశ్వర్యం = అఖండైశ్వర్యం
పాప + ఓఘం = పాపౌఘం
పరమ + ఔషధం = పరమౌషధం
ఋణ + ఋణం = ఋణార్ణం

4. యణాదేశ సంధి: ఇ–ఉ–ఋలకు అసవర్ణాచ్చులు పరమైతే క్రమంగా య–వ–రలు ఆదేశమవడాన్ని యణాదేశ సంధి అంటారు. ''ఇకోయణచిః'' : ఇక్కులకు (ఇ–ఉ–ఋ) యణ్ణులు (య–వ–ర) పరమవుతున్నందు వల్ల ఇది యణాదేశ సంధి.

ఉదా: జయంతి + ఉత్సవం = జయంత్యుత్సవం
హిందూ + ఆర్యులు = హింద్వార్యులు
పితృ + ఆర్జితం = పిత్రార్జితం

5. జశ్త్వ సంధి: క–చ–ట–త–పలకు అచ్చులు కానీ, హ–య–వ–ర–లు కానీ, వర్గ తృతీయ చతుర్థ పంచమాక్షరాలు కానీ, పరమైతే గ, జ, డ, ద, బలు ఆదేశమవడాన్ని జశ్త్వసంధి అంటారు.

ఉదా: తత్ + అరణ్య భూములు = తదరణ్య భూములు
అచ్ + అంతం = అజంతం
వాక్ + ఈశుడు = వాగీశుడు
కకుప్ + అంతం = కకుబంతం
సత్ + భావం = సద్భావం

6. శ్చుత్వ సంధి: సకారత వర్గాలకు శకారచ వర్గాలు పరమైనప్పుడు శకారచ వర్గాలే ఆదేశమవడాన్ని శ్చుత్వ సంధి అంటారు.
(సకార–త థ ద ధ న) (త వర్గం)
(శకార – చ ఛ జ ఝ ఞ) (చ వర్గం)
తపస్ + శమము = తపశ్శమము
(స్(స)+శ= శ్శ)
సత్+చరిత్ర=సచ్చరిత్ర(త్ (త) – చ= చ్చ)
సత్+జనుడు= సజ్జనుడు(త్ (త)+జ= జ్జ)
విద్యుత్+శక్తి=విద్యుచ్ఛక్తి(త్ (త)+ శ=చ్ఛ)

7. అనునాసిక సంధి: వర్గ ప్రథమాక్షరాలకు (క–చ–ట–త–ప)'న, మ' అనునాసికాలు పరమైనప్పుడు ఆయా వర్గానునాసికాలు వికల్పంగా రావడాన్ని అనునాసిక సంధి అంటారు. మయాది ప్రత్యయాలకు నిత్యముగా వస్తాయి.

ఉదా: వాక్ + మయం = వాఙ్మయం
(క–ఙ=నిత్యం)
జగత్ + నాటకం = జగన్నాటకం
= జగద్నాటకం (వికల్పం)
(అనునాసికం రానప్పుడు వర్గ తృతీయాక్షరం (త–ద–వికల్పం)
మృట్ + మయం = మృణ్మయం,
మృడ్మయం (టకు అనునాసికం రానప్పుడు డకారం వికల్పం)

8. విసర్గ సంధి: అకారం పూర్వముందున్న విసర్గకు వర్గ తృతీయ, చతుర్థ, పంచమాక్షరాలు అ–హ–య–వ–ర–లలు పరమైనప్పుడు విసర్గ – ఓకారంగా మారుతుంది. (వర్గ తృతీయాక్షరాలు– గ, జ, డ, బ, లు వర్గ చతుర్థాక్షరాలు (ఘ, ఝ, ఢ, ధ, భ, లు)

వర్గ పంచమాక్షరాలు: ఙ– ఞ– ణ– న–మ్ (అనునాసికాలు) హ–య–వ–ర–లలు పరమైనప్పుడు మాత్రమే విసర్గ ఓకారంగా మారుతుంది. కొన్నిసార్లు రేఫ వస్తుంది.

ఉదా: అయః + మయం = అయోమయం
(యః + మ = ఓ)
ఇతః + అధికం = ఇతోధికం (తః+అ = ఓ)
చతుః + ఆత్మ = చతురాత్మ
(తుః + ఆ = 'ర' కారం వచ్చింది)
తపః ఫలము = తపఃఫలం (ఫ కారం వర్గ ద్వితీయాక్షరమైనందు వల్ల విసర్గలో మార్పు లేదు).

9. పర సవర్ణ సంధి: పదాంతం ముందున్న 'త' కారానికి లకారం పరమైనప్పుడు 'ల'కారమే ఆదేశంగా రావడాన్ని పర సవర్ణ సంధి అంటారు. (త్ – తకారానికి లకారం వస్తే 'ల్ల' కారం వస్తుంది)

ఉదా: భగవత్ + లీల = భగవల్లీల
(త్ + ల = ల్ల)
ఉత్ + లేఖనం = ఉల్లేఖనం (త్+లే = ల్లే)
విద్యుత్ + లత = విద్యుల్లత (త్ + ల = ల్ల)
సుహృత్ + లాభం = సుహృల్లాభం
(త్ + లా = ల్లా)

10. పరరూప సంధి: హల్లుల్లోని అకారానికి అకారం పరమైతే రెండో పదంలోని మొదటి అచ్చు ఏకాదేశమవుతుంది. దీన్ని పరరూపసంధి అంటారు.

ఉదా: సార + అంగము = సారంగము
(ర్ + అ = రకారంలోని అకారానికి 'అ' కారం పరమై రకారానికి దీర్ఘం వచ్చింది)
సీమ + అంతము = సీమంతము
(మ్ + అకారానికి అకారం పరమై అకార దీర్ఘం వచ్చింది)

తెలుగు సంధులు

1. ఉత్వ సంధి: ఉత్తునకచ్చుపరమైనప్పుడు సంధి నిత్యముగా వస్తుంది (హ్రస్వమైన ఉకారానికి మాత్రమే ఇది వర్తిస్తుంది)

ఉదా: రాముడు + అతడు = రాముడతడు (డులోని ఉ కారానికి అకారం పరమై అకారం నిత్యంగా వచ్చింది)

- ప్రథమేతర విభక్తి శత్రర్థక చువర్ణంబులందున్న ఉకారానికి సంధి వైకల్పికం అవుతుంది.
- ప్రథమా విభక్తి కాకుండా ఇతర విభక్తుల్లో శత్రర్థకమైన 'చున్' ప్రత్యయంలోని ఉకారానికి సంధి వైకల్పికమని అర్థం.
- వైకల్పికమంటే ఒకసారి సంధి జరిగిన రూపం, మరోసారి సంధి జరగని రూపం సిద్ధిస్తుంది.

ఉదా: నన్నున్ + అడిగె = నన్నడిగె
(సంధి జరిగిన రూపం)
నన్నునడిగె (సంధి జరగని రూపం)

2. ఇత్వ సంధి: ఇత్తునకు సంధి వైకల్పికం. ఏమ్యాదుల్లో ఇత్తునకు సంధి వైకల్పికం (ఏమి, మరి, అది, అవి, ఇది, ఇవి, కాన్) మొదలైనవి ఏమ్యాదులు.

ఉదా: ఏమి + అంటివి:
ఏమంటివి, (సంధి జరిగిన) ఏమియంటివి (సంధి జరగని)

- మధ్యమ పురుష క్రియలందిత్తునకు సంధి నిత్యం.

ఉదా: చూచితిరి + ఇపుడు = చూచితిరిప్పుడు

- క్వార్థంబైన ఇత్తునకు సంధి లేదు. భూతకాలిక అసమాపక క్రియ క్వార్థంబు

ఉదా: వచ్చి + ఇచ్చి = వచ్చియిచ్చి (సంధి లేనందువల్ల యడాగమ రూపం)

3. అత్వ సంధి: అత్తునకు సంధి బహుళం.

- బహుళమంటే నిత్యం, నిషేధం, వైకల్పికం, అన్యవిధం అనే నాలుగు కార్యాలు ఉంటాయి.

నిత్యంగా జరిగేవి

ఉదా: రామ + అయ్య = రామయ్య (నిత్యం)

సంధి జరగని నిషేధ రూపం

ఉదా: దూత + ఇతడు = దూతయితడు
(యడాగమ రూపం)

వైకల్పికంగా జరగడం: సంధి జరిగిన రూపం, సంధి జరగని యడాగమ రూపం రెండూ వస్తాయి.

ఉదా: మేన + అల్లుడు = మేనల్లుడు
(సంధి జరిగిన రూపం)
మేనయల్లుడు (సంధి జరుగని యడాగమ రూపం)

అన్యవిధం: సూత్రంలో సూచించని విధంగా కొన్ని హల్లులు వచ్చి చేరతాయి.

ఉదా: తామర + ఆకు = తామరపాకు
పుగాగమం అన్య విధంగా వచ్చి చేరింది.

4. యడాగమ సంధి: సంధి లేని చోట స్వరంబు కంటే పరంబైన స్వరంబునకు యడాగమంబగు. సంధి జరిగే అవకాశం లేనప్పుడు పర స్వరానికి ముందు 'య్' కారం ఆగమంగా వచ్చి చేరుతుంది.

ఉదా: వెల + (య్) ఆలు = వెలయాలు
మా + (య్) అమ్మ = మాయమ్మ

5. టుగాగమ సంధి: కర్మధారయంలో ఉత్తునకు అచ్చు పరమైనప్పుడు టుగాగమంబగుతుంది.

వివరణ: నామవాచక, విశేషణాలకు సంబంధించిన సమాసం కర్మధారయ సమాసం. ఇందులో పరస్వరానికి ముందు 'ట్' కారం ఆగమంగా వస్తుంది.

ఉదా: కఱకు+ (ట్) అమ్ము = కఱకుటమ్ము

- కర్మధారయమున పేర్వాది శబ్దాలకు అచ్చు పరమైనప్పుడు టుగాగమంబువిభాషనగు.

పేర్వాదులు: పేరు, పొదరు, చిగురు, తలిరు.

ఉదా: పేరు + ఉరము = పేరుటురము
(టుగాగగం రానప్పుడు)

6. రుగాగమ సంధి: కర్మధారయంబున 'పేరాది' శబ్దాలకు'ఆలు'శబ్దం పరమైనప్పుడు రుగాగమంబగు.

పేరాది శబ్దాలు: పేద, బీద, ముగ్ధ, కొమ, జవ, మనుమ, ఐదవ మొదలైనవి.

ఉదా: పేద (ర్) + ఆలు = పేదరాలు
పరస్వరానికి ముందు 'ర్' కారం చేరి పేదరాలు రూపం వచ్చింది.
మనుమ(ర్) + ఆలు = మనుమరాలు

- కర్మధారయంబున తత్సమ పదాలకు 'ఆలు' శబ్దం పరమైనప్పుడు అత్వంబునకు ఉత్వంబు రుగాగమమవుతుంది.

(**తత్సమ శబ్దాలు:** ధీర, గుణవంత, ధనవంత, సంపన్న, గంభీర, ధైర్యవంత మొదలైనవి)

ఉదా: ధీర + ఆలు = ధీరు+ ర్ + ఆలు
= ధీరురాలు
గుణవంత + ఆలు =
గుణవంతు + ర్ +ఆలు= గుణవంతురాలు

7. దుగాగమ సంధి: నీ–నా–తన శబ్దాలకు ఉత్తర పదంబు పరమైనప్పుడు దుగాగమంబు విభాషనగు.

ఉదా: నా + (దు) విభుడు = నాదువిభుడు
(సంధి జరిగిన రూపం)
నా విభుడు (సంధి జరగని రూపం)
తన + (దు) కోపం = తనదు కోపం
(సంధి జరిగిన రూపం)
తన కోపం (సంధి జరగని రూపం)

8. నుగాగమ సంధి: ఉదంత తద్ధర్మార్థ విశేషణానికి అచ్చుపరమైనప్పుడు నుగామమంబగు.

తద్ధర్మార్థకాలు: భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో జరిగే క్రియలు. హ్రస్వమైన ఉకారం చివర ఉన్న తద్ధర్మార్థక క్రియలకు అచ్చుపరమైతే నుగాగమం వస్తుందని సూత్రార్థం.

ఉదా: చేయు + (న్) ఎడ = చేయునెడ
వ్రాయు + (న్) అది = వ్రాయునది

- షష్ఠీ తత్పురుష సమాస మందలి ఉకార, ఋకారంబులకు అచ్చుపరమైనప్పుడు నుగాగమంబగు.

ఉదా: రాజు + (న్) ఆనతి = రాజునానతి
చెరువు + (న్) ఉదకం = చెరువునుదకం

9. ద్విరుక్తటకార సంధి: కుఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దముల 'ఱ, డ'లకు అచ్చు పరమైనప్పుడు ద్విరుక్తటకారం ఆదేశమవుతుంది.

ఉదా: కు (ఱు) (ట్ట్)+ ఉసురు = కుట్టుసురు
చిఱు + (ట్ట్) ఎలుక = చిట్టెలుక
కడు + (ట్ట్) ఎదురు = కట్టెదురు
నడు + (ట్ట్) ఇల్లు = నట్టిల్లు
నిడు + ఊర్పు = నిట్టూర్పు

వివరణ: ద్విరుక్తటకారమంటే ద్విత్వటకారమని అర్థం. ద్విత్వటకారం ఆదేశంగా వచ్చి ఈ రూపాలు వచ్చాయి.

10. సరళాదేశ సంధి: ద్రుత ప్రకృతికం మీది పరుషాలకు సరళములగు.

ఉదా: పూచెను + కలువలు, పూచెను గలువలు: పరుషమైన కకారం సరళంగా (గ) మారింది.

- ఆదేశ సరళాలకు ముందున్న ద్రుతానికి బిందు సంశ్లేషలు విభాషనగు. పూచెను + గలువలు –పూచెంగలువలు;పూచెన్గలువలు: పూచెనుగలువలు, పూచెఁగలువలు అనే నాలుగు రూపాలు వస్తాయి. సమాసములందు స్వత్వ సంశ్లేషణ రూపాలుండవు. అర సున్నా రూపం మరో సూత్రంతో నిషేధానికి గురైంది. 'పూచెంగలువలు'అనే ఒక్క రూపం మాత్రమే మిగులుతుంది.

11. గ, స, డ, ద, వా దేశ సంధి:

1. ప్రథమం మీది పరుషాలకు గ, స, డ, ద, వలు బహుళముగానగు. ప్రథమావిభక్తిలో ఉన్న పదాలకు పరమైన పదాల్లో ఉన్న పరుషాలకు (కచటతపలకు క్రమంగా గ, స, డ, వలు) బహుళంగా వస్తాయి.

ఉదా: వాడు + కొట్టె = వాడు గొట్టె
అపుడు + చనియె = అపుడుసనియె

2. ద్వంద్వ సమాసాల్లో పదాలపై పరుషాలకు గ, స, డ, ద, వలు ప్రాయికంగా వస్తాయి.

ఉదా: తల్లి + తండ్రి = తల్లిదండ్రులు

3. తెనుగుల మీది సాంస్కృతిక పరుషాలకు గ, స, డ, ద, వలు రావు. తెలుగు పదాలకు పరంగా వచ్చిన తత్సమ పదాల్లోని పరుషాలకు గ, స, డ, ద, వలు రావు.

ఉదా: వాడు + కంసారి = వాడు కంసారి
వీడు + చక్రపాణి = వీడు చక్రపాణి
(ఈ ఉదాహరణలో క, చ అనే పరుషాలకు గ,స,లు రాలేదు)

12. ఆమ్రేడిత సంధి:

1. అచ్చునకు ఆమ్రేడితం పరమైనప్పుడు సంధి తరచుగానగు. ద్విరుక్తం పదరూపం ఆమ్రేడితం. ఒక పదాన్ని రెండుసార్లు ఉచ్చరించినప్పుడు రెండోసారి ఉచ్చరించినదాన్ని ఆమ్రేడితమంటారు.

ఉదా: ఔర + ఔర (ఆమ్రేడితం) ఔరౌర
ఆహా + ఆహా = ఆహాహా

2. ఆమ్రేడితం పరమైనప్పుడు కడాదుల తొలి అచ్చు మీది వర్ణంబులకెల్లా అదంతంబగు ద్విరుక్తటకారంబగు (**కడాదులు:** కడ, చివర, తుద, మొదలు, తెరువు, నడుమ మొదలైనవి)

ఉదా: క(డ)ట్ట + కడ = కట్టకడ
చివ(ట్ట)ర + చివర = చిట్టచివర
కడాదుల్లో తొలి అచ్చు తర్వాత వర్ణాలన్నింటికీ లోపం వచ్చి వాటి స్థానంలో అదంతమైన ద్విత్వట్టకారం వచ్చింది.

3. అందదుకు ప్రభృతులు యథా ప్రయోగంబుగా గ్రాహ్యములు.

ఉదా: అందుకు + అదుకు = అందదుకు
చెర + చెర = చెచ్చెర లాంటి రూపాలు యథావిధిగా గ్రహించవచ్చని చిన్నయ సూరి అభిప్రాయం.

13. పుంప్వాదేశ సంధి: కర్మధారయమందలి ము వర్ణానికి 'పుంపు'లగు ము వర్ణానికి 'పువర్ణం' బిందు పూర్వక పువర్ణం (ంపు) రెండు రూపాలు వస్తాయి.

ఉదా: సరసము + మాట = 1. సరసపు మాట
2. సరసంపు మాట
విరసము + వచనం = 1. విరసపు వచనం
2. విరసంపు వచనం

14. త్రిక సంధి:

1. ఆ, ఈ, ఏ అనే సర్వనామాలను త్రికములు అంటారు. **ఉదా:** ఆ + కన్య
2. త్రికంబు మీది అసంయుక్త హల్లునకు ద్విత్వం బహుళంగా వస్తుంది.
   ఉదా: ఆ + క్కన్య
3. ద్విరుక్తంబగు హల్లు పరమైనప్పుడు ఆచ్చికంబగు దీర్ఘం హ్రస్వం అవుతుంది.

ఉదా: ఆ + క్కన్య = అక్కన్య మూడు సూత్రాలతో – అక్కన్య రూపం వస్తుంది.

మహారత్న హోదా ఉన్న కంపెనీలు ఏవి?

భారత పారిశ్రామిక రంగం

మహారత్నాలు

ఏడాదికి సరాసరి 25 వేల కోట్ల టర్నోవర్, 5 వేల కోట్ల ప్రాఫిట్ ఉన్న ప్రభుత్వ రంగ కంపెనీలను మహారత్నాలుగా ప్రకటిస్తారు. 2009 డిసెంబర్ నుంచి కంపెనీలకు మహారత్న హోదా ఇస్తున్నారు. ఈ హోదా ఉన్న పరిశ్రమలు నికర విలువలో 15శాతం వరకు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవచ్చు. ఉదా॥ వ్యాపార ఒప్పందాలు, అదనపు సిబ్బంది నియామకాలు, యంత్రాల కొనుగోలు మొదలైన విషయాల్లో స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవచ్చు. ప్రస్తుతం ఈ హోదా ఉన్న పరిశ్రమలు ఏడు. అవి..

1. కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్)
2. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్)
3. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్టీపీసీ)
4. ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్జీసీ)
5. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఏఐఎల్)
6. గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (జీఏఐఎల్)
7. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్)

నవరత్నాలు

ఏడాదికి సరాసరి 10 వేల కోట్ల టర్నోవర్, 1000 కోట్ల ప్రాఫిట్ ఉన్న ప్రభుత్వ పరిశ్రమలను నవరత్నాలుగా ప్రకటిస్తారు. వీటిని 1997 జులై నుంచి గుర్తిస్తున్నారు. ఈ హోదా ఉన్న పరిశ్రమలు నికర విలువలో 15శాతం వరకు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవచ్చు.

నవరత్న హోదా ఉన్న కంపెనీలు..

1. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)
2. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్)
3. కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సీసీఐఎల్)
4. ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్)
5. హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)
6. హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్పీసీఎల్)
7. మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్ (ఎంటీఎన్ఎల్)
8. నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎండీసీ)
9. నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (ఎన్ఏఎల్సీఓ)
10. నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎల్సీఎల్)
11. ఆయిల్ ఇండియా లిమిటెడ్(ఓఐఎల్)
12. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (పీఎఫ్సీఎల్)
13. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్)
14. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)
15. రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్ఈసీఎల్)
16. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్సీఐఎల్)
17. నేషనల్ బిల్డింగ్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్బీసీసీ)

మాదిరి ప్రశ్నలు

1. రెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో స్థాపించని ఇనుము–ఉక్కు కర్మాగారం?
1) భిలాయ్ 2) దుర్గాపూర్
3) రూర్కెలా 4) బొకారో

2. హిందూస్థాన్ ఫొటోఫిల్మ్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ లిమిటెడ్ ఎక్కడ ఉంది?
1) అజ్మీర్ 2) ఉదకమండలం
3) ముస్సోరీ 4) బెంగళూరు

3. దేశంలో అతి పురాతన పరిశ్రమ?
1) ఇనుము– ఉక్కు కర్మాగారం
2) అల్యూమినియం కర్మాగారం
3) నూలు పరిశ్రమ
4) పంచదార పరిశ్రమ

4. శివకాశీ దేనికి ప్రసిద్ధి?
1) అగ్గిపుల్లలు 2) ఆటబొమ్మలు
3) లక్క 4) కాగితం

5. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) కేంద్ర కార్యాలయం ఎక్కడ ఉంది?
1) ముంబై 2) కోల్‌కతా
3) న్యూఢిల్లీ 4) భోపాల్

6. ఫిరోజాబాద్‌లో కేంద్రీకృతమైన పరిశ్రమ?
1) సిమెంట్ పరిశ్రమ
2) రాగి పరిశ్రమ
3) ఇనుము–ఉక్కు పరిశ్రమ
4) గాజు పరిశ్రమ

7. హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎక్కడ ఉంది?
1) విశాఖపట్నం 2) రాంచీ
3) శ్రీనగర్ 4) బెంగళూరు

8. ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఎక్కడ ఉంది?
1) మద్రాస్
2) బెంగళూరు
3) హైదరాబాద్
4) న్యూఢిల్లీ

9. రిషికేష్ దేనికి ప్రసిద్ధి?
1) ఎరువులు
2) సూక్ష్మజీవి నాశకాలు
3) ఫొటోఫిల్మ్‌లు
4) ఉన్ని దుస్తులు

10. రూర్కెలా కర్మాగారం ఏ నది ఒడ్డున ఉంది?
1) భద్రా నది 2) సువర్ణరేఖ నది
3) దామోదర్ నది 4) బ్రాహ్మిణి నది

11. స్పాంజ్ ఐరన్ ఉత్పత్తి జరిగే ప్రదేశం?
1) విశాఖపట్నం 2) భద్రావతి
3) పాల్వంచ 4) బళ్లారి

12. ఎలక్ట్రిక్ రైలు ఇంజన్ల తయారీ పరిశ్రమ ఎక్కడ ఉంది?
1) పెంబర్తి 2) పెరంబదూర్
3) వారణాసి 4) చిత్తరంజన్

13. గోల్డెన్ ఫైబర్ అని దేన్ని పిలుస్తారు?
1) జనుము 2) సింథటిక్
3) పట్టు 4) ఉన్ని

14. 1919లో ఇండియన్ ఐరన్ స్టీల్ కంపెనీని ఎక్కడ ఏర్పాటు చేశారు?
1) కర్ణాటకలోని భద్రావతి
2) బెంగాల్‌లోని బర్నాపూర్
3) తమిళనాడులోని సేలం
4) ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ తీరం

15. దేశంలో మొదటి యాంటీ బయోటిక్ పరిశ్రమను ఎక్కడ ఏర్పాటు చేశారు?
1) పింప్రి 2) సింద్రి
3) రాణికేట్ 4) రాణిపేట

16. దేశంలో మొదటి ప్రభుత్వ రంగ చమురు శుద్ధి కర్మాగారం ఏది?
1) దిగ్బాయ్ 2) గౌహతి
3) ముంబై 4) విశాఖపట్నం

17. మొట్ట మొదటి సిమెంట్ పరిశ్రమను దేశంలో ఎక్కడ ఎప్పుడు నిర్మించారు?
1) మహారాష్ట్ర (1912)
2) గుజరాత్ (1912)
3) ఆంధ్రప్రదేశ్ (1905)
4) చెన్నై (1904)

18. దేశంలో మొట్టమొదటి ఉన్ని వస్త్ర పరిశ్రమను ఎక్కడ నెలకొల్పారు?
1) పోర్టుగ్లాస్టర్ 2) లాల్ఇమ్లీ
3) రిష్రా 4) హౌరా

19. భారత్‌లో జనపనార మిల్లులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం?
1) ఉత్తరప్రదేశ్ 2) బిహార్
3) పశ్చిమబెంగాల్ 4) జార్ఖండ్

20. మొట్టమొదటి ఉన్ని వస్త్రాగారం ఎక్కడ ఏర్పాటు చేశారు?
1) కాన్పూర్ 2) లక్నో
3) ధరివాల్ 4) శ్రీనగర్

21. విమానాల పరికరాలు, విడిభాగాలు ఎక్కడ తయారవుతాయి?
1) హైదరాబాద్ 2) కోల్‌కతా
3) లక్నో 4) గోవా

22. దుర్గాపూర్ ఇనుము–ఉక్కు కర్మాగారం ఏ రాష్ట్రంలో ఉంది?
1) ఒడిశా 2) జార్ఖండ్
3) మధ్యప్రదేశ్ 4) పశ్చిమ బెంగాల్

23. భిలాయ్ ఇనుము–ఉక్కు కర్మాగారాన్ని ఏ దేశ సహకారంతో నిర్మించారు?
1) యూఎస్ఏ 2) యూఎస్ఎస్ఆర్
3) యూకే 4) జర్మనీ

24. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాను ఎప్పుడు స్థాపించారు?
1) 1961 2) 1973
3) 1971 4) 1959

25. హిందూస్థాన్ ఫొటోఫిల్మ్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ లిమిటెడ్ ఎక్కడ ఉంది?
1) నాగపూర్ 2) ముంబై
3) ఊటీ 4) బెంగళూరు

26. 'భారత హెవీ ప్లేట్స్ అండ్ వెస్సల్స్'ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
1) పాల్వంచ 2) బెంగళూరు
3) భోపాల్ 4) విశాఖపట్నం

27. రక్షణ సామగ్రిని ఉత్పత్తి చేసే ప్రాగాటూల్స్ ఎక్కడ ఉంది?
1) సికింద్రాబాద్ 2) భోపాల్
3) రూప్ నారాయణ్‌పూర్
4) హరిద్వారా

28. కిందివాటిలో మహారత్న హోదా లేని సంస్థ ఏది?
1) ఎన్టీపీసీ 2) బీహెచ్ఈఎల్
3) హెచ్ఏఎల్ 4) ఓఎన్జీసీ

29. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ ఎక్కడ ఉంది?
1) ఆల్వే 2) పనాజీ
3) జోథ్‌పూర్ 4) నాగపూర్

30. నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ గ్రౌండ్ నట్ ఎక్కడ ఉంది?
1) వడోదర 2) కోల్‌కతా
3) జునాగఢ్ 4) పుణే

31. భారతదేశ ప్రభుత్వ రంగ సంస్థలకు ఏ సంవత్సరం నుంచి నవరత్న హోదా ప్రకటిస్తున్నారు?
1) 2009 2) 1991
3) 2007 4) 1997

32. అల్యూమినియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను ఎక్కడ స్థాపించారు?
1) జాయక్ నగర్ 2) వార్‌బోర్న్
3) చెన్నై 4) భిలాయ్

33. దేశంలో మొట్ట మొదటి ఎరువుల పరిశ్రమ ను ఎక్కడ ప్రారంభించారు?
1) రామగుండం 2) రాణిపేట
3) తాల్చేర్ 4) పానిపట్

34. విశ్వేశ్వరయ్య ఐరన్ అండ్ స్టీల్ లిమిటెడ్ ఏ రాష్ట్రంలో ఉంది?
1) ఛత్తీస్‌గఢ్ 2) కేరళ
3) పశ్చిమబెంగాల్ 4) కర్ణాటక

35. దేశంలో మొదటి కాగిత పరిశ్రమను ఎక్కడ ఏర్పాటు చేశారు?
1) అహ్మదాబాద్ 2) రిష్రా
3) సేరంపూర్ 4) చిత్తరంజన్

సమాధానాలు

1) 4; 2) 2; 3) 3; 4) 1; 5) 3;
6) 4; 7) 2; 8) 3; 9) 2; 10) 4;
11) 3; 12) 4; 13) 1; 14) 2; 15) 1;
16) 2; 17) 4; 18) 2; 19) 3; 20) 1;
21) 3; 22) 4; 23) 2; 24) 2; 25) 3;
26) 4; 27) 1; 28) 3; 29) 2; 30) 3;
31) 4; 32) 1; 33) 2; 34) 4; 35) 3.

దేశంలోని వివిధ సంస్థలు వాటి ప్రధాన కార్యాలయాలు

1.	ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్	ముంబై
2.	ఇండియన్ పెట్రో కెమికల్స్ కార్పొరేషన్ లిమిటెడ్	వడోదర
3.	ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్	ఆల్వే
4.	నేషనల్ ఫిజికల్ లేబొరేటరీ	న్యూఢిల్లీ
5.	నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ	పనాజీ
6.	నేషనల్ కెమికల్ లేబొరేటరీ	పుణే
7.	ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ బయాలజీ	కోల్‌కతా
8.	సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్	జోథ్‌పూర్
9.	సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్	నాగపూర్
10.	సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్	కాసర్‌గఢ్
11.	సెంట్రల్ సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్	డెహ్రాడూన్
12.	కాటన్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్	ముంబై
13.	నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ గ్రౌండ్ నట్	జునాగఢ్
14.	ఆటమిక్ ఎనర్జీ కమిషన్	-ముంబై
15.	నేషనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్	నాగపూర్
16.	ఇండియన్ గ్రాస్‌లాండ్ అండ్ ఫాడేర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్	-ఝాన్సీ
17.	ఆంత్రోపాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా	-కోల్‌కతా
18.	నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపేషనల్ హెల్త్	- అహ్మదాబాద్

What is Miloni's overall percentage?

MODEL QUESTIONS

1. The length of a rectangle is three-fifth the side of a square. The radius of a circle is equal to side of the square. The circumference of the circle is 132 cm. What is the area of the rectangle if the breadth of the rectangle is 8 cm.?
a) 112.4 sq.cm.
b) 104.2 sq.cm.
c) 100.8 sq.cm
d) 114.0 sq.cm.
e) None of these

2. Five- ninth of a number is equal to twenty five percent of second number. Second number is equal to one-fourth of third number. The value of third number is 2960. What is 30 percent of first number?
a) 88.8
b) 99.9
c) 66.6
d) 77.7
e) None of these

3. The respective ratio between present age of Manoj and Wasim is 3:11. Wasim is 12 years younger than Rehana. Rehana's age after 7 years will be 85 years. What is the present age of Manoj's father who is 25 years older than Manoj?
a) 43 years b) 67 years
c) 45 years d) 69 years
e) None of these.

4. Dinesh's monthly income is four times Suresh's monthly income. Suresh's monthly income is twenty percent more than Jyothi's monthly income. Jyothi's monthly income is Rs.22,000/-. What is Dinesh's monthly income?
a) Rs. 1,06,500/-
b) Rs. 1,05,600/-
c) Rs. 1,04,500/-
d) Rs. 1,05,400/-
e) None of these

5. Smallest side of a right angled triangle is 8 cm less than the side of a square of perimeter 56 cm. Second largest side of the right angled triangle is 4 cm less than the length of rectangle of area 96 sq.cm. and breadth 8 cm. What is the largest side of the right angled triangle?
a) 20cm b) 12cm c) 10cm
d) 15cm e) None of these

6. The ratio between the adjacent angles of a parallelogram is 7:8 respectively. Also the ratio between the angles of quadrilateral is 5:6:7:12. What is the sum of the smaller angle of parallelogram and second largest angle of the quadrilateral?
a) 168° b) 228° c) 156°
d) 224° e) None of these

7. Raju runs 1250 meters on Monday and Friday. Other days he runs 1500 meters except Sunday(He does not run on Sunday). How many kilometers will he run in 3 weeks (first day starting from Monday)?
a) 12.5kms
b) 20.5 kms
c) 8.5 kms
d) 25.5 kms
e) None of these

8. The sum of nine consecutive odd numbers of set-A is 621. What is the sum of different set of six consecutive even numbers whose lowest number is 15 more than the lowest number of set-A?
a) 498 b) 468 c) 478
d) 488 e) None of these

9. In a school there are 250 students out of whom 12 percent are girls. Each girl's monthly fee is Rs. 450/- and each boy's monthly fee is 24 percent more than a girl. What is the total monthly fee of a girl and boys together?
a) Rs. 1,36,620/-
b) Rs. 1,36,260/-
c) Rs. 1,32,660/-
d) Rs. 1,32,460/-
e) None of these

10. The average speed of a train is — times the average speed of a car. The car covers a distance of 588 kms in 6 hours. How much distance will the train cover in 13 hours?
a) 1750kms b) 1760kms
c) 1720kms d) 1820kms
e) None of these

11. What would be the cost of laying a carpet on a floor which has, its length and breadth in the respective ratio of 32:21 and where its perimeter is 212 feet, if the cost per square foot of laying the carpet is Rs. 2.5?
a) Rs. 6,720/-
b) Rs.5,420/-
c) Rs. 7,390/-
d) Rs. 7,890/-
e) None of these.

12. The simple interest accrued on a amount at the end of five years at 12.5 p.c.p.a is Rs. 1,575/-, what is the amount?
a) Rs. 2,050/-
b) Rs. 2,550/-
c) Rs. 2,250/-
d) Rs.2,520/-
e) None of these

13. A 260 meters long train crosses a platform thrice its length in 80 seconds. What is the speed of the train in Kms/hour?
a) 52.4 b) 46.8
c) 35.1 d) 64.1
e) None of these

14. If the cost of 8 erasers and 5 sharpeners is Rs.31/-, what will be the cost of 24 erasers and 10 sharpeners?
a) Rs.62/- b) Rs.84/-
c) Rs.78/- d) Rs.80/-
e) Cannot be determined

15. In how many different ways can the letters of the word 'PRETTY' be arranged?
a) 120

BANK EXAMS
QUANTITATIVE APTITUDE

b) 36
c) 360
d) 720
e) None of these

16. A boat while travelling upstream covers a distance of 18 kms. at the speed of 3 Kms/hr. whereas while travelling downstream it covers the same distance at the speed of 9 kms/hr. what is he speed of the boat in still waters?
a) 3 kms/hr
b) 5 kms/hr
c) 7kms/hr
d) 8 kms/hr
e) None of these

17. What is the area of a circle whose circumference is 132cms.?
a) 1562 sq.cms.
b) 1386 sq.cms.
c) 1434 sq.cms.
d) 1643 sq.cms.
e) None of these

18. Shreya's bought an article and sold it for 125% percent of its cost price. What was the cost price of the article, if Shreyas sold it for Rs.30,750/-?
a) Rs.24,600/- b) Rs.24,640/-
c) Rs.24,250/- d) 23,200/-
e) None of these

19. The ages of Mira Tina and Sania are in the ratio of 6:4:7 respectively. If the sum of their ages is 34 years, what is Sania's age?
a) 12 years b) 10 years
c) 18 years d) 20 years
e) None of these

20. A basket contains three red and four green balls. If four balls are drawn at random from the basket, what is the probability that two are red and two are green?
a) — b) — c) —
d) — e) None of these

Direction (Q. 21-25): Each of the questions given below consists of a question and two statements numbered I and II given below. You have to decide whether the data provided in the statements is sufficient to answer the question Read both the statements and

Give answer (a): If the data in the statement I alone is sufficient to answer the question, while the data in statement II alone is not sufficient to answer the question.

Give answer (b): If the data in the statement II alone is sufficient to answer the question, while the data in statement I alone is not sufficient to answer the question

Give answer (c): If the data statement I alone or in statement II alone is sufficient to answer the question.

Give answer (d): if the data in both the statements I and II is not sufficient to answer the question.

Give answer (e): If the data in both statements I and II together is necessary to answer the question.

21. What is the product of X and Y?
I) Y=X–28 II) –42 –12=X

22. What is the rate of interest % p.(a).?
I) An amount double itself in five years at simple interest.
II) Simple interest of Rs.1,600/- is obtained in two years on an amount of Rs.4,000/-

23. In how many hours an A alone complete the piece of work?
I) B alone can complete the piece of work in 28 hours.
II) A,B and C together can complete the piece of work in 18 hours.

24. What will Anjali's age be five years from now?
I) Anjali's present age is twice Tosha's present age.
II) Tosha who is half Anjali's present age, was 21 years old five years ago.

25. What is the perimeter of the square?
I) The measure of one of its side is 10 cms.
II) The measure of its diagonal is 10 cms.

KEY

1) c; 2) b; 3) a; 4) b;
5) c; 6) a; 7) d; 8) e;
9) b; 10) d; 11) a; 12) d;
13) b; 14) e; 15) c; 16) e;
17) b; 18) a; 19) e; 20) c;
21) e; 22) c; 23) d; 24) b;
25) c;